


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 207

శుక్రవారం 18-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



టీవీ యాంకర్ టు మిస్ ఇండియా

అందాల కిరీటం గెలుచుకున్న ఉజ్జయిని యువతి నికిత పొర్వాల్ -13లో



'46'తో నగుబాటు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్ 46 ఆలౌట్ -14లో

మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ▼



సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం!

కొందరు మూసీ సుందరీకరణ అనే డైలాగ్‌ను ప్రచారంలోకి తెచ్చారు

అధికారం కోల్పోయి నిస్పృహతో నది పునరుజ్జీవానికి అడ్డుపడుతున్నారు

మీడియా భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్

- మేం అందాల కోసం పనిచేయడం లేదు..అందాల భామలతో కలిసి పనిచేయడం లేదు
- మంత్రులు, ప్రజా ప్రతినిధుల ముసుగులో కొందరు రాష్ట్రాన్ని పట్టి పీడించారు
- బందిపోటు దొంగల్లా పట్టపగలు దోపిడీ చేసి స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- కేటీఆర్, హరీశ్, ఈటల మూసీ తీరంలో మూడు నెలలుంటే ప్రాజెక్టును ఆపేస్తానన్న సీఎం
- రూ.141 కోట్లతో కన్సార్టియంకు ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'అధికారం కోల్పోయి నిస్పృహ, అసహనంతో మూసీ నది పునరుజ్జీవానికి కొంతమంది అడ్డుపడుతున్నారు. మూసీ సుందరీకరణ అనే డైలాగ్‌ను ప్రచారంలోకి తెచ్చారు. మేము అందాల కోసం పని చేయడం లేదు. అందాల భామలతో కలిసి పనిచేయడం లేదు. అలాంటి కొంతమంది.. మంత్రులు, ప్రజాప్రతినిధుల ముసుగులో పదేళ్లు రాష్ట్రాన్ని పట్టిపీడించి బందిపోటు దొంగలకంటే దుర్మార్గంగా పట్టపగలు దోపిడీ చేసి స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మూసీ పునరుజ్జీవన ప్రయత్నాలపై విష ప్రచారంతో ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. మూసీ మురికిని మించి మెదడులో విషం నింపుకుని తెలంగాణ సమాజంపై దాడి చేస్తున్నారు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం సచివాలయంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఒక్కొక్కరిని ఒప్పించి తరలిస్తాం

'ఇది సుందరీకరణ కాదు.. దుబాయ్‌కి వెళ్లి నెత్తిమీద జుట్టును నాటు వేయించుకున్న విధానం కాదు. పునరుజ్జీవంతో మూసీని, మురికిలో కాలం వెళ్లదీస్తున్న ప్రజలను కాపాడి మంచి జీవనాన్ని ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని, ప్రత్యామ్నాయ ఇళ్లను ఇవ్వాలనే ఆలోచన మాకు ఉంది. కానీ పేదరికం, కట్టుబానిసలు ఉండాలనే దొరలు, భూస్వాములు, జమీందారుల భావజాలం ఉన్నవారు దీనికి అడ్డుపడుతున్నారు. అక్కడి ప్రజల భవిష్యత్తుపై అపోహలు సృష్టిస్తున్నారు. నిజానికి 4 కోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్తును, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించగల కార్యాచరణ ఇది. గత 10 నెలల పాటు అధికారులు 33 బృందాలుగా ఏర్పడి మూసీ దుర్గంధంలో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న ప్రతి ఇంటికీ వెళ్లి వారి కష్టాలు, వివరాలను తెలుసుకున్నారు. వారిని ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై మేం ఆలోచన చేస్తున్నాం. అక్కడి సమస్యలు పరిష్కరించి ఒక్కొక్కరిని ఒప్పించి తరలిస్తాం..' అని సీఎం స్పష్టం చేశారు.

సెక్యూరిటీ లేకుండా వస్తా..మీరూ రండి

'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ భూసేకరణ కోసం వేములఘాట్ ప్రజలపై అర్ధరాత్రి పోలీసులతో దాడి చేయించి గుర్రాలతో తొక్కించినట్టుగా మేం చేయం. ఇక్కడికి వస్తావా? అక్కడికి వస్తావా? అని నన్ను అడుగుతున్నారు. వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట, గజ్వేల్‌లోని ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మకు నేను సెక్యూరిటీ లేకుండా వస్తా. బీఆర్‌ఎస్ నేతలూ రావాలి. రచ్చబండ నిర్వహించి పదేళ్లలో

మిగతా 2వ పేజీలో ▶

తదుపరి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా

కేంద్ర ప్రభుత్వానికి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సు

న్యాయ మంత్రిత్వ శాఖకు లేఖ.. కేంద్రం ఆమోదం లాంఛనమే

- నవంబర్ 10న రిటైరవనున్న జస్టిస్ చంద్రచూడ్
- దేశ 51వ సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 11న బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ ఖన్నా



వివరాలు 6లో

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ హతం

తమ దాడుల్లో మృతి చెందినట్లు ఇజ్రాయెల్ ప్రకటన



6లో

- గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడికి సూత్రధారి సిన్వర్
- హమాస్‌కు కోలుకోలేని దెబ్బ

మూసీపై సీఎం తీరు అర్థరహితం

బీఆర్‌ఎస్ ధ్వజం
మూసీపై నేడు కేటీఆర్ ప్రజెంటేషన్



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు అర్థరహితంగా ఉందని బీఆర్‌ఎస్ ధ్వజమెత్తింది. మూసీ నది ప్రక్షాళనకు సంబంధించి బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన కార్యక్రమాలపై శుక్రవారం కీలక ప్రజెంటేషన్ ఇస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలంగాణ భవన్‌లో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపింది. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్లను ప్రతిపాదించి, చాలా వరకు పూర్తి చేసినట్లు కేటీ రామారావు పలు సందర్భాల్లో వెల్లడించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు ఎస్టీపీల నిర్మాణ పనులను ఇటీవల కేటీ రామారావు పార్టీ ఎమ్మెల్యేలతో కలసి సందర్శించారు.

23న కేబినెట్ సమావేశం

రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా తుది నిర్ణయం! 2లో

ఇదండీ సంగతి



..ఐతే ప్రస్తుతం సీఎం అతిశీని దించాల్నా అని అడుగుతున్నార్సార్!

సన్నబియ్యానికి 'నూకలు' చెల్లినట్టే!

క్వింటాల్ సన్న ధాన్యానికి 58 కిలోల బియ్యం, 9 కిలోల నూకలు వస్తాయంటూ మిల్లర్ల మెలిక

ఖరీఫ్ సీఎంఆర్‌పై కొత్త ఎత్తుగడ



సాక్షి, హైదరాబాద్: సన్నబియ్యంలో నూకల పేరిట మిల్లర్లు భారీ స్కెచ్ వేశారు. 100 కిలోల సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 58 కిలోల బియ్యం, 9 కిలోల నూకలు వస్తాయని కొత్తరాగం ఎత్తుకున్నారు. నిబంధనల ప్రకారం ఖరీఫ్‌లో 100 కిలోల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కిలోల బియ్యం లెక్కన ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. ఈసారి కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం (సన్నాలు) భారీ ఎత్తున వస్తాయని భావిస్తున్న మిల్లర్లు మిల్లింగ్‌లో చేతివాటం చూపేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు రబీలో వచ్చే ధాన్యాన్ని రా రైస్‌గా మిల్లింగ్ చేస్తే నూకల శాతం పెరుగుతుందని చెబుతూ వచ్చిన మిల్లర్లు.. ఈసారి సన్న ధాన్యానికి కూడా ఇదే వంక పెడుతున్నారు. గతంలో ఎన్నడూ ఖరీఫ్ ధాన్యం ఔటర్న్‌పై ఒక్కమాట కూడా మాట్లాడని మిల్లర్లు ఎకాఎకిన 9 కిలోల బియ్యానికి టెండర్ పెడుతూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సన్నబియ్యం ధర కిలోకు రూ. 50 చొప్పున లెక్క వేసుకున్నా... 9 కిలోలకు రూ. 450 అవుతుంది. క్వింటాల్ సన్న ధాన్యానికి రైతుకు ప్రభుత్వం రూ. 500 బోనస్‌గా ఇవ్వాలని భావిస్తుంటే... మిల్లింగ్ పేరు మీద క్వింటాల్ ధాన్యానికి రూ. 450 విలువైన బియ్యాన్ని ఎగవేసే పన్నాగంలో మిల్లర్లు ఉన్నట్లు అర్థమవుతోంది. 9 కిలోల బియ్యానికి బదులు

మిగతా 15వ పేజీలో ▶

● టెక్...టాక్



శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ

డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జెడ్
రిజల్యూషన్: 1080×2340 పిక్సెల్స్
మెమొరీ: 128 జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 8జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14; ఫ్రంట్ కెమెరా: 10 ఎంపీ
బ్యాటరీ: 4700 ఎంఎహెచ్; కనెక్టివిటీ: 5జీ



ఒప్పో ప్యాడ్ 3 ప్రో

సైజ్: 12.5 అంగుళాలు
రిజల్యూషన్: 2000×3200 పిక్సెల్స్
ఇంటర్నల్ మెమొరీ: 256 జీబి
బ్యాటరీ కెపాసిటీ: 10000 ఎంఏహెచ్



వివో ఎక్స్ 200 ప్రో

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు;
బరువు: 223 గ్రా.
మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
రిజల్యూషన్: 1260×2800 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ;
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్



నథింగ్ సీఎంఎఫ్ వాచ్ ప్రో2

సైజ్: 1.32
రిజల్యూషన్: 466×466 పిక్సెల్స్
- స్విమ్మింగ్, రన్నింగ్, రాక్ క్లైంబింగ్, జిమ్ సెషన్.... మొదలైన యాక్టివిటీలలో ఉపకరిస్తుంది.
- స్ట్రెస్ రీడింగ్, స్లీప్ మానిటరింగ్‌లాంటి ఫీచర్‌లు ఉన్నాయి.

ఫుల్ చార్జ్: (జీరో నుంచి) 100 నిమిషాలు

విన్నర్

ఒకానొక రోజు...



గౌతమ్ నిధి

19 సంవత్సరాల గౌతమ్ నిధి బ్రిటిష్ హైకమిషనర్ హోదాలో గంభీరంగా ఉపన్యసించింది. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపింది. శాస్త్రవేత్తల నుంచి నవీన సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకుంది. ఇది సరే, 19 సంవత్సరాల అమ్మాయి 'బ్రిటిష్ హైకమిషనర్' ఏమిటి! అని ఆశ్చర్యపోతున్నారా... అవును... ఇది అక్షరాల నిజం...

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా 'హై కమిషనర్ ఫర్ ఎ డే' పోటీని నిర్వహిస్తున్నారు. ఈ పోటీ కోసం దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన అమ్మాయిల నుంచి 140 అప్లికేషన్‌లు వచ్చాయి. ఈ సంవత్సరం కర్ణాటకకు చెందిన గౌతమ్ నిధి(19) 'భారత్‌లో ఒకరోజు బ్రిటిష్ హైకమిషనర్'గా ఎంపికైంది.

గౌతమ్ నిధి ఢిల్లీలోని మిరాండ హౌజ్ కాలేజీలో హిస్టరీ, జాగ్రఫీలలో బ్యాచిలర్స్ డిగ్రీ చేస్తోంది.

స్కెచ్చింగ్, పద సంపద, సాంస్కృతిక దౌత్యం, విదేశాంగ విధానాలపై గౌతమ్‌కు ఆసక్తి. బ్రిటిష్ హైకమిషనర్‌గా గౌతమ్ నిధి ఒకరోజంతా తీరికలేనంత కార్యక్రమాలతో గడిపింది.

యూకే-ఇండియా ద్వైపాక్షిక సంబంధాల వివరాల గురించి మాట్లాడడం ద్వారా ఆమె తొలి కార్యక్రమం మొదలైంది. ఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ని, సందర్శించిన గౌతమ్ దివ్యాంగులకు ఉపకరించే కొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకుంది.

ఆ తరువాత 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ'కి వెళ్లి మన దేశంలో వ్యాక్సిన్‌ల అభివృద్ధికి టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుంది. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమలకు చెందిన వ్యక్తులతో రోజంతా అనేక సమావేశాలు నిర్వహించింది.

'బ్రిటిష్ హైకమిషనర్ ఫర్ ఏ డే'గా ఉండడం మరచిపోలేని అద్భుతమైన జ్ఞాపకం. సోలార్ ఎనర్జీ నుంచి బయోటెక్నాలజీ వరకు సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన చేసుకునే అదృష్టం దక్కింది. సామాజిక ప్రయోజనాలకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుంది' అంటుంది గౌతమ్ నిధి.

'ఈరోజు నిధి నుండి నేర్చుకోవడం అద్భుతంగా ఉంది. యూకే-ఇండియాలలోని నవీన సాంకేతిక పరిజ్ఞానం నుంచి గ్లోబల్ చాలెంజ్‌లను స్వీకరించి దూసుకెళుతున్న యువతుల వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం' అంటుంది మన దేశంలోని బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరూన్.

షోర్ ఏఐ



నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రిపోర్ట్ ప్రకారం విద్వేషపూరిత ప్రసంగాల కేసులు 45 శాతం పెరిగాయి. ఈ సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఏఐ ఇంజినీర్ ఆండ్రియా బారువా రంగంలోకి దిగాడు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత ప్రసంగాలను రూపుమాపడమే లక్ష్యంగా 'షోర్ ఏఐ' అనే అప్లికేషన్‌ను తీసుకువచ్చాడు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ)పై లోతైన అవగాహనతో ముఖ్యమైన సమస్యలను పరిష్కరించగల ప్రత్యేక నైపుణ్యం ఆ టెక్నాలజీకి ఉందని గ్రహించాడు. 'షోర్ ఏఐ' అనేది పోస్ట్‌లు, వ్యాఖ్యలను స్కాన్ చేస్తుంది. హెచ్చరికలు జారీ చేస్తుంది. నేరస్థులను ట్రాక్ చేస్తుంది. మూడు హెచ్చరికల తరువాత కూడా ఒకరు విద్వేషపూరిత వ్యాఖ్యలను పోస్ట్ చేస్తే వారు నిషేధానికి గురవుతారు.

'నిషేధిత యూజర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తప్పు చేసిందని భావిస్తే నేరుగా హ్యూమన్ మోడరేటర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. వారు కేసును పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు' అంటున్నాడు బారువా.

'షోర్ ఏఐ' ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ 2024'లో 'ఏఐ ఫర్ సోషల్ గుడ్' విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన 'జస్ట్ ఏఐ' అవార్డ్ గెలుచుకుంది.

త్రిపుర గ్రామీణ ప్రాంతానికి చెందిన బారువా ఏఐ ఇంజినీరే కాదు ఆర్టిస్ట్ కూడా. 'కళాకారుడిగా నా భావాలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేయడం మొదలుపెట్టినప్పుడు ప్రోత్సాహకరమైన ప్రశంసలతో పాటు విపరీతమైన ద్వేషం ఎదుర్కొన్నాను. నిజజీవితంలో మనం ఎదుర్కొనే అవమానాలు, వివక్ష ఆన్‌లైన్‌లోకి కూడా వచ్చాయి అని తెలుసుకున్నాను' అంటాడు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన బారువా.

వెన్నెల్లో ఆడపిల్ల

మ్యూజిక్ వరల్డ్



తన కొత్త సింగిల్‌తో నైంటీస్ క్లాసిక్‌ను ఇంటర్‌పోల్ చేస్తోంది లీసా. 'కిస్ మీ' (1997)ని ఆకర్షణీయమైన డాన్స్-పాప్ ట్రాక్‌గా పునర్నిర్మించింది. రెండున్నర నిమిషాల పాటు సాగే ఈ పాటను ఫ్రెంచ్ కుర్రాడితో కలిసి పాడింది. 'మూన్‌లిట్ ఫ్లోర్' అనేది ప్రేమలో పడడానికి సంబంధించిన డాన్స్-పాప్ ట్రాక్. ఒరిజినల్ పాటలోని 'లీడ్ మీ ఔట్ ఆన్ ది మూన్‌లిట్ ఫ్లోర్'లాంటి చరణాలను మార్చారు. థాయ్ ర్యాపర్ లాలిసా మనోబాల్ 'లీసా'గా ప్రసిద్ధురాలైంది. దక్షిణ కొరియా మ్యూజిక్ గ్రూప్ 'బ్లాక్‌పింక్'లో లీసా సభ్యురాలు. 2021లో తన మొదటి సింగిల్ ఆల్బమ్ 'లాలీసా'ను విడుదల చేసింది. దక్షిణకొరియాలో అమ్మకాలలో ఈ ఆల్బమ్ రికార్డ్ సృష్టించింది. విడుదలైన 24 గంటల్లో ఎక్కువమంది వీక్షించిన వీడియోగా నిలిచింది. 'హౌ యువర్ టంగ్ దు ఆల్ దోజ్ ట్రిక్స్?' అని ప్రియుడిని అడుగుతోంది లీసా. ఆ ట్రిక్స్ ఏమిటో తెలుసుకోవాలంటే 'మూన్‌లిట్ ఫ్లోర్' వినాల్సిందే!

ఇన్నోవేషన్

అలెర్జీ యాప్



ఫైనలియర్ గ్రాడ్యుయేషన్ ప్రాజెక్ట్‌కు ఐడియా కోసం వెదుకుతున్నప్పుడు అయేషా ఫజలుల్ రహిమాన్‌కు 'అలెర్జీ' పై దృష్టి పడింది.

తిరువనంతపురం లోని 'కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్' స్టూడెంట్ అయిన అయేషా అలెర్జీల గురించి హెచ్చరించే 'అలెర్జీ' అనే స్మార్ట్‌వాచ్ యాప్‌ను డెవలప్ చేసింది.

డిజైన్ ప్రోటోటైప్ దశలో ఉన్న ఈ యాప్‌ను తిరువనంతపురంలో జరిగిన 'ది డాట్ ఎగ్జిబిషన్ 2024'లో ప్రదర్శించి ఎంతో మంది ప్రశంసలు అందుకుంది.

అలెర్జీ ఉన్న రోగి స్పృహ కోల్పోతే ఈ వాచ్ నాన్‌స్టాప్‌గా 'బీప్' సౌండ్ ఇస్తుంది. లైట్‌ను అదేపనిగా ఫ్లాష్ చేస్తుంటుంది. డిస్‌ప్లేలో 'హెల్ప్, అలర్జీ పేషెంట్' అనే మెసేజెస్‌తో పాటు 'ట్యాప్ బటన్' కనిపిస్తుంది. అది ట్యాప్ చేస్తే సూచనలు కనిపిస్తాయి.

'మన దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరు అలర్జీలతో బాధపడుతున్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని ఈ వాచ్‌ను తయారు చేశాను. ఇది సకాలంలో హెచ్చరించడమే కాదు చికిత్స సమయంలో రోగికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను వైద్యులకు అందజేస్తుంది' అంటుంది 22 ఏళ్ల అయేషా.

గేమింగ్

వెదకాలి... వేటాడాలి

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్
జానర్: సర్వైవల్ హారర్
మోడ్: సింగిల్ ప్లేయర్



సర్వైవల్ హారర్ గేమ్ 'సైలెంట్ హిల్' విడుదల అయింది. 2001లో వచ్చిన 'సైలెంట్ హిల్2'కు రీమేక్‌గా వచ్చిన వీడియో గేమ్ ఇది. రిమోట్ మైనింగ్ టౌన్ 'సైలెంట్ హిల్' కేంద్రంగా గేమ్ కొనసాగుతుంది. ఈ టౌన్ ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా కనిపిస్తుంది. కొందరికి మంచు మాత్రమే కనిపిస్తుంది. కొందరికి మంట మాత్రమే కనిపిస్తుంది. కొందరికి చీకటి మాత్రమే కనిపిస్తుంది. ఒరిజినల్ గేమ్‌లాగే ఈ గేమ్‌లో జేమ్స్ సందర్లాండ్ ప్రధాన పాత్ర. 'నీ కోసం వేచి ఉన్నాను' అని చనిపోయిన భార్య నుంచి జేమ్స్‌కు లేఖ అందుతుంది. ఆమెను వెదుక్కుంటూ 'సైలెంట్ హిల్'కు వస్తాడు జేమ్స్. గేమ్ ప్లే విషయానికి వస్తే...ఈ గేమ్‌లో ఆధునీకరించిన థర్డ్-పర్సన్ కెమెరా సిస్టమ్ ఉంది.

English Idioms

నెపో బేబీ

ప్రసిద్ధ వ్యక్తుల పిల్లలు, ఫేమస్ పేరెంట్స్ ఉన్న ఫేమస్ పర్సన్, బంధుప్రీతి నుంచి లబ్ధి పొందిన వారి విషయంలో ఉపయోగించే మాట.... నెపో బేబీ.
ఉదా: బీయింగ్ ఏ నెపో బేబీ డజంట్ గ్యారెంటీ దట్ యూ కెన్ బీ ఏ హైలీ సక్సెస్‌ఫుల్ పర్సన్.

విమ్ అండ్ విగర్

ఫుల్ ఎనర్జీ, ఉత్సాహం ఉండే సందర్భంలో వాడే మాట... విమ్ అండ్ విగర్
ఉదా: ఐ హ్యావ్ టు కిక్ స్టార్ట్ మై న్యూ బిజినెస్ విత్ విమ్ అండ్ విగర్

సినిమా


● అల్లు అర్జున్

యాభై రోజుల్లో రూల్ స్టార్ట్

పుష్పరాజ్ కౌంట్‌డౌన్ మొదలైంది. 50 రోజుల్లో (డిసెంబరు 6న) ప్రపంచ వ్యాప్తంగా పుష్ప రూల్ ప్రారంభం కానుందని పేర్కొని, అల్లు అర్జున్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప: ది రైజ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ఎంతటి సంచలన విజయం సాధించిందో తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' తెరకెక్కుతోంది. ఇందులోనూ అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటిస్తుండగా సుకుమారే దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని డిసెంబరు 6నే విడుదల చేయనున్నట్లు ప్రకటించి, 50 రోజుల కౌంట్‌డౌన్ స్టార్ట్ అంటూ అల్లు అర్జున్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''పుష్ప-2 ది రూల్' క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముఖ్యంగా భారతీయ సినీ పరిశ్రమ యావత్ ఎదురు చూస్తున్న సినిమా మన తెలుగు చిత్రం కావడం గర్వ కారణంగా ఉంది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

రజనీకాంత్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను - టీజే జ్ఞానవేల్


● టీజే జ్ఞానవేల్, రజనీకాంత్


"రజనీకాంత్ గారిని ఎలా చూపించాలో, ఎలా చూపిస్తే అభిమానులు సంతోషిస్తారో అనే అవగాహన నాకు ఉంది. ఫ్యాన్స్‌ని అలరించే అంశాలతో పాటు ఆకట్టుకునే కంటెంట్‌తో 'వేట్టయాన్: ది హంటర్' సినిమాను రూపొందించడమే నా ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాను. రజనీకాంత్‌గారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను" అని డైరెక్టర్ టీజే జ్ఞానవేల్ అన్నారు. రజనీకాంత్ లీడ్ రోల్‌లో అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'వేట్టయాన్: ది హంటర్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలైంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రిలీజైంది. తమిళ్, తెలుగులో ఈ సినిమాకి మంచి స్పందన వస్తోందని యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా టీజే జ్ఞానవేల్ పంచుకున్న విశేషాలు.

● 'జైలర్' సినిమా తర్వాత రజనీకాంత్‌గారి కుమార్తె సౌందర్య నాతో 'మా నాన్నకి సరిపోయే కథలు ఉన్నాయా' అని అడిగారు. రజనీకాంత్ గారు నా శైలిని అర్థం చేసుకుని, కావాల్సినంత క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. నిజ జీవిత ఎన్‌కౌంటర్ల నుంచి స్ఫూర్తి పొంది 'వేట్టయాన్: ది హంటర్' కథ రాశాను. అయితే ఈ చిత్రంలో అనేక అంశాలపై లోతుగా చర్చించినప్పటికీ రజనీకాంత్‌గారి అభిమానులు ఇష్టపడే ఆ ఐకానిక్ మూమెంట్స్‌ను పెట్టడం, ఈ కథకి ఆయన స్టైల్, మేనరిజమ్‌ను జోడించడం నాకు సవాల్‌గా అనిపించింది. ● దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల గురించి అనేక వార్తలు చదివాను. ఎర్రచందనం స్మగ్లర్లు అంటూ చెట్లు నరికే వారిని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన నన్ను కదిలించింది. పేదలు తరచూ ఇటువంటి ఎన్‌కౌంటర్ల బాధితులవుతున్నారని, సంపన్నులు తప్పించుకుంటున్నారని నా పరిశోధనల్లో తెలిసింది. ఎన్‌కౌంటర్లలో ఎంత వాస్తవం ఉంది? అసలు ఇలా చేయడం కరెక్టేనా? నిజమైన దోషులనే శిక్షిస్తున్నామా? అనే వాటిని 'వేట్టయాన్: ది హంటర్'లో చూపించాను. విద్యా వ్యవస్థ లోపాలను కూడా టచ్ చేశాం. ● ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌గార్లను బ్యాలెన్స్ చేయడంపై దృష్టి పెట్టలేదు. వారి పాత్రల భావజాలాన్ని బ్యాలెన్స్ చేయడంపైనే దృష్టి పెట్టాను. ప్యాట్రిక్ పాత్రకు ఫాహద్ ఫాజిల్ కరెక్ట్ అనిపించింది. అలాగే నటరాజ్ పాత్రని రాస్తున్నప్పుడు రానా దగ్గుబాటినే అనుకున్నాను. అనిరుధ్ రవిచందర్ అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం అందించాడు. 'వేట్టయాన్: ది హంటర్' సినిమాకి ప్రీక్వెల్ చేయాలనే ఆలోచన ఉంది. ఇక నవంబరు మొదటి వారంలో నా కొత్త సినిమాల గురించి చెబుతాను.

ఓటీటీ | ఇది చూడొచ్చు

ఈ అరటిపండు చాలా చేదు!!

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'వాళై' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మనం తినే అరటిపండు నోటికి ఎంత తియ్యగా ఉంటుందో, అది మన నోటి దాకా రావడానికి ఎన్ని జీవితాలను చేదు చేస్తుందో చెప్పిన చిత్రం 'వాళై'. ఈ సినిమా మాతృక తమిళ మైనా తెలుగులో డబ్ అయి హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతోంది. 1999 ఫిబ్రవరి 22న తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా శ్రీ వాయుగుండం ప్రాంత పరిధిలో జరిగిన ఓ ఘోర ప్రమాదంలో బతికి బయటపడ్డ వ్యక్తి అందించిన సమాచార రూపమే ఈ 'వాళై' సినిమా. ఈ విషయాన్ని సవివరంగా దర్శకుడు సినిమా ఆఖర్లో చెప్పారు. ఈ సినిమాకి మారీ సెల్వరాజ్ దర్శకుడు. ప్రముఖ వర్ధమాన తమిళ నటులు కలైరాసన్, నిఖిలా విమల్ ఈ సినిమా ముఖ్య తారాగణం. ఇక కథాంశానికొస్తే... శివానందన్, శేఖర్ మంచి స్నేహితులు. బాగా పేద కుటుంబం నుండి వచ్చిన పిల్లలు. ఇద్దరూ ప్రభుత్వ బడిలో ఎనిమిదో తరగతి చదువుతూ ఉంటారు. వారమంతా బడికి వెళ్ళి వారాంతంలో ఓ రూపాయి సంపాదించడం కోసం అరటి గెలలు కోసే పనికి ఊరితో పాటు వెళుతూ ఉంటారు. శివానందన్ చదువులో మంచి తెలివిగలవాడు, ఈ అరటిపండ్లు కోసే పని అస్సలు నచ్చదు తనకు. క్లాసులో సైన్సు పాఠాలు చెప్పే పూంగొడి టీచర్ అంటే శివానందన్‌కు చాలా ఇష్టం. ఇక అరటిపండ్లు కోయడానికి ఆ ఊరి తరపున ఖని అనే వ్యక్తి నాయకత్వం వహిస్తుంటాడు. అరటి గెలల వ్యాపారికి, ఊరికి మధ్యలో బ్రోకర్‌గా ముత్తురాజ్ వ్యవహరిస్తుంటాడు. ముత్తురాజ్‌కు, ఖనికి కూలీ డబ్బుల మధ్య వైరం ఏర్పడి ఖని మీద ముత్తురాజ్ ద్వేషం పెంచుకుంటాడు. ఓ రోజు శివానందన్ అరటి గెలల పని నుండి తప్పించుకొని ఆకలితో ఓ అరటి తోటలోకి వెళ్ళి అరటిపండ్లు తినబోతాడు. అంతే... ఆ తోట యజమాని శివానందన్‌ను పట్టుకుని తీవ్రంగా కొట్టగా స్పృహ తప్పి ఓ కొలనులో పడిపోతాడు. తను లేచి కళ్ళు తెరిచేసరికి ఊరంతా ఏడుస్తుంటుంది. శివానందన్ తల్లితో పాటు అక్క, తోటి స్నేహితుడు శేఖర్, ఖనితోపాటు దాదాపు 19 మంది ఊరువాళ్ళు చనిపోయి పడి ఉంటారు. అసలు వీళ్ళంతా ఎలా చనిపోయారు? ఆ తరువాత శివానందన్ పరిస్థితి ఏంటి అన్నది 'వాళై' సినిమాలోనే చూడాలి. రోజు వారీ కూలీ చేసుకుని బతికే జీవితాలు ఎలా ఉంటాయన్న స్థితిగతులను ఎంతో హృద్యంగా చిత్రీకరించారు దర్శకుడు. ఈ సినిమాని మనం తెర మీద చూస్తున్నట్టుండదు... జీవితాలను చూస్తున్న ఫీల్ కలుగుతుంది. సినిమాలో కొంచెం ల్యాగ్ ఉన్నా మనసుకు హత్తుకుంటుంది. తినే పండు మనకు తియ్యగా ఉన్నా ఆ పండు మన దాకా రావడానికి ఎంతమంది జీవితాలను చేదు చేసిందో అని చెప్పేదే ఈ 'వాళై' సినిమా.

– ఇంటూరు హరికృష్ణ

కథ నచ్చితే మనస్ఫూర్తిగా సపోర్ట్ చేయండి - కిరణ్ అబ్బవరం

''నేను, అంజన్ షార్ట్ ఫిలింస్ నుంచి వచ్చాం. మూడేళ్లుగా అంజన్ ఫ్యామిలీ అంతా 'లవ్ రెడ్డి' సినిమా కోసం కష్టపడుతున్నారు. కథ నచ్చితే ఈ సినిమాను మనస్ఫూర్తిగా సపోర్ట్ చేయండి. నా వంతుగా ఆంధ్ర, సీడెడ్, నైజాంలో ఒక్కో షోని నేను స్పాన్సర్ చేస్తాను'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా స్మరన్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ రెడ్డి'. సునంద బి. రెడ్డి, హేమలతా రెడ్డి, రవీందర్ .జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి నిర్మించారు. సుమ, సుష్మిత, హరీష్, బాబు, రవికిరణ్, జకారియా సహ నిర్మాతలుగా వ్యవహరించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా 'లవ్ రెడ్డి' సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''అంజన్‌కు ఇండస్ట్రీ నుంచి తిరిగి వెళ్లిపోయే ఉద్దేశం లేదు.. తను మంచి స్థాయికి చేరుకోవాలి'' అన్నారు. ''కథ పరంగా 'లవ్ రెడ్డి' పెద్ద సినిమానే'' అని మదన్ గోపాల్ రెడ్డి, యశస్విని చెప్పారు. ''ఇటీవల హిందూపురంలో మా సినిమా ప్రివ్యూ వేస్తే మంచి స్పందన వచ్చింది'' అన్నారు స్మరణ్ రెడ్డి. ''మీరు థియేటర్‌లోకి వెళ్లి కూర్చోండి చాలు... మా మూవీనే మిమ్మల్ని చూపు తిప్పుకోకుండా చేస్తుంది'' అని శ్రావణి తెలిపారు. ''మా సినిమా నచ్చి తెలుగులో మైత్రీ మూవీస్, కన్నడలో హోంబలే ఫిలింస్ రిలీజ్ చేస్తున్నాయి'' అని అంజన్ రామచంద్ర చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ ప్రిన్స్ మాట్లాడారు.



● శ్రావణి, కిరణ్ అబ్బవరం, అంజన్

ఎర్రగుడి నేపథ్యంలో...


● మంచు లక్ష్మి

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. ఎస్తేర్, శివ కంఠమనేని, ఆదిత్య ఓం ఇతర పాత్రల్లో నటించారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్షా ఆర్ట్స్, ఏఐ (అమెరికా ఇండియా) ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ''1974–90 మధ్య కాలంలో జరిగిన వాస్తవ ఘటనలతో 'ఆదిపర్వం' తెరకెక్కింది. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న ఈ పీరియాడిక్ ప్రేమకథలో అద్భుతమైన గ్రాఫిక్స్ ఉంటాయి. 'అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలో దుష్ట శక్తికి, దైవ శక్తికి మధ్య జరిగే యుద్ధాన్ని చూపిస్తున్నాం. 500 థియేటర్స్‌లో మా మూవీ విడుదలవుతోంది'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఎస్ఎన్ హరీశ్, సంగీతం: మాధవి సైబ, ఓపెన్ బనాన ప్రవీణ్, సంజీవ్, బి. సుల్తాన్ వలి, లుబెక్ లీ, రామ్ సుధీ (సుధీంద్ర).

ఎమర్జెన్సీకి రూట్ క్లియర్


● కంగనా రనౌత్

హిందీ చిత్రం 'ఎమర్జెన్సీ'కి సెన్సార్ క్లియరెన్స్ లభించింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. భారత దేశ దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో ఇందిరా గాంధీ పాత్ర తీరును, ఓ వర్గ ప్రజలను కంగనా తప్పుగా చూపించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా విడుదల పలు మార్లు వాయిదా పడింది. ఫైనల్‌గా సెప్టెంబరు 6న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ సెన్సార్‌పరమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. దాంతో విడుదల మళ్లీ ఆగింది. తాజాగా 'ఎమర్జెన్సీ'కి సెన్సార్ సర్టిఫికెట్ లభించిందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని, సపోర్ట్‌గా నిలిచిన ఫ్యాన్స్‌కు థ్యాంక్యూ అంటూ సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా కంగనా రనౌత్ వెల్లడించారు.

ఇంజినీర్ ప్రేమకథ


● దీపిక, ప్రదీప్

ప్రదీప్ మాచిరాజు హీరోగా నటిస్తున్న ద్వితీయ చిత్రానికి 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే టైటిల్‌ని ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో దీపికా పిల్లి హీరోయిన్. నితిన్–భరత్ దర్శకత్వంలో మాంక్స్–మంకీస్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ''యునిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో సివిల్ ఇంజినీర్‌గా ప్రదీప్ నటిస్తున్నారు. తన ఉద్యోగంలో భాగంగా ఓ గ్రామానికి వెళతాడు ఈ ఇంజినీర్. అక్కడ ఓ అమ్మాయితో ప్రేమలో పడతాడు. వారి ప్రేమకథ, ఊహించని మలుపులు ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: రథన్, కెమెరా: ఎమ్ఎన్ బాలరెడ్డి.


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 207

శుక్రవారం 18-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాయబ్‌సింగ్ సైనీ అనే నేను..

హరియాణా ముఖ్యమంత్రిగా ఓబీసీ నాయకుడు సైనీ ప్రమాణం -6లో



2 నెలల కనిష్టానికి సూచీలు


బ్యాంకులు, రియల్టీ షేర్లలో అమ్మకాలు.. మార్కెట్ మూడోరోజూ డీలా -15లో



సుజాత ఎక్కడ?

మావోయిస్టు అగ్రనేత సుజాత అలియాస్ పద్మ అలియాస్ మైనా అలియాస్ కల్పన ఎక్కడు న్నారనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది.

వివరాలు 16లో ▸



దారి తప్పిన జలచక్రం!

పర్యావరణంతో మనిషి ఆడుతున్న ఆట పెనువిపత్తుగా పరిణమిస్తోందని ఓ అంతర్జాతీయ నివేదిక తెలిపింది.

వివరాలు 6లో ▸



సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధమే

భారత పౌరసత్వ చట్టం–1955లోని 'సెక్షన్ 6ఏ' రాజ్యాంగబద్ధతను ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది.

వివరాలు 6లో ▸



నిరాధార ఆరోపణలు..

ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో అడ్డగోలు ఆరోపణలు చేసిన కెనడాపై భారత్ మళ్లీ విరుచుకుపడింది.

వివరాలు 6లో ▸

పరీక్షల ముందు పరేషాన్!

మూడు రోజుల్లో గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలుండగా అభ్యర్థుల ఆందోళనలు

రిజర్వుడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారంటూ ఆవేదన

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ అధ్యక్షులతో భేటీ
- పరీక్షలను రీషెడ్యూల్ చేయించాలంటూ వినతి
- వారికి మద్దతుగా ముందుకొస్తున్న పార్టీలు
- పరీక్షల నిర్వహణపై వెనక్కి తగ్గేది లేదంటున్న యంత్రాంగం
- అధికారులతో సీఎస్ సమీక్ష



గురువారం హైదరాబాద్ గాంధీనగర్‌లోని కెనరా బ్యాంక్ పార్కులో నిరసన తెలుపుతున్న గ్రూప్‌-1 అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షల సమయం ముంచుకొస్తున్న వేళ అభ్యర్థులు ఆందోళన బాట పట్టారు. మూడు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానుండగా.. వాటిని రీషెడ్యూల్ చేయాలంటూ రోడ్డెక్కారు. ఒకవైపు రాజకీయ పార్టీలను సంప్రదిస్తూనే.. మరోవైపు పరీక్షల వాయిదా కోసం నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. తాజాగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను వేరువేరుగా కలిశారు. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అనుసరించిన విధానంతో రిజర్వుడ్ అభ్యర్థులు నష్టపోయారంటూ వారికి వివరించి పరీక్షల రీషెడ్యూల్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. టీజీపీఎస్సీ వైఖరిపై న్యాయపోరాటం చేస్తామని, ఇందుకు సహకరించాలని కేటీఆర్‌ను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్‌కుమార్ గౌడ్ కూడా వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహించనున్న మెయిన్స్ పరీక్షల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అలాగే, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ చేపట్టడంతో

మిగతా 3వ పేజీలో ▶

46 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తాం: సీఎస్



గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని 46 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. పరీక్షల నిర్వహణపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ సవాలుతో కూడుకున్నదని, వదంతులకు తావివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మాట్లాడుతూ ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కమిషన్ కార్యాలయం నుంచి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు ఒక గంట అదనంగా సమయం కేటాయిస్తున్నట్టు చెప్పారు. సహాయకుల (స్క్రైబ్) సహాయంతో పరీక్షలు రాసే వారికి ప్రత్యేకంగా 4 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టేయండి

గ్రూప్‌-1 పరీక్షలపై ఐదుగురు అభ్యర్థుల అప్పీల్

- తప్పు ప్రశ్నలపై వాదనలు వినాలని విజ్ఞప్తి
- నేడు విచారణ చేపట్టనున్న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం

3లో

పెండింగ్ బిల్లులపై 'పంచాయితీ'!

సగం దాకా గ్రామ పంచాయతీల్లో రూ.3 లక్షలు మొదలు రూ.కోటి దాకా పెండింగ్ బిల్లులు

- గత ప్రభుత్వ హయాంలో మౌఖిక ఆదేశాలతో చేసిన పనులతో అవస్థలు పడుతున్న మాజీ సర్పంచ్‌లు
- కాంగ్రెస్ సర్కార్‌లోనైనా వస్తాయన్న ఆశ... పదినెలలుగా ఎదురుచూపులే
- అప్పుల పాలై ఉసురు తీసుకుంటున్న మాజీ సర్పంచ్‌లు



సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో పెండింగ్ బిల్లుల 'పంచాయతీ'ఎటూ తేలడం లేదు. రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతీలుండగా, దాదాపు సగం గ్రామ పంచాయతీల్లో ఒక్కో దాంట్లో రూ.3 లక్షలు మొదలు రూ.కోటి దాకా పెండింగ్ బిల్లులు మాజీ సర్పంచ్‌లను ఊపిరి సలపనివ్వడం లేదు. మొత్తంగా చూస్తే...ఈ ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసే నాటికి రూ.1,300 కోట్ల (వీటిలో పూర్తి చేసిన పనులకు కేంద్రం నుంచి రావాల్సినవి కలిపి) మేర గ్రామపంచాయతీల్లో బకాయిలు పేరుకుపోయినట్టుగా సర్పంచ్‌ల సంఘాలు చెబుతున్నాయి. సొంత ఆదాయ వనరుల్లేని 5,500కు పైగా చిన్న, మధ్యస్థాయి పంచాయతీలకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, బెదిరింపులతో అప్పులు తెచ్చి, ఇంట్లో ఆడవారి బంగారం తాకట్టు పెట్టి వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినా, ఆ బిల్లులు ఇంకా రాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తమ తలరాత మారుతుందని ఆశించిన మాజీ సర్పంచ్‌లకు నిరాశ ఎదురవుతోంది. పలువురు సర్పంచ్‌లు అప్పుల ఒత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారని, మరికొందరు చిన్నవయస్సులోనే తనువు చాలించారని సర్పంచ్‌ల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019–2024 మధ్యకాలంలో దేశంలోనే అత్యధిక అభివృద్ధి పనులు చేసి తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టి అవార్డులు, రివార్డులకు కారణమైన గ్రామ ప్రథమపౌరులు మాజీలుగా మారాక పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా అప్పుడు కొంచెం ఇప్పుడు కొంచెం వస్తున్నాయి. ఈ కారణంగా గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులు పేరుకుపోతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఆర్ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలకు ఎన్నోసార్లు కలిసి విజ్ఞప్తులు చేసినా పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌పై అడుగు ముందుకు పడడం లేదని సర్పంచ్‌ల సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. గత ప్రభుత్వ

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఈ నెలాఖరుకు జేఈఈ నోటిఫికేషన్!



జేఈఈ–2025 నోటిఫికేషన్ ఈ నెలాఖరులో వెలువడనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. నవంబర్ మొదటి వారంలో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించే వీలుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

- వివరాలు 3లో▶

పత్తి.. లారీల కత్తి



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), వ్యవసాయ మార్కెటింగ్ శాఖల తీరుపై తెలంగాణ లారీ ఓనర్ల అసోసియేషన్లు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలో ఉన్న పత్తిని ఇతర రాష్ట్రాలకు తరలించే విషయంలో ఇతర రాష్ట్రాల లారీలను వినియోగించుకోవడమే ఇందుకు ప్రధాన కారణం.

- వివరాలు 2లో▶

కల్తీ మద్యం కాటుకు బిహార్‌లో 24 మంది బలి



మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో కల్తీ మద్యం 24 మంది ప్రాణాలను బలి తీసుకుంది. సివాన్ జిల్లాలోని మఘర్, ఔరియా గ్రామాల్లో 20 మంది, సరణ్ జిల్లాలోని ఇబ్రహీంపూర్‌లో నలుగురు మృతిచెందినట్లు అధికారులు గురువారం వెల్లడించారు.

- వివరాలు 6లో▶

ఉన్నత విద్యలో సమూల మార్పులపై దృష్టి



ఉన్నత విద్యకు ప్రస్తుతమున్న చాలెంజ్‌లను అధిగమించడమే తన తొలి ప్రాధాన్యం అని ఉన్నత విద్యామండలి కొత్త చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. సమాజంలో ఇప్పుడున్న పోకడలకు అనుగుణంగా సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలిపారు.

- వివరాలు 14లో▶

'ఈషా' స్కూళ్లలో కీచక చర్యలు!

జగ్గీ వాసుదేవ్‌కు తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

కోయంబత్తూరులోని పాఠశాలలపై రాజమండ్రికి చెందిన దంపతుల తీవ్ర ఆరోపణలు



- మా కుమారుడిపై మరో విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు
- తెల్లవారుజామున విద్యార్థినులతో అర్ధనగ్నంగా యోగా చేయిస్తున్నారు
- త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి.. ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

2లో

ఇకపై 60 రోజుల వరకే..

రైల్వే టికెట్ అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం 120 రోజుల నుంచి 60 రోజులకు కుదింపు

- నవంబర్ 1 నుంచి బుకింగ్ చేసుకొనే వారికి వర్తింపు
- నిబంధనల్లో కీలక మార్పులు చేసిన రైల్వే శాఖ
- ప్రస్తుతం 21 శాతంగా క్యాన్సిలేషన్స్.. టికెట్లు బుక్ చేసుకున్నా రైలెక్కని వారు 4–5 శాతం
- ఆ టికెట్లను అమ్ముకుంటున్న దళారులు.. అవినీతికి పాల్పడుతున్న రైల్వే సిబ్బంది
- వాటన్నింటికీ అడ్డుకట్ట వేయడానికే కాలపరిమితిని కుదించామన్న రైల్వే శాఖ

6లో



ప్రభుత్వ ఆస్పత్రులపై పోలీస్ నిఘా



ఠాణాలకు ఆస్పత్రుల్లోని సీసీ కెమెరాలతో అనుసంధానం

16లో

- 24 గంటల కంట్రోల్ రూంతోపాటు బారికేడ్ల విధానం
- వైద్య సిబ్బందికి భద్రతపై మంత్రి దామోదర కీలక నిర్ణయం
- ప్రైవేట్ ఆస్పత్రుల మాదిరిగా రోగుల బంధువులకు విజిటర్స్ పాస్
- ఉత్తర్వులు జారీ చేసిన వైద్య, ఆరోగ్యశాఖ

పత్రికా స్వేచ్ఛపై 'రెడ్‌బుక్' పడగ



రాజ్యాంగ హక్కులను కాలరాసిన కూటమి ప్రభుత్వం

'సాక్షి' ఎడిటర్ వి.మురళిపై అక్రమ కేసు నమోదు

వరద సహాయ చర్యల్లో ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేసినందుకే..

కక్ష పూరితంగా ప్రైవేట్ వ్యక్తితో ఫిర్యాదు చేయించిన సర్కారు

ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణిపై సర్వత్రా తీవ్ర ఖండనలు

ఈ అక్రమ కేసులు చెల్లవని సుప్రీంకోర్టు న్యాయవాదుల స్పష్టీకరణ

వివరాలు 12లో

క్లుప్తంగా...

23న కేబినెట్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరుగనుంది. మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి గతంలో మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే డిజిటల్ ఫ్యామిలీ కార్డు పైలట్ ప్రాజెక్టు ప్రతి నియోజకవర్గంలో ఒక పంచాయతీ, ఒక పట్టణంలో నిర్వహించిన సర్వే ఫలితాలను ఈ సందర్భంగా మంత్రివర్గంలో చర్చించి తుది రూపును ఇచ్చే అవకాశం ఉంది. అలాగే ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న డీఏకి సంబంధించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుని దీపావళి తీపికబురు చెబుతుందని సమాచారం. ధరణిపై ఏర్పాటు అయిన కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై చర్చ, చట్టానికి తుదిరూపు ఇచ్చే అవకాశం ఉంది. శీతాకాల సమావేశాల నిర్వహణ, మూసీ పునరుజ్జీవనం సందర్భంగా నిర్వాసితులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఉపాధి అంశాలపై కూడా నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాల సమాచారం.

బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు

డీజీపీకి మండలి విపక్ష నేత మధుసూదనాచారి ఫిర్యాదు



డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న మధుసూదనాచారి. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నేతలు డీజీపీ జితేందర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు యాదగిరితో కూడిన బృందం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసింది. జిల్లా నాయకులపై అక్రమ కేసుల అంశాన్ని వారు డీజీపీతో ప్రస్తావించారు.

ఎస్సీ కమిషన్‌కు మూసీ నిర్వాసితుల మొర

సాక్షి, హైదరాబాద్: మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో పేద ఎస్సీ కుటుంబాలను అక్రమంగా తరలిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను నిర్వాసితులు ఆశ్రయించారు. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ సమక్షంలో గురువారం ఎస్సీ కమిషన్‌కు పిటిషన్‌ను దాఖలు చేశారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించిన సొమ్ముతో చట్టబద్ధంగా ఇళ్లు నిర్మించుకున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు అందించడమే కాకుండా, ఆస్తి పన్నులు కూడా వసూలు చేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఇప్పుడు అవే ఇళ్లను అక్రమ కట్టడాలని ప్రభుత్వం పేర్కొంటూ తమను తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు వారు వివరించారు. ఎస్సీ కుటుంబాల హక్కులను కాపాడాలని ఎస్సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

రేవంత్‌ది రోజుకో మాట


మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'మతిమరుపు ఎక్కువై పూటకో మాట మాట్లాడుతున్నావు.. డాక్టర్‌ను సంప్రదించు రేవంత్ రెడ్డి.. రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామన్నది నువ్వే .. మళ్ళీ ఆ సంఖ్య ఎక్కడిదని నువ్వే అంటున్నావు'.. అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మూసీ నది అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ఆయన గురువారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజల కష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భూమి పాలు చేస్తున్నారని, నది గర్భం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఇళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే ఇళ్ల మార్కింగ్ మొదలు పెట్టాలని సూచించారు. పేద ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ కచ్చితంగా నిలబడుతుందని, సీఎం రేవంత్ ఊకదంపుడు బెదిరింపులకు భయపడబోదని స్పష్టం చేశారు.

కేసీఆర్‌పై కేసు డిసెంబర్ 27కు వాయిదా

భూపాలపల్లి అర్బన్: మేడిగడ్డ కుంగుబాటుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై భూపాలపల్లి కోర్టులో నమోదైన కేసును డిసెంబర్ 27వ తేదీకి వాయిదా వేస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి.. అప్పటి సీఎం కేసీఆర్‌తో పాటు, స్మితా సబర్వాల్, నిర్మాణ సంస్థపై జిల్లా కోర్టులో ఫిర్యాదు చేయడం తెలిసిందే. వారి తరఫున న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరవుతున్నారు.



పునరుజ్జీవం తర్వాత మూసీ ఎలా ఉండబోతోందో తెలియజేస్తూ సీఎం ఇచ్చిన ప్రెజెంటేషన్‌లోని చిత్రాలు

సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం!

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్ని దుర్మార్గాలు చేశారో ప్రజలను అడుగుదాం..' అని రేవంత్ సవాల్ చేశారు.

బఫర్ జోన్‌లో మరో 10 వేల గృహాలు

'మూసీ గర్భంలో 1,690 ఇళ్లు ఉండగా వారికి దసరా పండుగ వేళ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు రూ.25 వేలు చొప్పున తోవ ఖర్చులకు ఇచ్చాం. అయితే హైడ్రా వస్తుంది..బుల్డోజర్లు పెడ్తున్నరు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీలో ప్రభుత్వం ఒక్క ఇల్లు కూలగొట్టలేదు. ఖాళీ చేసిన లబ్ధిదారులే తమ ఇళ్ల తలుపులు, కిటికీల కోసం కూలగొట్టుకున్నారు. అడ్డగోలుగా కట్టిన 10, 20 అంతస్తుల ఆకాశహర్మ్యాలను కూల్చడానికే బుల్డోజర్లు, హైడ్రా అవసరం. అయినా హైడ్రా ఏమైనా ఫామ్‌హౌస్‌లో నిద్రపోయే భూతమా? మీద పడడానికి? మరో 10 వేల ఇళ్లు బఫర్‌జోన్‌లో ఉన్నాయి వారికి ప్రత్యామ్నాయం కల్పించి, మంచి జీవితాలు ఇచ్చి మనస్సు గెలవాలని భావిస్తున్నాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఆ కంపెనీలతో కన్సార్టియం

'ప్రపంచంలో అద్భుతాలను సృష్టించిన ఐదు కంపెనీలతో ఒక కన్సార్టియం ఏర్పాటు చేయించి రూ.141 కోట్లతో మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతలను టెండర్ల ద్వారా అప్పగించాం. డీపీఆర్ తయారీతో పాటు అంచనా వ్యయం, నిధులు, పెట్టుబడులు, రుణాల సమీకరణకు సంబంధించి కన్సార్టియం సహకారం అందిస్తుంది. 18 నెలల్లో డీపీఆర్ తయారు చేస్తారు. ఆ తర్వాత నాలుగైదేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఆరున్నరేళ్ల పాటు కన్సార్టియం సేవలందిస్తుంది. ఈ కన్సార్టియంలో భాగమైన 'మీన్‌హార్ట్' కంపెనీకే ప్రధాని మోదీ గుజరాత్‌లో సర్దార్ పటేల్ విగ్రహం కట్టే బాధ్యత అప్పగించారు. అలాగే రాష్ట్రంలో కేసీఆర్, రామేశ్వర్‌రావు తమ కులగురువు చినజీయర్ స్వామితో కలిసి సమతామూర్తి విగ్రహాన్ని కట్టే బాధ్యత అప్పగించారు. గత ప్రభుత్వం ఉప్పల్‌లో మూసీపై రూ.30 కోట్లతో పనులు ప్రారంభించి రూ.6 కోట్లు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో ఉంది. కానీ వర్షం వచ్చి చేసిన పనికొట్టుకుపోయిందని అంటున్నారు. ఈ వ్యవహారంలో లోపల వేయవచ్చు. చర్లపల్లి జైల్లో వేస్తే తిండిదండగ అని మేం చూసీ చూడనట్టుగా ఉంటే వారికి అలుసుగా ఉంది..' అని రేవంత్ అన్నారు.

'మూసీ'పై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

'మూసీ ఒడ్డున ఖాళీ చేసిన ఇళ్లల్లో హరీశ్, కేటీఆర్, ఈటల రాజేందర్ 3 నెలలు ఉంటే ఈ ప్రాజెక్టును ఆపేస్తానంటూ ఓపెన్ ఆఫర్ ఇస్తున్నా. ప్రజలు అక్కడ ఉండడం అద్భుతం అనుకుంటే మీరూ ఉండండి. పునరుజ్జీవాన్ని అడ్డుకోవడం దేశద్రోహం. దీనిపై అసెంబ్లీలో చర్చకు కూడా సిద్ధం.

అనుమానాలుంటే నివృత్తి చేస్తాం

ప్రత్యేక కేసుగా ఎంపీలను ఎంక్లోజర్‌లో పెట్టి శాసనసభలో మాట్లాడించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. ఎంఐఎం, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు అసద్, కిషన్, కేసీఆర్ తమ అనుమానాలను శనివారంలోగా ప్రశ్నల రూపంలో తెలియజేస్తే రాతపూర్వకంగా సమాధానమిస్తాం'అని సీఎం తెలిపారు.

దామగుండాన్ని వ్యతిరేకించేవాళ్లు కసబ్ లాంటోళ్లు

'దేశ భద్రత కోసం ఏర్పాటు చేసే దామగుండం నేవీ రాడార్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడే వాళ్లు కసబ్‌లాంటి వాళ్లు. కేటీఆర్ కసబ్‌లాగా మాట్లాడితే ఎవడో వచ్చి ఇవ్వాల్సిన సమాధానం ఇస్తాడు. జీహెచ్‌ఎంసీలో వరద బాధితులకు నష్ట పరిహారం పంపిణీలో అక్రమాలపై ఏసీబీ విచారణకు ఆదేశించాలా?..' అని కేటీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ ప్రశ్నించారు. అంతకు ముందు.. ప్రస్తుతం మూసీ నది ఎలా ఉంది? పునరుజ్జీవం తర్వాత ఎలా ఉండబోతోంది తెలియజేస్తూ సీఎం ప్రెజెంటేషన్ ఇచ్చారు.

పత్తి.. లారీల కత్తి

పత్తి రవాణాకు ఇతర రాష్ట్రాల లారీలకు సీసీఐ అవకాశం

భగ్గుమంటున్న తెలంగాణ లారీ ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్లు

సాక్షి, హైదరాబాద్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), వ్యవసాయ మార్కెటింగ్ శాఖల తీరుపై తెలంగాణ లారీ ఓనర్ల అసోసియేషన్లు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలో ఉన్న పత్తిని ఇతర రాష్ట్రాలకు తరలించే విషయంలో ఇతర రాష్ట్రాల లారీలను వినియోగించుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. తమ ఉపాధి అవకాశాలకు అడ్డుపడుతున్నారంటూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలను తెలంగాణ లారీ ఓనర్లు అడ్డుకుంటున్నారు. ఫలితంగా వివిధ జిల్లాల్లోని గోదాముల్లో ఉన్న పాత పత్తి నిల్వలు రవాణా చేయలేకపోతున్నారు. మరోవైపు కొత్తగా మార్కెట్లోకి పత్తి వస్తుండటంతో వాటికి గోదాములు దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

సీసీఐ, మార్కెటింగ్ శాఖల కుమ్మక్కు

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 25 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా. మార్కెట్లో ధరల పతనంతో మద్దతు ధర ఇచ్చేందుకు సీసీఐ రంగంలోకి దిగింది. కొత్త పత్తిని కొనుగోలు చేసి వాటిని జిన్నింగ్ మిల్లులకు తరలించాక, తర్వాత ఆ పత్తిని రాష్ట్రంలో ఎక్కడికక్కడ గోదాముల్లో నిల్వ చేసేందుకు సీసీఐ ఏర్పాట్లు చేసింది. అయితే ఇప్పటికే ఆయా గోదాముల్లో పాత పత్తి నిల్వ ఉంది. వాటిని రవాణా ద్వారా తరలిస్తేనే కొత్త పత్తిని తిరిగి గోదాముల్లో నిల్వ చేయడానికి వీలవుతుంది. దీనికోసం సీసీఐ అధికారులు లారీల కోసం కాంట్రాక్టులు కుదుర్చుకున్నారు. అవన్నీ కూడా ఇతర రాష్ట్రాలకు చెందినవే. ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడకు ఏదో ఒక వస్తువు రవాణా చేసి తిరిగి వెళ్లేప్పుడు ఇక్కడున్న పత్తిని తీసుకెళతాయి. దీనివల్ల తక్కువ ధరకు లారీలు వస్తాయని, అందుకే తమ లారీలను వాడుకోవడం లేదని తెలంగాణ లారీ ఓనర్లు అంటున్నారు. ఇతర రాష్ట్రాల లారీల కాంట్రాక్టర్లతో సీసీఐ, మార్కెటింగ్ శాఖ యంత్రాంగం కుమ్మక్కు అవుతుందని తెలంగాణ లారీ యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

చేతులెత్తేసిన మార్కెటింగ్ శాఖ

తెలంగాణలో 1.85 లక్షల పెద్ద లారీలు ఉన్నాయి. ఆయా లారీలకు చెందిన యజమానుల్లో 60% మంది సొంత లారీలను వారే నడుపుకుంటారు. ఆర్థికపరమైన కారణాల వల్ల రాష్ట్రంలోని లారీ ఓనర్లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయని తెలంగాణ లారీ ఓనర్ల సంఘం ఆవేదన వ్యక్తం చేస్తోంది. మార్కెటింగ్‌శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఆలేరు లారీ అసోసియేషన్, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, సూర్యాపేట లారీ అసోసియేషన్స్, జమ్మికుంట, పెద్దపల్లి, సుల్తానాబాద్ స్థానిక లారీ అసోసియేషన్లు సమస్యలు సృష్టిస్తున్నాయని పేర్కొంది. తెలంగాణలోని పలు ప్రాంతాల లారీ ఓనర్ల అసోసియేషన్ల కారణంగా సూర్యాపేట, జమ్మికుంట, పెద్దపల్లి, వీటీ.నగర్, మల్లేపల్లి, నకిరేకల్, నల్లగొండ, అచ్చంపేట, నాగర్‌కర్నూలు, ఆలేరు, మోత్కూరు, చండూరు, చిట్యాల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, మక్తల్, సుల్తానాబాద్‌లలో కొనుగోలు కేంద్రాలు తెరవడం కష్టమని మార్కెటింగ్‌శాఖ చేతులెత్తేసింది.

ఐవీఎఫ్ సెంటర్లు ఎక్కడున్నాయో బీఆర్‌ఎస్ చూపించాలి

గాంధీలో ఒక్కరికి ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించండి.. మంత్రి దామోదర రాజనర్సింహ సవాల్



సాక్షి, హైదరాబాద్: గాంధీ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సేవల ప్రారంభంపై బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు 2018లో జీవోలు ఇచ్చి, ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలకు దమ్ముంటే ఎంజీఎం, పేట్లబుర్జు దవాఖానాలలో ఐవీఎఫ్ సెంటర్లు ఎక్కడున్నాయో చూపించాలని మంత్రి సవాల్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో గాంధీ హాస్పిటల్‌లో ఒక్కరికైనా ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించాలన్నారు. ఐవీఎఫ్ సేవలు ప్రారంభించకుండా మోసం చేసినందుకు మహిళలకు ఆ పార్టీ నేతలు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ మేరకు మంత్రి గురువారం ఓ ట్వీట్ చేశారు. 'హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్, పేట్లబుర్జు హాస్పిటల్, వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు 2018న జీవో 520 విడుదల చేశారు. కానీ, ఒక్క హాస్పిటల్‌లో కూడా ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒక్క పరికరం కూడా కొనుగోలు చేయలేదు. 2023లో ఎన్నికలకు ముందు గాంధీకి కొంత ఎక్విప్‌మెంట్ తీసుకొచ్చి, ఐవీఎఫ్ సేవలను ప్రారంభిస్తున్నట్టు హడావుడి చేశారు. కానీ, అక్కడ ఎంబ్రియాలజిస్టును, స్టాఫ్‌ను నియమించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఎంబ్రియాలజిస్టును నియమించాం. శిక్షణ పొందిన స్టాఫ్‌ను నియమించాం. నిధులు కేటాయించాం. అవసరమైన అనుమతులు తీసుకొచ్చి, ఐవీఎఫ్ సేవలను ప్రారంభించాం. మేము చిత్తశుద్ధితో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తే, దాన్ని మీ ఖాతాలో వేసుకునేందుకు చవకబారు విమర్శలు చేస్తున్నారు. మీకు దమ్ముంటే మీ హయాంలో గాంధీలో ఒక్కరికి ఐవీఎఫ్ చేసినట్టు నిరూపించండి. పేట్లబుర్జు, ఎంజీఎంలో ఐవీఎఫ్ సెంటర్లు ఎక్కడున్నాయో చూపించండి. మహిళలను మోసం చేసి నందుకు బహిరంగ క్షమాపణలు చెప్పండి' అని మంత్రి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పేట్లబుర్జు, ఎంజీఎం సహా జిల్లాల్లోనూ ఐవీఎఫ్ సేవలను విస్తరిస్తామని మంత్రి తెలిపారు.



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఏపీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు వై.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. పార్టీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా నియమించినందుకు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. - సాక్షి,అమరావతి

జనం మెచ్చేలా పనిచేద్దాం

- గత పది నెలల్లో బీఆర్‌ఎస్ అన్ని కష్టకాలాలనూ అధిగమించింది: కేటీఆర్
- బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం సమావేశం



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ప్రజలు మనకు రెండుసార్లు అధికారం ఇచ్చినా కొన్ని పొరపాట్లతోపాటు కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలతో ఓడిపోయాం. కేసీఆర్‌కు గాయం, పార్టీ ఫిరాయింపులు, కవితను జైలుకు పంపడం, పార్లమెంటు ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగలడం లాంటివి జరిగినా పోరాటం చేశాం. గత పది నెలల్లో మన పార్టీ అన్ని కష్టకాలాలనూ అధిగమించింది. ఇప్పుడు ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా కేసీఆర్‌ను తలుచుకుంటున్నారు. ప్రజలకు కష్టమొస్తే గాంధీభవన్, బీజేపీ ఆఫీసు వైపు కాకుండా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు. ప్రజలు మెచ్చే విధంగా మళ్లీ వారికి దగ్గరవుదాం. డీఎంకే, శిరోమణి అకాలీదళ్ తరహాలో మరో 70ఏళ్ల పాటు పార్టీ బలంగా ఉండేలా బీఆర్‌ఎస్‌ను తీర్చిదిద్దుకుందాం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. 'పార్టీలో ఉన్న చాకుల్లాంటి యువ నాయకత్వం నుంచి కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందాం. విద్యార్థి నాయకులకు కూడా ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లతోపాటు నాయకత్వ బాధ్యతల్లో పెద్దపీట వేస్తాం' అని కేటీఆర్ ప్రకటించారు.

బీజేపీ, కాంగ్రెస్ తోడు దొంగలు

'హైదరాబాద్ చుట్టూ మూడు వైపుల సముద్రం, తెలంగాణలో భాక్రానంగల్ ఉందని, విప్రో సీఈఓ సత్య నాదెళ్ల అని ఎవరో రాసిచ్చినది చదివే సీఎం ఉండటం మన కర్మ. పైన జుమ్లా పీఎం ఉంటే ఇక్కడేమో హౌలా సీఎం ఉన్నాడు. ఆయన 25 సార్లు ఢిల్లీకి పోయినా 25 పైసలు కూడా తీసుకురాలేదు. కాంగ్రెస్‌తోపాటు బీజేపీ కూడా తెలంగాణకు అతి ప్రమాదకరం. లోలోన బీజేపీ, కాంగ్రెస్ తోడు దొంగలు' అని కేటీఆర్ విమర్శించారు. 'ప్రభుత్వం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానాలతో గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు రద్దయ్యే పరిస్థితి ఉంది. బీఆర్‌ఎస్ కార్యకర్తల మీద కేసులు పెడితే మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో రిటైర్డ్ పోలీసు అధికారులతో కమిటీ వేసి కాపాడుకుంటాం' అని కేటీఆర్ చెప్పారు. సమావేశంలో బాల్క సుమన్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్‌లో చర్చించి డీఏలు విడుదల చేయాలి

పత్తి కొనుగోలులో కేంద్ర ప్రభుత్వానిది ద్వంద్వ వైఖరి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న కరువు భత్యాన్ని ఈ నెల 23న జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో చర్చించి దీపావళి కానుకగా విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బకాయిపడిన ఐదు డీఏల మొత్తం 17.29 శాతాన్ని కలుపుకుని ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాలన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుకగా మూడు శాతం కరువు భత్యం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో డీఏ విడుదల చేస్తామని ప్రకటించిన సీఎం మాట తప్పారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా డీఏల విడుదల జరగక ఒక్కో ఉద్యోగి ప్రతినెలా సుమారు రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు నష్టపోతున్నారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన నూతన ఈహెచ్‌ఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

బతుకమ్మ చీరలపై పొంతన లేని మాటలు

బతుకమ్మ చీరల పంపిణీ ఎందుకు నిలిచిందనే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి సీతక్క పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఒక్కో మహిళకు రూ.25 వేలు చొప్పున పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23,250 కోట్లు బకాయి పడిందన్నారు. రూ.500కు గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజ్యోతిని కొందరికే పరిమితం చేశారన్నారు.

పత్తి ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా..

పత్తి కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ నీతితో వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక, ఒకే రేషన్ కార్డు, ఒకే మార్కెట్ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం.. ఒకే మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గుజరాత్ పత్తి రైతులకు క్వింటాలుకు రూ.8,257 మద్దతు ధర చెల్లిస్తున్న కేంద్రం.. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతుకు క్వింటాలుకు రూ.7,521 మాత్రమే చెల్లించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాసిరకం బతుకమ్మ చీరలిచ్చి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

- మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండిపాటు
- మహిళలకు ఉచిత ప్రయాణంతో పదినెలల్లో రూ.3 వేల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చింది నాసిరకం బతుకమ్మ చీరలేనని, అంతకంటే అధిక ప్రయోజనాలు కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పిస్తోందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వంలో బతుకమ్మ చీరను బంద్ పెట్టారన్న మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను సీతక్క గురువారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళలకు నాసిరకం చీరలు ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని గత ప్రభుత్వం దెబ్బతీసిందని మండిపడ్డారు. బతుకమ్మ చీరల పేరిట నాటి ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్లు వ్యయం చేస్తే...ప్రజా ప్రభుత్వంలో మహిళలకు చార్జీల భారం లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం వల్ల గత పదినెలల్లో రూ.3,325 కోట్ల మేర ప్రయోజనం కల్పించామని వివరించారు. నిన్నటి వరకు మహిళలు 98.50 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని గుర్తు చేశారు. అంటే ప్రతీనెల దాదాపు రూ.332 కోట్ల మేరకు మహిళలకు ఆదా అవుతోందని తెలిపారు. వంటింటి భారం తగ్గించేందుకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ కోసం వెయ్యి కోట్లు వ్యయం చేశామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామని మంత్రి చెప్పారు.

జోడేఘాట్ అభివృద్ధికి రూ.6 కోట్లు

మంత్రి సీతక్క.. కుమురంభీంకు నివాళి



జోడేఘాట్‌లోని భీం స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్: జోడేఘాట్‌లో పర్యాటకాభివృద్ధి కోసం రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. కుమురంభీం 84వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లోని భీం స్మారకం వద్ద ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోడేఘాట్‌ను టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కుమురంభీం జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం సాగించిన 12 పోరు గ్రామాల్లో ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఆదివాసీ యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. అటవీ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యం చేయొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ఈషా' స్కూళ్లలో కీచక చర్యలు!

జగ్గీ వాసుదేవ్‌కు తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

- కోయంబత్తూరులోని పాఠశాలలపై రాజమండ్రికి చెందిన దంపతుల తీవ్ర ఆరోపణలు
- మా కుమారుడిపై మరో విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు
- త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి..
- తమ కుమార్తెపై రెండేళ్లపాటు అత్యాచారం జరిగిందని మరో మహిళ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఈషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారికి కేంద్రంగా మారిందని ఈషా ఫౌండేషన్ పాఠశాల మాజీ ఉపాధ్యాయురాలు యామిని రాగాని, ఆమె భర్త సత్య ఎన్ రాగాని ఆరోపించారు. తమ కుమారుడిని తమిళనాడు కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌కు చెందిన పాఠశాలలో చదివించామని, ఆ సమయంలో అతడిపై తోటి విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని వెల్లడించారు. ఇటీవల అక్కడి ఈషా హోమ్‌స్కూల్‌లోనూ విద్యార్థులపై ఈ తరహా ఉదంతాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే ఈషా యోగా కేంద్రంలో విద్యా కార్యక్రమాల పేరుతో ఈషా సంస్కృతికి చెందిన బాలికలతో అర్ధనగ్నంగా ఆధ్యాత్మిక దీక్షలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్ (సద్గురు)కు అన్ని విషయాలు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నించారు. రాజమండ్రికి చెందిన ఈ దంపతులు కొంతకాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

ఎన్నో దురాగతాలు

యామిని రాగాణి మాట్లాడుతూ.. ఈషా ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు ఈషా విద్య, ఈషా సంస్కృతి, ఈషా హోమ్ స్కూళ్లలో 8 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఈషా పాఠశాలలో 8 ఏళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం జరిగిన విషయాన్ని బయటికి రానివ్వలేదన్నారు. అదేవిధంగా 13 ఏళ్ల బాలుడిని 3 సంవత్సరాల పాటు వేధించినట్టు ఆరోపణలు వచ్చాయని, యాజమాన్యం నిర్లక్ష్యంతో 12వ తరగతి విద్యార్థి ఒకరు ఈ ఏడాది జూన్ 21న మృతి చెందాడని చెప్పారు. ఇలా వరుస ఘటనలు చోటు చేసుకోవడం, తమ కుమారుడు సైతం లైంగిక వేధింపులకు గురికావడంతో కలతచెందిన తాము ధైర్యం చేసి మీడియా ముందుకు వచ్చామని వెల్లడించారు. సద్గురుపై ఉన్న భక్తి, విశ్వాసంతో తాము కూడా తమ కుమారుడిని ఈషా పాఠశాలలో చదివించామని వివరించారు. లైంగిక వేధింపుల విషయం యాజమాన్యం దృష్టికి, తద్వారా జగ్గీ వాసుదేవ్ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పారు. అంతర్గతంగా ఈ పాఠశాలల్లో జరుగుతున్న విషయాలు వెలుగులోకి తెచ్చేందుకు తాను వలంటీర్ టీచర్‌గా ఫౌండేషన్‌లో రెండేళ్లు పనిచేసినట్టు యామిని రాగాని తెలిపారు. విద్యార్థులను బూతులు తిట్టడం, మానసికంగా, శారీరకంగా హింసించడం తాను ప్రత్యక్షంగా చూసినట్టు చెప్పారు. తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు హిందుత్వం అనే పదాన్ని వాడుతున్నారని ఆరోపించారు.

బాధితులను నిర్వాహకులు బెదిరిస్తున్నారు

'తెల్లవారుజామున యోగా పేరిట బాలికలను సైతం అర్ధనగ్నంగా కూర్చోబెడుతున్నారు. ఈ విషయం గురించి ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్, మరో ఇద్దరు ముఖ్యుల మధ్య ఈమెయిల్స్ నడిచాయి..' అని యామిని, సత్య వెల్లడించారు. దీనిపై త్వరలోనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఏడు బాధిత కుటుంబాలు తమ వెంట వచ్చాయని, మిగిలిన బాధితులతో కూడా కలిసి ముందుకు వెళతామన్నారు. అయితే ఫౌండేషన్ నిర్వాహకులు బాధితులను బెదిరిస్తున్నారని, స్థానిక పోలీసులను మేనేజ్ చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, జగ్గీ వాసుదేవ్ వ్యవహారాలన్నింటిపైనా సమగ్ర దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాకు ప్రాణహాని ఉంది

ఈషా పాఠశాలలో చదువుతున్న తన ఏడేళ్ల కూతురుపై ఆ పాఠశాలలో పీఈటీ రెండేళ్ల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడని సదరు బాలిక తల్లి ఫోన్‌కాల్‌లో మీడియాకు తెలిపారు. 'మేం ఎంతో మనోవేదన అనుభవించాం. ఈషా ఫౌండేషన్‌లో దుర్మార్గాలు బయట పెట్టాలంటే భయంగా ఉంది. మాకు ప్రాణహాని ఉంది. అందుకే నా వివరాలు చెప్పలేకపోతున్నాను. కానీ త్వరలోనే నేను కూడా మీడియా ముందుకు వస్తా..' అని పేరు, వివరాలు చెప్పడానికి ఇష్టపడని ఆ బాధిత మహిళ వెల్లడించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి యథావిధిగా కాలేజీలు

- కొలిక్కి వచ్చిన ప్రైవేటు కాలేజీల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: నాలుగు రోజులుగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు చేస్తున్న ఆందోళన ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. వారితో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలప్రదమైనట్లు కాలేజీ యాజమాన్యాలు గురువారం వెల్లడించాయి. శుక్రవారం నుంచి కాలేజీలు యథావిధిగా పనిచేస్తాయని ప్రకటించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు బోధన మానేసి బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఈ అంశంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చర్చించారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తక్షణమే ఆందోళన విరమించాలని ప్రభుత్వం బుర్రా వెంకటేశం ద్వారా కాలేజీల యాజమాన్యాలకు కబురు పంపింది. ఈ నేపథ్యంలో బుర్రా వెంకటేశం, కాలేజీ నిర్వాహకుల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదమైనట్లు కాలేజీల యాజమాన్యాలు వెల్లడించాయి. బకాయిలను సత్వరమే విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో జరిగిన చర్చల్లో టీపీడీఎంఏ నాయకులు డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, యాద రామకృష్ణ, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి. చిత్రంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

గ్రూప్‌-1 అభ్యర్థుల నిరసన

చిక్కడపల్లి (హైదరాబాద్): గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని గ్రూప్‌-1 అభ్యర్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండోరోజు కూడా కొనసాగాయి. బుధవారం సాయంత్రం అభ్యర్థులు అశోక్‌నగర్ రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. అదేవిధంగా గురువారం కూడా గాంధీనగర్ కెనరా బ్యాంక్ సమీపంలో ఉన్న పార్కులో వందలాదిమంది అభ్యర్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ముషీరాబాద్ పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నెలాఖరుకు జేఈఈ నోటిఫికేషన్!

- నవంబర్ మొదటివారంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- జనవరి, ఏప్రిల్‌లో మెయిన్స్
- సిలబస్ కుదింపుపై తర్జనభర్జన
- గత ఏడాది తగ్గిన సిలబస్
- పరీక్ష కేంద్రాల పెంపు అంశంపై పరిశీలన



సాక్షి, హైదరాబాద్: జేఈఈ–2025 నోటిఫికేషన్ ఈ నెలాఖరులో వెలువడనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. నవంబర్ మొదటి వారంలో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించే వీలుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. జనవరిలో మొదటి విడత జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఏప్రిల్ లేదా మే నెలలో రెండో విడత మెయిన్స్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టనున్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ సంస్థల్లో ప్రవేశానికి ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ)ను నిర్వహిస్తారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు పంపుతారు. అడ్వాన్స్‌డ్‌లో పొందిన ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. జేఈఈ మెయిన్స్ ర్యాంకు ద్వారా ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంజనీరింగ్ సీట్లు పొందే వీలుంది. ఈ పరీక్షను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలపై దృష్టి పెట్టారు. ఏయే కేంద్రాలను ఎంపిక చేయాలనే సమాచారాన్ని ఎన్‌టీఏ సేకరించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మొదటినుంచీ తెలంగాణ వ్యాప్తంగా 21 పట్టణాల్లో జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తున్నారు. అయితే గత ఏడాది నుంచి పరీక్ష కేంద్రాలను కుదించారు. కరోనా నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పరీక్ష కేంద్రాలను 17 పట్టణాలకే పరిమితం చేశారు. కాగా, గత ఏడాది జేఈఈ రాసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా ఈ సంవత్సరం పరీక్ష కేంద్రాలను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

సిలబస్‌పై కసరత్తు..

గత సంవత్సరం జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌కు కూడా పరీక్ష సిలబస్‌ను తగ్గించారు. 2020లో కరోనా కారణంగా 8 నుంచి 12వ తరగతి వరకూ కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్‌లో కొన్ని చాప్టర్లను తీసివేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈతో పాటు ఇతర జాతీయ సిలబస్ ఉండే విద్యార్థులకు జేఈఈలో ఆయా చాప్టర్లను తొలగించాలనే డిమాండ్ వచ్చింది. ఈ కారణంగా గత సంవత్సరం కొన్ని చాప్టర్లను ఇవ్వలేదు. అయితే, ఈ ఏడాది ఆ సమస్య లేదని అధికారులు భావిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాత సిలబస్‌ను మళ్లీ కలపడమా? లేదా ఈ సంవత్సరం కూడా గత ఏడాది మాదిరిగానే నిర్వహించడమా? అనే దానిపై ఎన్‌టీఏ, ఇతర కేంద్ర సంస్థలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేయండి

- గ్రూప్‌-1 పరీక్షలపై ఐదుగురు అభ్యర్థుల అప్పీల్
- తప్పు ప్రశ్నలపై వాదనలు వినాలని విజ్ఞప్తి
- నేడు విచారణ చేపట్టనున్న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మూడురోజుల క్రితం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో అప్పీల్ దాఖలైంది. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన గంగుల దామోదర్‌రెడ్డితోపాటు మరో నలుగురు హైకోర్టులో రిట్ అప్పీల్ దాఖలు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జీఏడీ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది. 'ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితాను ప్రచురించే ముందు ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను నిష్పాక్షికంగా పరిశీలించాలి. ఆ అభ్యంతరాలపై పూర్తి పరిశీలన జరిగిన తర్వాతే మెరిట్ జాబితా ప్రకటించాలి. కానీ టీజీపీఎస్సీ ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. తప్పుగా వచ్చిన ప్రశ్నలను తొలగించి మళ్లీ మెరిట్ జాబితా ప్రకటించేలా ఆదేశించాలి'అని దామోదర్‌రెడ్డితోపాటు మరికొందరు దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేశారు. సాంకేతిక అంశాలను నిపుణుల కమిటీకే వదిలేయాలని, కోర్టుల జోక్యం కూడదని వ్యాఖ్యానించారు. ఈ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ తాజాగా పిటిషనర్లు ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు.

అప్పీల్‌లో పేర్కొన్న అంశాలివీ..

'సింగిల్ జడ్జి ఉత్తర్వులు చట్టవిరుద్ధం. గ్రూప్‌-1 ప్రిలిమ్స్ 'కీ'లో కొన్ని ప్రశ్నలు, జవాబుల్లో స్పష్టంగా తప్పులు కనిపిస్తున్నాయి. వాటిని, పిటిషనర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే రిట్ పిటిషన్ కొట్టివేశారు. నిపుణుల కమిటీ నిర్ణయంపై న్యాయ సమీక్ష అవసరం లేదని చెప్పారు. తప్పుడు ప్రశ్నలు తొలగిస్తే మెరిట్ జాబితా అంతా మారిపోతుందని అందులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించారు. కొన్ని ప్రశ్నలు తప్పుగా రూపొందించిన విషయాన్నీ గ్రహించలేదు. సింగిల్ జడ్జి మా పిటిషన్లను కొట్టివేయడం ద్వారా తప్పుడు ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన వారు కూడా మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు అవుతుంది. ఈ తప్పుడు ప్రశ్నలకు అనుకోకుండా పిటిషనర్లు కొందరు సరైన సమాధానం ఇవ్వడాన్ని టీజీపీఎస్సీ సింగిల్ జడ్జి ముందు పేర్కొంది. ప్రిలిమ్స్‌తోనే నేరుగా జాబ్ ఇవ్వకపోయినా మెయిన్స్ పరీక్ష రాయడానికి అదే కీలకం. ఇలా తప్పుడు 'కీ'తో అర్హత సాధించి పోస్టుల్లో చేరే వారు తదుపరి మూడు దశాబ్దాల పాటు అధికారులుగా విధులు నిర్వహిస్తారు. రాహుల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. ఈనెల 15న సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి'అని ద్విసభ్య ధర్మాసనం ముందు దాఖలుచేసిన అప్పీల్‌లో కోరారు.

'గ్రూప్‌-1' డిమాండ్లను పరిశీలించాలి: కేటీఆర్

తెలంగాణ భవన్‌లో గ్రూప్‌-1 అభ్యర్థులతో భేటీ



గ్రూప్‌-1 అభ్యర్థులతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలనే అభ్యర్థుల డిమాండ్లను పరిశీలించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షల రీషెడ్యూల్ కోరుతూ అశోక్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థుల అరెస్టును ఖండిస్తూ, వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్‌-1 అభ్యర్థులు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. గ్రూప్‌-1 మెయిన్స్‌కు సంబంధించి 22 కేసులు కోర్టులో విచారణలో ఉన్నా ప్రభుత్వం మొండిగా పరీక్షలు నిర్వహించాలని చూస్తోందని చెప్పారు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధమని, రిజర్వేషన్లలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. న్యాయపరమైన అంశాలు పరిష్కరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము సుప్రీంకోర్టుకు వెళ్తే కచ్చితంగా పరీక్షలు రద్దవుతాయన్నారు. అభ్యర్థుల పోరాటానికి అండగా నిలుస్తామని, న్యాయ సహాయం అందిస్తామని కేటీఆర్ వారికి భరోసా ఇచ్చారు. కాగా, తమ సమస్యల పరిష్కారంలో అండగా నిలవాలని కోరుతూ ఆశా వర్కర్లు, మూసీ పరీవాహక ప్రాంత మహిళలు గురువారం పెద్దఎత్తున తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు.

పరీక్షల ముందు పరేషాన్!

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్షల నిర్వహణ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అనివార్యం అని తెలుస్తోంది.

ఎన్నెన్నో వివాదాలు...

గ్రూప్‌-1 పరీక్షల విషయంలో ఆది నుంచి వివాదాలే. 503 గ్రూప్‌-1 ఉద్యోగాల భర్తీకి 2022 ఏప్రిల్‌లో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 2022 అక్టోబర్‌లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా... ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగు చూడడంతో ఆ పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేసింది. ఆ తర్వాత 2023 జూన్‌లో మరోమారు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా... ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హైకోర్టు లోపాలను ఎత్తిచూపుతూ ఆ పరీక్షను రద్దు చేసింది. అంతలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం... కమిషన్ చైర్మన్, సభ్యుల రాజీనామాలు, ఆ తర్వాత ప్రక్షాళన దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం... నూతన చైర్మన్, సభ్యులను నియమించడం చకచకా జరిగిపోయాయి. టీజీపీఎస్సీ పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో 563 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించి మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపిక చేపట్టింది. గత నోటిఫికేషన్‌లో జీవో 55 ఆధారంగా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసిన టీజీపీఎస్సీ... ఈసారి జీవో 29ని జోడిస్తూ దీని ప్రకారం ఎంపిక చేసింది. అయితే, జీవో 29 ద్వారా రిజర్వుడ్ అభ్యర్థులు నష్టపోయారని కొందరు ఆందోళన చేపడుతుండగా... ప్రిలిమినరీ పరీక్షలో ఇచ్చిన ప్రశ్నల్లో తప్పులు దొర్లాయని, వాటిని తొలగించి తుది ఫలితాలు ప్రకటించాలనే డిమాండ్లతో న్యాయపోరాటానికి దిగారు. అయితే ఆయా పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడంతో పరీక్షల నిర్వహణకు మార్గం సుగమమైంది.

'గ్రూప్‌-1'ను రీషెడ్యూల్ చేయాలి

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు గ్రూప్‌-1 అభ్యర్థుల విజ్ఞప్తి
- అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో సమావేశమైన గ్రూప్‌-1 అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 పరీక్షలు వాయిదా వేయాలని తాము కోరడం లేదని, నవంబర్‌లో హైకోర్టు తీర్పు వచ్చేంత వరకు రీషెడ్యూల్ చేయాలని మాత్రమే కోరుతున్నామని గ్రూప్‌-1 అభ్యర్థులు చెప్పారు. దీనికోసం గురువారం ఉదయం గాంధీ భవన్ వద్ద అభ్యర్థులు ఆందోళనకు దిగగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ అభ్యర్థులను వదిలివేయాలని, గాంధీభవన్‌లో మధ్యాహ్నం సమావేశమవుతానని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పడంతో పోలీసులు వారిని వదిలేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆయన గ్రూప్‌-1 అభ్యర్థులతో సమావేశం కాగా.. అభ్యర్థులు తమ డిమాండ్లను తెలియజేశారు. జీవో 29 వల్ల రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. గ్రూప్‌-1 పరీక్షల మెరిట్‌ను జీవో 55 ద్వారా ఎంపిక చేయాలని కోరారు. గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌లో కూడా చాలా తప్పులు జరిగాయని మహేశ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. జీవో 29పై అభ్యర్థుల అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అధికారులతో మాట్లాడి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పీజీ ప్రవేశాల రిపోర్టింగ్ గడువు 21 వరకు..

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 1, 2 విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 21 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని టీజీసీపీఈటీ–2024 ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొఫెసర్ జలపతి గురువారం కోరారు. గడువు ఈ నెల 17తో ముగియగా.. ప్రైవేటు కాలేజీల బంద్ కారణంగా విద్యార్థుల విజ్ఞప్తి మేరకు గడువు ను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

నిశ్చయంగా, అల్లాహ్ భూమ్యాకాశాలను తమ స్థానాల నుండి విడిపోకుండా వాటిని నిలిపి ఉంచాడు. ఒకవేళ అవి తొలగిపోతే, ఆయన తప్ప మరెవరైనా వాటిని నిలిపి ఉంచగలరా?

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 18 అక్టోబర్ 2024

ప్రమాదకర ప్రతిపాదన

విజ్ఞత మరిచినచోట విపరీతాలు చోటుచేసుకోవటంలో వింతేమీ లేదు. కావడ్ యాత్ర సందర్భంగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను నిలిపివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం మొన్న జూలైలో ఇచ్చిన తీర్పు అర్థం కాకనో లేక దాన్ని ధిక్కరించే ఉద్దేశమో... ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రెండు ఆర్డినెన్సులు తీసుకురావాలని తాజాగా నిర్ణయించింది. ఆహారంలో లేదా పానీయాల్లో ఉమ్మివేయటం లేదా మానవ వ్యర్థాలతో దాన్ని కలుషితపరచటం పదేళ్ల శిక్షకు అర్హమయ్యే నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించటం, విక్రయదారుల పూర్తి వివరాలు అందరికీ కనబడేలా చేయటం ఈ ఆర్డినెన్సుల ఉద్దేశం. ఇప్పుడున్న చట్టం ప్రకారం కల్తీ కారణంగా మరణం సంభవిస్తే బాధ్యులైనవారికి మూడేళ్ల కఠిన శిక్ష విధించవచ్చు. తినే ఆహారపదార్థం రుచిగా, పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అలాంటి ఆహారం దొరికేచోటకే వెళ్తారు. హోటళ్లు మొదలుకొని సైకిళ్లపై తిరుగుతూ అమ్ముకునే విక్రయదారుల వరకూ అందరూ కమ్మనైన ఆహారపదార్థాలు వడ్డించి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఒకవేళ ఎవరైనా లాభార్జనకు కక్కుర్తిపడి నాసిరకం పదార్థాలను అంటగడితే అలాంటివారి పనిబట్టడానికి రకరకాల చట్టాలున్నాయి. ఆహారకల్తీని అరికట్టడానికీ, హానికరమైన, కాలంచెల్లిన పదార్థాల విక్రయాన్ని నిరోధించటానికీ హోటళ్లపై, ఇతర దుకాణాలపై విజిలెన్సు విభాగాలు దాడులు నిర్వహిస్తుంటాయి. కేసులు పెడతాయి. అయితే ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరగటం లేదని, ప్రభుత్వాలు మొక్కుబడిగా ఈ పనిచేస్తుంటాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఆహారం తిని అస్వస్థతకు గురయి పదుల సంఖ్యలో జనం ఆస్పత్రుల పాలైనప్పుడు ఆదరాబాదరాగా చర్యలు తీసుకోవటం కూడా కనబడుతుంటుంది. హఠాత్తుగా యూపీ సర్కారు ఈ చర్య తీసుకోవటం వెనక ఇలాంటి ఘటన ప్రభావం ఏమైనా ఉందా? పోనీ ఈ మాదిరి ఉదంతాల కారణంగా జనం తరచూ అస్వస్థులవుతున్న లేదా మరణిస్తున్న ఉదంతాలేమైనా గమనించారా? అసలు ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకొచ్చాక ఎన్ని హోటళ్లపై, తినుబండారాల విక్రయ సంస్థలపై దాడులు నిర్వహించారు? అక్రమాలకు పాల్పడ్డారని తేలిన ఎంతమందిని శిక్షించారు? ఈ క్రమంలో ప్రస్తుత చట్టాలు నిరుపయోగంగా ఉన్నాయని భావిస్తే తగిన డేటాతో ఆ వివరాలు ప్రజల ముందు ఉంచొచ్చు. అప్పుడు ఒక సమగ్రమైన చట్టం అవసరమేనని అందరూ భావిస్తారు. కానీ యూపీలో జరుగుతున్నది అది కాదు. ఫలానా వర్గంవారు విక్రయించే పండ్లు లేదా ఇతర ఆహారపదార్థాలు అపరిశుభ్రంగా ఉంటాయని, వాటిని కలుషితం చేసి అమ్ముతున్నారని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. వాటి ఆధారంగా ప్రభుత్వం ఈ ఆర్డినెన్సులు తీసుకొస్తున్నట్టు కనబడుతోంది.

దుశ్చర్యలకు పాల్పడేవారికి మతం, కులం ఉండవు. ఎక్కడో ఒకచోట జరిగిన ఘటనను వీడియో తీసి ఫలానా మతం వారంతా ఇలాగే చేస్తున్నారని వదంతులు వ్యాప్తిచేయటం విద్వేషాలు రెచ్చగొట్టడానికే తోడ్పడతాయి. ఇదే యూపీలోని ఘజియాబాద్‌లో ఒక వ్యాపారి ఇంట్లో ఎనిమిదేళ్లుగా వంట మనిషిగా పనిచేస్తున్న రీనా కుమార్ అనే యువతి రోటీల్లో మూత్రాన్ని కలుపుతోందని ఆరోపిస్తూ పోలీసులు బుధవారం అరెస్టు చేశారని మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ మధ్య తెలంగాణలో అధికారులు వరస దాడులు నిర్వహించినప్పుడు అనేక హోటళ్లు, తినుబండారాల దుకాణాలు పాచిపోయిన పదార్థాలను అమ్ముతున్నాయని తేలింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిలో అన్ని మతాలకూ చెందినవారూ ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరిగే కావడ్ యాత్ర సమయంలో ఆ మార్గంలోని దుకాణాల్లో విక్రయదారులు తమ పేర్లు, ఇతర వివరాలు కనబడే బోర్డులు ప్రదర్శించాలని పోలీసులు మొన్న జూలైలో నోటీసులిచ్చారు. కావడ్ యాత్రికులు 'స్వచ్ఛమైన శాకాహారులు' గనుక అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఈ పని చేశామని సంజాయిషీ ఇచ్చారు. దాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దుకాణంలో నచ్చిన, నాణ్యమైన, రుచికరమైన ఆహారం దొరుకుతున్నదో లేదో వినియోగదారులు చూస్తారు తప్ప, వాటి విక్రయదారు ఎవరన్నది పట్టించుకోరు. అలా పట్టించుకోవాలని యూపీ ప్రభుత్వం తహతహలాడుతున్నదని తాజా నిర్వాకం గమనిస్తే అర్థమవుతుంది. వినియోగదారుల విశ్వాసాన్ని పరిరక్షించటమే ఆర్డినెన్సుల ఉద్దేశమన్న ప్రభుత్వ వాదన నమ్మదగ్గదిగా లేదు. ఆ పని విక్రయదారులది! వారిలో అక్రమార్కులుంటే చర్య తీసుకోవటానికి ఇప్పుడున్న చట్టాలు సరిపోతాయి. చెదురుమదురుగా జరిగిన ఉదంతాలను భూతద్దంలో చూపి జనాన్ని కలవరపెట్టడం సబబు కాదు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనకున్న స్ఫూర్తి అర్థం చేసుకుంటే యూపీ ప్రభుత్వం ఇలాంటి ఆర్డినెన్సుల ఆలోచన చేసేది కాదు. యూపీలో గోసంరక్షణ, లవ్ జీహాద్ తదితర ఆరోపణలతో గుంపు దాడులు, గృహదహనాలు, హత్యోదంతాల వంటివి జరిగాయి. నిందితుల ఇళ్లూ, దుకాణాలూ బుల్‌డోజర్లతో నేలమట్టం చేయటం కూడా రివాజుగా మారింది. ఎన్‌కౌంటర్లు సరేసరి. ఆర్డినెన్సుల ప్రతిపాదన ఆ క్రమంలో మరో చర్య కావొచ్చన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి కరువైందని యువత... ధరలు ఆకాశాన్నంటాయని సామాన్యులు మొత్తుకుంటున్నారు. విద్య, వైద్య రంగాలు పడకేశాయని గగ్గోలు పెడుతున్నారు. వీటిపై సమర్థవంతంగా వ్యవహరించి ప్రజల విశ్వాసాన్ని పొందాల్సివుండగా, ప్రజల్లో పరస్పర అవిశ్వాసాన్ని కలిగించే ఇలాంటి పనులకు పూనుకోవటం ఏం న్యాయం? అసలు నేరానికి తగ్గ శిక్ష ఉండాలన్న ఇంగితం కరువైతే ఎలా? ఆర్డినెన్సుల ప్రతిపాదనపై యూపీ సర్కారు పునరాలోచన చేయాలి.

కాల పరీక్షలో మన విదేశీ సంబంధాలు

విశ్లేషణ



సంజయ బారు

దశాబ్దాలుగా భారతీయులకు, ప్రత్యేకించి పంజాబ్ నుండి వలస వెళ్తున్నవారికి కెనడా చేరుకోవలసిన ప్రదేశంగా ఉంటోంది. అంతేకాదు, భారత్ అణు సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో సహాయపడే వ్యూహాత్మక భాగస్వామి కెనడా. అటువంటి దేశంతో భారత్ సంబంధాలు ఎందుకు క్షీణిస్తున్నట్లు? కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తమ సిక్కు పౌరులను భారత్ హత్య చేయిస్తుందని ఆరోపించడం, దాదాపు అటువంటి ఆరోపణనే అమెరికా కూడా చేయడం వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ సందర్భంగా రెండు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదటిది... కెనడా, అమెరికా ప్రభుత్వాలు ఈ అంశంపై బహిరంగ ప్రకటనకు ఎందుకు వెళ్లాయి? రెండవది... భారతదేశంపై ఇలా ఆరోపణలు మోపడం ఎక్కడదాకా వెళ్లి ఆగుతుంది?

గత దశాబ్దంలో ప్రపంచ వలస ప్రస్థానాలకు చెందిన ఒక ముఖ్యమైన కథ ఏమిటంటే... భారతీయ వలసలు గణనీయంగా పెరగడం. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు, సింగపూర్ నుంచి దుబాయ్ వరకు, పోర్చుగల్ నుంచి ఇజ్రాయెల్ వరకు భారతీయుల వలసలు నానాటికీ పెరుగుతున్నాయి. 2014లో కెనడాలో కేవలం 38,364 మంది భారతీయులు శాశ్వత పౌరులుగా మారారు. 2022 నాటికి ఈ సంఖ్య ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయిలో 1,18,095కి చేరుకుంది. దీనికి విరుద్ధంగా, 2022లో కేవలం 30 వేల మంది చైనీయులు మాత్రమే కెనడాకు తరలి వెళ్లారు. దశాబ్దాలుగా భారతీయులకు, ప్రత్యేకించి పంజాబ్ నుండి వలస వచ్చిన వారికి కెనడా చేరుకోవలసిన ప్రదేశంగా ఉంటోంది. పైగా, భారతదేశ అణు సామర్థ్యాన్ని పెంపొందించడంలో సహాయపడే వ్యూహాత్మక భాగస్వామి కెనడా. అలాంటప్పుడు, రెండు దేశాల మధ్య సంబంధాలు ఎందుకు మునుపెన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి?

భారతదేశం, ఆంగ్లోస్ఫియర్ (ఇంగ్లిష్ భాష, సంస్కృతి ప్రధానంగా ఉండే) దేశాల మధ్య సమస్య ఉందని స్పష్టమవుతోంది. విదేశాంగ విధానం, జాతీయ భద్రతతో స్వప్రయోజనాలు నెరవేర్చేందుకు దేశీయ రాజకీయ వ్యూహాలను ట్రూడో మిళితం చేశారని భారత అధికారులు అభియోగాలు మోపారు. ట్రూడోకి కెనడియన్ సిక్కుల ఓటు అవసరం కాబట్టి వారి ఖలిస్తానీ ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నారు; ఆయన ప్రభుత్వం డ్రగ్ పంపిణీదారులు, భారత వ్యతిరేక ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తోందనీ వీరు ఆరోపించారు. దీనికి ప్రతిగా కెనడా పౌరులను హత్య చేయడానికి భారత ఇంటెలిజెన్స్ అధికారులు, దౌత్యవేత్తలు కుట్ర పన్నారని ట్రూడో ప్రభుత్వం ఆరోపించింది.

మరోవైపు అమెరికా ఈ వివాదంలోకి అడుగుపెట్టి, కెనడియన్ సిక్కు హత్యను, అమెరికన్ సిక్కుపై ఇదే విధమైన ప్రయత్నానికి ముడిపెట్టింది. దీంతో దౌత్యపరమైన గందరగోళం ప్రారంభమైంది. త్వరలోనే ఇది పెద్ద గొడవగా మారి పరాకాష్ఠకు చేరింది. కెనడా, అమెరికా, బ్రిటన్‌లలో ఖలిస్తానీ అనుకూల క్రియాశీలత గురించి భారత్ ఫిర్యాదు... దేశీయ భద్రతా సమస్యలపై ఆధారపడింది. పాశ్చాత్య ప్రభుత్వాలు భారతదేశ ఆందోళనల పట్ల సున్నితంగా వ్యవహరించడం లేదన్న మోదీ ప్రభుత్వ దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే, దౌత్యవేత్తలు, సీనియర్ ప్రభుత్వ అధికారులతో సహా భారతీయులకు వ్యతిరేకంగా కెనడా, అమెరికా చేసిన నేరారోపణలు తీవ్రమైనవి. ఈ సందర్భంగా రెండు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదటిది... కెనడా, అమెరికా ప్రభుత్వాలు ఈ అంశంపై బహిరంగ ప్రకటనకు ఎందుకు వెళ్లాయి? రెండోది... భారత్‌పై ఇలా ఆరోపణలు మోపడం ఎక్కడ దాకా వెళ్ళి ఆగుతుంది? రెండవ ప్రశ్న విషయానికి వస్తే, అమెరికా, కెనడా రెండూ పేర్లను కూడా పేర్కొన్నాయి. పైగా భారతీయులపైనే తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యతను ఉంచాయి.



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, భారత ప్రధాని నరేంద్ర మోదీ (ఫైల్)

మొదటి ప్రశ్న ముఖ్యమైనది. ఎందుకంటే కెనడా, అమెరికాలు భారతదేశంతో సహేతుకంగానే మంచి దౌత్య సంబంధాలను కలిగి ఉన్నాయి. పైగా చాలావరకు విచక్షణతో ఇవి విషయాలను నిర్వహించగలవని ఆశించవచ్చు. మొదటి ప్రశ్నకు సంబంధించి కెనడియన్ సిక్కు ఓటర్లతో ఎన్నికల ఒప్పందాన్ని కుదుర్చుకోవాలనే ఆశతో ట్రూడో పక్షపాత రాజకీయాలు ఆడుతున్నారనేది భారత ప్రభుత్వ అధికారిక అభియోగం. 'సరిహద్దు' ఉగ్రవాద దాడులకు సంబంధించిన ఆరోపణలతో భారత రాజకీయ నాయకులు రాజకీయ పెట్టుబడి పెట్టారని పాకిస్తాన్ ఆరోపిస్తున్న రీతిని ఇది బాగా ధ్వనిస్తోంది. దేశీయ రాజకీయాలతో జాతీయ భద్రతా సమస్యలను కలపడం రెండు మార్గాలనూ తొలగించివేస్తుంది. పైగా అటువంటి ఆరోపణలను మూడవ పక్షం వారు ఎలా చూస్తున్నారనే అంశంపై జాగ్రత్తగా ఉండాలి.

బహుశా, ట్రూడో ప్రభుత్వాన్ని భారతదేశం విస్మరించే స్థాయిలో ఉందనే అభిప్రాయాన్ని కొందరు అర్థం చేసుకోవచ్చు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి ప్రాథమిక ఆరోపణలు వచ్చినప్పుడు న్యూఢిల్లీలో ఇదే ప్రధానమైన అభిప్రాయంగా ఉండేది. తర్వాత, అమెరికా గడ్డపై కూడా, గురుపత్వ సింగ్ పన్నూన్‌ను చంపడానికి భారత అధికారులు కుట్ర పన్నారని అమెరికా ఆరోపించడమే కాకుండా, చట్టపరమైన చర్యలను కూడా ప్రారంభించడం ద్వారా ముందడుగు వేసింది. ఇదంతా కేవలం స్నేహితుల మధ్య ఉన్న అపార్థం, అపనమ్మకాల వ్యవహారమా? లేక దీంట్లో పెద్ద సమస్యలు ఇమిడి ఉన్నాయా? ఇంగ్లిష్ భాషాధిక్య దేశాలైన ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, న్యూజిలాండ్, అమెరికా తమ 'ఫైవ్ ఐస్' కూటమి ద్వారా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పంచుకున్న విషయం తెలిసిందే. దీన్ని బట్టి చూస్తే, ట్రూడో ఎక్కువ ఓట్లను కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించడం ఏమంత విశ్వసనీయమైన ప్రతిస్పందనగా అనిపించదు. మరీ ముఖ్యంగా, పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలు తమను లక్ష్యంగా చేసుకుంటున్నాయని భారత ప్రభుత్వం ఎందుకు విశ్వసిస్తోందనే ప్రశ్నను అడిగి తీరాలి.

ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ గత వారం తన విజయదశమి ప్రసంగంలో, పాశ్చాత్య 'ఉదారవాద, ప్రజాస్వామ్యాలు' బంగ్లాదేశ్‌లో చేసినట్లుగా భారతదేశంలో 'అరబ్ స్ప్రింగ్' తరహా 'వర్ణ విప్లవాలను' ప్రదర్శించాలని యోచిస్తున్నాయని పరోక్షంగా ఆరోపించారు. పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలతో సంబంధాలను వీక్షిస్తున్న ఈ విధానం భారతీయ విదేశీ, జాతీయ భద్రతా విధానాలకు సంబంధించి పెద్ద ప్రశ్నను లేవనెత్తుతుంది.

ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తన పదవీ కాలంలో చేసిన అనేక ప్రసంగాలలో 'భారతదేశం బాగుండాలని ప్రపంచం కోరుకుంటోంది, కానీ మన సవాళ్లు స్వదేశంలో ఉన్నాయి' అని తరచుగా చెప్పేవారు. అంతర్జాతీయ సమాజం, ముఖ్యంగా ఉదారవాద ప్రజాస్వామ్యాలు కలిసి జిహాదీ తీవ్రవాదం, నిరంకుశ చైనా పెరుగుదలపై భారతదేశంలాగే ఆందోళన చెందుతున్నాయనీ, అందువల్లే పాశ్చాత్య ఉదారవాద, ప్రజాస్వామ్య పాలనపై గురిపెట్టిన ఈ రెండు ప్రమాదాలకు వ్యతిరేకంగా భారతదేశం ఎదుగుదలకు అవి మద్దతునిచ్చాయన్న దృక్పథంపై ఈ అంచనా ఆధారపడి ఉంది.

ఈ దృక్కోణం మారిందా? భారతదేశం ఇకపై ఆంగ్లోస్ఫియర్‌ను 'మిత్రుడు'గా లేదా కనీసం దాని పురోగతిలో భాగస్వామిగా చూడలేదా? చైనా, పాకిస్తాన్‌లు రెండింటినీ తన జాతీయ భద్రతకు ప్రమాదకారులుగా ప్రకటించిన భారత్ అదే సమయంలో పశ్చిమ ఉదారవాద ప్రజాస్వామ్యాలను దూరం చేసుకోగలదా? విదేశాంగ విధాన నిర్వాహకులు, జాతీయ భద్రతను నిర్వహించే వారి ఆలోచనల మధ్య తప్పు అమరిక ఏదైనా ఉందా? కెనడా ప్రధాని ట్రూడో ఇలాంటి అనేక ప్రశ్నలను లేవనెత్తారు.

కొనసాగుతున్న పశ్చిమాసియా సంఘర్షణలో పెరుగుతున్న అమెరికా ప్రమేయం పెనుమంటగా మారడంతోపాటు భారత ఆర్థిక వ్యవస్థపై తక్షణ పర్యవసానాలను కలిగిస్తుంది. మొత్తంమీద ప్రపంచ పర్యావరణం నేడు భారత ఆర్థికవృద్ధికి, పెరుగుదలకి చాలా తక్కువ అనుకూలంగా ఉన్నట్లు అనిపిస్తుంది. మోదీ ప్రభుత్వం, సంఘ్ పరివార్‌లు పశ్చిమ దేశాలపై, వాటి సంస్థలపై క్రమం తప్పకుండా విమర్శలు గుప్పించడం చూస్తే... పశ్చిమ దేశాలతో భారత్ సంబంధాలు పరీక్షకు గురవుతున్నట్లు, విశ్వాస సంక్షోభాన్ని కూడా ఎదుర్కొంటున్నట్లు అనిపిస్తుంది. ట్రూడో వ్యవహారం కేవలం ఒక తీవ్రమైన అనారోగ్యపు లక్షణం కావచ్చు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారు ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో...)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బతకనీయరా?



దూషణలకు దిగే మగ వాళ్లను మహిళలు బ్లాక్ చేస్తారు. కానీ బ్లాక్ చేసినా అలాంటివాళ్లు ఇంకా పోస్టులను చూసేట్టుగా బ్లాక్ ఆప్షన్‌ను ట్విట్టర్ మార్చనుంది. దుర్వినియోగదారులను ప్రోత్సహించే పిచ్చి ఎత్తుగడ ఇది.

– చిన్మయి శ్రీపాద, గాయని

ఘోరమైన ఆట



గత యాభై ఏళ్లుగా నేను క్రికెట్ చూస్తున్నాను. ఇన్నేళ్లలో ఇండియా టెస్టు క్రికెట్‌లో అత్యంత ఘోరమైన రోజు ఇది (న్యూజిలాండ్ చేతిలో ఇండియా మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయింది.)

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

నగర భాగ్యం!



ఇండియాలోని ఏ నగరంలో స్థిరపడాలని ఒక ఎన్‌ఆర్‌ఐ చూస్తుంటే గనక– నేననుకోవడం హైదరాబాద్ మేటి. చెదురు మదురు ఘటనలు ఎప్పుడో తప్ప వినబడవు. భాషకు సంబంధించిన అభద్రత లేదు. అద్దెల గురించి జనాలు ఫిర్యాదులు చేయగా చూడలేదు. డాష్‌కామ్ ప్రమాదాల వీడియోలు అతి తక్కువ.

– చిరాగ్ బడ్‌జాత్యా, ఆంట్రప్రెన్యూర్

తెలియని పని



'యుద్ధము–శాంతి' నవల రాతప్రతిని లియో టాల్‌స్టాయ్ భార్య (సోఫియా) ఏడుసార్లు తన చేత్తో చూసి రాసింది. వేతనం లేని శ్రమలు చేసే ఈనాటి మహిళల గురించి మీరు తెలుసుకోవాల్సింది ఇదే!

– కిరణ్ మన్‌రాల్, రచయిత్రి

ఈ కాలపు భయం



తన పన్నును సగం విరగ్గొట్టుకున్న నా చెల్లె నాతో వీడియో కాల్‌లో ససేమిరా మాట్లాడనంది. దాన్ని నేను స్క్రీన్ షాట్ తీసి, తర్వాత ఎప్పుడైనా ఏడిపిస్తానని భయపడింది.

– ఇస్మత్ ఆరా, కాలమిస్ట్

రోజులు మారాయా?



మా కొలీగ్ పన్నెండేళ్ల కూతురికి బాయ్ ఫ్రెండ్ ఉన్నాడట. నాకు పన్నెండేళ్లు ఉన్నప్పుడు రిఫ్రిజిరేటర్ డోర్ నెమ్మదిగా మూస్తూ, ఎప్పుడు లైట్ ఆరిపోతుందా అని చూసేదాన్ని.

– శ్వేత, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పరిష్కారం ఎప్పుడో!

హైదరాబాద్ చారిత్రక నగరం. వనాలు, కొండలు, గుట్టలు వంటి ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. అటువంటి హైదరాబాద్ కాలక్రమంలో కాలుష్య కాసారంగా మారింది. అలనాటి అందాలు, శుభ్రతలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. చెత్త వేసే డస్ట్‌బిన్లు ఎత్తేశారు, కానీ ప్రత్యామ్నాయంగా ఏది చూపించలేకపోయారు. ఎక్కడ పడితే అక్కడ వ్యాపారాలకు అనుమతులు ఇచ్చేశారు. కానీ ఎక్కడా వాహనాల పార్కింగ్ గురించి ఆలోచించలేదు. బస్తీలలో ఇప్పటికీ కలుషితమైన నీరు వస్తోంది. వాటిల్లోకి ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద సిగ్నల్స్ వ్యవస్థను తీసేసి యూ టర్న్ వ్యవస్థను తీసుకొచ్చారు. ట్రాఫిక్ సమస్య ఇంకా జటిలంగా మారింది. పార్కింగ్ లేని మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్స్ అనుమతులు ఇచ్చారు. ఇలా ఒక్కటేమిటి అనేక విధానపరమైన లోపాలు కారణంగా హైదరాబాద్ విలవిల్లాడుతోంది.

కనీసం హైదరాబాద్ నగరానికి వివిధ పనుల కోసం వచ్చినవాళ్ళకు సరైన టాయిలెట్స్ కూడా లేవు. నగరానికి వచ్చిన మహిళల పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయి. నిర్ణయాలు వేలలో తీసుకుంటున్నారు. ఒక్క శాతం కూడా ఆచరణ రూపంలోకి రావడం లేదు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలనే కాదు... ఇరుకు సందుల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలను కూడా ఆదుకోవాలి. వాళ్లకు కూడా సురక్షిత ప్రాంతాల్లో పక్కా ఇళ్ల నిర్మాణాలు చేసి ఇవ్వాలి. బస్తీలలో ఉన్న వాళ్లను కూడా భవనాల్లోకి చేర్చినప్పుడే అభివృద్ధికి బీజం పడుతుంది. అధికారులు, రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో ఆలోచించి పనులు చేసినప్పుడే బడుగుల జీవితాలలో మార్పు వస్తుంది. ఐదు రూపాయల భోజనం అందించే స్థలాలు చెత్త చెదారంతో నిండి ఉంటున్నాయి. రోడ్లపైననే నిలబడి ఆహారం తినాల్సిన పరిస్థితి. మంచి నీళ్లు తాగుదామని నగరానికి వచ్చినవాళ్లు అనుకుంటే హైదరా బాద్ మొత్తం వెతికినా ప్రభుత్వం కల్పించే మంచినీటి సదుపాయాలు ఎక్కడా కనిపించవు. లక్షల సమస్యలతో అనునిత్యం పోరాడుతున్న హైదరాబాద్ ప్రజ లకు పరిష్కారం లభించేది ఎప్పుడో మరి!

– డా॥ వై. సంజీవ కుమార్, స్కై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

పాలు అందరికీ అందుతున్నాయా?

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

అధికారిక డేటా ప్రకారం, దేశంలో పాల ఉత్పత్తి 2021–22లో 221 మిలియన్ టన్నులు. భారతదేశపు పాల ఉత్పత్తి మెజారిటీ బర్రెల నుండి లభిస్తుండగా, ఆవు పాల వాటా పెరుగుతోంది. 2021 నాటికి ఆవు పాల వాటా 48.2%.

2019లో విడుదల చేసిన 20వ పశుగణన ప్రకారం, ఆవులు బర్రెలు, పాలు ఇచ్చేవి వట్టి పోయినవి కలిపి, దేశంలో మొత్తం పాడి పశువులు 12.57 కోట్లు. మునుపటి గణనమీద ఇది 6% పెరుగుదల. పాలు ఇచ్చే పశువుల సంఖ్య వేరుగా లేదు. వట్టి పోయిన పశువుల సంఖ్య పెరిగిందా, తగ్గిందా? పశువుల సంఖ్యలో పెరుగుదల ఎట్లా సాధ్యం? ప్రభుత్వం ఇస్తున్న లెక్కలకూ, క్షేత్ర పరిస్థితికీ మధ్య తేడా ఉన్నది.

పలుచనవుతున్న పాలు

దేశంలోని 110 బిలియన్ డాలర్ల పాడి పరిశ్రమలో డెయిరీ సహకార సంఘాలు, ప్రైవేట్ సంస్థలు, 'అమూల్', 'మదర్ డెయిరీ' వంటి ప్రభుత్వ సంస్థలతో కూడిన సంఘటిత రంగం వాటా కేవలం 30 బిలియన్ డాలర్లు. ఇది 30 శాతం కంటే తక్కువ.

భారతదేశంలోని పాల ఉత్పత్తిలో సగానికి పైగా ప్రాసెస్ అవుతున్నది. అంటే నెయ్యి వగైరా వాటికి లేదా ఇతర ఉత్పత్తులలో ఒక ముడి పదార్థంగా వాడతారు. మిగిలిన 48% పాలుగా అమ్ముతున్నారు. నిత్యం పాలు వాడే హోటళ్ళు, స్వీట్ దుకాణాలలో పన్నీర్ కొరకు కూడా డిమాండ్ పెరుగుతోంది. పెద్ద హోటళ్ళు వాళ్ళకు అవసరమైన పాలను అధిక ధరకు కొని, వినియోగదారుల నుంచి వసూలు చేయగలవు. దరిమిలా చిన్న హోటళ్ళు, చాయ్ దుకాణాలకు అంతగా పాలు దొరకకపోవచ్చు. లేదా ఆ ధర వాళ్ళు పెట్టలేరు. ముడి పాల కొరకు ఉన్న ఇటువంటి పోటీ గురించి, అంతర్గత డిమాండ్ గురించి, ఆ యా వినియోగ వర్గాలు చెల్లిస్తున్న ధరల గురించి విశ్లేషణలు లేవు. పోటీ పడలేని వ్యక్తులు, రంగాలు అసంఘటిత రంగంలోనే ఎక్కువ. పర్యవసానంగా, చాయ్ దుకాణాల చాయ్‌లో పాల 'శాతం' తగ్గుతున్నది. కొన్ని ఉత్పత్తులలో పాలు పలుచన అవుతున్నాయి.

చిన్న పిల్లల ఎదుగుదలకు ముడి పాలు అవసరమని వైద్యులు, పోషకాహార నిపుణులు నిత్యం వల్లెవేస్తున్న తరుణంలో 'అందరికీ పాలు' దొరకకపోవడం అన్యాయమే. పేద వాడికి పాలు అందకపోవడం మన ఆహార వ్యవస్థలో ఉన్న తీవ్ర లోపం. ఈ లోపాన్ని సరిదిద్దే ప్రభుత్వ చర్యలు కావాలి. ఒక ఊర్లో ఉత్పత్తి అవుతున్న పాలు, ఇతర ఉత్పత్తులు అక్కడే, లేదా ఆ ప్రాంతంలోనే వినియోగం అయ్యే పరిస్థితులు ప్రభుత్వం కల్పించాలి.



దిగుమతులతో దెబ్బతినే జీవనోపాధి

అమెరికా సహా వివిధ దేశాల నుంచి ఏటా రూ. 200–300 కోట్ల విలువైన పాల ఉత్పత్తులను మన దేశం దిగుమతి చేసుకుంటోంది. 2020లో భారత ప్రభుత్వం 10,000 టన్నుల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. 2023 జనవరిలో, దేశంలోకి పాలు, క్రీమ్ దిగుమతులు మునుపటి సంవత్సరం కంటే వెయ్యి శాతం పైగా పెరిగి 4.87 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ దిగుమతులు ఫ్రాన్స్, జర్మనీ, పోలాండ్ వంటి దేశాల నుండి వచ్చాయి.

పాల ఉత్పత్తుల దిగుమతులను సరళీకృతం చేయాలని భారత్ మీద ఐరోపా కమ్యూనిటీ, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల నుంచి ఒత్తిడి ఉన్నది. డెయిరీ ఉత్పత్తుల దిగుమతుల మీద సుంకాలు తగ్గించాలని వాణిజ్య ఒప్పందాలలో భాగంగా చర్చలు జరుగుతున్నాయి. అదే సమయంలో భారతదేశం నుండి డెయిరీ దిగుమతులకు నిబంధనలు పెట్టి రష్యా, యూరప్, మెక్సికో, చైనా అనుమతించడం లేదు. డెయిరీ దిగుమతులపై 60–70% సుంకం విధిస్తున్న అమెరికా, భారతదేశం విధించే 30–60% సుంకాలను తగ్గించాలని కోరుతున్నది. ఇంకొక వైపు అమెరికా తన డెయిరీ రంగానికి సంవత్సరానికి 28 బిలియన్ డాలర్ల సబ్సిడీలను ఇస్తుంది. పాలు, పాల ఉత్పత్తుల దిగుమతులు పెరిగితే లక్షలాది మంది భారత చిన్న, సూక్ష్మ పాడి రైతుల జీవనోపాధి ఆగమైపోతుంది అనే ఆందోళన నెలకొంది.

విధానాలు అనుకూలమేనా?

ప్రపంచ పాల ఉత్పత్తిలో భారతదేశం వాటా 22%. జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఇది 5%. దాదాపు 7 కోట్ల మంది పాడి రైతులు ఉన్నారు. పాడి పరిశ్రమ జీవనోపాధులను, వాతావరణ మార్పులను, కులం, మతాలను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తుంది.

వినియోగదారులు వివిధ రకాలగా పాలకు ధర చెల్లిస్తున్నారు. పంటల మాదిరే పాడి రైతుకు ఆ వినియోగం నుంచి వస్తున్న డబ్బులో ఎంత శాతం చేరుతున్నది అనే ప్రశ్న ఉన్నది. బర్రె మీద, ఆవుల మీద పెట్టాల్సిన ఖర్చుకు తగినట్టు ముడి పాలకు ధర లేదనీ, ఇంకా ఆదాయం సంగతి దేవుడెరుగు అనీ పాడి రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు అనేకం ఉన్నాయి. అందులో అనేకం చిన్న పాడి రైతులు అందుకోలేరు.

భారత పాడిపరిశ్రమలో సరళీకృత విధానం చిన్న రైతులకు ముప్పు కలిగిస్తుందని ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. పాడి రైతులకు భూమి దొరికే అవకాశం తగ్గిపోతున్నది. పట్టణాలలో, పట్టణ శివార్లలో భూమి ధరలకు రియల్ ఎస్టేట్ వలన రెక్కలు రావడం వల్ల చిన్న పాడి రైతు మనగలిగే పరిస్థితులు లేవు.

పాల కథ -2

సగటు రైతు ఆదాయం రూ. 7,000 అని ప్రభుత్వం అంటున్నది. పశుపోషణ ఉంటే అదనపు ఆదాయం వస్తుంది. దేశంలోని రైతులు తమ మొత్తం పశుపోషణ ఆదాయంలో దాదాపు 67% పాడి ద్వారా సంపాదిస్తున్నారు. ఇంకా అనేక రకాల ఉపయోగం పాడి పశువులతో ఉంది. పర్యావరణం వినాశనం అవుతున్న తరుణంలో పశువుల వైవిధ్యం, ఆహారం, సుస్థిర జీవనం మీద దృష్టి పెట్టడం ముఖ్యం. పుడమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పశు పోషణ ఇంకా సమస్యాత్మకంగా మారుతున్నది. హైబ్రిడ్ జాతులతో, పాశ్చాత్య పశు పోషణ పద్ధతుల వల్ల కాలుష్యం పెరుగుతున్నది. అనారోగ్య పశువుల సంఖ్య పెరుగుతున్నది. శుభ్రత పాటించని ఆధునిక డెయిరీల వల్ల పశువుల వ్యాధులు మానవులకు సంక్రమిస్తున్నాయి. పశువులకు సరైన ఆహారం, జీవనం లేని కారణంగా వాటి పాలలో కూడా పోషకాలు ఉండటం లేదు. విషాలు, రసాయనాలు, యాంటీ బయాటిక్స్ వాటికి ఇవ్వడం వలన, వాటి పాల ద్వారా అవి మనుషులకు చేరుతున్నాయి.

పశుపోషణలో సంప్రదాయ విజ్ఞానం, నైపుణ్యానికి చాలా విలువ ఉన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాడి పశువులను ప్రకృతి వనరుగా పరిగణించాలి. ఈ సూత్రం ఆధారంగా విధానం తీసుకురావాలి. పథకాలు వాటి సుస్థిరతకు, విస్తృతికి ఉపయోగపడే విధంగా రూపకల్పన చెయ్యాలి. స్థానిక పాడి రైతులను స్థానిక మార్కెట్లతో అనుసంధానం చెయ్యాలి. పాలు, పాల ఉత్పత్తులు గ్రామాలలో ప్రథమంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. పాడి రైతులకు ప్రతి ఏటా చట్ట బద్ధంగా కనీస మద్దతు ధరను ప్రకటించి, అమలు చెయ్యాలి. పాల సహకార సంఘాల సంఖ్యను పెంచాలి. కేంద్రీకృత పాల మార్కెటింగ్ వ్యవస్థకు ఇచ్చే సబ్సిడీలు స్థానిక సహకార సంస్థలకు ఇవ్వాలి. భూమి వినియోగ విధానం రూపొందించి అందులో గడ్డి మైదానాలకు స్థానం కల్పించాలి. పశుగ్రాసానికి, దాణాకు సంబంధించి శాస్త్రీయ నిర్ణయాలు తీసుకోవాలి. పాడి రైతులకు భూమి ఇవ్వాలి. లేదా భూమి ఉన్న రైతుకు పాడి పశువులను అందజెయ్యాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.3.01 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** అశ్వని సా.4.01 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.12.19 నుండి 1.47 వరకు, తదుపరి రా.1.02 నుండి 2.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.10 నుండి 12.58 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.17 నుండి 10.46 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 5.34.

ఐడీసీ లిఫ్టులను కేసీఆర్ విచ్ఛిన్నం చేశారు

- సంస్థ చైర్మన్ విజయ్‌బాబు ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) ఎత్తిపోతల పథకాలను గత సీఎం కేసీఆర్ విచ్ఛిన్నం చేశారని సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ఆరోపించారు. రాష్ట్రంలోని 643 లిఫ్టుల్లో 129 లిఫ్టులను పూర్తిగా నిర్వీర్యం చేశారని, మరో 180 లిఫ్టులు పూర్తిగా, 113 లిఫ్టులు పాక్షికంగా పనిచేయడం లేదన్నారు. కేవలం 113 లిఫ్టులు మాత్రమే పనిచేస్తున్నాయని, 5లక్షల ఎకరాల ఆయకట్టుకుగాను 2లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోందన్నారు. సంస్థ బోర్డు సమావేశం అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పనిచేయని 180 లిఫ్టుల మరమ్మతులకు రూ.400 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆర్టిజన్లను విస్మరిస్తే రాష్ట్రవ్యాప్త సమ్మె

విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు



హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న ఆర్టిజన్లు

హనుమకొండ: ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేయకుండా రిక్రూట్‌మెంట్‌కు వెళ్తే రాష్ట్రవ్యాప్త సమ్మెకు వెళ్తామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.ఈశ్వర్‌రావు హెచ్చరించారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన ఆర్టిజన్‌లతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల నుంచి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా ఆర్టిజన్ ఉద్యోగులు తరలివచ్చారు. ధర్నా అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి జేఏసీ నాయకులు వినతి పత్రం అందించారు. అంతకుముందు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ, ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేసే వరకు జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు భర్తీ చేయొద్దన్నారు. ప్రజావాణిలో డిప్యూటీ సీఎంను జేఏసీ నాయకులు కలిస్తే పరిశీలిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 23వేల మంది ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేయకుండా 3,500 మందిని రిక్రూట్‌మెంట్ చేస్తామని యాజమాన్యం చెబుతుందని, ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేయకుండా రిక్రూట్‌మెంట్‌కు వెళ్తే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

పిడుగు పడి రైతు మృతి..

- నిర్మల్ జిల్లాలో 72 గొర్రెల మృత్యువాత



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల)/ సారంగపూర్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో పిడుగు పాటుకు ఓ రైతు మృతిచెందగా, నిర్మల్ జిల్లా లో 72 గొర్రెలు మృత్యు వాతపడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లికి చెందిన కామిటి నర్సారెడ్డి (49) అనే రైతు గురువారం తె ల్లవారు జామున గ్రామ శివారులోని పశువుల పాక వద్దకు వెళ్లాడు. పాలు పితికి, పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా పిడు గుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన సమీప పొలాల్లోని రైతు లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించా రు. అలాగే నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్ తండాలో గు రువారం పిడుగుపా టు కు గొర్రెలు మృత్యు వా తపడ్డాయి. గ్రామా నికి చెందిన చౌహాన్ ఈనేష్ కు 60 గొర్రెలు, రాథోడ్ ప్రహ్లాద్‌కు 12 గొర్రెలు ఉ న్నాయి. మేతకోసం ఉద యం సమీపంలోని అడవిలోకి తోలుకెళ్లారు. సాయంత్రం ఒక్కసారి గా ఉరుములు, మెరుపు లతో వర్షం కురవడంతో యజమానులు గొర్రెల ను సమీపంలోని చెట్టు కిందకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో చెట్టుపై పిడుగుపడి 72 గొర్రెలూ మృతిచెందాయి. పిడుగు పడే సమయంలో కాపరులు దూరంగా ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు.

ఆసుపత్రుల్లో వసతులపై నివేదికివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో వసతులపై వారం రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన సౌకర్యాలు కల్పించకపోవడం, అలాగే మెడికల్, పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రాథమిక సౌకర్యాలు తెలుసుకుని వివరాలు అందజేస్తామని, గడువు కావాలని ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ పొట్టిగారి శ్రీధర్ కోరారు. ఈ విజ్ఞప్తికి సమ్మతించిన ధర్మాసనం వారం రోజులు సమయం ఇచ్చింది. ఆలోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది.

భవనాలను ప్రభుత్వమే నిర్మించాలి: తమ్మినేని

సాక్షి, హైదరాబాద్ : గురుకులాలకు సొంత భవనాలను ప్రభుత్వమే నిర్మించాలని, సరుకులు సరఫరా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల గురుకుల భవనాలకు అద్దెలు చెల్లించకపోవడంతో యజమానులు హాస్టళ్లకు తాళాలు వేసి మూసేశారని, ఇది విద్యార్థుల భవిష్యత్‌కు తీవ్ర నష్టమని గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భవనాలను తెరిపించి చదువులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

దారి తప్పిన జలచక్రం!



"అడ్డూ అదుపూ లేని మానవ కార్యకలాపాల వల్ల భూమిపై జలచక్రంతో సహా అన్నిరకాల సంతులనాలూ ఘోరంగా దెబ్బ తింటున్నాయి. దాంతో వర్షపాత ధోరణులు విపరీతంగా మారుతున్నాయి. దేశాలన్నీ తమ నీటి నిర్వహణ తీరుతెన్నులను యుద్ధ ప్రాతిపదికన మెరుగు పరుచుకోవాలి. కాలుష్యానికి తక్షణం అడ్డుకట్ట వేయాలి. లేదంటే మానవాళి మనుగడకు ముప్పు మరెంతో దూరంలో లేదు'

\- రిచర్డ్ అలన్, క్లైమేట్ సైన్స్ ప్రొఫెసర్, రీడింగ్ యూనివర్సిటీ, ఇంగ్లండ్

"ప్రపంచ నీటి సంక్షోభం పెను సమస్య మాత్రమే కాదు. జల ఆర్థిక వ్యవస్థల్లో అత్యవసరమైన మార్పుచేర్పులకు అవకాశం కూడా. ఇందుకోసం ముందుగా నీటి విలువను సరిగా అర్థం చేసుకోవడం చాలా అవసరం. దురదృష్టవశాత్తూ చాలా దేశాల్లో అదే లోపిస్తోంది

\- గోజీ ఒకొంజో ఇవాలా, డైరెక్టర్ జనరల్, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్

చరిత్రలో ఇదే తొలిసారి ● పరాకాష్టకు నీటి ఎద్దడి ● మనిషి నిర్వాకమే కారణం ● అంతర్జాతీయ నివేదిక వెల్లడి

పర్యావరణంతో శతాబ్దానికి పైగా మనిషి ఆడుతున్న ప్రమాదకరమైన ఆట పెను విపత్తుగా పరిణమిస్తోంది. దాని తాలూకు విపరిణామాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. విచ్చలవిడిగా అడవుల నరికివేత, మితిమీరిన వాతావరణ కాలుష్యం తదితరాల దెబ్బకు చివరికి భూమిపై జీవకోటి మనుగడకు అత్యవసరమైన జలచక్రం కూడా గతి తప్పింది. అంతర్జాతీయ నిపుణుల సమూహమైన గ్లోబల్ కమిషన్ ఆన్ ద ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ చేపట్టిన అధ్యయనం ఈ మేరకు తేల్చింది. ''చరిత్ర పొడవునా అత్యంత భారీ వాతావరణ మార్పుల నెన్నింటినో తట్టుకుని నిలిచిన జలచక్రం ఇలా సంతులనం కోల్పోవడం మానవాళి చరిత్రలో ఇదే తొలిసారి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా నీటి ఎద్దడి అతి త్వరలోనే పరాకాష్ఠకు చేరడం ఖాయం'' అని బుధవారం విడుదల చేసిన నివేదికలో హెచ్చరించింది. మనిషి నిర్వాకం వల్ల చోటుచేసుకుంటున్న పర్యావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణమంటూ కుండబద్దలు కొట్టింది! ''దీనివల్ల ఆహార సంక్షోభం మొదలుకుని పలు రకాల విపరిణామాలు తలెత్తనున్నాయి. వీటి దెబ్బకు త్వరలో పలు దేశాల ఆర్థిక వ్యవస్థలే అతలాకుతలం కావడం ఖాయం'' అని జోస్యం చెప్పింది.

ఏమిటీ జలచక్రం...!?

జలచక్రం భూమిపై నీటి కదలికలకు సంబంధించిన సంక్లిష్టమైన వ్యవస్థ. చెరువులు, నదులు, ముఖ్యంగా సముద్రంలోని నీరు సూర్యర్శ్మి ప్రభావంతో ఆవిరిగా వాతావరణంలోకి చేరుతుంది. భారీ నీటి ఆవిరి మేఘాలుగా మారి సుదూరాలకు పయనిస్తుంది. శీతల వాతావరణం ప్రభావంతో చల్లబడి వానగా, మంచుగా తిరిగి నేలపైకి చేరుతుంది. ఈ ప్రక్రియనంతటినీ కలిపి జలచక్రంగా పేర్కొంటారు. మనిషి చేజేతులారా చేస్తూ వస్తున్న పర్యావరణ విధ్వంసం ధాటికి దీనిపై కొన్ని దశాబ్దాలుగా కనీవినీ ఎరగని స్థాయిలో ఒత్తిడి పడుతూ వస్తోంది. ఇటీవలి కాలంలో అది భరించలేని స్థాయికి చేరిందని అధ్యయనం వెల్లడించింది. దశాబ్దాల తరబడి భూమిని విచ్చలవిడిగా విధ్వంసకర విధానాలకు వాడేయడం మొదలుకుని ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాలు నీటి నిర్వహణలో కనబరుస్తున్న లెక్కలేనితనం దాకా జలచక్రం గతి తప్పేందుకు దారితీసిన పలు కారణాలను నివేదిక ఏకరువు పెట్టింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

గతి తప్పితే అంతే...!

జలచక్రం గతి తప్పితే జరిగే చేటును తాజా నివేదిక కళ్లకు కట్టింది...

- కేవలం నీటి ఎద్దడి దెబ్బకు 2050 నాటికి దాదాపుగా అన్ని దేశాల జీడీపీ కనీసం 8 శాతం, అంతకుమించి తగ్గిపోతుందని అంచనా. అల్పాదాయ దేశాల జీడీపీలో 15 శాతానికి పైగా క్షీణత నమోదు కావచ్చు.
- దీని ప్రభావంతో ఏకంగా 300 కోట్ల మంది తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. చాలా దేశాల్లో పంటలూ నేలచూపులు చూస్తున్నాయి.
- భారీ భవనాలు తదితరాల తాలూకు ఓపలేని భారానికి తోడు భూగర్భ జల వనరులూ నిండుకుంటుండటంతో నగరాలు, పట్టణాలు నానాటికీ మరింత వేగంగా భూమిలోకి కూరుకుపోతున్నాయి.
- నీటి సంక్షోభం ఇప్పటికే ప్రపంచ ఆహారోత్పత్తిని 50 శాతానికి పైగా ప్రభావితం చేస్తోంది.

హరిత జలం.. అతి కీలకం

చెరువులు, నదుల వంటి జలాశయాల్లోని నీటికి బ్లూ వాటర్ అంటారు మట్టి, మొక్కల్లో నిల్వ ఉండే తేమను హరిత జలం అని పేర్కొంటారు. మనం ఇప్పటి దాకా పెద్దగా పట్టించుకోని ఈ నీటి వనరును జలచక్రంలో అతి కీలకమైన పారగా నివేదిక అభివర్ణించింది. ''ప్రపంచ వర్షపాతంలో ఏకంగా సగానికి పైగా దీనివల్లే సంభవిస్తోంది. భూమిని వేడెక్కించే కర్బన ఉద్గారాలను చాలావరకు శోషించుకునేది ఈ హరితజలమే'' అని తేల్చింది. కానీ, ''ఏ దేశంలో చూసినా చిత్తడి నేలలను నాశనం చేసే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. దీనికి తోడు అడవులనూ విచ్చలవిడిగా నరికేస్తున్నారు. దాంతో కర్బన ఉద్గారాలు నేరుగా వాతావరణంలోకి విడుదలైపోతున్నాయి. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ ఊహాతీత వేగంతో పెరిగిపోతోంది. మట్టిలో, చెట్లలో ఉండే తేమ హరించుకుపోతోంది. ఇదో విషవలయం. దీని దెబ్బకు కార్చిచ్చుల ముప్పు కూడా నానాటికీ పెరుగుతోంది'' అని నివేదిక హెచ్చరించింది.

తదుపరి సీజేఐ జస్టిస్ ఖన్నా

- కేంద్రానికి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సు
- దేశ 51వ సీజేఐగా నవంబర్ 11న బాధ్యతలు



కేంద్రానికి పంపిన సిఫార్సు లేఖను జస్టిస్ సంజీవ్ ఖన్నాకు చూపుతున్న సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ మొదలైంది. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం ఇందుకు శ్రీకారం చుట్టారు. తన వారసునిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సిఫార్సు చేస్తూ కేంద్ర న్యాయ శాఖకు లేఖ రాశారు. కేంద్రం లాంఛనంగా ఆమోదం తెలిపిన అనంతరం జస్టిస్ ఖన్నా సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తి అవుతారు. నవంబర్ 10న జస్టిస్ చంద్రచూడ్ రిటైరవనున్నారు. అనంతరం 11న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆరు నెలలకు పైగా సేవలందించి 2025 మే 13న రిటైరవుతారు. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి ఖన్నాయే. సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నవారే తదుపరి సీజేఐ కావడం పరిపాటి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లు. జస్టిస్ చంద్రచూడ్ దాదాపు రెండేళ్లుగా సీజేఐగా సేవలందిస్తుండటం తెలిసిందే. తదుపరి సీజేఐ పేరును సూచించాల్సిందిగా కేంద్ర న్యాయ శాఖ గత శుక్రవారం ఆయన్ను అభ్యర్థించింది.

చరిత్రాత్మక తీర్పులు

జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయ కోవిదునిగా పేరొందారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. ఈవీఎంలు సురక్షితమైనవని, బూత్‌ల ఆక్రమణ, బోగస్ ఓటింగ్‌లకు చెక్ పెడతాయని స్పష్టం చేయడమే గాక ఎన్నికల్లో వాడకాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు. వీవీప్యాట్ల ద్వారా ఈవీఎం ఓట్లను నూరు శాతం వెరిఫై చేయాలంటూ దాఖలైన కేసును కొట్టేసిన ఆ ధర్మాసనానికి ఆయనే సారథి. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమైనదంటూ తీర్పు వెలువరించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా సభ్యులు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా ఆయన ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో జైలుపాలైన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీస్‌అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కూడా సేవలందిస్తున్నారు.

హైకోర్టు సీజే కాకుండానే...

జస్టిస్ ఖన్నా 1960 మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీ క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్ సభ్యునిగా నమోదు చేసుకున్నారు. తీస్‌హజారీ జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా కెరీర్ మొదలు పెట్టారు. అనంతరం ఢిల్లీ హైకోర్టు తోపాటు పలు ట్రిబ్యునళ్లలో న్యాయవాదిగా పలు ప్రతిష్టాత్మక కేసులను వాదించి సమర్థునిగా పేరు తెచ్చుకున్నారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, ఏడాది అనంతరం శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఏ హైకోర్టుకూ ప్రధాన న్యాయమూర్తిగా పని చేయకుండానే నేరుగా ఈ ఘనత సాధించిన అతి కొద్దిమందిలో ఒకరిగా నిలిచారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నాకు ఆయన మేనల్లుడు. 1973లో కేశవానంద భారతి కేసులో మౌలిక నిర్మాణ సిద్ధాంతానికి సంబంధించి చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ హెచ్ ఆర్ ఖన్నా సభ్యుడు. ఎమర్జెన్సీ వేళ పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు వంటి ప్రాథమిక హక్కులను కూడా సస్పెండ్ చేయవచ్చంటూ 1976లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పుతో విభేదించిన ఏకైక సభ్యునిగా ఆయన సుప్రసిద్ధులు. ఈ కారణంగా తనను కాదని జూనియర్‌ను సీజేఐగా నియమించడంతో న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారు.

బిహార్‌లో కల్తీ మద్యం కాటుకు
24 మంది బలి

పాట్నా: మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో కల్తీ మద్యం 24 మంది ప్రాణాలను బలి తీసుకుంది. సివాన్, సరణ్ జిల్లాల్లో కల్తీ మద్యం సేవించి మృతిచెందిన వారి సంఖ్య 24కు చేరిందని అధికారులు గురువారం వెల్లడించారు. సివాన్ జిల్లాలోని మఘార్, ఔరియా గ్రామాల్లో 20 మంది, సరణ్ జిల్లాలోని ఇబ్రహీంపూర్‌లో నలుగురు మృతిచెందినట్లు వెల్లడించారు. మరో 25 మంది వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. బాధితుల్లో చాలామంది కంటిచూపు కోల్పోయినట్లు తెలుస్తోంది. కల్తీ మద్యం ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. కారకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. అక్రమ మద్యం వ్యాపారంపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు బిహార్ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు కల్తీ మద్యం వ్యవహారంపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. నితీశ్ కుమార్ ప్రభుత్వ చేతగానితనం వల్లే ప్రజలు ప్రాణాలు కోల్పోయారని విపక్ష నేతలు ఆరోపించారు. మద్య నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం సేవించి ప్రజలు మరణించడం పట్ల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి చావులకు ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని బిహార్ ప్రభుత్వానికి సూచించారు. బిహార్‌లో 2016 ఏప్రిల్ 5వ తేదీ నుంచి సంపూర్ణ మద్య నిషేధం అమలవుతోంది. దీంతో అక్రమార్కులు కల్తీ మద్యం విక్రయిస్తూ జనం ప్రాణాలను చెలగాటం ఆడుతున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో కల్తీ మద్యం వల్ల 150 మందికిపైగా మరణించినట్లు ప్రభుత్వం ఇటీవల అంగీకరించింది.

నిరాధార ఆరోపణలు...
అనవసర ఉద్రిక్తతలు

కెనడా తీరుపై భారత్ ధ్వజం

- ట్రూడో వైఖరే ప్రధాన సమస్య
- విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి అడ్డగోలు ఆరోపణలు చేసిన కెనడా తీరును భారత్ మరోసారి తూర్పారబట్టింది. ఈ విషయమై ఏ ఆధారాలూ లేకున్నా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బాధ్యతారహితంగా చేసిన తీవ్ర ఆరోపణలే ఇరు దేశాల మధ్య తాజా దౌత్య వివాదానికి ఆజ్యం పోశాయంటూ ఆక్షేపించింది. నిజ్జర్ హత్య వెనక భారత ఏజెంట్లున్నారన్న తన ఆరోపణలకు నిఘా సమాచారమే ఆధారం తప్ప దాన్ని నిరూపించేందుకు ఎలాంటి రుజువులూ తమ వద్ద లేవని ట్రూడో బుధవారం స్వయంగా అంగీకరించడం తెలిసిందే. భారత్‌పై ఆయన ఆరోపణల్లో పస ఎంతో దీన్నిబట్టే అర్థమవుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. నిజ్జర్ ఉదంతానికి సంబంధించి కెనడా తమకు ఇప్పటిదాకా ఎలాంటి రుజువులూ ఇవ్వలేదని భారత్ పదేపదే చెబుతూ వస్తుండటం తెలిసిందేది.



విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

దొంగ ఏడ్పులు...

నిజ్జర్ హత్య వెనక కూడా బిష్ణోయ్ గ్యాంగే ఉందని కెనడా చెబుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో కెనడా నుంచి భారత్‌లో అరాచకాలకు పాల్పడుతున్న ఆ గ్యాంగ్‌కు చెందిన పలువురు సభ్యులను అరెస్టు చేసి అప్పగించాలని ఎన్నిసార్లు కోరినా స్పందనే లేదని జైస్వాల్ స్పష్టం చేశారు. 'కెనడా గడ్డపై ఉంటూ భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఖలిస్తానీ శక్తుల్లో గుర్జీత్‌సింగ్, గుర్జీందర్‌సింగ్, అర్ష్‌దీప్‌సింగ్ గిల్, లఖ్బీర్‌సింగ్ లండా, గుర్‌ప్రీత్‌సింగ్ తదితరుల పేర్లను ట్రూడో సర్కారుకు ఎప్పుడో ఇచ్చాం. వీరిలో పలువురు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులూ ఉన్నారు. వీరంతా ఉగ్రవాదం తదితర తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. వీరిని అప్పగించాల్సిందిగా ఏళ్ల క్రితమే కోరాం. తాజాగా ఇటీవల కూడా విజ్ఞప్తి చేశాం. కానీ కనీస స్పందన లేదు'' అని వివరించారు. ''ఇలాంటి కనీసం 26 విజ్ఞప్తులు కెనడా వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. భారత భద్రత కోణం నుంచి చూస్తే ఇది చాలా తీవ్రమైన అంశం'' అని వివరించారు. ''వారిపై కనీసం గట్టి చర్యలైనా తీసుకోవాలని భారత్ ఎన్నిసార్లు కోరినా ట్రూడో సర్కారు పెడచెవిన పెడుతూ వస్తోంది. వారి రెచ్చగొట్టే ప్రసంగాలను భావ ప్రకటన స్వేచ్ఛ ముసుగులో చూసీ చూడనట్టు వదిలేస్తోంది'' అని ఆరోపించారు. ''ఓవైపేమో భారత్ ఎంతగా విజ్ఞప్తి చేసినా వారిని ఉద్దేశపూర్వకంగానే పట్టుకోవడం లేదు. మరోవైపు అదే బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు భారత ఆదేశాల మేరకు తమ దేశంలో అరాచకాలకు పాల్పడుతున్నారంటూ దొంగ ఏడ్పులు ఏడుస్తోంది'' అంటూ జైస్వాల్ నిప్పులు చెరిగారు. ట్రూడో సర్కారు తాలూకు ఈ ప్రవర్తన కచ్చితంగా రాజకీయ ప్రేరేపితమేనని ఆయన స్పష్టం చేశారు. మరో ఏడాదిలో కెనడాలో ఎన్నికలు జరగనుండటం తెలిసిందే.

అడ్వాన్స్ బుకింగ్ ఇకపై
60 రోజులే

- రైల్వే టికెట్ అడ్వాన్స్ బుకింగ్ నిబంధనల్లో కీలక మార్పు
- నవంబర్ 1 నుంచి అమల్లోకి

సాక్షి, న్యూఢిల్లీ: రైళ్లలో అడ్వాన్స్ టికెట్ బుకింగ్ నిబంధనలను భారతీయ రైల్వే మార్చింది. ప్రస్తుతం నాలుగు నెలల ముందుగానే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉండగా.. దీన్ని 60 రోజులకు కుదించింది. అడ్వాన్స్ రిజర్వేషన్ కాల పరిమితిని 60 రోజులకు తగ్గిస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంతకు ముందు అడ్వాన్స్ రిజర్వేషన్ కాలపరిమితి 120 రోజులు కాగా, ఇప్పుడు అది 60 రోజులకు తగ్గింది. ఈ నిర్ణయం నవంబర్ 1వ తేదీ నుంచి బుక్ చేసుకొనే టికెట్లపై అమలుకానుంది. ఐఆర్‌సీటీసీ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా టికెట్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. లేదా రైల్వే టికెట్ కౌంటర్ నుంచి టికెట్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. మరోవైపు తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి షార్ట్ రూట్ రైళ్లకు ఈ నిర్ణయం వర్తించదని రైల్వే శాఖ తెలిపింది. అదే సమయంలో విదేశీ పర్యాటకులకు 365 రోజుల అడ్వాన్స్ బుకింగ్ నిబంధనలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. రిజర్వ్ టికెట్లు అధికంగా రద్దు అవుతుండటం, ప్రయాణికులు రాక సీట్లు, బెర్తులు ఖాళీగా ఉండిపోతుండటాన్ని దృష్టిలో పెట్టుకొని అడ్వాన్స్ టికెట్ల బుకింగ్ కాలపరిమితిని తగ్గించామని రైల్వే పేర్కొంది. ప్రస్తుతం కాన్సిలేషన్స్ 21 శాతం ఉంటున్నాయని, 4–5 శాతం ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నా.. ప్రయాణం చేయడం లేదని వివరించింది. దీనివల్ల దళారులు సీట్లను అమ్ముకుంటున్నారని, రైల్వే సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొంది. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయడానికే అడ్వాన్స్ రిజర్వేషన్ కాలపరిమితిని 120 నుంచి 60 రోజులకు కుదించామని తెలిపింది.

సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధమే

- అసోం వలసపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు
- 1971 మార్చి 25 కటాఫ్ తేదీ సరైనదే
- పిటిషన్లను తిరస్కరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: భారత పౌరసత్వ చట్టం–1955లోని 'సెక్షన్ 6ఏ' రాజ్యాంగబద్ధతను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోమిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ 4:1 మెజార్టీతో గురువారం తీర్పు వెలువరించింది. జస్టిస్ పార్దీవాలా మాత్రమే ఈ తీర్పుతో విభేదించారు. సెక్షన్ 6ఏ రాజ్యాంగవిరుద్ధమని ఆయన చెప్పారు. చట్టవిరుద్ధమైన వలసలకు అస్సాం అకార్డ్(ఒప్పందం) ఒక రాజకీయ పరిష్కారంగా తోడ్పడిందని ధర్మాసనం వెల్లడించింది. అసోంలోకి వలసలకు, వలసదార్లకు పౌరసత్వం ఇవ్వడానికి 1971 మార్చి 25ను కటాఫ్ తేదీగా నిర్ణయించడం సరైందేనని పేర్కొంది. సెక్షన్ 6ఏ చట్టబద్ధమేనని సీజేఐ తన తీర్పులో వివరించారు. చట్టంలో ఈ సెక్షన్‌ను చేర్చడానికి పార్లమెంట్‌కు చట్టబద్ధమైన అధికారం ఉందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అసోంలోకి వలసలు అధికం కాబట్టి అక్కడికి ఎంతమంది అక్రమంగా వచ్చారన్నది కేంద్ర ప్రభుత్వం వెల్లడించలేదని తెలిపింది. అసోంలో భిన్నమైన గిరిజన తెగలు, సమూహాలు, వర్గాలు ఉన్నాయని, ఆయా వర్గాల ప్రజలకు తమ సంస్కృతిని కాపాడుకొనే హక్కును ఆర్టికల్ 29(1) కింద రాజ్యాంగం కల్పించిందని, సెక్షన్ 6ఏ ఈ హక్కును ఉల్లంఘిస్తోందంటూ పిటిషనర్లు చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఆర్టికల్ 29(1)ను ఉల్లంఘిస్తున్నారని చెప్పడానికి ఒక రాష్ట్రంలో లేదా ఒక ప్రాంతంలో వేర్వేరు తెగల ప్రజలు ఉన్నారని చెప్పడం ఒక్కటే సరిపోదని స్పష్టంచేసింది.

ఏమిటీ సెక్షన్ 6ఏ?

1985 నాటి అస్సాం అకార్డ్ తర్వాత అప్పటి ప్రభుత్వం సెక్షన్ 6ఏను ప్రత్యేక ప్రొవిజన్‌గా పౌరసత్వ చట్టంలో చేర్చింది. అక్రమ వలసలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన ప్రఫుల్ల కుమార్ మహంత నేతృత్వంలోని ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్‌తో రాజీవ్ గాంధీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందమే అస్సాం అకార్డ్. ఈ అకార్డ్ కింద ఎవరెవరికి భారత పౌరసత్వం కల్పించాలన్నది సెక్షన్ 6ఏ నిర్దేశిస్తోంది. ఈ సెక్షన్ ప్రకారం.. 1966 జనవరి 1 నుంచి 1971 మార్చి 25 దాకా బంగ్లాదేశ్‌తోపాటు నిర్దేశించిన ఇతర ప్రాంతాల నుంచి అసోంలోకి వలసవచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వొచ్చు. అలాంటివారు పౌరసత్వం కోసం సెక్షన్ 18 కింద రిజిస్టర్ చేసుకోవాలి. అయితే, అక్రమ వలసదార్లుగా గుర్తించిన తేదీ నుంచి పది సంవత్సరాల దాకా భారత పౌరసత్వం కోసం రిజిస్టర్ చేసుకోవడానికి వీల్లేదు. పదేళ్లు పూర్తయిన తర్వాతే అవకాశం ఉంటుంది. అలాగే 1971 మార్చి 25 తర్వాత వలస వచ్చినవారిని సెక్షన్ 6ఏ ప్రకారం వెనక్కి పంపించాలి. ఈ సెక్షన్‌ను అసోం సన్మిలితా మహాసంఘతో పాటు మరికొన్ని గ్రూప్‌లు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది అసోంలోకి సామూహిక వలసలను ప్రోత్సహించేలా ఉందని ఆరోపించాయి.

నాయబ్‌సింగ్ సైనీ అనే నేను..

- హరియాణా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం
- హాజరైన మోదీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు



గురువారం సీఎంగా ప్రమాణస్వీకారం అనంతరం మోదీకి సైనీ అభివాదం

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రిగా ఓబీసీ నాయకుడు నాయబ్‌సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం చేశారు. పంచకులలోని దసరా గ్రౌండ్‌లో గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయనతో రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. నూతన మంత్రుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. గురువారం వాల్మీకి జయంతి కావడంతో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకారానికి బీజేపీ నాయకత్వం ఇదే రోజును ముహూర్తంగా ఎంచుకుంది. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్‌తో పాటు బీజేపీ/ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, భూపేంద్ర పటేల్, ప్రమోద్ సావంత్, హిమంత బిశ్వ శర్మ, విష్ణుదేవ్ సాయి, పుష్కర్‌సింగ్ ధామీ తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం కంటే ముందు సైనీ గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇటీవల జరిగిన హరియాణా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గాను కమలం పార్టీ 48 స్థానాలు గెలుచుకుని వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది.

మోదీ అభినందనలు

హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీతోపాటు కొత్త మంత్రులకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. మంత్రివర్గం కూర్పు చక్కగా ఉందని ప్రశంసించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. హరియాణా ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేరుస్తుందని, రాష్ట్ర అభివృద్ధిని నూతన శిఖరాలకు చేరుస్తుందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, యువత, మహిళలతోపాటు సమాజంలోని ఇతర వర్గాల సంక్షేమం, సాధికారత విషయంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుందన్న విశ్వాసం తనకు ఉందన్నారు.

బీజేపీతో మూడు దశాబ్దాల అనుబంధం

బీజేపీ సీనియర్ నేనాయకుడు నాయబ్‌సింగ్ సైనీని మరోసారి అదృష్టం వరించింది. హరియాణా సీఎంగా వరుసగా రెండోసారి ఆయన ప్రమాణం చేశారు. ఈ ఏడాది మార్చి నెలలో ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో ఆయనను బీజేపీ అధిష్టానం నియమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడంతోపాటు ఓబీసీల ఓట్లపై గురిపెట్టిన కమల దళం అదే వర్గానికి చెందిన సైనీని తెరపైకి తీసుకొచ్చింది. ఈ ప్రయోగం సత్ఫలితాలు ఇచ్చింది. హరియాణాలో బీజేపీ వరుసగా మూడోసారి నెగ్గింది. అనూహ్యంగా పార్టీని గెలిపించిన సైనీకే మళ్లీ సీఎం పీఠం దక్కింది. ఆయన సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. సైనీ 1970 జనవరి 25న అంబాలా జిల్లాలోని మీర్జాపూర్ మాజ్రా గ్రామంలో జన్మించారు. మూడు దశాబ్దాలుగా బీజేపీలో కొనసాగుతున్నారు. పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో ఎమ్మెల్యేగా, 2019లో ఎంపీగా గెలిచారు. 2014 నుంచి 2019 దాకా మనోహర్‌లాల్ ఖట్టర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2023 అక్టోబర్‌లో హరియాణా బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఖట్టర్ ఈ ఏడాది మార్చి సీఎం పదవితోపాటు కర్నాల్ ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు. ఖట్టర్ స్థానంలో సైనీ ముఖ్యమంత్రి అయ్యారు. మే నెలలో జరిగిన కర్నాల్ ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అక్టోబర్ 5న జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో లాడ్వా స్థానం నుంచి 16,054 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు.

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మృతి

- డీఎన్ఏ టెస్టు తర్వాత ధ్రువీకరించిన ఇజ్రాయెల్
- హమాస్‌కు కోలుకోలేని దెబ్బ



యాహ్యా సిన్వర్

దియర్ అల్–బలాహ్ (గాజా స్ట్రిప్): వరుసబెట్టి అగ్రనేతలకు కోల్పోతున్న హమాస్‌కు గురువారం మరో శరాఘాతం తగిలింది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ తమ దాడుల్లో మృతి చెందాడని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. గాజాపై తాము జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందారని ఇజ్రాయెల్ తెలిపింది. వీరిలో ఒకరు యాహ్యా సిన్వర్ అని డీఎన్ఏ టెస్టు తర్వాత ఇజ్రాయెల్ ప్రకటించింది. సిన్వర్‌ను అంతమొందించామని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడికి సూత్రధారి సిన్వర్. ఈ దాడిలో 1,200 ఇజ్రాయెల్ దేశస్తులు చనిపోగా, 250 మందిని హమాస్ బందీలుగా పట్టుకుంది. అప్పటినుంచి సిన్వర్.. ఇజ్రాయెల్ ప్రధాన లక్ష్యంగా మారారు. మోస్ట్ వాంటెడ్ లిస్టులో అగ్రభాగాన ఉన్నారు. మిలటరీ వ్యూహకర్త సిన్వర్ మరణం హమాస్‌కు కోలుకోలేదని దెబ్బని చెప్పొచ్చు. అయితే సిన్వర్ మరణాన్ని హమాస్ ఇంకా ధ్రువీకరించలేదు. ఈ ఏడాది జూలైలో హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియాను ఇరాన్ రాజధాని టెహరాన్‌లో ఇజ్రాయెల్ మట్టుబెట్టిన విషయం తెలిసిందే. హనియా మరణం తర్వాత సిన్వర్ హమాస్ పగ్గాలు చేపట్టారు. 'సిన్వర్‌ను మట్టుబెట్టడం ఇజ్రాయెల్ సైనిక, నైతిక విజయమని విదేశాంగ మంత్రి కట్జ్ అభివర్ణించారు. కాగా గాజాలో జబాలియాలోని స్కూలులో నిర్వహిస్తునున్న శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 28 మంది మరణించారు.

శరణార్థి శిబిరం నుంచి...

యాహ్యా సిన్వర్ 1962లో గాజాలోని ఖాన్ యూనిస్ శరణార్థి శిబిరంలో పుట్టారు. 1987లో హమాస్ ఏర్పడ్డప్పటి తొలినాటి సభ్యుల్లో ఒకరు. సంస్థ సాయుధ విభాగాన్ని చూసుకునేవారు. 1980ల్లోనే ఆయనను ఇజ్రాయెల్ అరెస్టు చేసింది. ఇద్దరు ఇజ్రాయెలీ సైనికులను హత్య చేసిన నేరంలో నాలుగు జీవిత ఖైదులు విధించింది. జైల్లో పరిస్థితుల మెరుగుదల కోసం ఉద్యమం లేవదీసి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. 2011లో ఒక్క ఇజ్రాయెలీ సైనికునికి ప్రతిగా విడుదల చేసిన వేలాది మంది పాలస్తీనా ఖైదీల్లో భాగంగా విముక్తి పొందారు. గాజాకు తిరిగొచ్చి హమాస్ అగ్రనేతగా ఎదిగారు. ఏమాత్రం దయాదాక్షిణ్యాల్లేని తీరుతో 'ఖాన్ యూనిస్ బుచర్'గా పేరుపొందారు. 2023 అక్టోబర్ 7న 1,200 మందికి పైగా ఇజ్రాయెలీలను పొట్టన పెట్టుకున్న హమాస్ మెరుపుదాడి వెనక సంస్థ సాయుధ విభాగం చీఫ్ మొహమ్మద్ డెయిఫ్‌తో పాటు సిన్వర్ కీలకంగా వ్యవహరించారంటారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం ; 18 ; అక్టోబర్ ; 2024



సీవరేజీ టన్నెలింగ్ పనుల్లో కదలిక!
సుదీర్ఘ కాలం తర్వాత డీ-సిల్టింగ్ సీవరేజీ టన్నెలింగ్ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. జల మండలి చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రాజెక్టు పనులపై దృష్టి సారించింది. -8లో



వైష్ణవి..ది 'పవర్'లిఫ్టర్
ఆమె 'పవర్'కు ప్రత్యర్థి గుండెల్లో దడ పుట్టాల్సిందే. బరిలోకి దిగిందంటే పతకం పక్కా కొట్టాల్సిందే. ప్రోత్సహించే వారు లేకున్నా రాణిస్తోంది నగరానికి చెందిన వైష్ణవి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0/23.0
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. శుక్రవారం కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం గాలులు వీస్తాయి.

రూ.3 కోట్లతో స్పోర్ట్స్ పరికరాలు

డివిజన్‌కు రూ.2 లక్షల వంతున..

- కార్పొరేటర్ల విజ్ఞప్తికి స్పందించిన జీహెచ్‌ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహమిస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీకి చెందిన పలు ఇండోర్ స్టేడియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసే ఆలోచనల్లో ఉన్న జీహెచ్‌ఎంసీ.. కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు క్రీడా పరికరాల కొనుగోళ్లకూ సిద్ధమవుతోంది. ప్రతి కార్పొరేటర్ డివిజన్‌కు రూ.2 లక్షల విలువ చేసే క్రీడా పరికరాలు ఇవ్వాలని కార్పొరేటర్లు కోరడంతో మేయర్ విజయలక్ష్మి అందుకు సిద్ధమయ్యారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు, స్పోర్ట్స్ స్టేడియాలకు వచ్చేవారు ఆడుకునేందుకు తగినంత క్రీడాసామాగ్రి కావాలని కార్పొరేటర్లు కోరారు.

ఖర్చయితే మాకేంటి?

జీహెచ్ఎంసీ ఖజానా పరిస్థితి ఎలా ఉన్నా పట్టుబట్టి మరీ జీహెచ్ఎంసీ నిధులతోనే కుటుంబ సభ్యులతో సహా హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు దక్కించుకున్న కార్పొరేటర్లు ఇటీవలే స్టడీ టూర్ల పేరిట గౌహతి, ఆగ్రా, జైపూర్, ఇండోర్, లక్నో తదితర ప్రాంతాలను చుట్టి వచ్చారు. మళ్లీ ఇప్పుడు స్పోర్ట్స్ మెటీరియల్ పేరిట మరో రూ.3 కోట్ల ఖర్చుకు సిద్ధం కావడాన్ని జీహెచ్ఎంసీ వర్గాలే విమర్శిస్తున్నాయి. గతంలో క్రీడాపరికరాలు, జిమ్ సామాగ్రి కార్పొరేటర్లు, వారి అనుయాయుల అధీనంలోనే ఉండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. కాగా, గత మూడేళ్లుగా కోరుతున్నా ఇంతవరకు క్రీడాసామాగ్రి సమకూరలేదని కొందరు కార్పొరేటర్లు తెలిపారు. జీహెచ్ఎంసీ చేసే ఖర్చులో అది పెద్ద లెక్కలోది కాదని, ఔత్సాహికులైన వారిని, స్థానికులను ప్రోత్సహిస్తూ వారికి తగిన సదుపాయాలు కల్పిస్తే, వారు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని, తద్వారా కార్పొరేషన్‌కే మంచి పేరు వస్తుందని అంటున్నారు. గతంలోనూ పలువురు జీహెచ్ఎంసీ గ్రౌండ్స్ నుంచే ఎంతో ఉన్నతస్థాయికి ఎదగడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్టాండింగ్ కమిటీ ఆమోదంతో నిధులు మంజూరయ్యాక క్రికెట్, షటిల్ బాడ్మింటన్, క్యారమ్స్, చెస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, టెన్నికాయిట్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌లకు సంబంధించిన సామాగ్రి కొనుగోలు చేయాలని భావిస్తున్నారు.



ఎక్కడి ఫైళ్లు అక్కడే..!

అనుమతులకు హెచ్‌ఎండీఏ వెనుకంజ

చెరువులు, కుంటలు ఉన్నా..లేకున్నా నిలిపివేత

- అన్నింటికీ ఎన్‌ఓసీల పేరిట కొర్రీలు
- సుమారు 200లకు పైగా ఫైళ్లు పెండింగ్
- పెద్ద లేఅవుట్‌లు, బహుళ అంతస్తుల నిర్మాణ అనుమతులకు బ్రేక్

సాక్షి, సిటీబ్యూరో: 'పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ప్రాంతానికి చెందిన ఒక బిల్డర్ భవన నిర్మాణం కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నారు. చుట్టుపక్కల చెరువులు, కుంటలు ఉన్నాయనే సాకుతో హెచ్‌ఎండీఏ అధికారులు నీటిపారుదల, రెవెన్యూ శాఖల నుంచి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) తెచ్చుకోవాలని అంక్షలు విధించారు. దీంతో ఆరు నెలల పాటు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. చివరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సంయుక్త తనిఖీల అనంతరం ఇరిగేషన్ విభాగానికి చెందిన ఉన్నతాధికారి ఎన్‌ఓసీని అందజేశారు. కానీ అప్పటికే హైడ్రా ఉనికిలోకి రావడంతో కలెక్టర్ నుంచి కూడా ఎన్‌ఓసీ తప్పనిసరిగా మారింది. దీంతో ఇప్పటి వరకూ ఆ ఎన్‌ఓసీ లభించలేదు. సదరు బిల్డర్ అటు కలెక్టరేట్ చుట్టూ, ఇటు హెచ్‌ఎండీఏ చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి వస్తోంది.'

...ఇది ఒక్క ఇస్నాపూర్ ప్రాంతానికి చెందిన సమస్య మాత్రమే కాదు, కేవలం ఎన్‌ఓసీలతో ముడిపడిన అంశం కూడా కాదు. రకరకాల కారణాలు, కొర్రీలతో హెచ్‌ఎండీఏలో వందలకొద్దీ ఫైళ్లు పేరుకుపోతున్నాయి. 'హైడ్రా ఫోబియో'తో అనుమతులను ఇచ్చేందుకు కొందరు అధికారులు వెనుకంజ వేస్తుండగా, 'పై నుంచి ఆదేశాలు' రావాలంటూ మరికొందరు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా బడా నిర్మాణ సంస్థలు మొదలుకొని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఆశించే మధ్యతరగతి, వేతన జీవుల వరకు నెలల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది.

తారకమంత్రంలా ఎన్‌ఓసీ..

దరఖాస్తు చేసుకున్న భవనాలు, లే అవుట్ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఉన్నా లేకున్నా హెచ్‌ఎండీఏ అధికారులు ఎన్‌ఓసీని తారకమంత్రంలా జపిస్తున్నారు. అన్ని సమస్యలకూ ఒకే మంత్రం అన్నట్లుగా రకరకాల షార్ట్‌ఫాల్స్‌తో పాటు ఎన్‌ఓసీని కూడా జత చేస్తున్నారు. దీంతో దరఖాస్తుదారుల కష్టాలు మొదలవుతున్నాయి. తప్పుల తడకలాంటి మాస్టర్‌ప్లాన్‌ను ప్రామాణికంగా తీసుకొని ఎన్‌ఓసీల పేరిట కొర్రీలు విధిస్తున్నారంటూ నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా ఏర్పాటుకు ముందు ఒకటి, రెండు నెలల్లో ఎన్‌ఓసీలు లభించేవి. కానీ ఇప్పుడు ఇరిగేషన్, రెవిన్యూ విభాగాల మధ్య సమన్వయం కొరవడింది. రెండు విభాగాలకు చెందిన అధికారులు సంయుక్త తనిఖీలు చేయడం లేదు. ఏ విభాగం ఎలా స్పందిస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. 'కాలువలు, కుంటలు లేని చోట సైతం పంట కాలువలు ఉన్నట్లుగా కొర్రీలు విధిస్తున్నారు. ఎన్‌ఓసీ కావాలంటున్నారు. కానీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మాత్రం సకాలంలో ఎన్‌ఓసీలు ఇవ్వడం లేదు. దీంతో దారుణంగా నష్టపోవలసి వస్తుంది.' అని తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలామందికి సొంత ఇల్లు కలగానే మిగులుతుందని విస్మయం వ్యక్తం చేశారు. బాలాపూర్ ప్రాంతంలో స్థానిక మున్సిపాలిటీ అనుమతులతో నాలగంతస్తులు నిర్మించిన ఒక బిల్డర్ టీడీఆర్‌పైన ఐదో అంతస్తు కోసం టీజీబీపాస్ ద్వారా హెచ్‌ఎండీఏలో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఆ ప్రాంతం వాటర్‌బాడీలో ఉన్నట్లు కొర్రీ పెట్టారు. ఆరు నెలలుగా ఎన్‌ఓసీ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు ఆ బిల్డర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకప్పుడు టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతి వచ్చేవరకు హెచ్‌ఎండీఏ చుట్టూ తిరగవలసి వచ్చేది. ఇప్పుడు హెచ్‌ఎండీఏతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ తిరగవలసి వస్తుంది.' అని చెప్పారు.

తక్కువ విస్తీర్ణంలో చేపట్టే భవనాలు, లే అవుట్‌ల పరిస్థితి ఇలా ఉండగా, హైరైజ్ భవనాలు, 10 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేసే లే అవుట్‌లకు మాత్రం పైనుంచి ఆదేశాలు వస్తే తప్ప పనులు కావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంలో వివిధ స్థాయిల్లో సుమారు 200లకు పైగా ఫైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం. బడా లే అవుట్‌ల విషయంలో అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించినప్పటికీ తీవ్రమైన జాప్యం నెలకొనడం, ఫైళ్లు నిలిచిపోవడం పట్ల అధికారులు సైతం నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. దుండిగల్, ఘట్‌కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఫైళ్లు పెద్ద ఎత్తున ఉన్నట్లు సమాచారం. 'సాధారణంగా దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగల సందర్భంగా చాలామంది ప్లాట్‌లు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటారు. నిర్మాణ సంస్థలకు ఎక్కువ వ్యాపారం కూడా ఈ రోజుల్లోనే ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అపార్ట్‌మెంట్లకు అనుమతులు లభించకపోవడం వల్ల కొనుగోలుదారులకు ఎలాంటి భరోసాను ఇవ్వలేకపోతున్నాం.' అని ఒక బిల్డర్ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

హజ్ యాత్రకు 6,519 మంది ఎంపిక

సాక్షి సిటీబ్యూరో: హజ్ యాత్ర-2025కు రాష్ట్ర వ్యాప్తంగా 6519 మంది యాత్రికులు ఎంపికయ్యారని రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాకత్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సౌదీ అరేబియా ప్రభుత్వం హజ్ యాత్రకు మన దేశ వ్యాప్తంగా 1.75 లక్షల మందికి అనుమతులు ఇచ్చిందన్నారు. ఇందులో కేంద్ర హజ్ కమిటీ 50 వేల మంది యాత్రికులను తీసుకెళ్లే అవకాశం ప్రైవేట్ టూర్ ఆపరేటర్లకు ఇవ్వగా..మిగతా 1.12 లక్షల మంది యాత్రికులు వివిధ రాష్ట్రాల హజ్ కమిటీల ద్వారా ఎంపికవుతారన్నారు. కేంద్ర హజ్ కమిటీ రాష్ట్రంలోని ముస్లింల జనాభా నిష్పత్తి ప్రకారం యాత్రికుల సంఖ్యను కేటాయించిందన్నారు. ఈసారి హజ్‌యాత్రకు 9011 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో డ్రా ద్వారా 6519 మంది ఎంపిక కాగా రిజర్వు కోటాలో 766 మంది ఉన్నారన్నారు. మిగిలిన 2492 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నట్టు తెలిపారు. ఎంపికైన యాత్రికులు ఈ నెల 30వ తేదీ లోపు రూ.1,30,300 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. యాత్రకు సంబంధించిన ఇతర వివరాలకు హజ్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మూసీ ప్రక్షాళన కోసం..

- దక్షిణ కొరియాలోని సియోల్‌లో స్టడీ టూర్
- ప్రజా ప్రతినిధులు, అధికారుల బృందం పర్యటన

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నది ప్రక్షాళనలో మరో ముందడుగు పడింది. మురికి కూపంగా మారిన మూసీకి పూర్వ వైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడుం బిగించారు. ఇందులో భాగంగా దక్షిణ కొరియాలోని సియోల్‌లో అధ్యయనం చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ నెల 21 నుంచి 24 వరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పలువురు ప్రజా ప్రతినిధులు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులతో కూడిన బృందం సియోల్ నగరాన్ని సందర్శించనున్నారు. క్షేత్ర స్థాయిలో అక్కడి పరిస్థితులు, సాంకేతిక అంశాలు, సవాళ్లను అధ్యయనం చేయనున్నారు. దీంతో మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్ వారసత్వ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు ఉపాధి కల్పన, ఆదాయ మార్గాలుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తి



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కె.ఇలంబర్తి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అడిషనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, జోనల్ కమిషనర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి ఒక అద్భుతమైన సంపదను అందించారని పేర్కొన్నారు. వాల్మీకి రచనల్లో వ్యక్తమైన ధర్మ బోధలు, ఆధ్యాత్మికత, న్యాయ, నైతిక విలువలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సీఎన్ రఘుప్రసాద్, నళిని పద్మావతి, సీపీఆర్‌ఓ ముర్తుజా అలీ, ఏఎంసీలు రమణ, శారద తదితరులు పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన నేపథ్యంలో ప్రభుత్వం ఆ స్థానంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ఇలంబర్తిని జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమించడం తెలిసిందే.

25 నుంచి మాదిగల ధర్మయుద్ధం



మందకృష్ణ మాదిగ

లక్డీకాపూల్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు ఇక నమ్మేది లేదు.. ఆయనను వదిలేదు' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. నిండు శాసనసభలో మాట్లాడినదానికి విరుద్ధంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. గురువారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ..దేశంలోనే ఎస్సీ వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామన్న సీఎం, మాదిగలకు ద్రోహం చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖలో 11 వేలకుపైగా టీచర్ పోస్టులను భర్తీ చేసి మాదిగలను నట్టేట ముంచారన్నారు. రేవంత్ సర్కార్ వైఖరికి నిరసనగానే రాష్ట్రంలో మాదిగలను, ఉప కులాలను మరో ఉద్యమానికి సిద్ధం చేయడానికి నిజామాబాద్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర సదస్సు కార్యాచరణను రూపొందించిందన్నారు. ఆ మేరకు ఈ నెల 25 నుంచి 31 వరకు మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. నవంబరు 4 నుంచి 14 వరకు 119 నియోజకవర్గాలలో మాదిగల ధర్మయుద్ధ మహాదీక్షలు, నవంబర్ 16 నుంచి డిసెంబర్ 20 వరకు తెలంగాణ వ్యాప్తంగా మాదిగల ధర్మయుద్ధ రథయాత్ర సాగుతుందని చెప్పారు.

ట్రా'ఫికర్'పై హైడ్రా నజర్



ట్రాఫిక్ పోలీసులతో కలిసి సంయుక్త చర్యలు



సమావేశంలో రంగనాథ్ తదితరులు

- డీఆర్‌ఎఫ్ బృందాలకు దీనిపై ప్రాథమిక శిక్షణ
- కాలనీల్లోని ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం
- కమిషనర్, అదనపు కమిషనర్ల కీలక సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని ట్రాఫిక్ సమస్య పైనా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. ప్రధానంగా వర్షం కురిసినప్పుడు రహదారులు గోదారులుగా మారడం, గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం వంటి కీలక సమస్యలు పరిష్కరించడానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సిటీ ట్రాఫిక్ అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ సంయుక్తంగా ట్రాఫిక్ విభాగం అధికారులతో భేటీ అయ్యారు. ఈ కీలక సమీక్ష గురువారం నాంపల్లిలోని ట్రాఫిక్ కమిషనరేట్‌లో జరిగింది. ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణయించిన హైడ్రా అధికారులు డీఆర్‌ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రాథమిక శిక్షణ ఇప్పించనున్నారు. భారీ వర్షాలతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఇతర కీలక సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణలో డీఆర్‌ఎఫ్ బృందాలు భాగస్వాములు కానున్నాయి. వర్షం కురిసినప్పుడు వరద నీరు నిలిచే ప్రాంతాల్లో (వాటర్ లాగింగ్ ఏరియాలు) ఈ రెండు విభాగాలు సంయుక్తంగా సహాయక, క్లియరెన్స్ చర్యలు చేపట్టనున్నాయి. ఇప్పటికే నగర వ్యాప్తంగా గుర్తించిన వాటర్ లాగింగ్ ఏరియాల్లో ఆ సమస్య పరిష్కారం పైనా హైడ్రా దృష్టి పెడుతోంది. రాజధాని వ్యాప్తంగా 144 వాటర్ లాగింగ్ పాయింట్లు ఉండగా... వాటిలో 65 హైదరాబాద్ పరిధిలోనే ఉన్నట్లు తేల్చారు. ప్రాధాన్యత క్రమంలో ఈ ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించనున్నారు. వీలైనంత త్వరగా నీరు తొలిగించేలా హార్స్ పవర్ ఎక్కువ ఉన్న మోటార్ల వినియోగించడం, ఓ ప్రాంతంలో ఉన్న నీరు మరో ప్రాంతానికి పంపడం కాకుండా డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా శాశ్వత పరిష్కారం కనుగొననున్నారు. దీనికోసం త్వరలో రెండు భాగాలు క్షేత్ర స్థాయిలో అధ్యయనం సహా అనేక చర్యలు తీసుకోనున్నాయి. వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త లైన్లను వేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్ ఆక్రమణల్నే పరిగణనలోకి తీసుకున్నారు. అయితే సమకాలీన అవసరాలు, మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇకపై కాలనీల్లోని ఈ ఆక్రమణల్ని తొలగించాలని హైడ్రా-ట్రాఫిక్ విభాగాలు నిర్ణయించాయి. దీనికోసం స్పెషల్ డ్రైవ్స్ చేపట్టనున్నారు.

ఫుట్‌పాత్‌ల పునరుద్ధరణ

హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ విభాగాలు ఉమ్మడిగా పని చేస్తూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు ప్రజలు సాఫీగా నడచుకు వెళ్లేలా ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయనున్నారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, టెలిఫోన్ డక్‌లు, చెత్త డబ్బాలు తదితరాలను అయా విభాగాలు తొలగించేలా చర్యలు తీసుకోనున్నారు. వీటితో పాటు కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను, కొమ్మలను గుర్తించి వాటిని తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ట్రాఫిక్, ముసక సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యంతో పని చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇకపై ప్రతి నెలా హైడ్రా-ట్రాఫిక్ విభాగాలు సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసుకుని చేపట్టిన కార్యక్రమాలు పురోగతి, భవిష్యత్తు లక్ష్యాల నిర్దేశంపై సమీక్షలు నిర్వహించనున్నారు.

'యాడ్ రెవెన్యూ'పై..

నగరంలో 3 లక్షలకు పైగా ట్రేడ్ లైసెన్సులు

- ప్రకటన బోర్డు పన్ను చెల్లిస్తున్నది 6 వేల సంస్థలే..

సాక్షి, సిటీబ్యూరో: ప్రకటన బోర్డుల ద్వారా జీహెచ్‌ఎంసీకి వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచడంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. గతంలో జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉండే ఈ యాడ్స్ వింగ్ ప్రస్తుతం దీని పరిధిలోకి వచ్చింది. దీంతో ప్రతి ఏడాదీ ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కొన్ని రెట్లు పెంచే అవకాశం ఉన్నట్లు గుర్తించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆ దిశలో కసరత్తు చేస్తున్నారు. నగరంలోని వాణిజ్య సంస్థలన్నీ జీహెచ్‌ఎంసీ వద్ద ట్రేడ్ లైసెన్సులు తీసుకున్న తర్వాతే కార్యకలాపాలు చేపట్టాలి. ఇలా నమోదు చేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించే సంస్థలు కేవలం పెయింట్‌తో రూపొందించిన బోర్డులు మాత్రమే వినియోగించాలి. వీటితో పాటు లేదా కేవలం గ్లోసైన్ తదితర బోర్డులను ఏర్పాటు చేయాలంటే అదనంగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజధానిలో 3 లక్షల ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. అయితే ప్రకటన బోర్డులకు సంబంధించిన పన్ను చెల్లిస్తున్న సంస్థలు మాత్రం ఆరు వేలే అని హైడ్రా అధికారులు గుర్తించారు. మరోపక్క కొన్ని యాడ్ ఏజెన్సీలు సైతం అనుమతి తీసుకున్న, ప్రకటించిన బోర్డుల కన్నా ఎక్కువ ఏర్పాటు చేసుకున్నట్లు హైడ్రా అనుమానిస్తోంది. రహదారులపై ఉండే లాలీపాప్స్, బస్టాపులు ఇతర చోట్ల ఏర్పాటు చేసిన బోర్డుల విషయంలోనూ ఇలా జరుగతున్నట్లు భావిస్తోంది. ఈ రెండు అంశాలను పరిష్కరిస్తే జీహెచ్‌ఎంసీకి భారీ ఆదాయం వస్తుందని అధికారులు చెప్తున్నారు. దీని కోసం నగర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలతో పాటు స్పెషల్ డ్రైవ్స్ చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్‌పై ఎందుకీ నిర్లక్ష్యం?

ఏ సర్వీసు ఎప్పుడొస్తుందో తెలియదు

- అకస్మాత్తుగా సర్వీసులు రద్దు
- సకాలంలో రైళ్లు నడపండి
- జంటనగరాల ప్రయాణికుల సంఘాలు డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రైళ్ల రద్దుపై ప్రయాణికుల సంఘాలు, వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. 'ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియదు, ఏ క్షణంలో ఎందుకు రద్దవుతుందో తెలియదు. నగరానికి లైఫ్‌లైన్‌గా నిలిచిన ఎంఎంటీఎస్‌పైన నిర్లక్ష్యమెందుకు' అంటూ రైల్వే ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణపైన దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్‌లకు చెందిన ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం ప్రయాణికుల సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ మార్గాల్లో నడుస్తున్న ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్ల రాకపోకల పట్ల వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్, హైదరాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ లోకేష్ విష్ణోయ్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు సికింద్రాబాద్‌లోని సంచాలన్‌భవన్, హైదరాబాద్ భవన్‌లలో ప్రయాణికుల సంఘాలతో సమావేశాలను ఏర్పాటు చేశారు. డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ, జంటనగరాల సబర్బన్ ట్రావెలర్స్ అసోసియేషన్, అమ్ముగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వివేకానందపురం వెల్ఫేర్ అసోసియేషన్, దక్షిణ మధ్య రైల్వే రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్, తదితర సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సకాలంలో రైళ్లు నడపాలి..

మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు, మేడ్చల్ నుంచి ఉందానగర్ వరకు గతేడాది సర్వీసులను ప్రారంభించారు. కానీ ఈ రూట్‌లలో ప్రతి రోజు రైళ్లు రద్దవుతున్నాయి. పైగా ఏ ట్రైన్ ఎప్పుడొస్తుందో తెలియదు. మధ్యాహ్నం సమయంలో నడిపే రైళ్ల వల్ల ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఉండే సమయాల్లోనే రైళ్లు అందుబాటులో ఉండడం లేదు. ఈ రూట్‌లో సకాలంలో రైళ్లు నడపాలని జంటనగరాల సబర్బన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధి నూర్ కోరారు. ఉదయం 9 గంటలకు రావలసిన ట్రైన్ 11 గంటలకు రావడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. మరోవైపు మల్కాజిగిరి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాది కాలనీలకు సిటీబస్సుల కంటే ఎంఎంటీఎస్ ఎంతో ప్రయోజనంగా ఉంటుందని భావిస్తే ఈ రూట్‌లో మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు రైళ్లు ప్రారంభించినా ఫలితం లేకుండా పోయిందని అమ్ముగూడ, రాఘవేంద్రనగర్ కాలనీలకు చెందిన ప్రతినిధులు తెలిపారు.

'హైలైట్స్' పునరుద్ధరించాలి...

ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందజేసే 'హైలైట్స్' మొబైల్ యాప్ సేవలను పునరుద్ధరించాలని ప్రయాణికుల సంఘాలు కోరాయి. చిన్న చిన్న కారణాలతో ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయడం పట్ల కూడా ప్రయాణికుల సంఘాలు అభ్యంతరం తెలిపాయి. మరోవైపు సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనుల దృష్ట్యా కూడా రైళ్లను రద్దుచేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికుల సంఘాల నుంచి వచ్చిన సమస్యలను, సలహాలను, సూచనలను పరిగణనలోకి తీసుకొని చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల అభ్యర్ధనలను పరిశీలించిన అనంతరం, ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని దక్షిణమధ్యరైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఉన్నతాధికారులను ఆదేశించారు.



కాలనీ సంఘాలతో రైల్వే అధికారుల సమావేశం

కెమెరాలున్నా.. నిఘా సున్నా!

- పుట్టగొడుగుల్లా అనుమతుల్లేని పరిశ్రమలు
- డ్రైనేజీలు, జలాశయాల్లో వ్యర్థాల పారబోత
- కెమెరాలకు చిక్కకుండా అర్ధరాత్రి వేళ పని పూర్తి
- తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతున్న పీసీబీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో అనుమతులు లేని పరిశ్రమలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జీడిమెట్ల, నాచారం, చర్లపల్లి వంటి ప్రాంతాల్లోని అనుమతులు లేని పరిశ్రమలను గుర్తించడం కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు సవాల్‌గా మారింది. స్థానికుల ఫిర్యాదులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేసిన సమయంలోనే వీటి గుట్టు వీడుతోంది. పరిశ్రమల ఏర్పాటు సమయంలో కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్‌ఇ), కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌ఓ) అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, కొందరు అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అక్రమంగా పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆయా పరిశ్రమల నుంచి వ్యర్థాల విడుదల, కలుషితాలను శుద్ధి కేంద్రాలకు తరలించే ప్రక్రియపై నిఘా లేకుండా పోయింది. నిబంధనలను పాటించకపోవడం, బయటి వ్యక్తులు లోపలికి రాకుండా భద్రతా ఏర్పాట్లు, సీసీకెమెరాలకు చిక్కకుండా వ్యర్థాల తరలింపు కారణంగా ఇలాంటి పరిశ్రమల గుర్తింపు అధికారులకు కష్టతరంగా మారింది.

5 వేలకు పైగా పరిశ్రమలు..

గ్రేటర్ హైదరాబాద్‌లో చర్లపల్లి, జీడిమెట్ల, కాటేదాన్, పాశమైలారం, నాచారం తదితర 10 పారిశ్రామిక వాడలున్నాయి. వీటిల్లో సుమారు 5 వేలకు పైగా పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అనుమతులు లేని పరిశ్రమల గుర్తింపునకు పీసీబీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. పారిశ్రామిక వాడల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసింది. కానీ కొందరు వాటి కళ్లు గప్పి మరీ వ్యర్థాలను డ్రైనేజీలు, జలాశయాల్లోకి వదలుతున్నారు. జీడిమెట్ల, కాటేదాన్, నాచారం ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ విడుదల చేసే కలుషితాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

- భర్త ఆత్మహత్య

రసూల్‌పురా: భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికిలోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన శివరాజ్ జగత్ విశ్వకర్మ భార్య నలుగురు పిల్లలతో కలిసి రెండేళ్ళ క్రితం నగరానికి వలస వచ్చాడు. పాతబోయిన్‌పల్లి ఆర్ఆర్‌నగర్ లోని బాలాజీ రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతను తరచూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. దసరా పండుగ రోజూ కూడా మద్యం తాగి గొడవపడటంతో అతడి భార్య దీపా రసూల్‌పురాలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి లోనైన శివరాజ్ బుధవారం మధ్యాహ్నం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు అతడి భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంగ్లం పేరుతో ఆజ్యం

విద్వేషాలు రెచ్చగొడుతున్న ఇంగ్లిష్ హౌస్ అకాడమీ

- సీఈఓగా మోటివేషనల్ స్పీకర్ మునావర్ జామా
- 2019 నుంచి సికింద్రాబాద్ కేంద్రంగా ఈ వ్యవహారం
- కేసు నమోదు చేసిన గోపాలపురం పోలీసులు
- 'ముత్యాలమ్మ గుడి' కేసు దర్యాప్తులో వెలుగులోకి
- అకాడమీతో పాటు మెట్రో పోలీస్ హోటల్ సైతం సీజ్

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్, కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంపై దాడి కేసును దర్యాప్తు చేస్తున్న నార్త్‌జోన్ పోలీసులు కీలక విషయాలు గుర్తించారు. ఈ ఘటనకు పాల్పడిన ముంబై వాసి ఇంగ్లిష్ హౌస్ అకాడమీలో శిక్షణ నిమిత్తం నగరానికి వచ్చినట్లు తేలడంతో ఆ సంస్థ వ్యవహారాలపై ఆరా తీశారు. దీని కేంద్రంగానే మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సదస్సులు జరుగుతున్నట్లు గుర్తించిన గోపాలపురం పోలీసులు మరో కేసు నమోదు చేశారు. గురువారం రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు ఇంగ్లిష్ హౌస్ అకాడమీతో పాటు మెట్రో పోలీస్ హోటల్‌ను సీజ్ చేశారు. ముంబైకి చెందిన మునావర్ జామాకు మోటివేషనల్ స్పీకర్‌గా గుర్తింపు ఉంది. ఇంగ్లిష్ హౌస్ అకాడమీ పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన అతను 19 రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. సికింద్రాబాద్‌లోని రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా 2019 నుంచి ఓ బ్రాంచ్ నిర్వహిస్తున్నాడు.


మునావర్ జామా

ఆంగ్లంతో పాటు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకునేవాడు. నెల రోజుల కోర్సుకు రూ.20 వేలు చొప్పున ఫీజు వసూలు చేస్తున్న అతను శిక్షణకు వచ్చిన వారు బస చేసేందుకు పక్కనే ఉన్న మెట్రో పోలీస్ హోటల్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకుగాను నెలకు రూ.30 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. మునావర్ జామా తన ప్రసంగాల్లో భాగంగా విద్వేషాలు రెచ్చగొడుతున్నాడని, ఇతడితో పాటు ఇస్లామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన వివాదాస్పద వ్యక్తి జాకీర్ నాయక్ ప్రసంగాలతో ప్రేరణ పొంది నిందితుడు ముత్యాలమ్మ దేవాలయంలో విధ్వంసం సృష్టించినట్లు తేల్చారు. విగ్రహం ధ్వంసంపై మార్కెట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా... ఇంగ్లిష్ హౌస్ అకాడమీతో పాటు మెట్రో పోలీస్ హోటల్ గోపాలపురం ఠాణా పరిధిలోకి వస్తాయి. దీంతో వీటికి సంబంధించి మునావర్ జామా, హోటల్ యజమాని అబ్దుల్ రషీద్ బషీర్ అహ్మద్,



మేనేజర్ రెహ్మాన్‌లపై కూడా సుమోటోగా కేసు నమోదు చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఇంగ్లిష్ హౌస్ అకాడమీ బోధనలు చేస్తోందని, అనుమతి లేకుండా 151 మంది హాజరైన సదస్సుకు సహకారం అందించడం, నిబంధనలకు విరుద్ధంగా హోటల్‌లోని 49 గదుల్లో ఎక్కువ మంది బస చేయడానికి అంగీకరించడం తదితర ఉల్లంఘనలు మెట్రో పోలీస్ పాల్పడిందని తేల్చారు. ఈ మేరకు జీహెచ్ఎంసీకి లేఖ రాయగా... దీనిని పరిగణలోకి తీసుకున్న బల్దియా అధికారులు వీటికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులు రద్దు చేశారు. దీంతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు గురువారం ఈ రెండింటినీ సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడి కేసు నిందితుడిని త్వరలో అరెస్టు చేయనున్నారు. పరారీలో ఉన్న మునావర్ జామా సహా ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే అకాడమీ నుంచి కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్న పోలీసులు సదస్సుకు హాజరైన 151 మంది అభ్యర్థుల వివరాలు, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు.

అర్ధరాత్రి అల్లరి మూక వీరంగం

- పెట్రోల్ బంక్‌లో హల్‌చల్
- సిబ్బందితో వాగ్వాదం, క్యాషియర్‌పై దాడి

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కావేరి నగర్‌లో అల్లరి మూక వీరంగం సృష్టించింది. ఓ పెట్రోల్ బంక్‌లో హల్‌చల్ చేయడంతో పాటు క్యాషియర్‌పై మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకానగర్‌కు చెందిన సాయివర్ధన్ రెడ్డి కావేరినగర్ నాలా సమీపంలోని పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి శివసాయిగౌడ్ తన అనుచరులతో అక్కడికి వచ్చి ముత్యాలు అనే వ్యక్తికోసం ఆరా తీశాడు. ముత్యాలు రాలేదని సాయివర్ధన్ సమాధానం అని చెప్పడంతో మాకే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతావా అంటూ అతడిపై దాడి చేశారు. కన్నా గౌడ్ తన అనుచరులకు సమాచారం ఇవ్వడంతో దాదాపు 50 మందికి పైగా అక్కడికి వచ్చి సాయివర్ధన్‌పై మూకుమ్మడిగా దాడి చేయడమేగాక అర గంట పాటు బీభత్సం సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కన్నాగౌడ్, మల్లికార్జున్ గౌడ్, విక్రమ్ గౌడ్, సన్నిగౌడ్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సవరణ

గురువారం (17-10-2024)న హైదరాబాద్ ఎడిషన్ 7వ పేజీలో '20 లక్షల బిలియన్ డాలర్ల లావాదేవీలు లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన వార్తలో పొరపాటు దొర్లింది. 20 లక్షల బిలియన్ డాలర్లకు బదులుగా 20 బిలియన్ డాలర్లుగా చదువుకోగలరు. - ఎడిటర్

ఆటోపై కూలిన చెట్టు

- డ్రైవర్‌కు గాయాలు


పెంటయ్యను గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం


నుజ్జునుజ్జయిన ఆటో

ఘట్‌కేసర్: గాలి దుమారం లేకుండానే ప్రమాదవశాత్తు ఆటోపై చెట్టు కూలడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన గురువారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, మక్త అనంతారం గ్రామానికి చెందిన మునికుంట్ల పెంటయ్య ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం అతను ఘట్‌కేసర్ నుంచి భువనగిరి వెళుతుండగా స్థానిక మాధవరెడ్డి రైల్వే వంతెన సమీపంలో ఆటోపై చెట్టు కూలింది. దీంతో పెంటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెంటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పై చెట్టుకూలి వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: బైక్‌పై శుభకార్యానికి వెళుతున్న తండ్రి, కుమారుడిపై చెట్టు కూలడంతో తండ్రి మృతి చెందగా.. కుమారుడికి గాయాలైన సంఘటన గురువారం ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జియాగూడకు చెందిన గూడూరి బాల ప్రకాశ్ గౌడ్ (57) తన కుమారుడు నవనీత్‌తో కలిసి బైక్‌పై శుభకార్యం నిమిత్తం కర్మన్‌ఘాట్‌కు బయలుదేరారు. చంపాపేట్ వెళ్లే ప్రధాన రహదారిపై నైటింగేల్ ఆసుపత్రి సమీపంలో ఒక్కసారిగా వేప చెట్టు కూలి బైక్‌పై పడింది. దీంతో వారిరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలప్రకాష్ గౌడ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడికుమారుడు నవనీత్ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


బాల ప్రకాశ్ (ఫైల్)

టాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

నాగోలు: టాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..హయత్‌నగర్ పరిధిలోని తొర్రూర్‌కు చెందిన షేక్ మౌలానా(57) టాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతను హస్తినాపురం వద్ద సెల్లార్ నిర్మాణంలో భాగంగా మట్టిని టాక్టర్ ద్వారా బయటికి తరలిస్తుండటంతో ట్రాక్టర్ టైర్లు స్లిప్ కావడంతో టాక్టర్ బోల్తా పడింది. షేక్ మౌలాన్‌పై ట్రాక్టర్ ఇంజిన్ పడడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిరాజుకు అతి ఉత్కృష్ట సేవా పతకం

సాక్షి, సిటీబ్యూరో: నగర భద్రత విభాగం (సీఎస్‌డబ్ల్యూ) అదనపు డీసీపీగా పని చేస్తున్న సీనియర్ పోలీసు అధికారి పాక గిరి రాజుకు కేంద్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు గురువారం వర్తమానం అందింది. ఈ సందర్భంగా సిటీ పోలీసు ఉన్నతాధికారులు గిరిరాజును అభినందించారు.



పోలీసు శాఖలో విశేషమైన సేవలు అందించిన అధికారులకు కేంద్రం ఈ పతకాన్ని అందిస్తుంది. ఈ పతకం తన బాధ్యతల్ని మరింత పెంచిందని, విధి నిర్వహణకు పునరంకితం అయ్యే స్ఫూర్తిని ఇచ్చిందని గిరిరాజు 'సాక్షి'తో అన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య

ఉప్పల్: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ హోంగార్డు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, గిద్దలూరుకు చెందిన పోడ వెంకట రమణయ్య(39)పంజాగుట్ట ఏసీపీ కార్యాలయంలో హోం గార్డుగా పని చేస్తూ రామంతాపూర్ వెంకట రెడ్డి నగర్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన అతను తన భార్య సుభాషిణిని ఆమె పని చేసే ప్రాంతంలో వదిలి, పిల్లలను స్కూల్‌లో దించి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చేనని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ సూరి భగవంతం పేరున పోస్టల్ స్టాంప్

- కేంద్రానికి లేఖ రాస్తా
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: రక్షణ రంగానికి విశేష సేవలందించిన డాక్టర్.సూరి భగవంతం పేరున తపాల బిల్లా విడుదల చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. గురువారం డాక్టర్.సూరి భగవంతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓయూలో దివంగత డా.సూరి భగవంతం 115వ జయంతి సభ నిర్వహించారు. ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్‌బీ రామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ ఇంద్రాసేనా రెడ్డి, గౌరవ అతిథులుగా సైంటిఫిక్ అడ్వైజర్ డా.సతీష్ రెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంద్రాసేనా రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సైంటిస్టు డా.సూర్తి భగవంతం అన్నారు. ఓయూకు తొలి తెలుగు వీసీగా పని చేసిన ఆయన ఆ తర్వాత తొమ్మిదేళ్ల డీఆర్‌డీవో డైరెక్టర్‌గా రక్షణ రంగ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే దేశం ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ రంగం బలోపేతానికి డా.సూరి భగవంతం చేసిన కృషి ఎనలేనిదన్నారు. తన కుటుంబ సభ్యులను కూడా సైటింస్టులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అనంతరం డాక్టర్.సూరి భగవంతం ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి, డీఆర్‌డీవో డైరెక్టరేట్ జనరల్ డా.వీ రాజాబాబు తరపున జీఏఎస్ మూర్తికి, ఎస్ఆర్ఎస్ఈ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్, ఇంటలిజెంట్ డిజైన్ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డ, రవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మోచర్ల శశిభూషన్ తరపున శరత్‌కు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా.సూరి భగవంతం కుటుంబ సభ్యులతో పాటు ఓయూ అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.


డా.సూరి భగవంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

సీవరేజీ టన్నెలింగ్ ప్రాజెక్ట్ పనుల్లో కదలిక

- 17 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రారంభమైన పనులు
- మూడు డివిజన్లలో మురుగు సమస్యకు పరిష్కారం
- సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో 90 శాతం పనుల పూర్తికి ప్రణాళిక


పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: సుదీర్ఘ కాలం తర్వాత డీ-సిల్టింగ్ సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. జలమండలి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రాజెక్టు పనులపై దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదికి పునరుజ్జీవం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సీవరేజీ టన్నెలింగ్ ప్రాజెక్టు మళ్లీ తెరపైకి వచ్చినట్లయింది . గురువారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పనులు కొనసాగుతున్న కింగ్ కోఠి, కాచిగూడ, బర్కత్‌పురా, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు సూచనలు చేశారు.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం

నగరంలోని మూడు డివిజన్లలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 2007లో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా వరకు దాదాపు 5 కిలోమీటర్ల 1800 ఎంఎమ్ డయా భారీ పైప్ లైన్ నిర్మించాలన్న లక్ష్యంతో సీవరేజీ టన్నెలింగ్ ప్రాజెక్టు(సీవర్ ట్రంక్ మెయిన్) చేపట్టింది. రాజ్ భవన్, సచివాలయం నుంచి అబిడ్స్, హిమాయత్ సాగర్, నారాయణ గూడా, బర్కత్‌పురా, బాగ్‌లింగం పల్లి ప్రాంతాల్లోని మురుగు నీటిని నాలాల్లో కలవకుండా నేరుగా అంబర్‌పేట్ ఎస్టీపీకి మళ్లించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. వాస్తవంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా అక్కడి నుంచి అంబర్‌పేట్ వరకు సీవరేజీ పైప్ లైన్ విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ ద్వారా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 17 ఏళ్ల క్రితం అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులు ప్రారంభించినా ఇప్పటివరకు 4.4 కిలోమీటర్ల మేరకు మాత్రమే పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. చాలా ప్రాంతాల్లో భూగర్భంలో బండపరుపు తేలడంతో టన్నెలింగ్ పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రాజెక్ట్ వ్యయం పెరిగి సదరు ఏజెన్సీ పనులను అర్ధాంతరంగా వదిలేసింది. తాజాగా మూసీ నదీ ప్రక్షాళనలో భాగంగా పనులకు మళ్లీ ఊపిరిపోసినట్లుయ్యింది.

- ఈ ప్రాజెక్టు మిగిలిన 0.6 కిలోమీటర్లు పూర్తి చేస్తే జలమండలి ఓ అండ్ ఎం 4, 5, 6 డివిజన్ ప్రాంతాల్లోని రాజ్ భవన్, సచివాలయం, అబిడ్స్, హిమాయత్ సాగర్, నారాయణ గూడా, బర్కత్ పురా, బాగ్ లింగంపల్లి తదితర మురుగు మూసీ నాలాకు చేరకుండా అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళుతుంది. అక్కడ మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదిలే అవకాశం ఉంటుంది.

శరవేగంగా పనులు..

మూసీ ప్రక్షాళన నేపథ్యంలో ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జనవరి నాటికి 90 శాతం పనులు పూర్తి చేసి మార్చిలో ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో జరుగుతున్న టన్నెలింగ్ పనులు దాదాపు కింగ్ కోఠి వద్ద 200 మీటర్లు, కాచిగూడ వద్ద 200 మీటర్లు.. బషీర్ బాగ్ వద్ద 200 మీటర్లు టన్నెలింగ్ పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

లంగర్ హౌస్: బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో పాత్రికేయుడు మృతి చెందిన ఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మహబూబ్‌నగర్‌కు చెందిన రాములు గౌడ్ (48) హైదర్‌గూడా ఎర్రబోడులో నివాసం ఉంటూ ప్రజా టైమ్స్ పత్రికను నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం బైక్‌పై మాదాపూర్ వెళ్లిన ఆయన రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా ఇబ్రహీంబాద్‌లోని పెట్రోల్ పంపు సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ అతడి బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాములును స్థానికులు చికిత్స నిమిత్తం లంగర్ హౌస్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాములు గౌడ్ మృతి పట్ల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


రాములు గౌడ్(ఫైల్)

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం


సీఎం రేవంత్‌రెడ్డితో మాజీ ఎంపీ అంజన్‌ కుమార్‌యాదవ్, కిరణ్‌యాదవ్‌

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలో నిర్వహించనున్న సదర్‌ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి రావల్సిందిగా గురువారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ సీనియర్‌ కాంగ్రెస్‌ నేత కిరణ్‌యాదవ్‌లు ఆహ్వానాన్ని అందజేశారు. ప్రతియేటా వైభవంగా ఎల్లారెడ్డిగూడలో సదర్‌ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా సందడిగా సదర్‌ ఉత్సవాలను జరుపుతామన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎంను ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

సీవరేజీ సమస్యలను పరిష్కరించండి

కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డి


వాటర్‌వర్క్స్‌ అధికారుల సమావేశంలో మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరనగర్‌ కాలనీ: వాటర్‌వర్క్స్‌ విభాగం చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వెంకటేశ్వరనగర్‌ కాలనీ కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. వాటర్‌వర్క్స్‌ డీజీఎం ఇంద్రశీలతో పాటు సిబ్బందితో గురువారం ఆమె సమావేశమై డివిజన్‌ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌ పనులు, మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించారు. అలాగే డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలపై అధికారులతో చర్చించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

వ్యర్థాలను రోడ్లపై వేయొద్దు

ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌


వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌

వెంగళరావునగర్‌: వ్యర్థాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని మధురానగర్‌ పీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలియజేశారు. స్థానిక మధురానగర్‌ పోలీసుస్టేషన్‌ పరిధిలో ఉన్న మటన్, బీఫ్, చికెన్‌ షాపుల వ్యాపారులతో గురువారం పీఎస్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ వ్యాపారులు తమ షాపుల్లోని వ్యర్థాలను పక్కాగా ఒక సంచిలో ప్యాక్‌ చేసి జీహెచ్‌ఎంసీ వ్యర్థాలను తీసుకెళ్లే వాహనంలో అప్పగించాలని సూచించారు. అలాకాకుండా రోడ్లపై పడేస్తే స్థానికులతోపాటు రోడ్డుపై ప్రయాణాలు సాగించే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ సూచనలు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ పరిధిలోని వివిధ షాపుల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విండోస్‌ స్పేస్‌లో బ్రోంబల్‌ అత్యుత్తమ సేవలు

బ్రోంబాల్‌ సీఈఓ సునీల్‌


విలేకరుల సమావేశంలో సునీల్, మురళి తదితరులు

బంజారాహిల్స్‌: గ్లోబల్‌ ఇటాలియన్‌ ఫర్నిచర్‌ బ్రాండ్‌లను సరఫరా చేయడంలో పేరెన్నిక గన్న అల్టోసా గ్రూప్‌ భాగస్వామ్యంతో కలిసి విండోస్‌ స్పేస్‌ రంగంలో విశిష్ట సేవలు అందించేందుకు ముందుకు వచ్చినట్లు బ్రోంబాల్‌ సీఈఓ సునీల్‌ తెలిపారు. బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లో ఇండియా పార్టనర్‌ మురళీతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ ఉత్పత్తుల వివరాలను వెల్లడించారు. బ్రోంబల్‌ ప్రధాన కార్యాలయం మార్గదర్శకాలను అనుసరించి సైట్‌ నిర్వహణ, ఇన్‌స్టాలేషన్, విక్రయాలను జరపడం జరుగుతుందన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి సేవలు అందించనున్నట్లు చెప్పారు. బ్రోంబల్‌ విండోస్‌ స్టెయిన్‌ లెస్‌ స్టీల్, కోర్టెన్‌ స్టీల్, బ్రాస్‌ వంటి ప్రీమియం మెటీరియల్‌ను ఉపయోగించడం తమ ప్రత్యేకతగా చెప్పారు.

వీధిదీపాలకు మరమ్మతులు


వీధిదీపాలను మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ ఆదేశాల మేరకు గురువారం పలు ప్రాంతాల్లో వీధిదీపాల మరమ్మతులు చేపట్టారు. ఫిలింనగర్‌ ప్రాంతంలోని వినాయకనగర్, బాబు నాయుడునగర్‌ తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదంటూ కార్పొరేటర్‌ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన వీధిదీపాల సిబ్బంది పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. అలాగే అవసరమైన వాటికి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వెల్దండ వెంకటేష్‌ మాట్లాడుతూ సమస్య తన దృష్టికి రావడమే తరువాయి..పరిష్కారానికి వెనువెంటనే అధికారులను పురమాయించడం జరుగుతుందన్నారు.

ఘనంగా బోనాల సమర్పణ

గచ్చిబౌలి: నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. కొత్తగూడలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ముగిశాయి.

ఆహార భద్రత కార్డుదారులకు

మరో నాలుగేళ్లు భరోసా

2028 వరకు ఉచిత రేషన్‌ బియ్యం పంపిణీ

- ఖైరతాబాద్‌ సర్కిల్‌లో 3,03,035 మందికి లబ్ధి
- ఫోర్టిఫైడ్‌ బియ్యంతో బలవర్ధకమైన ఆహారం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



బంజారాహిల్స్‌: కరోనాతో కుదేలైన పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్‌ కళ్యాణ్‌ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ వస్తుంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం 2023 డిసెంబర్‌లో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉచిత బియ్యం పథకం గడువు ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుండడంతో మరోసారి కేంద్రం రేషన్‌ లబ్ధిదారుల పట్ల కరుణ చూపింది. ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబర్‌ వరకు ఆహార భద్రతా కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో లక్షలాది మంది లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేషనింగ్‌ ఖైరతాబాద్‌ సర్కిల్‌–7 పరిధిలో ఈ పథకం కింద మూడు లక్షల పైచిలుకు మంది లబ్ధి పొందనున్నారు. ప్రతి నెలా ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. సర్కిల్‌–7 పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్‌ తదితర డివిజన్లు వస్తాయి. ఈ డివిజన్ల పరిధిలోనే 81 రేషన్‌ షాపులు ఉన్నాయి.

- మొత్తం తెల్లరేషన్‌ కార్డులు 83,034 కాగా, వీటిలో 2,93,009 మంది లబ్ధిదారులు ఉన్నారు.
- అంత్యోదయ అన్న యోజన కార్డులు (ఏఏవై) 3482 ఉండగా, వీటి ద్వారా 10025 మంది లబ్ధి పొందుతున్నారు.
- అన్నపూర్ణ కార్డు ఒకటి ఉండగా ఈ కార్డు ద్వారా ఒకరు లబ్ధి పొందుతున్నారు.
- తెల్ల రేషన్‌కార్డులు, ఏఏవై, అన్నపూర్ణ కార్డులు మొత్తం కలిపి 86,517 ఉండగా, వీటి ద్వారా మొత్తం 303035 మంది లబ్ధి పొందుతున్నారు.
- ప్రతినెలా వీరందరికీ 18,20,789 కిలోల ఉచిత రేషన్‌ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్‌ బియ్యం..

ఆహార భద్రతా కార్డుదారులకు గత కొంతకాలంగా కేంద్రం ఫోర్టిఫైడ్‌ బియ్యం పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్‌ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్‌ బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఫోర్టిఫైడ్‌ బియ్యంలో ఐరన్, ఫోలిక్‌ యాసిడ్, విటమిన్‌ బీ12 పోషకాలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 2028 డిసెంబర్‌ వరకు రేషన్‌ కార్డుదారులకు ఉచిత బియ్యమే కాకుండా బలవర్ధకమైన ఫోర్టిఫైడ్‌ బియ్యం పంపిణీ చేస్తున్నందున లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో

20 వేల పుస్తకాలతో గ్రంథాలయం

- విద్యార్థుల విజ్ఞానానికి గ్రంథాలయాలు అవశ్యం : పాఠశాల డైరెక్టర్‌ వరలక్ష్మి



ఫిలింనగర్‌: విద్యార్థుల్లో పఠనాసక్తికి పెంపొందించే దిశగా జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లోని విశ్వం బ్లాక్‌లో నూతన గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయాన్ని 7,000 అడుగుల విస్తీర్ణంతో, 20,000 పుస్తకాలతో ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి డిజిటల్‌ గ్రంథాలయాన్ని కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలకు అనుబంధంగా వివిధ రకాలైన సంపాదకుల పుస్తకాలను, విద్యా సంబంధ వనరులను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌ వరలక్ష్మి, ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి తదితరులు హాజరై ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఆవశ్యకమని, ప్రతి విద్యార్థి ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న అన్ని రిఫరెన్స్‌ మెటీరియల్‌ను ఉపయోగించడం ద్వారా విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేసి రాబోయే బోర్డు పరీక్షల్లో అత్యున్నత ప్రతిభను సాధించాలన్నారు.


నారాయణగూడలో విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఏడేళ్లుగా రూ.8300 కోట్ల బకాయిలు

కాచిగూడ: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, హైదరాబాద్‌ జిల్లా కార్యదర్శి అశోక్‌ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ చౌరస్తా నుంచి వైఎంసీఏ మీదుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ బకాయిలు ఉన్నాయని అన్నారు. వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం, ప్రజా భవన్‌ను లక్షలాది మంది విద్యార్థులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు దామర కిరణ్, లెనిన్‌ గువేరా, స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్‌ శ్రీ, సహన, భగత్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ఫిలింనగర్‌లో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న నేతలు

ఫిలింనగర్‌: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌ విగ్రహాల చౌరస్తాలో నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి బోయ డివిజన్‌ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు బన్నప్ప, సాయిలు, రాము, విష్ణు, రాములు పాల్గొన్నారు.

లిబర్టీలో...


వాల్మీకికి నివాళులర్పిస్తున జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తి తదితరులు

లిబర్టీ: వాల్మీకి సేవా సమాజ సంఘం, మున్సిపల్‌ లేబర్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతి వేడుకల్లో బల్దియా కమిషనర్‌ ఇలంబర్తి, వాల్మీకి సేవా సమాజ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్‌ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి రామాయణం రాసి చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. మానవాళిలో నేటికీ రామాయణ గాథ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని పేర్కొన్నారు. శ్రీరాముడి గాథను మానవాళికి అందించిన ఆదికవి వాల్మీకి అని కొనియాడారు. రామాయణంలోని అనేక ఘట్టాలు నేటికి సమాజంలో అనుసరిస్తున్నారని వారు తెలిపారు.

ఎంఎంటీఎస్‌లో మహిళ మృతదేహం లభ్యం

కాచిగూడ: ఎంఎంటీఎస్‌ రైల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి–ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్‌ రైల్లో ఓ గుర్తుతెలియని మహిళ (35) మృతదేహాన్ని గుర్తించి ఫలక్‌నుమా రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ ఫారం–3 వద్ద దింపారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి షాపులోనూ సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలి

- జూబ్లీహిల్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వరరెడ్డి


షాపుల నిర్వాహకులతో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్‌ సీఐ వెంకటేశ్వరరెడ్డి

బంజారాహిల్స్‌: ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా తేలికగా నిర్ధారణ చేసుకోవచ్చునని అందుకు ప్రతి వ్యాపారి తమ షాపులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జూబ్లీహిల్స్‌ సీఐ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఇటీవల నగరంలో ఉద్రిక్తతలకు కారణమైన వరుస సంఘటనల నేపథ్యంలో వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు చికెన్, మటన్‌ వ్యాపారులతో గురువారం జూబ్లీహిల్స్‌ పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి షాపులోనూ బయట రెండు, లోపల రెండు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏదైనా ఘటన జరిగినప్పుడు తేలికగా ఆ దృశ్యాలను నిర్ధారణ చేసుకోవచ్చన్నారు. మాంసం వ్యర్థాలను రోడ్లపై, చెత్త కుప్పల్లో వేయకుండా కవర్లలో ప్యాక్‌ చేసి డంపింగ్‌యార్డుకు పంపించే విధంగా చొరవ చూపాలన్నారు. స్వచ్ఛ ఆటోలు తమ వద్దకు వస్తాయని, వారికి ఇవ్వాలన్నారు. మాంసం వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడవేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డీఐ మధుసూదన్, ఎస్‌ఐలు హరీశ్వర్‌రెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు


మొబైల్‌ ఫోన్‌ స్నాచర్లను చూపిస్తున్న జూబ్లీహిల్స్‌ పోలీసులు

బంజారాహిల్స్‌: మొబైల్‌ ఫోన్లను దొంగలిస్తున్న ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్‌ పెద్దమ్మతల్లి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చారు. భక్తులను టార్గెట్‌ చేస్తూ దొంగల ముఠాలు దొంగతనాలు చేశాయి. పోలీసులు రెండు రోజుల పాటు పక్కా ప్రణాళికలు వేసుకుని ఫతేనగర్‌కు చెందిన కొమిరె మొరలిన్‌ అలియాస్‌ నెర్రి (19), ఆర్‌.వెంకటేష్‌ (30)లను అరెస్టు చేసి వీరి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో కూడా పలు దొంగతనాలకు పాల్పడినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. మొబైల్‌ ఫోన్లను స్నాచింగ్‌ చేస్తున్న రేణుక అనే దొంగ పరారీలో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు వెంకటేష్‌ దొంగతనం చేసి తీసుకువచ్చిన సెల్‌ఫోన్లను విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సైకిల్‌ ర్యాలీ

- ప్రజా సంబరాలు విజయవంతం చేయాలని జోనల్‌ కమిషనర్‌ పిలుపు


సైకిల్‌ ర్యాలీలో జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి

బంజారాహిల్స్‌: కేబీఆర్‌ పార్కు చుట్టూ ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించే ప్రజా సంబరాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం పార్కు వద్ద నిర్వహించిన సైకిల్‌ ర్యాలీని ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబీఆర్‌ పార్కు చుట్టూ ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాల్లో ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, వాకర్లు, సందర్శకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేచరల్, కల్చర్‌ అండ్‌ ఫ్యామిలీ థీమ్‌తో ఈ కార్యక్రమాలను రూపకల్పన చేసినట్లు తెలిపారు. కేబీఆర్‌ పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో హాబీస్‌ కార్నర్, లైవ్‌ మ్యూజిక్, ఫొటో బూత్, గేమ్స్‌ అండ్‌ ఎంటర్‌టైనమెంట్‌ జోన్, షాపింగ్‌ స్టాల్స్, ఆర్ట్స్‌ కార్నర్‌ వేదికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సైకిల్‌ ర్యాలీలో సర్కిల్‌–18 డీఎంసి ప్రశాంతి, ఏఎంహెచ్‌వో డాక్టర్‌ భార్గవ్‌ నారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌ అండ్‌ ఆన్‌లైన్‌ ఎడ్యుకేషన్‌లో బీఈడీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2024–25 విద్యా సంవత్సరానికి బీఈడీ(ఓడీఎల్‌) కోర్సులో చేరేందుకు సర్వీస్‌ టీచర్లలో డీఈఐ, ఈడీ పాస్‌ అయినవారు ప్రవేశాలకు అర్హులు. ఆన్‌లైన్‌ దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్‌ 30గా నిర్ణయించారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్‌ దరఖాస్తు ఫారమ్‌ అడ్మిషన్‌ పోర్టల్‌లో అందుబాటులో ఉంది. దరఖాస్తు ఫారమ్‌ను రిజిస్ట్రేషన్‌ ఫీజుతో ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ప్రవేశ పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు స్టూడెంట్‌ సపోర్ట్‌ యూనిట్‌(ఎస్‌ఎస్‌యూ) హెల్ప్‌లైన్‌ నంబర్‌ 040–23008463 లేదా 040–23120600 (ఎక్స్‌టెన్షన్‌–2207, 2208) ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సంప్రదించవచ్చు.

ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్‌ వేయడం హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ పిడమర్తి రవి, గజ్జెల కాంతం

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేసి, క్షేత్రస్థాయిలో మాదిగ జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయడం కోసం 60 రోజుల గడువుతో ఏకసభ్య కమిషన్‌ వేయడం హర్షించదగ్గ విషయమని ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ డాక్టర్‌ పిడమర్తి రవి అన్నారు. గురువారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మాదిగ సంఘాలు 60 రోజుల పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా ఉండాలని, మందకృష్ణ మాదిగ 60 రోజులు ఉద్యమాన్ని ఆపాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల పక్షపాతి అని, మాదిగల సంపూర్ణ మద్దతు ముఖ్యమంత్రికి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మాదిగ సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా ఉండాలని, 60 రోజుల్లో వర్గీకరణ పూర్తవుతుందని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వర్గీకరణపై ఒక అడుగు ముందుకు వేయలేదని, వర్గీకరణ గురించి ప్రస్తావించనే లేదని ఆయన అన్నారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ గురించి సీఎంతో చర్చించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఇప్పటి వరకు మందకృష్ణ మాదిగ కలువలేదన్నారు. త్వరలో మాదిగలకు జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ ఫలాలు అందుతాయని అది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. అక్టోబర్‌ 22వ తేదీ నుంచి తెలంగాణలోని 60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాదిగ సమ్మేళనాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ సమ్మేళనాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్‌ గజ్జల కాంత, గోర రా జయ్య, ఒక్కలగడ్డ చంద్రశేఖర్, బోరెల్లి సురేష్, చిరుమర్తి రాజు, నక్క మహేష్, జోగు గణేష్, శ్రవణ్‌ కుమార్, సంజీవ పాల్గొన్నారు.

కాచిగూడ ఆర్టీసీ డిపోకు మూడో స్థానం

కాచిగూడ: దసరా స్పెషల్‌ ఆపరేషన్స్‌లో భాగంగా రిటర్న్‌ ట్రాఫిక్‌లో కాచిగూడ డిపో 97.33 ఈపీకే సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. యాజమాన్యం నిర్దేశించిన ఫెయిర్‌ పెయిడ్‌ అర్నింగ్స్‌ టార్గెట్‌ రూ.12.22 లక్షలు అధిగమించి రూ.13.44 లక్షలు సాధించినట్లు డీఎం రఘు తెలిపారు. మొత్తం రూ.29 లక్షలు సాధించామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో కాచిగూడ డిపో నిలిచిన సందర్భంగా ఉద్యోగులతో కలిసి అధికారులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ (ఎం) జగన్‌ పాల్గొని ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ కె.శ్రీనివాసులు, అసిస్టెంట్‌ ఇంజినీర్‌ వాసవీ పాల్గొన్నారు.


కాచిగూడ డిపోలో ఉద్యోగులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్న అధికారులు

సాక్షి శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024

నగరంలో నేడు

1. హెల్త్‌కేర్ బిజినెస్ ఉమెన్స్ అసోసియేషన్(హెచ్‌బీఏ) ఆధ్వర్యంలో మాదాపూర్ దుర్గంచెరువు రోడ్‌లోని సత్వ నాలెడ్జ్ సిటీలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు షీఈఓ ఉమెన్ లీడర్‌షిప్ సమ్మిట్ జరుగుతుంది.

2. అసోసియేషన్ ఆఫ్ ఓటోలారింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ ఆధ్వర్యంలో శామీర్‌పేట్‌లోని అలంకృత రిసార్ట్ అండ్ కన్వెన్షన్‌లో సాయంత్రం 5.45 గంటలకు రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుంది. ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు.

3. ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రెటరీస్ ప్రాంతీయ సదస్సుపై సమావేశం ఉదయం 10.45 గంటలకు పంజాగుట్టలోని అగర్వాల్ ఐ హాస్పిటల్ సమీపంలోని సెస్ ప్రాంగణంలో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఓయూ వీసీ పదవి మాదిగలకు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ పదవికి మాదిగ అధ్యాపకులను ఎంపిక చేయాలని బహుజన విద్యార్థి సంఘాల నేతలు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు. సెర్చ్ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన అధ్యాపకుడిని కాకుండా నిజాయితీ గల మాదిగ ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో వివిధ పదవుల్లో కొనసాగిన ఆయన అనేక అక్రమాలకు పాల్పడినట్లు బహుజన విద్యార్థి సంఘం నాయకులు వేల్పుల సంజయ్ పేర్కొన్నారు.

సొంత భాషలో వ్యవసాయ సమాచారం

– మేనేజ్, భాషిణి అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల అధికారులు

ఏజీవర్సిటీ: వ్యవసాయంలో భాష అడ్డంకులను తొలగించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), భాషిణి సంస్థ గురువారం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యోగితారాణా మాట్లాడుతూ.. భారతీయ భాషల్లో శిక్షణ, జ్ఞాన వనరులను అందించడం ద్వారా వ్యవసాయ విద్య, విస్తరణలో భాష అవరోధాలను తగ్గించడానికి మేనేజ్ ప్రయత్నిస్తుందని తెలిపారు. భాషిణి సహాయంతో టెక్స్ట్ స్పీచ్ అనర్గమైన భారతీయ భాషల్లోకి త్వరగా అనువదించడం ద్వారా ఈ సవాల్‌ను అధిగమించడంలో సహాయ పడుతుందన్నారు. రైతుల నుంచి విస్తరణ అధికారుల వరకు సొంత భాషలో సమాచారం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అమితాబ్‌నాగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డిజిటల్ ఇండియా భాషా విభాగం డాక్టర్ శరవణ్ రాజ్, డైరెక్టర్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ అత్తలూరి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల వితరణ



పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న సంస్థ సభ్యులు

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ బాలికలకు పాదుపుగా వాడిన 25 హైఅండ్ ల్యాప్‌టాప్‌లను క్లారనెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందజేసింది. వాటి విలువ సుమారు రూ.32 లక్షలు అని సంస్థ సభ్యులు తెలిపారు. పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (పీయూఆర్‌ఈ) అనే స్వచ్ఛంద సంస్థకు ల్యాప్‌టాప్‌లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా క్లారనెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా హెచ్‌ఆర్ హెడ్ సృజనిచౌదరి మాట్లాడుతూ.. తమ సంస్థ సీఎస్ఆర్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ముఖ్యంగా విద్యా, షెల్టర్ హోమ్స్, స్థానికంగా జీవనోపాధి, యువత నాయకత్వంపై దృష్టి సారిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లారనెట్ ఇండియా ఐటీ అండ్ సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ఇన్‌చార్జి అక్షయ్, సంస్థ ఇండియా ఫైనాన్స్ హెడ్ సయ్యద్ వాసే, ప్యూర్ సంస్థ నుంచి అరుణ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయం రాష్ట్రానికి గర్వకారణం

– స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం తెలంగాణకే గర్వకారణమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలి అకాడమి ఆధ్వర్యంలో ది ప్రైడ్ ఆఫ్ రామప్ప దేవాలయం పేరిట గురువారం నిర్వహించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా మన ప్రాచీన చరిత్ర ఆనవాళ్లు, ప్రసిద్ధ దేవాలయాలు, పురావస్తు కట్టడాలు మన సంస్కృతిని నేటి తరానికి తెలియజేసేలా కనిపిస్తాయన్నారు. రామప్ప దేవాలయం శిల్పాలు ఎంతో రమణీయంగా ఉంటాయని కొనియాడారు. రామప్ప చరిత్రను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భారత రంగస్థలికి సాంస్కృతిక శాఖ తరఫున సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామప్ప గీతం, పేరిణి,కూచిపూడినృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ సత్యనారాయణ, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రంగస్థలి అధ్యక్షుడు డాక్టర్ సంగభట్ల నర్సయ్య, కూచిపూడి నృత్య గురువు విజయలక్ష్మీ పాల్గొన్నారు.



మొదటి ప్రయత్నంలోనే..

మొదటి ప్రయత్నంలోనే టీచర్ ఉద్యోగం రావడం చాలా హ్యాపీగా ఉంది. కుటుంబ సభ్యుల సహకారంతోనే డీఎస్సీ కోసం బాగా ప్రిపేరయ్యాను. చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తా. సర్వీస్ అంతా గుర్తుండేలా పనిచేస్తా. – వి.విజయ, టీచర్, ప్రైమరీ స్కూల్, సురభికాలనీ, శేరిలింగంపల్లి.



రెండున్నరేళ్లు కష్టపడ్డా..

ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రెండున్నర ఏళ్లుగా ప్రణాళిక ప్రకారం సొంతంగా ప్రిపేర్ కావడంతో సాధించగలిగాను. మొదటి ప్రయత్నం విఫలమైంది. రెండో ప్రయత్నంలో ఫ్యామిలీ సపోర్టుతోనే ఉద్యోగం సాధించగలిగాను. – ఎ.పాండురంగారెడ్డి, టీచర్, ప్రైమరీ స్కూల్, సురభికాలనీ, శేరిలింగంపల్లి.



15 ఏళ్లుగా ప్రైవేటు స్కూల్లో..

ఓ ప్రైవేటు స్కూల్లో 15 ఏళ్లు హిందీ టీచర్‌గా పనిచేశా. మొదటి నుంచీ ఉపాధ్యాయ వృత్తిని ప్రాణంగా భావిస్తూ డీఎస్సీకి సిద్ధమయ్యా. 2012లో ప్రయత్నం విఫలమైంది. అయినా నిరుత్సాహపడకుండా ఈసారి సిద్ధమయ్యా. ప్రిపరేషన్‌లో భర్త, చెల్లి సహకారం దోహదపడింది. లాంగ్వేజ్ పండిట్లో మొదటి స్థానం సాధించాను. – శిరీష, హిందీ పండిత్, జెడ్పీహెచ్ఎస్ గణేష్‌నగర్

కొత్త సార్లొచ్చారు!



ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెబుతున్న కొత్త టీచర్

- గ్రేటర్ పరిధిలో వెయ్యి మంది టీచర్లు
- కొత్త ఉత్సాహంతో స్కూళ్లలోకి..
- ప్రభుత్వ పాఠశాలల్లో తీరిన టీచర్ల కొరత
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలకు కొత్త సార్లు వచ్చారు. డీఎస్సీ–2024 ద్వారా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సుమారు వెయ్యి మంది కొత్త టీచర్లుగా ఎంపికయ్యారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత తీరినట్లయ్యింది. హైదరాబాద్ జిల్లాలో 584 మంది, రంగారెడ్డి జిల్లాలో 334, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 82 మంది తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కొత్తగా టీచర్లు వచ్చారని తెలిసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త టీచర్లను కదిలిస్తే వారు ఉద్యోగం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ తమ ప్రయత్నాలను వివరించారు.

యూట్యూబ్‌ను అనుసరించా..



యూట్యూబ్‌లో ట్రైనర్స్ చెప్పే అంశాలు రాసుకుని సొంతంగా ఇంటి వద్దే ప్రాక్టీస్ చేశా.. కోచింగ్ తీసుకోలేదు. 2013లో మొదటిసారి ప్రయత్నించి సాధించలేకపోయా.. 2024లో రెండోసారి రాయడంతో సాధ్యమైంది. ఓపెన్ కేటగిరీలో ఈ ఉద్యోగం కొట్టాను. చాలా ఆనందంగా ఉంది. గోల్ అంటూ ఏమీ లేదు. సాధించిన ఉద్యోగం నిబద్ధతతో పని చేసి మంచి పేరు తెచ్చుకుంటే చాలు. – శ్రీధర్, మ్యాథ్స్ టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మూసారంబాగ్

ఇంటివద్దే ప్రిపేరయ్యా..



ప్రభుత్వం డీఎస్సీకి ఇచ్చిన సిలబస్ ప్రకారం ఇంటి వద్దనే ప్రిపేర్ అయ్యాను. మొదటిసారి పరీక్ష రాశాను.. ఉద్యోగం వచ్చింది. నాన్న ప్రోత్సాహంతో సాధించగలిగాను. ఉద్యోగం లభించినందుకు చాలా సంతోషంగా ఉంది. – వి.నవ్య, స్కూల్ అసిస్టెంట్, మౌలాలి

అమ్మ కల నెరవేరింది..



14 ఏళ్లు ప్రైవేటు పాఠశాలలో పని చేశా. రెండో ప్రయత్నంలో ఉద్యోగం వచ్చింది. గతంలో కొద్దిలో తప్పిపోయింది. నేను సర్కారు టీచర్ కావాలని మా అమ్మ కోరిక.. ఇప్పుడు అమ్మ ఎంతో సంతోషంగా ఉంది. నా కోరిక, అమ్మ కల నెరవేరింది. – నసీమా బేగం, ప్రభుత్వ పాఠశాల, మౌలాలి

రేపు రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం



పాతబస్తీ నాయకులతో సమావేశంలో జి.నిరంజన్

చార్మినార్: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవాన్ని శనివారం చార్మినార్ వద్ద నిర్వహించడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ఈ మేరకు పాతబస్తీకి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చార్మినార్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ స్మారక స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సభ కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ మంత్రి జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు వి.హనుమంత్‌రావు పాల్గొంటారన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ సైబర్ సెక్యూరిటీ, విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పవర్ గ్రిడ్, సదరన్ రీజియన్–1 సికింద్రాబాద్ ప్రాంతీయ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ టెక్నికల్ అనాలసిస్ట్ పాల్గొని సైబర్ నేరగాళ్ల నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. కార్యక్రమంలో సదరన్ రీజియన్–1 చీఫ్ జనరల్ మేనేజర్ అఖిలేష్ పాఠక్, సీజీఎం ఎస్ఎంవీ నానాజీ వెంకట ఎస్వీ, పీసీఎస్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే ఎల్వీ ప్రసాద్ సేవలు

- ఎల్‌వీపీ ఎట్ హోం పేరుతో అమల్లోకి..
- స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు భాగస్వామ్యం



సాక్షి, సిటీబ్యూరో: ఇంటివద్దకే సమగ్ర నేత్ర సంరక్షణను నేరుగా అందించాలనే ఉద్దేశంతో ఎల్‌వీపీ @ హోమ్ కార్యక్రమాన్ని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రారంభించింది. ఈ విషయాన్ని గురువారం ఆస్పత్రిలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. వయోవృద్ధులు, కదల్లేని స్థితిలో ఉన్న వారికోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు భాగస్వామ్యమైంది. నాణ్యమైన కంటి చికిత్స అందించాలనే ఉద్దేశంతో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు చేపట్టిన 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' ప్రోగ్రామ్‌లో భాగంగా ఎల్‌వీపీ @ హోం కార్యక్రమంలో పాల్పంచుకుంటోంది. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలతో పాటు గ్రామాల్లోని ప్రజలకు కూడా ఈ సేవలు అందిస్తున్నామని వివరించారు. ఫోన్ కాల్ ద్వారా ఈ సేవలు పొందొచ్చని, శిక్షణ పొందిన టెక్నీషియన్ నేరుగా ఇంటికి వచ్చి సమగ్ర కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల 25 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలోని సిరిసిల్ల, ఏపీలోని మదనపల్లి, ఒడిశాలోని బెర్హంపూర్ ప్రాంతాల్లో కూడా ఈ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి నేరుగా డాక్టర్లతో వీడియో కన్సల్టేషన్ ఉంటుందని, ఏవైనా పెద్ద సమస్యలు ఉంటే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవచ్చని చెప్పారు. వయోవృద్ధులు, వృద్ధాశ్రమాల్లో ఉన్న వారికి మెరుగైన చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని వివరించారు. కార్యక్రమంలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు సస్టెనబిలిటీ హెడ్ కరుణ భాటియా, ఆస్పత్రి నెట్‌వర్క్ డైరెక్టర్ సూర్యస్నాత రథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపా' చట్టాలతో దుర్మార్గమైన హింసాకాండ



ఇందిరాపార్కు వద్ద దీక్షలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి

కవాడిగూడ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. 'ఉపా' చట్టంతో దుర్మార్గమైన హింసాకాండను అమలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామిక వాదులంతా ఏకతాటిపై వచ్చి జాతీయ స్థాయిలో ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపా చట్టానికి మోదీ ప్రభుత్వం మరింత విషపు కోరలు పెంచిందని విమర్శించారు. 90శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను అక్రమ కేసులు పెట్టి 10 ఏళ్లు జైల్లో పెట్టిందన్నారు. పౌరస్మృతి చట్టాలను తెచ్చి ప్రశ్నించే గొంతులను ఉపా చట్టంతో మోదీ ప్రభుత్వం అణిచివేసిందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో ఉపా వంటి చీకటి చట్టాలకు చోటులేదన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉపా చట్టానికి టైం ఫ్రేం లేదని, ట్రయల్ ఉండదు, బెయిల్ లేని దుర్మార్గమైన చట్టమని ఆయన విమర్శించారు. ఉపా చట్టంలో అరెస్టయిన వారిలో కేవలం 3శాతమే నేరాలు నిరూపించారని 97శాతం నేరారోపణలు రుజువు కాలేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నర్సింహ, వీఎస్ బోస్, బొమ్మగాని ప్రభాకర్ సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కె.యాదగిరి, బి.స్టాలిన్, సీనియర్ నాయకులు ఎం.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పోరాటయోధుడు కొమురం భీం

కవాడిగూడ: జల్ జమీన్ జంగిల్ హక్కుల సాధన కోసం కొమురం భీం అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బ్రిటీష్, నిజాం పాలకులతో పోరాటం చేసిన మహనీయుడు కొమురం భీం అన్నారు. కొమురం భీం 84వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఆదివాసి గిరిజనవాసులకు జల్ జమీన్ జంగిల్‌పై హక్కుల సాధన కోసం పోరాటం చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం డాక్టర్ హెచ్‌కె నాగు, వివేక్ వినాయక్ మాట్లాడుతూ.. ఆదివాసీ బంధు అమలు చేయాలని, కొమురం భీంకు భారతరత్న ఇచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్టీ కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, తెలుగు సినీ దర్శక నిర్మాత అల్లాని శ్రీధర్, గిరిజన ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ హెచ్‌కె నాగు, వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ వినాయక్, అధ్యక్షుడు సిందం అర్జున్, ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్ పాల్గొన్నారు.



డీఏ ఫార్ములా సాధనలో ఎన్‌ఎఫ్‌ఐఆర్ కీలకపాత్ర



అడ్డగుట్ట: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ఫార్ములా సాధించడంలో ఎన్‌ఎఫ్‌ఐఆర్ కీలకపాత్ర పోషించిందని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఎన్‌ఎఫ్‌ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. భారతీయ రైల్వేలోని ట్రేడ్ యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు రైల్ నిలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైల్ నిలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే కార్మికుల న్యాయపరమైన హక్కుల సాధన కోసం ఎన్‌ఎఫ్‌ఐఆర్, ఎంప్లాయీస్ సంఘ్ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని వెల్లడించారు. అన్ని వర్గాల రైల్వే ఉద్యోగుల శ్రేయస్సు కోసం పని చేస్తున్న ఏకైక సంస్థ ఎంప్లాయీస్ సంఘ్‌కు ఎన్నికల్లో తమ మద్దతు తెలపాలని ఉద్యోగులను కోరారు. సమావేశంలో ఎంప్లాయీస్ సంఘ్ జోనల్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆంద్రూ, నాయకులు సంతోష్‌కుమార్, రాజగోపాల్, భరణి భాను, రుద్రారెడ్డి, షేక్ రవూఫ్, నాగేంద్రబాబు, నారాయణరావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ తాపడానికి రూ.10 లక్షల విరాళం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ విమాన గోపురం స్వర్ణ తాపడానికి నగరంలోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10 లక్షల విరాళం అందజేశారు. యాదాద్రీశుడిని గురువారం దర్శించుకున్న ఆయన, అనంతరం ఈవో భాస్కర్‌రావును కలిసి రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్

కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి



డాక్టర్ గురువారెడ్డి

సనత్‌నగర్: ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 1.3 మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థోపెడిక్ ట్రామా, ఫ్రాక్చర్స్, మస్క్యులోస్కెలటల్ గాయాలకు ప్రత్యేక చికిత్సల కోసం సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ అత్యాధునిక ట్రామా కేర్ సేవలను అందిస్తోందన్నారు. వరల్డ్ ట్రామా డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ గురువారెడ్డి మాట్లాడారు. ట్రాఫిక్ చట్టాల అమలు, మౌలిక సదుపాయాలు, వాహన భద్రతా చర్యలు, రహదారి భద్రతా కార్యక్రమాలపై దృష్టి సాధించడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలైన వారికి నిపుణులైన ఆర్థోపెడిక్ సర్జన్ల సేవలు ఎంతో అవసరమన్నారు. సర్వేజన ఫౌండేషన్, ఎస్‌టీఓపీ(సొసైటీ టు ప్రివెంట్ యాక్సిడెంట్స్) చేపడుతున్న కార్యక్రమాల ద్వారా దశాబ్దకాలంలో దేశంలో రోడ్డు ప్రమాదాలను 5 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ట్రామాకేర్‌లో అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. దేశంలో అతిపెద్ద ఆర్థోపెడిక్ గ్రూప్ ప్రాక్టీస్‌లో భాగంగా 30 మందికి పైగా అన్ని విభాగాల్లో నిపుణులైన ఆర్థోపెడిక్ సర్జన్లు ఉన్నారన్నారు.

పర్యాటకులను ఆకర్షించే మొదటి వ్యక్తులు డ్రైవర్లే..



ఆర్‌జీఐఏలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అతిథి దేవోభవ శిక్షణ

శంషాబాద్: మన ప్రాంతానికి వచ్చే పర్యాటకులు, ప్రయాణికులను ఆకర్షించే మొదటి వ్యక్తులుగా డ్రైవర్లు ఉండాలని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ అన్నారు. నగరంలోని వెయ్యి క్యాబ్, ఆటో డ్రైవర్లకు అతిథి దేవోభవ పేరిట మూడు రోజుల ఇంటెన్సివ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం ప్రారంభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యాటకులు కలిసే తొలి వ్యక్తులుగా ఉండే డ్రైవర్లు వారితో వ్యవహరించే తీరు ఈ ప్రాంతం గురించి వివరించే తీరుతోనే మన పర్యాటకం కూడా వృద్ధి చెందుతుందన్నారు. టీహెచ్ఎంబీసీ చైర్మన్ రాఖీ కంకారియా మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటకాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షితమైన ప్రయాణ అనుభవంతో పాటు మన సాంస్కృతిక విలువలను వివరించడంతో పాటు రక్షణగా ఉండే బాధ్యత డ్రైవర్లకు సూచించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇది వలంటీర్ కమిటీనా.. కార్యకర్తల కమిటీనా?



- ఇందిరమ్మ కమిటీలపై పునరాలోచన చేయండి
- ఎంపీటీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గౌడ్

లక్డీకాపూల్: లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు వలంటీర్ కమిటీనా.. కార్యకర్తల కమిటీనా..? అన్న సందేహం వ్యక్తమవుతోందని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ అన్నారు. ప్రజాపాలనలో వలంటీర్ వ్యవస్థ పటిష్టంగా పనిచేసేలా ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీలు కార్యకర్తల కమిటీలా ఉందని అన్నారు. ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ప్రాధాన్యం ఇచ్చి కమిటీలో ప్రత్యేక అధికారి కాకుండా తమను నియమించాలన్నారు. స్థానిక సంస్థల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆమోదయోగ్యంగా ఇందిరమ్మ కమిటీలు ఉండాలే కానీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలను అవమానపరిచేలా ఉండకూడదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరైన పద్ధతి కాదన్నారు. ఎంపీటీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టి.శివ, మోహన్‌రెడ్డి, ఏ.అశోక్ కుమార్, మన్నె రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అమ్మాయి అంటేనే భారంగా భావించే తండా.. బడికి వెళ్లాలన్నా తప్పుగా భావించే సమాజం ఒకవైపు.. చదువుకుంటేనే జీవితాలు బాగుపడతాయని భావించే కుటుంబం మరోవైపు.. చివరకు ఆ కుటుంబమే గెలిచింది.. సమాజం ముందు తలెత్తుకుని సగర్వంగా నిల్చుంది. ఇదీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ విజయగాథ. ఎక్కడో మారుమూల తండాలో పుట్టి.. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. చదువుతోనే గౌరవం వస్తుందన్న తండ్రి మాటలను తుచ తప్పకుండా పాటించారు. అడుగడుగునా ఆయన మాటలను గుర్తు చేసుకుని ముందుకు సాగారు. ఇప్పుడు ఏకంగా తెలంగాణలోని మహిళా యూనివర్సిటీకి ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొ.సూర్య ధనంజయ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొ.విజ్జులత ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

– సాక్షి, సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్

స్ఫూర్తి

ఐలమ్మ వర్సిటీ.. సూర్యోదయం!



మారుమూల తండా నుంచి మహిళా వర్సిటీ వీసీ వరకూ

ఎంతో మందికి ఆదర్శం ప్రొ.సూర్య విజయప్రస్థానం



ప్రొఫెసర్ ధనావత్ సూర్యా ధనుంజయ్ నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, భల్లునాయక్ తండాలో జన్మించారు. మొత్తం 10 మంది తోబుట్టువులు. తల్లిదండ్రులు భల్లు నాయక్, తండ్రి ద్వాళీబాయి. చదువు ప్రాధాన్యాన్ని ఆ కాలంలోనే గుర్తించి.. తండావాసులు అందరూ చదువుకోవాలనే ఆశయంతో ఓ ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయించారు. అయితే సూర్య చిన్నతనంలోనే ఆయన కన్నుమూయడంతో తల్లిపైనే కుటుంబ భారం పడింది. అయినా కూడా అందరినీ చదివించాలనే తండ్రి ఆశయాన్ని ఆ తల్లి మనోధైర్యంతో ముందుకు తీసుకెళ్లారు. తన బిడ్డలందరినీ చదివించారు. ఆమె సంకల్పం, భర్త ధనుంజయ్ ప్రోత్సాహంతో, తమ పిల్లల ప్రోత్సాహం, త్యాగంతోనే తాను ఇంతస్థాయికి చేరుకోగలిగానని ప్రొఫెసర్ సూర్య చెబుతున్నారు.

ఓపెన్ యూనివర్సిటీ చదువు..

భల్లు నాయక్ మరణంతో ఆ ఊర్లోని పాఠశాల కూడా మూతపడింది. పై చదువుల కోసం మిర్యాలగూడకు వెళ్లాలంటే కనీసం బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో మిర్యాలగూడలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేరి రోజూ తండా నుంచి మిర్యాలగూడకు నడిచి వెళ్లేవారు. ఆ తర్వాత ఎస్సీ బాలికల హాస్టల్‌లో సీటు రావడంతో అక్కడే పదోతరగతి పూర్తి చేశారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడే ధనంజయ్‌తో పెళ్లి జరిగింది. పెళ్లయి తర్వాత ఇంటర్ పూర్తి చేశారు. పిల్లలు పుట్టడంతో చదువు మధ్యలో ఆగిపోయింది. కానీ భర్త ప్రోత్సాహంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యలో బీఏ పూర్తిచేసి, ఆంధ్ర మహిళా సభలో బీఈడీ, అప్పటి కోటి ఉమెన్స్ కాలేజీలో ఎంఏ తెలుగు, బీఎల్ఐఎస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఎంఫిల్, డాక్టరేట్ పట్టా పొందారు. ఆ తర్వాత ఓయూ తెలుగు శాఖలో ప్రొఫెసర్ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఓయూలో తెలుగుశాఖ సీనియర్ ప్రొఫెసర్‌గా, సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గా సేవలందించారు.







తలసాని ట్రస్టు సహకారం..

ఇంటర్నేషనల్ కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు తలసాని ట్రస్టు ద్వారా తలసాని సాయికిరణ్‌యాదవ్ అందించిన రూ.2 లక్షల ఆర్థిక సహాయం మరువలేనిది. ప్రోత్సాహాన్ని అందిస్తే అంతర్జాతీయ వేదికలపై మరింత రాణిస్తా. గతంలో ఆర్థిక ఇబ్బందులతో అంతర్జాతీయ పోటీలకు అవకాశం వచ్చినా పాల్గొనలేకపోయాను. అలాంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది. –మహేష్ వైష్ణవి, పవర్‌లిఫ్టర్

ఆమె 'పవర్'కు ప్రత్యర్థి గుండెల్లో దడ పుట్టాల్సిందే. ఆమె బరిలోకి దిగిందంటే పతకం పక్కా కొట్టాల్సిందే. వెన్నుతట్టి ప్రోత్సహించే వారు అంతగా లేకపోయినా స్వతహాగా అంతర్జాతీయ వేదికపై తన 'పవర్' చూపిస్తూ తెలుగు గడ్డ వనితాశక్తిని నలుదిశలా చాటిచెబుతోంది. తనకు ఎంతో ఇష్టమైన క్రీడలో విజయాల పరంపరను కొనసాగిస్తూ ఎందరో మన్ననలు పొందుతోంది.

– సనత్‌నగర్



వైష్ణవి.. ది పవర్ లిఫ్టర్

పోటీకి దిగితే.. ప్రత్యర్థికి సవాలే..

పవర్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న మహేష్ వైష్ణవి

సౌతాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్‌లో గోల్డ్‌మెడల్..

సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌కు చెందిన బైక్ మెకానిక్ కుమార్తె మహేష్ వైష్ణవి పవర్‌లిఫ్టర్‌గా అప్రతిహతంగా దూసుకుపోతూ భారత కీర్తి కెరటంగా నిలుస్తోంది. తాజాగా సౌతాఫ్రికాలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టింగ్‌లో 30 దేశాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్న చాంపియన్‌షిప్‌లో 84 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి మరోసారి తన 'పవర్'ను చూపించింది.

'పవర్' ప్రయాణం ఇలా..

నాన్న రాంమహేష్‌ది బైక్ మెకానిక్ వర్క్‌షాప్. తల్లి గృహిణి. సోదరుడు విద్యార్థి. బైక్ మెకానిక్ వర్క్‌షాప్ ద్వారా వచ్చే ఆదాయం పిల్లల చదువులు, కుటుంబాన్ని పోషించుకోడానికే సరిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తిని పెంచుకుంది వైష్ణవి. తన పట్టుదలతో ముందడుగు వేసింది. పట్టుమని రెండు పదుల వయస్సు కూడా నిండని ఆమె 2019లో ఉత్తర ప్రదేశ్ గజల్‌పూర్‌లో జరిగిన పవర్‌లిఫ్టింగ్ సబ్‌జూనియర్ నేషనల్స్‌లో మొట్టమొదటిసారిగా పాల్గొని ఎనిమిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆనాడు మొదలై.. పవర్‌లిఫ్టింగ్ జర్నీలో వెనుకడుగు వేయలేదు.



- ఆ తర్వాత 2021లో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్స్‌లో ఓవరాల్ బ్రాంజ్ మెడల్ సాధించింది.
- అదే ఏడాది కేరళలో జరిగిన సబ్ జూనియర్ క్లాసిక్ నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ గోల్డ్ మెడల్ దక్కించుకుంది.

పతకాల పరంపర..

- 2002లో తమిళనాడు కొయంబత్తూర్‌లో జూనియర్ ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ పతకం.
- 2023లో జూనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్ మెడల్.
- జార్ఖండ్ రాంచీలో జరిగిన జూనియర్ క్లాసిక్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం.
- మధ్యప్రదేశ్‌లో సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం.
- 2023లో వరల్డ్ యూనివర్సిటీ కప్, ఏషియన్ యూనివర్సిటీ కప్, ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, వరల్డ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ అకాడమీ వంటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనా ఆర్థిక ఇబ్బందులతో ఆమె హాజరుకాలేకపోయారు.
- 2024లో చెన్నైలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీలో గోల్డ్ మెడల్.
- పంజాబ్ పాటియాలలో జరిగిన సబ్ జూనియర్ అండ్ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్.
- 2024లో సౌతాఫ్రికా సన్‌సిటీలో అంతర్జాతీయ వేదిక అయిన కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించింది. ఇందులో ఓవరాల్, స్క్వాడ్ వ్యక్తిగత, బెంచ్ వ్యక్తిగత, డెడ్‌లిఫ్ట్ వ్యక్తిగత విభాగాల్లో బంగారు పతకాలను సాధించారు.

'మా' సభ్యులకు కంటి పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సభ్యులకు శంకర ఐ హాస్పిటల్స్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు, ఫీనిక్స్ సంస్థ డైరెక్టర్ నీలేష్ జానీ, శంకర హాస్పిటల్ హెడ్ విశ్వమోహన్ 'మా' వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ట్రెజరర్ శివ బాలాజీ పాల్గొన్నారు.



'చిత్రామృతం' పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గాయని కేఎస్ చిత్ర 45 ఏళ్ల ప్రస్థానానికి స్మరణార్థంగా 'చిత్రామృతం' సంగీత కచేరి నిర్వహించనున్నారు. డిసెంబర్ 22న శిల్పకళా వేదికలో జరిగే ఈ మ్యూజిక్ కన్సర్ట్ పోస్టర్‌ను ప్రముఖ గాయని చిత్ర, సంగీత దర్శకులు ఆర్‌పీ పట్నాయక్ తదితర వర్ధమాన సింగర్లు ఆవిష్కరించారు. నగరంలోని జూబ్లీ రిడ్జ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగర్ చిత్రతో తన అనుభవాలను పంచుకున్నారు ఆర్‌పీ పట్నాయక్. వినయం, వృత్తిపరమైన నిబద్ధతకు చిత్ర నిదర్శనమని, ఆమెతో పనిచేసిన ప్రతి ఒక్కరిపై చెరగని ముద్ర వేశారన్నారు. 'చిత్రామృతం' మ్యూజిక్ కన్సర్ట్‌కు సంబంధించిన టికెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయని, ఎస్ ఛాంట్ మీడియా, ఎమ్3 ఎంటర్‌టైన్‌మెంట్ నిర్వాహకులు తెలిపారు. ఇండియన్ ఐడల్ తెలుగు నుంచి రజిని, ధృతి, రజిని పూర్ణిమ, కీర్తన, శ్రీకీర్తి, వల్లభ, కుశాల్, సాయి మాధవ్ పాల్గొని చిత్ర పాడిన ప్రసిద్ధ పాటలతో అలరించారు.

నెక్స్ ఇన్ టెక్..పోటీ నేడు..

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత చదువులు అభ్యసించే లక్ష్యంతో ఉన్న విద్యార్థుల కోసం ఓ ఆసక్తికరమైన పోటీ నగరంలో జరగనుంది. నగరానికి చెందిన విదేశీ విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సేవలు అందించే గ్రాడ్‌రైడ్ సంస్థ ఆధ్వర్యంలో నెక్స్ ఇన్‌టెక్ పేరుతో బాచుపల్లిలోని బీవీఆర్‌ఐటీ కాలేజీలో జరిగే ఈ పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రతిష్టాత్మక వర్సిటీలు, కళాశాలలు పాల్గొంటున్నాయి. ఈ విషయాన్ని గ్రాడ్ రైట్ నిర్వాహకులు గురువారం మాదాపూర్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో తెలిపారు. ఈ పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్న అమెరికాలోని ప్రతిష్టాత్మక లేహై యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సబ్రినా జెడ్లికా మాట్లాడుతూ ఇందులో ఉత్తీర్ణులైనవారికి నగదు పురస్కారాలతో పాటు స్కాలర్‌షిప్స్, ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు.. వంటి అవకాశాలు కల్పిస్తామన్నారు. తొలిసారిగా కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్ మూడు కోర్సులనూ మేళవించి ఈ పోటీ ఏర్పాటు చేస్తున్నామని, ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడమే ఈ పోటీ లక్ష్యమని వివరించారు. ఉస్మానియా, సీబీఐటీ సహా పెద్ద సంఖ్యలో ఇతర కళాశాలలు పాల్గొంటున్నాయన్నారు. అత్యంత పురాతన వర్సిటీ తరపున భారతదేశానికి తాను తొలిసారి రావడం సంతోషం కలిగిస్తోందన్నారు.





స్విమ్మింగ్, డ్యాన్సింగ్, కరాటే, పోలో క్రీడల్లోనూ రాణిస్తూ...

- విభిన్న కళల్లో రాణిస్తూ ఆల్ రౌండర్‌గా గుర్తింపు
- సిటీలో చదివి.. అమెరికా నివాసిగా నృత్య ప్రదర్శనలు
- నగరంలో తొలి నృత్యప్రదర్శన రేపు

విశిష్ఠ ప్రతిభ

కళలూ, కలలకు సానబెడుతూ..

కలలు కనాలి.. కళలను ఇష్టపడాలి.. వాటిని సాకారం చేసుకోవాలి.. దీనికి నిదర్శనంగా నిలుస్తున్నారు నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి విశిష్ఠ డింగరి. బిటెక్ పూర్తి చేసిన ఆమె అందరిలా ఏదో చిరుద్యోగంతో సరిపెట్టుకోలేదు. మరింత ఉన్నతంగా తన కలలకు సానబెట్టుకున్నారు. అమెరికా బోస్టన్ యూనివర్సిటీ నుంచి కమ్యూనికేషన్ అండ్ అడ్వర్టైజింగ్‌లో ఎంఎస్ చేశారు. అనంతరం నాట్య గురు డాక్టర్ జయశ్రీ రాజగోపాల్ శిష్యరికంలో భరతనాట్యంలో నృత్య విశారద చేశారు. ప్రస్తుతం నృత్య కరణాల ప్రధానమైన నృత్య శాలి కోర్సు అభ్యసిస్తున్నారు. డా.ఉమా రామారావు దగ్గర కూచిపూడి నాట్యం నేర్చుకున్నారు. చెన్నై శాస్త్ర యూనివర్సిటీ నుంచి డా.పద్మా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భరతనాట్యం ఫైన్‌ఆర్ట్స్ పూర్తి చేశారు.

ఓ వైపు కాలిఫోర్నియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు గత 15 ఏళ్లుగా భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తూ నృత్యకారిణిగా గుర్తింపు పొందారు. కేవలం నృత్యంలో మాత్రమే కాక ఆమె విభిన్న కళల్లో రాణిస్తున్న ఆల్ రౌండర్ కూడా. అంతర్జాతీయ స్విమ్మర్‌గా.. అరేబియా మహా సముద్రంలో అనేక సార్లు ఈత పోటీల్లో పాల్గొని మెడల్స్ కైవసం చేసుకుని చాంపియన్‌గానూ నిలిచారు. జాతీయ స్థాయి పోలో క్రీడాకారిణిగా మన్ననలందుకున్నారు. మరోవైపు కరాటేలో నాలుగు సార్లు బ్లాక్ బెల్ట్ సాధించి రికార్డు సృష్టించారు. వీటన్నిటి రంగాల్లో రాణిస్తూనే భారతీయ సంప్రదాయ వైభవానికి మరింత ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు విశిష్ఠ డింగరి తెలిపారు.

నృత్య ప్రదర్శన రేపు..

ముంబయికి చెందిన నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో విశిష్ఠ నృత్య ప్రదర్శన జరుగుతోంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ తరఫున ప్రఖ్యాత భరత నాట్య గురు డా.జయశ్రీ రాజగోపాలన్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి త్రిదండి చిన శ్రీమన్నారాయణ జీయరు స్వామి, ప్రముఖ నాట్య గురువు పద్మ విభూషణ్ డా.పద్మా సుబ్రహ్మణ్యం (చెన్నై), సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, కళారత్న అశోక్ గుర్జాలే హాజరుకానున్నారు.



– సాక్షి, సిటీబ్యూరో



రేపటి నుంచి 'సాలార్‌జంగ్'లో ఆర్ట్ ఎగ్జిబిషన్

చార్మినార్: సాలార్‌జంగ్ మ్యూజియంలో డైవర్స్ వాయిసెస్–ఆర్ట్ బియాండ్ బౌండరీస్ పేరుతో ఆర్ట్ వర్క్ ఆఫ్ న్యూరో డైవర్స్ అనే ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈస్ట్ బ్లాక్‌లోని గ్యాలరీలో శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారని, ఈ నెల 19 నుంచి 27 వరకూ నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్ తెలిపారు. ది ఆర్ట్ శాంక్చువరీ సహకారంతో ప్రత్యేకంగా రూపొందించిన 100 వరకూ చిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి 'వాట్ హై..ఫై'

నగర వేదికగా హోమ్‌థియేటర్ ఈవెంట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తొలి అత్యాధునిక టెక్నాలజీ ఆధారిత హోమ్ థియేటర్ ఎక్స్‌పో శుక్రవారం నుంచి జరుగనుంది. మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో వాట్ హై ఫై షో పేరిట హోమ్ థియేటర్ ఉత్పత్తుల ప్రదర్శన మూడు రోజుల పాటు జరుగుతుందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అద్దం పడుతుందని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్టీరియో సెటప్స్, ఎవి ఫర్నిచర్, డాల్బీ అట్మోస్ స్పీకర్ సిస్టమ్స్‌తో పాటు అత్యంత అడ్వాన్స్‌డ్ హెడ్ ఫోన్ ఆధారిత సిస్టమ్స్ కూడా ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఈ ఈవెంట్‌లో భాగంగా వర్క్‌షాప్స్, అవార్డ్స్, నిపుణులతో సంప్రదింపులు వంటివి కూడా ఉంటాయన్నారు.



పత్రికా స్వేచ్ఛపై రెడ్‌బుక్ పడగ

రాజ్యాంగ హక్కులను కాలరాసిన టీడీపీ కూటమి ప్రభుత్వం

'సాక్షి' దినపత్రిక ఎడిటర్ వి.మురళిపై అక్రమ కేసు నమోదు

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియాపై కూడా చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంతో వేధింపులకు తెగించింది. పత్రికా స్వేచ్ఛ కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఎమర్జెన్సీ రోజుల నాటి అరాచకాలకు తెరతీసింది. టీడీపీ కూటమి సర్కారు అసమర్థ, అవినీతి పరిపాలనను సాక్ష్యాధారాలతో సహా ప్రజల ముందుంచుతున్న ''సాక్షి'' దినపత్రికపై కక్ష సాధింపు చర్యలకు దిగింది. రాజ్యాంగ సూత్రాలు, పార్లమెంటు చేసిన చట్టాలకు విరుద్ధంగా విజయవాడ పోలీసులు గురువారం సాక్షి పత్రిక ఎడిటర్ వి.మురళి, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు నమోదు చేయడం చంద్రబాబు ప్రభుత్వ దమననీతికి నిదర్శనం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దుర్నీతి, కక్ష సాధింపులు ఇలా ఉన్నాయి..

పత్రికా ధర్మం నిర్వర్తిస్తున్నందుకే చంద్రబాబుకు కంటగింపు

టీడీపీ కూటమి రెడ్‌బుక్ పేరుతో సాగిస్తున్న అరాచకాలు, దాడులు, వేధింపులను ఎక్కడికక్కడ ఎండగడుతూ ''సాక్షి'' పత్రిక బాధితులకు అండగా ఉంటోంది. బాధ్యతాయుతమైన మీడియా సంస్థగా పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పాటుపడుతోంది. ఈ క్రమంలో గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో టీడీపీ రౌడీమూకలు బరితెగించి పాల్పడుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతోంది. మరోవైపు టీడీపీ ప్రభుత్వ అవినీతి, దోపిడీని ప్రజలకు వివరించి చైతన్యపరుస్తూ పత్రికా ధర్మాన్ని నిర్వర్తిస్తోంది. దీంతో చంద్రబాబు ప్రభుత్వం సాక్షి మీడియాపై కక్ష గట్టింది. సాక్షి టీవీ చానల్ ప్రసారాలకు ఆటంకాలు కల్పిస్తోంది. కేబుల్ ఆపరేటర్లను భయపెట్టి సాక్షి టీవీ చానల్ ప్రసారాలను నిలిపివేస్తోంది. మరోవైపు సాక్షి పత్రికపై కూడా కక్ష గట్టింది. సర్కారు అలసత్వంతో

ఇటీవల విజయవాడలో వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. భారీ వర్షాలు, వరదలు వస్తాయని వాతావరణ శాఖ నాలుగు రోజుల ముందే స్పష్టమైన సమాచారం ఇచ్చి హెచ్చరించినా సరే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు.

సుప్రీం ఆదేశాలు పట్టవా?

"ప్రభుత్వాన్ని విమర్శించే వార్తలు రాశారనే కారణంతో జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవద్దని సుప్రీంకోర్టు ఈ నెల 4వతేదీన ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) కింద జర్నలిస్టులకు ఉన్న భావప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని స్పష్టం చేసింది. యూపీ ప్రభుత్వ అధికారుల్లో కుల సమీకరణాలను ఉద్దేశించి జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్ రాజ్' శీర్షికన ఓ కథనం రాశారు. దీనిపై లక్నోలోని హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబర్ 20న ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాల్సిందిగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ హృషికేశ్‌రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'జర్నలిస్టు రాసినవి కేవలం ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నాయనే కారణంతో క్రిమినల్ కేసులు పెట్టవద్దు'అని స్పష్టం చేసింది. జర్నలిస్టులపై దూకుడు చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ.. ఏపీ ప్రభుత్వ పెద్దల ఆదేశంతో ఫిర్యాదు వచ్చిందే తడవుగా విజయవాడ పోలీసులు సాక్షి ఎడిటర్‌పై కేసు నమోదు చేసిన తీరుపై జర్నలిస్టులతో పాటు న్యాయవాదులు విస్తుపోతున్నారు. కుట్రతో కూడిన ఈ కేసుపై సుప్రీం వరకు వెళతామని ప్రకటించారు.

దీంతో వరదలు ముంచెత్తి విలయం సృష్టించాయి. 50 మందికిపైగా దుర్మరణం చెందగా ఏకంగా రూ.10 వేల కోట్ల ఆస్తినష్టం సంభవించింది. వరదల సహాయ,



పునరావాస చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అంతేకాదు వరద బాధితులకు సహాయ, పునరావాస వ్యయం, పరిహారం పంపిణీలో భారీ అవినీతికి పాల్పడింది. భోజనాలు, అగ్గిపెట్టెలు, మంచినీళ్ల సీసాలు తదితర వ్యయాన్ని భారీ ధరలతో అమాంతం పెంచేసింది. దీనిపై పూర్తి సాక్ష్యాధారాలతో 'ముంపులోనూ మేసేశారు' అనే శీర్షికతో సాక్షి పత్రిక కథనాన్ని ప్రచురించింది. వామపక్ష పార్టీలు ఈ విషయంపై పూర్తి ఆధారాలతో ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రభుత్వాన్ని విమర్శించారు. సాక్షి కథనంతో తమ అవినీతి బండారం బట్టబయలైందని ఆందోళన చెందిన చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగింది. ఈ క్రమంలో దొంగదారిలో కక్ష సాధింపు చర్యలకు తెర తీసింది.

కుట్రపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు

పత్రికా స్వేచ్ఛ కోసం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను చంద్రబాబు ప్రభుత్వం కాలరాసింది. పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే తగిన చర్యలు తీసుకునేందుకు మన చట్టంలో స్పష్టమైన నిబంధనలున్నాయి. పత్రికలో ప్రచురితమైన కథనంపై అభ్యంతరం తెలుపుతూ ఖండన ఇవ్వవచ్చు. ఇంకా తమ పరువుకు భంగం వాటిల్లిందని భావిస్తే న్యాయస్థానంలో పరువు నష్టం దావా వేయవచ్చు. దానిపై న్యాయస్థానం విచారించి తగిన తీర్పు వెలువరిస్తుంది. ఇదీ చట్టపరమైన విధానం. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఈ చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోలేదు. ఎందుకంటే న్యాయస్థానంలో కేసు వేస్తే.. సాక్షి పత్రిక పూర్తి ఆధారాలతో తన వాదనను వినిపిస్తుంది. అందుకే దొంగదెబ్బ తీసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. విజయవాడకు చెందిన గుడిపాటి లక్ష్మీనారాయణ అనే న్యాయవాదితో సాక్షి కథనానికి వ్యతిరేకంగా పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. నిబంధనల ప్రకారం ఆ ఫిర్యాదును పోలీసులు స్వీకరించకూడదు. ఎందుకంటే సాక్షి పత్రిక కథనంతో ఆ న్యాయవాదికి ఎలాంటి సంబంధం లేదు. ఆ న్యాయవాదిని ఉద్దేశించి ఆ కథనం రాయలేదు. ఆయన పరువుకు ఎక్కడా భంగం కలగలేదు. ఆ కథనంలో ప్రభుత్వ అవినీతి గురించే పేర్కొన్నారు. ఆ న్యాయవాది ప్రభుత్వ అధికార వ్యవస్థలో భాగం కూడా కాదు. అయినా సరే నిబంధనలకు విరుద్ధంగా ఆ న్యాయవాదితో ఫిర్యాదు చేయించారు. ఆయన ఫిర్యాదుపై విజయవాడ పోలీసులు ఏకంగా సాక్షి పత్రికకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మరింత విడ్డూరం. కేవలం చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, అసమర్థ పరిపాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లకుండా.. సాక్షి పత్రికను కట్టడి చేయాలన్న కుట్రతోనే ఈ అక్రమ కేసు బనాయించారన్నది సుస్పష్టం. ఇక తిరుపతిలోనూ ఇదే విధంగా సాక్షి పత్రికపై ఫిర్యాదు చేయించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ... రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ సాక్షి పత్రికపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగటాన్ని యావత్ పాత్రికేయ రంగంతోపాటు మీడియా నిపుణులు తీవ్ర స్థాయిలో నిరసిస్తున్నారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో పోరాటం చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

చట్ట ప్రకారం కేసులు చెల్లవు

ఒక కథనం విషయంలో పత్రికా ఎడిటర్‌పై కేసు పెట్టడం అంటే భావ ప్రకటనా సేచ్ఛను ఆటంకం పరిచినట్టే. వాస్తవాలను బయట పెట్టకుండా బెదిరించే ప్రయత్నం ఇది. ప్రతి వ్యక్తికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. ఈ రోజుల్లో ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టుకోవచ్చు. పత్రికలు చాలా జవాబుదారీతనంతో నడుస్తాయి. అలాంటి పత్రికా ఎడిటర్‌పై కేసులు పెట్టడం అప్రజాస్వామికం. ఇలాంటి ఘటనల్లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఉండాల్సింది. రాజకీయ ఒతిళ్లతో ఆ పని చేసినట్టు తెలుస్తోంది. ఇలాంటి కేసులు చట్ట ప్రకారం నిలబడవు.

– సుప్రీం కోర్టు న్యాయవాదులు

పత్రికా స్వేచ్ఛను హరించడమే..

వాస్తవాలను బయటపెడితే కూటమి ప్రభుత్వం సహించలేకపోతోంది. విజయవాడ వరదలకు సంబంధించి అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మరల్చడానికి పత్రికలను టార్గెట్ చేస్తోంది. సాక్షి ఎడిటర్‌పై కేసు పెట్టడమంటే పత్రికా స్వేచ్ఛను హరించడమే. నిర్భయంగా, నిష్పాక్షికంగా వార్తలు రాసి వాస్తవాలు బయటపెట్టే విలేకరుల గొంతు నొక్కడమే. ఇది అత్యంత గర్హనీయం. దీనిపై మా అసోసియేషన్ తరఫున ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకి ఫిర్యాదు చేస్తాం. ఇలా కేసులు పెట్టేవారిని ఏ ప్రభుత్వం ప్రోత్సహించకూడదు. బేషరతుగా కేసును ఉపసంహరించుకోవాలి.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్


అభ్యంతరాలుంటే ఖండన ఇవ్వాలి



రాజకీయ దురుద్దేశంతో కేసులు పెట్టి పత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం సరికాదు. విపత్తుల సమయంలో ప్రభుత్వ పనితీరును తెలియచేసిన 'సాక్షి' ఎడిటర్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అకాల వరదలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల కష్టాలను, ప్రభుత్వ చర్యలను రిపోర్టు చేయడం మీడియా బాధ్యత. ఇటీవల విజయవాడ వరదల నేపథ్యంలో బాధితులకు అందిన సహాయంపై 'సాక్షి'అదే పని చేసింది. పత్రికలో ప్రచురించిన కథనంపై అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే.. అందులో అసత్యాలు ఉన్నాయని భావిస్తే మొదట వాస్తవ గణాంకాలను చెబుతూ ఖండన ఇవ్వాలి. సాక్షి ఆ వివరణను ప్రచురించకపోతే న్యాయ స్థానాలను ఆశ్రయించాలి. అంతేగానీ పోలీసు కేసు పెట్టడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను దెబ్బతీయడమే.ఎవరైనా తప్పు వార్త రాస్తే ఖండించాలి. ఖండన ప్రచురించకుంటే పరువు నష్టం దావా వేసుకోవచ్చు. అంతేగానీ ఎవరో ఒకరి చేత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి దానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏమాత్రం సరికాదు'

– దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు, మన తెలంగాణ దినపత్రిక సంపాదకుడు

విశాఖలో సెంచరీ మ్యాట్రెసెస్ కొత్త షోరూమ్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: మూడు దశాబ్దాలుగా వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొన్న పట్టుపరుపుల తయారీ సంస్థ సెంచరీ మ్యాట్రెసెస్ మరో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలోని రేసపువానిపాలెంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఈ సంస్థ షోరూమ్‌ను విశాఖ ఎంపీ శ్రీభరత్ గురువారం ప్రారంభించారు. కొత్త షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రతీ కొనుగోలుపై 15శాతం రాయితీతో పాటు రూ.15వేల వరకు విలువైన బహుమతులను ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ... తమ వద్ద స్ప్రింగ్, ఫోమ్, కోయిర్ వంటి పరుపులు లభ్యమవుతాయన్నారు. పసిపిల్లలు నిద్రించేందుకు బెడ్డీ బై సెంచరీ పేరుతో ప్రత్యేక పరుపును తయారుచేసినట్లు ఆయన తెలిపారు.

సాహితీలో తవ్వేకొద్దీ డొల్ల కంపెనీలు

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ ప్రీలాంచ్ స్కాంలో తవ్వేకొద్దీ కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణతోపాటు కంపెనీ డైరెక్టర్లు సైతం అందినకాడికి దండుకున్నట్టు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు లక్ష్మీనారాయణను సోమవారం నుంచి కస్టడీకి తీసుకొని విచారిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 1,800 మంది కస్టమర్ల నుంచి రూ. 2 వేల కోట్ల మేర వసూలు చేసినట్టు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఆ సొమ్మును ఏపీ కంపెనీల్లోకి మళ్లించారన్న దానిపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఇదే అంశంపై లక్ష్మీనారాయణను గురువారం కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. గత 3 రోజులుగా ఈడీ సేకరించిన సమాచారం మేరకు లక్ష్మీనారాయణతోపాటు మరికొందరు డైరెక్టర్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఇందులో లక్ష్మీనారాయణ సోదరుడు హరిబాబు, గోలమారి ఆంథోనిరెడ్డి, అతడి కుమారుడు అక్షయ్‌రెడ్డి, సతీశ్ చుక్కపల్లి, లక్ష్మీనారాయణ భార్య పార్వతి, లక్ష్మీనారాయణ కుమారుడు సాత్విక్, పూర్ణచందరరావు సందు సైతం డైరెక్టర్లుగా కొనసాగారు. ఈ భారీ కుంభకోణంలో లక్ష్మీనారాయణ తర్వాత కీలక పాత్రధారులుగా గోలమారి ఆంథోనిరెడ్డి, పూర్ణచందర్‌రావులు ఉన్నట్టు ఈడీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. కాగా లక్ష్మీనారాయణ ఈడీ కస్టడీ శుక్రవారంతో ముగియనుంది. దీంతో చివరిరోజు మరిన్ని కీలక అంశాలపై ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు.

ఎండీ లక్ష్మీనారాయణతోపాటు ఇతర డైరెక్టర్ల పేర్లు తెరపైకి

- గోలమారి ఆంథోనిరెడ్డి, పూర్ణచందర్‌రావు సందు ఇతరులు
- అందినకాడికి దోచుకున్నట్టు కీలక ఆధారాలు
- ఈడీ దర్యాప్తులో లక్ష్మీనారాయణ నుంచి కీలక సమాచారం


లక్ష్మీనారాయణ

నేతల పేర్లు చెప్పి రూ. కోట్లు పక్కదారి పట్టించిన ఆంథోనిరెడ్డి?

కీలక నిందితుల్లో ఒకరిగా ఈడీ అనుమానిస్తున్న గోలమారి ఆంథోనిరెడ్డి నాయకుల పేర్లు చెప్పి కమీషన్ల పేరిట పదుల కోట్ల రూపాయలు పక్కదారి పట్టించినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్‌కు కావాల్సిన అనుమతులు ఇప్పిస్తానని ఇద్దరు నేతల కోసమని రూ.40 కోట్ల మేర తీసుకున్నట్టుగా తెరపైకి వచ్చినట్టు సమాచారం. హెచ్ఎండీఏ అనుమతుల కోసం కొందరు అధికారులకు ఇవ్వాలంటూ రూ.10 కోట్లకు పైగా కొల్లగొట్టినట్టు తెలుస్తోంది. ఆంథోనిరెడ్డి తన కుమారుడు అక్షయ్‌రెడ్డిని సైతం డైరెక్టర్‌గా పెట్టి అక్రమాలకు పాల్పడినట్టు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. మరో డైరెక్టర్ పూర్ణచందర్‌రావు సైతం పెద్ద మొత్తంలోనే డబ్బులు దండుకున్నట్టు ఈడీ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది.

బ్రోకర్ల ద్వారా అడ్డగోలుగా వసూళ్లు

ప్రీ లాంచ్ ఆఫర్ల పేరిట పెద్ద ఎత్తున మోసాలకు తెర తీసేందుకు కంపెనీ ఎండీ లక్ష్మీనారాయణతోపాటు ఇతర డైరెక్టర్లూ వారికి నచ్చిన విధంగా బ్రోకర్లను నియమించుకొని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. కంపెనీ డైరెక్టర్లుగా వ్యవహరించిన వారిలో కొందరు ఎన్ఆర్ఐలను సైతం ఈ కుంభకోణంలోకి లాగేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. కొందరు కస్టమర్ల నుంచి వసూలు చేసిన డబ్బును కంపెనీ లెక్కల్లోకి చూపకుండా కొందరు ఇష్టారీతిన వాడుకున్నట్టు సమాచారం.

డొల్ల కంపెనీల్లోకి డబ్బుల మళ్లింపు

ప్రీలాంచ్ పేరిట వసూలు చేసిన డబ్బును దారి మళ్లించేందుకు డొల్ల కంపెనీలను సృష్టించారు. ఒక కంపెనీలో ఉన్నవారే మరో కంపెనీలో డైరెక్టర్లుగా, భాగస్వాములుగా వీటిని ఏర్పాటు చేసినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించినట్టు సమాచారం.

ఉచిత రొయ్య పిల్లల పంపిణీ లేనట్టేనా?

ఇప్పటివరకు టెండర్లు పిలవని మత్స్యశాఖ



సాక్షి, హైదరాబాద్: ఉచిత రొయ్య పిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. అసలు ఈ ఏడాది రిజర్వాయర్లు, చెరువుల్లో రొయ్య పిల్లలు వదులుతారో, లేదో.. తెలియని పరిస్థితిల్లో మత్స్యశాఖ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించినా మత్స్యశాఖ నిర్లక్ష్యంతో పథకం నిర్వీర్యం అవుతోందని విమర్శలు వస్తున్నాయి. అక్టోబర్ నెల మూడో వారం అయినా రొయ్యల పంపిణీపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో మత్స్యకారులు ఎటూ తోచని పరిస్థితుల్లో ఉన్నారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం గత ఆరేళ్ల నుంచి మత్స్యశాఖ ఉచితంగా రొయ్య పిల్లలను రిజర్వాయర్లు, చెరువుల్లో వదులుతోంది. 2017లో ప్రారంభమైన ఈ పథకం దశలవారీగా పెరుగుతూ వచ్చింది. ఈసారి టెండర్లు పిలవకపోవడంతో అసలు రొయ్య పిల్లల పంపిణీ ఉంటుందా? ఉండదా? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రొయ్య పిల్లల పంపిణీపై మత్స్యశాఖ డైరెక్టర్ వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించకపోవడం గమనార్హం.

సంవత్సరం	నీటి వనరులు	వ్యయం కోట్లలో	పోసిన రొయ్య పిల్లలు (కోట్లలో)
2017-18	11	రూ. 1.38	1.08
2018-19	24	రూ. 6.27	3.19
2019-20	70	రూ. 6.39	3.42
2020-21	90	రూ. 8.61	4.15
2021-22	189	రూ.10.00	25.00

పెండింగ్ బిల్లులపై 'పంచాయితీ'!

▶ మొదటి పేజీ తరువాయి

హయాంలో మౌఖిక ఆదేశాలతోనే పంచాయతీల్లో పనులు చేయించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పదినెలలు గడిచినా పెండింగ్ బిల్లులు క్లియర్ కాకపోవడంతో ఇవి వస్తాయా లేదా ఆందోళన కూడా వీరిని వెంటాడుతోంది. కొన్నినెలల క్రితం అప్పటి గవర్నర్ రాధాకృష్ణన్‌ను తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ నేతలు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, సుర్వి యాదయ్యగౌడ్, ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సుభాష్ తదితరులు కలిశారు. 'గత ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సొంత డబ్బులను ఖర్చు చేశాం. కొంతమంది అప్పులుచేసి మరీ పనులు పూర్తి చేయించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు'అని వారు గవర్నర్‌కు వివరించారు.

సర్పంచ్ సంఘాల నాయకులు ఏమంటున్నారంటే...

పెండింగ్ బిల్లుల సాధనకు వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు తెలిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఈ సర్కార్ అధికారంలోకి వచ్చి పదినెలలు దాటినా అసలు మా సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీనిచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ప్రభుత్వం బకాయిల చెల్లింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– సుర్వి యాదయ్య గౌడ్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు

అప్పుల పాలయ్యాను

గ్రామాభివృద్ధిలో భాగంగా రూ. 80 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టాను. వాటిలో ఇంకా రూ.20 లక్షల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పుతెచ్చిన డబ్బులకు ప్రతినెలా వడ్డీ చెల్లిస్తున్నా. ఇప్పటివరకు వడ్డీ మూడున్నర లక్షలకు చేరుకుంది. వడ్డీ కట్టడానికి మళ్లీ అప్పులు చేస్తున్న.

– ఎండీ ఖలీదాబేగం,చిన్న రామంచర్ల మాజీ సర్పంచ్, బచ్చన్నపేట మండలం, జనగామ జిల్లా

ఒకటో తేదీ వచ్చిందంటే..

ప్రతినెలా ఒకటవ తేదీ వచ్చిందంటే కంటి మీద కునుకు లేకుండా గడపాల్సి వస్తోంది. గ్రామాభివృద్ధి పనుల కోసం 25లక్షలు అప్పు చేసి పనులు పూర్తి చేశా. నెలకు రూ.50 వేలు వడ్డీ కట్టాల్సి వస్తోంది. ఇప్పటికీ రూ.7.5 లక్షలు వడ్డీ కింద కట్టాను.

– ఒడిటి తిరుపతిరెడ్డి, తొగర్రాయి మాజీ సర్పంచ్, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా

బిల్లుల కోసం ఆత్మహత్యాయత్నం...



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి. పదవిలో ఉండగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాడు. దీనికిగాను దాదాపు రూ.12 లక్షల వరకు బిల్లులు రావాలి. బిల్లులు ఆలస్యం కావడంతో గతేడాది అక్టోబర్ నెలలో ఎంపీడీవో కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.

అప్పుల పాలై ప్రాణం తీసుకున్నాడు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేట గ్రామ సర్పంచ్ వడ్డే ఆనందరెడ్డి (46) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామాభివృద్ధి కోసం వెచ్చించిన రూ.35 లక్షల బిల్లులు రావాలని, అప్పుల పాలై ఆవేదనతో 2021 మే 5న ఆత్మహత్యకు పాల్పడ్డారు.



మాకు రారా కొత్త టీచర్లు?

వాజేడు: చదువుకునేందుకు విద్యార్థులున్నా.. ఉపాధ్యాయులు లేని పాఠశాల అది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని జంగాలపల్లి గిరిజన ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 35 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల బదిలీల్లో ఇక్కడ ఉన్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు కాచారం, మరొకరు మంగపేట మండలం చుంచుపల్లికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఒక ఉపాధ్యాయినిని నియమించగా.. ఆమె బీఈడీ ఓడీలో ఉన్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు రోజూ బడికి వచ్చి వెళ్తున్నారు. కాగా, పే సెంటర్ ఇన్‌చార్జ్ హెచ్ఎం కేశవరావు ఇతర పాఠశాలల ఉపాధ్యాయుల్లో రోజుకొకరిని జంగాలపల్లి పాఠశాలకు పంపిస్తూ నెట్టుకొస్తున్నారు. కొత్త డీఎస్సీలోనూ ఈ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పాఠశాలకు తాళం వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



66మందికి ఇద్దరే టీచర్లా?

అధికారుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం.. పర్వత్‌పల్లి పాఠశాలకు తాళం

బషీరాబాద్: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని పర్వత్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు తాళం వేశారు. పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 66 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారని, అందులో భరత్ అనే ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిని బుధవారం అధికారులు రిలీవ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కొత్త ఉపాధ్యాయులను నియమిస్తుంటే తమ గ్రామానికి ఎందుకు నియమించలేదని నిలదీశారు. టీచర్లు లేని పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తూ వారి భవిష్యత్‌ను పాడు చేయలేమని స్పష్టం చేశారు. కొత్తగా ఉపాధ్యాయులను నియమించే వరకు పిల్లలను బడికి పంపేదిలేదంటూ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పాఠశాలలో సద్దాం హుస్సేన్, రవీందర్‌రెడ్డి అనే ఇద్దరు టీచర్లే లిఉన్నారని వీరు ఐదు తరగతులకూ పాఠాలు ఎలా బోధిస్తారో అధికారులే చెప్పాలన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు చెప్పారు. మరోవైపు త్వరలో కొత్త టీచర్లు వస్తారని, విద్యార్థులను బడికి పంపాలని ఉపాధ్యాయులు, మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



'వాన'రాలతో యాతన

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. మార్కెట్‌కు పెద్దఎత్తున ధాన్యం వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించడం లేదు. మరోవైపు వర్షం తగ్గిన తరువాత ధాన్యం కుప్పలపై వానర సైన్యం మూకుమ్మడిగా దాడి చేసింది.



ఊరి కీడుకు వనభోజనాలే పరిష్కారమని..

వేములపల్లి: ఊరికి కీడు వచ్చిందంటూ ఊరిలో జనాలంతా తెల్లారేసరికి వనభోజనాలకు వెళ్లారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొన్ని రోజుల నుంచి గ్రామంలో కొంతమంది అనారోగ్యంతో, మరికొందరు రోడ్డు ప్రమాదంలో, ఇంకొందరు వయస్సు మీరి.. ఇలా ఏదో ఒక కారణంతో మృతి చెందారు. దీంతో భయాందోళనకు గురైన గ్రామస్తులు పలుమార్లు ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని కోరారు. ప్రతి ఏటా వన భోజనాలకు గురువారమే వెళ్లాల్సి ఉండగా ఈ ఏడాది ఆదివారం వెళ్లడంతో అపచారం జరిగిందని, దీంతో గ్రామంలో ఒక్కొక్కరుగా చనిపోతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు సమస్య పరిష్కారమయ్యే విధంగా గ్రామస్తులు గురువారం గ్రామ పొలిమేర దాటి అక్కడే వంటావార్పు చేసుకుని అక్కడే భోజనాలు చేసి సాయంత్రం గ్రామానికి చేరుకోవాలని గ్రామపెద్దలు నిర్ణయించి చాటింపు వేయించారు. ఈ మేరకు గ్రామస్తులు వారి ఆదేశాలు పాటించారు. అయితే కొంతమంది గ్రామస్తులు మాత్రం ఇటువంటి మూఢ నమ్మకాలను నమ్మనవసరం లేదని చెప్తున్నారు.

మణుగూరు నుంచి రామగుండానికి కొత్త రైల్వే బ్రాడ్‌గేజ్

- గెజిట్ జారీచేసిన కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: మణుగూరు నుంచి రామగుండం రైల్వే స్టేషన్ వరకు చేపట్టనున్న కొత్త బ్రాడ్‌గేజ్ నిర్మాణ పనుల కోసం అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. 208.80 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ రైల్వేలైన్ పనులు, అమలు, నిర్వహణ అధికారాలను ముగ్గురు అధికారులకు అప్పగించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్, ఖానాపూర్ బాధ్యతలు కాటారం సబ్ కలెక్టర్‌కు, ఘన్‌పూర్, భూపాలపల్లి– భూపాలపల్లి ఆర్డీవోకు, పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం (మంథని), మంథని, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి– పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు బాధ్యతలు అప్పగించింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 18-10-2024



టీవీ యాంకర్ టు మిస్ ఇండియా

మధ్యప్రదేశ్ ఉజ్జయినికి చెందిన నికిత పోర్వాల్ మిస్ ఇండియా కిరీటం దక్కించుకుంది. టీవీ యాంకర్‌గా, నటిగా కెరీర్ మొదలుపెట్టి ఒక సామాన్య కుటుంబం నుంచి ఆమె ఈ గుర్తింపు పొందింది.

'మన జీవితానికి ఒక విలువ ఉండాలి. మనం లేకపోతే నష్టాన్ని అనుభూతి చెందాలి' అంటుంది నికిత పోర్వాల్. అక్టోబర్ 16 (బుధవారం) ముంబైలో జరిగిన 'ఫెమినా మిస్ ఇండియా 2024' ఫైనల్స్‌లో నికిత పోర్వాల్ కిరీటధారిగా నిలిచింది. 27 రాష్ట్రాల నుంచి మొత్తం 30 మంది పోటీ పడితే నికిత మొదటి స్థానంలో నిలిచింది. దాద్రా నాగర్ హవేలీకి చెందిన రేఖా పాండే రెండో స్థానంలో, గుజరాత్‌కు చెందిన ఆయూషీ ధోలాకియా మూడో స్థానంలో నిలిచింది. సంగీతా బిజిలానీ, నేహా ధూపియా తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. మరో నెల రోజులలో జరగనున్న 'మిస్ వరల్డ్ 2024' పోటీల్లో మన దేశం తరఫున నికిత ప్రపంచ దేశాల సుందరీమణులతో పోటీ పడనుంది. మిస్ వరల్డ్ కిరీటం కూడా దక్కించుకోవాలని ఆశిస్తోంది.



తండ్రి ప్రోత్సాహంతో ...

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన నికిత హైస్కూల్ రోజుల నుంచే మోడలింగ్‌లోకి రావాలని భావించింది. ఆమె తండ్రి అశోక్ పోర్వాల్ ఇందుకు ప్రోత్సహించాడు. కూతురి ప్రతిభ గమనించి మోడలింగ్ రంగంలోకి చిన్న వయసులోనే ప్రవేశ పెట్టాడు. తల్లి రాజ్‌కుమారి కూడా వెన్నంటే ఉంటూ నికితను నడిపించింది. 'మోడల్‌గా పని చేసి మరుసటి రోజు స్కూల్‌కి వెళితే ఆ ప్రపంచం ఈ ప్రపంచం చాలా వేరేగా ఉండేవి. అడ్జస్ట్ కావడం కష్టమయ్యేది. కాని మా స్కూల్ వాళ్లు నాకు సపోర్ట్ నిలిచారు. కాలేజీలో చదువుకుంటూ ఫ్యాషన్ ప్రదర్శనలకు వెళ్లేదాన్ని. రాత్రుళ్లు మేలుకొని సిలబస్ చదవడం, రికార్డులు పూర్తి చేయడంలో నిమగ్నమయ్యేదాన్ని. ఆ హార్డ్‌వర్క్ వృథా పోలేదు' అంటుంది నికిత.

లోపలి సౌందర్యం

'అందాల పోటీలో రాణించాలంటే లోపలి సౌందర్యాన్ని బయటకు తేవాలి. ఆ సౌందర్యానికి రూపమే మన దేహం. ముందుగా ఆ సౌందర్యాన్ని నమ్మాలి. అందుకు ధ్యానం చేయడం లాంటి ఎన్నో విధానాలు అవలంబించాను. నా మాటను, నడకను రోజుల తరబడి సాధన చేశాను. ఎదుటివారు మనలో చూసేది నిజాయితీని... మనం మనలా ఉన్నామా లేదా అనే విషయాన్ని. దాన్ని పోగొట్టుకోకూడదు' అంటుంది నికిత. నాటకాల మీద మక్కువతో థియేటర్‌లో పని చేసిందామె. 'కృష్ణలీల' అనే నాటకాన్ని స్వయంగా రాసింది కూడా!

టీవీ యాంకర్‌గా...

కుటుంబానికి మద్దతుగా నిలవడం కోసం టీవీ యాంకర్‌గా కూడా పనిచేసింది నికిత. అలాగే సీరియల్స్‌లో, సినిమాల్లో కూడా చిన్న చిన్న పాత్రలు పోషించింది. తుదకు 'మిస్ ఇండియా' అయ్యింది. 'ఈ గుర్తింపును ఎలా ఉపయోగిస్తారు' అనంటే 'యువతను మోటివేట్ చేయడానికి ఉపయోగిస్తాను. మన దేశంలోని యువతకు చాలా స్కిల్స్ ఉన్నాయి. కాని కమ్యూనికేషన్‌లో వెనుకబడుతున్నారు. మీ మాటే మిమ్మల్ని ముందుకు తీసుకెళుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ మీద ధ్యాస పెట్టండి అని చెబుతాను' అంటోంది నికిత. మిస్ ఇండియా అయ్యాక సంజయ్ లీలా భన్సాలీ వంటి దర్శకుల నుంచి పిలుపు అందుకుంటోందామె. త్వరలో వెండి తెర మీద

వినిపించే బోధకులు



పవర్ డ్రెస్సింగ్

'పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు డ్రెస్సింగ్ కూడా ఉపయోగపడుతుంది' అంటారు హైదరాబాద్ వాసి, ఫౌండెడ్ హెడ్ గ్లోబల్ స్కూల్ అండ్ కాలేజీ నిర్వాహకురాలు, టీచర్ మేఘన ముసునూరి. గ్లోబల్ టీచర్ అవార్డు గ్రహీత అయిన మేఘన ముసునూరి వార్డ్ రోబ్ గురించి చెప్పిన విషయాలు..

"ప్రైమరీ స్కూల్ పిల్లలకు క్లాస్ తీసుకునేటప్పుడు కలర్‌ఫుల్‌గా డ్రెస్ చేసుకుంటాను. చిన్నపిల్లలకు బ్రైట్ కలర్స్ అంటే ఇష్టం. మనం చెప్పినవి చక్కగా వినడానికి ఈ రంగులు దోహదం చేస్తాయి. పిల్లలు డ్రెస్ ఒకటే చూడరు. చెవులకు, చేతులకు, మెడలో ఏం వేసుకున్నారు.. అని కూడా చూస్తారు. వాళ్లకి ఆసక్తి కలిగించేది ఏదైనా ఉంటే, ఇదేమిటి? నేనెప్పుడూ చూడలేదు... అని కూడా అడుగుతారు. అలా ఒకరోజు నా దగ్గర వడ్లు, మినుములు... మొదలైన గింజలతో తయారు చేసిన బ్రేస్‌లెట్‌ని వేసుకెళ్లాను. ఆ రోజు దాని గురించి వారు ఎన్నోప్రశ్నలు వేశారు. అంటే, ఆ బ్రేస్‌లెట్ వారిలో ఎంతో ఆసక్తిని కలిగించిందనేగా!

నైటీతో కనిపించను

ఎదుటివారిని చూడగానే 6 నుంచి 12 సెకన్లలో ఆ వ్యక్తిని మనం సీరియస్‌గా తీసుకోవచ్చా లేదా అనేది బ్రెయిన్ ఒక ఇంప్రెషన్‌ని క్రియేట్ చేసుకుంటుంది. నాకు ఇద్దరు అమ్మాయిలు. వాళ్లు నా మాట వినని సందర్భాలు దాదాపుగా లేవు. ఎందుకంటే, వాళ్లు నన్ను నైటీలో ఎప్పుడూ చూడరు. సౌకర్యం కోసం రాత్రి సమయంలో వేసుకునే నైటీలోనే స్కూల్‌లో పిల్లలను దింపడానికి వచ్చే తల్లులు ఉన్నారు. చాలా మంది తల్లులు నా దగ్గర 'తమ పిల్లలు మాట వినడం లేదు' అని చెబుతుంటారు. అప్పుడు వాళ్లతో 'ఎప్పుడైనా టీచర్‌ని మీరు నైట్‌డ్రెస్‌లో చూశారా' అని అడుగుతాను. అంతేకాదు 'మన డ్రెస్ వల్ల కూడా పిల్లలు మన మాట వింటారు' అని చెబుతాను. ఒకప్పుడు మా ఇంటికి టీచర్ వస్తున్నారంటే మా తాతగారు తప్పనిసరిగా భుజంపైన కండువా వేసుకొని, బయటకు వచ్చేవారు. గౌరవం అంటే నమస్కారం ఒక్కటే కాదు. మన డ్రెస్సింగ్ కూడా.

నా సొంత డిజైన్స్

బైక్ రైడ్‌కి వెళ్లేటప్పుడు జీన్స్ వేసుకుంటాను. మీటింగ్స్, కాన్ఫరెన్స్ ఉన్నప్పుడు చీరలు కట్టుకుంటాను. 2-3 రోజుల మీటింగ్స్ అయితే బ్లేజర్స్, ఫ్రాక్స్ కూడా వేసుకుంటాను. చీర అయితే, బ్లౌజ్ ట్రెండీగా ఉండేలా ఎంచుకుంటాను. వెస్ట్రన్ టాప్ వేసుకొని చీర కట్టుకుంటాను. కొన్నిసార్లు టాప్ టు బాటమ్ ఒకే కలర్, కొన్నిసార్లు కాంట్రాస్ట్ వేసుకుంటాను. ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. అలాంటప్పుడు డైనమిజాన్ని చూపేలా డ్రెస్ చేసుకుంటాను.



కూతుళ్లు.. డ్రెస్ డిజైనింగ్

జ్ఞాపకాలు బాగుండాలంటే...

జ్ఞాపకాలలో మన డ్రెస్సింగ్ కూడా బాగుండాలి. ఒకప్పుడు ఆకులు పచ్చగానే ఉన్నట్టు డ్రాయింగ్‌లో చూపేవారు. కానీ, ప్రకృతిలో ఆకులు చాలా రంగుల్లో ఉన్నాయి. అందుకని, మనం వేసుకునే డ్రెస్, జ్యువెలరీ కూడా కలర్‌ఫుల్‌గా ఉండాలి. బంగారు ఆభరణాలే వేసుకోవాలని అనుకోను. తక్కువ ఖర్చుతో లభించే క్రియేటివ్ జ్యువెలరీ ఏదైనా ఎంపిక చేసుకుంటాను. టీచర్ అంటే సీరియస్‌గా ఉండాల్సిన అవసరం లేదు. పిల్లల్లో ఇంట్రెస్ట్, కాన్ఫిడెంట్ బిల్డ్ చేసేలా ఉండాలి. నేను రకరకాల బ్రోచెస్ పెట్టుకుంటాను. మా స్కూల్‌లో ఒక పిల్లవాడు వాళ్ల అమ్మకు ఒక బ్రోచ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చాడంట. 'ఎందుకు?' అని అడిగితే 'మా టీచర్ పెట్టుకుంటుంది, చాలా బాగుంటుంది' అని చెప్పాడంట. పిల్లల నుంచి ఇలాంటి ఎన్నో జ్ఞాపకాలు నాకున్నాయి. ఇదే ఫ్యాషన్ అని, ఎవరి లాగానో ఉండాలని కాకుండా సమాజంలో మనదైన ఒక గుర్తింపు డ్రెస్సింగ్ ద్వారా చూపాలి. పవర్ డ్రెస్సింగ్ వల్ల ఎదుటి వారు మనతో ప్రవర్తించే తీరులో కూడా మార్పు వస్తుంది.

వినిపించే బోధకులు



దేవుడు మనకు 'ఇవ్వలేదని' బాధపడతాం. దేవుడు మనకు 'లేకుండా చెయ్యలేదని' మాత్రం సంతోషించం. దేవుడు ఏమిచ్చినా, ఏమివ్వకున్నా ఎప్పుడూ మనుషులతో కనెక్ట్ అయి ఉండేవారు దేవభూమిలో ఉన్నట్లే నవ్వులు చిందిస్తూ ఉంటారు. తమ చుట్టూ స్నేహ పరిమళాలను చిలకరిస్తూ ఉంటారు. ఈ ఫొటోలో కుడివైపున ఉన్న మహిళలు ఇద్దరూ ఫ్రాన్స్ జాతీయులు. వాళ్ళు ప్రస్తుతం ఉన్నది కోళికోడ్. అక్కడి ఎస్. ఎం. స్ట్రీట్ లో షాపింగ్ కి వచ్చారు. వాళ్ళు ఇండియా రావటం ఇదే మొదటిసారి. మధ్యలో ఉన్నావిడ సమీర. ఆమె పక్కన జోలీ. ఇద్దరికీ వినికిడి శక్తి లేదు. ఇద్దరికీ మాటలు రావు. అయినప్పటికీ సేల్స్ ఉమన్ (ఎడమ చివర) తో చక్కగా 'సంభాషిస్తున్నారు'. కాగితంపై సేల్స్ ఉమన్ వారికి రాసి చూపిస్తోంది. అందుకు వారు చిరునవ్వుతో 'ఓ య్యా..' అంటూ అర్థవంతంగా స్పందిస్తున్నారు. విశేషం ఏమిటంటే... గూగుల్ ట్రాన్స్‌లేటర్ సహాయంతో ఇంతదూరం ఇండియా ట్రిప్ కు వచ్చిన సమీర, జోలీ.. ఫ్రాన్సులోని ఒక లెర్నింగ్ హాస్పిటల్ లో బధిరులకు బోధకులు!

* పెటా
అత్యంత అందమైన శాకాహార సెలబ్రిటీలు

బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, రితేష్ దేశ్‌ముఖ్‌లను పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ (పెటా) ఇండియా 2024కి గాను భారతదేశపు 'అత్యంత అందమైన శాకాహార సెలబ్రిటీలు'గా ఎంపిక చేసింది. జంతు సంక్షేమం పట్ల గల అంకిత భావానికి, కారుణ్య జీవనశైలి నిబద్ధతకు గుర్తింపుగా వారికి ఈ గౌరవం లభించింది.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్



రితేష్ దేశ్‌ముఖ్

జాక్వెలిన్ ఫెర్నాండెజ్ 'పనితో సంబంధం లేకుండా కూడా వెలుగులోకి రావడం ఆనందంగా ఉంది'ని ఈ సందర్భంగా తెలియజేసింది.

గతంలో హాటెస్ట్ వెజిటేరియన్ సెలబ్రిటీ అవార్డు టైటిల్ విజేతలలో జీనత్ అమన్, జాకీ ష్రాఫ్, ఫాతిమా సనా షేక్, రాజ్‌కుమార్ రావు, అలియా భట్, అక్షయ్ కుమార్, భూమి పెడ్నేకర్, శ్రద్ధా కపూర్, సోనూసూద్, మానుషి చిల్లర్ .. వంటి సెలబ్రిటీల పేర్లు ఉన్నాయి. మానుషి చిల్లర్, సునీల్ ఛెత్రి, అనుష్క శర్మ, కార్తీక్ ఆర్యన్, విద్యుత్ జమ్వాల్, షాహిద్ కపూర్, రేఖ, అమితాబ్ బచ్చన్‌లు కూడా అత్యంత అందమైన శాకాహారులుగా గుర్తింపు పొందారు.

ఈ యేడాది జాక్వెలిన్ తన స్టార్ పవర్‌ను అన్ని జంతువుల రక్షణ కోసం ఉపయోగించడంలో పేరొందింది. 50 ఏళ్లకు పైగా సంకెళ్లలో ఉంచిన ఏనుగును రక్షించిన #FreeGajraj ప్రచారంతో సహా అనేక మార్గాల్లో పెటా ఇండియా పనికి మద్దతుగా తన అభిమానులను సమీకరించింది.

రితేష్ శాకాహారి. శాకాహారాన్ని ప్రోత్సహిస్తున్నాడు. భార్య జెనీలియాతో కలిసి శాకాహార మాంసం కంపెనీని కూడా స్థాపించాడు. 'నటన నుంచి జంతు సంరక్షణ వరకు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, రితేష్ దేశ్‌ముఖ్ నిజమైన సూపర్ స్టార్‌లుగా నిరూపితమయ్యారు' అని పెటా ఇండియా సెలబ్రిటీ, పబ్లిక్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సచిన్ బంగేరా తెలిపారు. 'ఈ విధంగా దయను ప్రపంచానికి చూపినందుకు పెటా ఇండియా వారిని గౌరవించడం ఆనందంగా ఉంది. అన్నింటికన్నా వీరిది నాణ్యమైన అందం' అని ప్రశంసించారు.

హెల్దీ డైట్
కుకర్ బ్రౌనీ

కావలసినవి: గోధుమపిండి – 200 గ్రాములు; బటర్ – 100 గ్రాములు; డార్క్ చాకొలెట్ – 50 గ్రాములు; బెల్లం పొడి – 6 టేబుల్ స్పూన్‌లు; వేడి పాలు – 150 ఎంఎల్; కోకోపౌడర్ – 6 టేబుల్ స్పూన్‌లు; మిల్క్ చాకొలెట్ చంక్స్ – 60 గ్రాములు; చాకొలెట్ చిప్స్ – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్.

తయారీ: ● ప్రెషర్ కుకర్ అడుగున ఉప్పు చల్లాలి. బోలుగా ఉన్న ఒక స్టాండ్‌ని కుకర్‌లో పెట్టి కుకర్ విజిల్ తీసేసి మూత పెట్టాలి. ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉంచి సన్న మంట మీద మరో ఐదు నిమిషాల సేపు వేడి చేయాలి. ● కుకర్ పాత్రలో అమరే విధంగా ఒక ప్లేట్ తీసుకుని టీ స్పూన్ వెన్న రాయాలి. అంచులకు దళసరి కాగితాన్ని (స్వీట్ లకు ఉపయోగించేది) అతికించాలి. ● మరొక పాత్రలో వెన్న, డార్క్ చాకొలెట్ కరిగించాలి. మంట మీద ఉండగానే అందులో బెల్లం పొడి, పాలు జత చేసి బాగా కలపాలి. మంట ఆపేసి గోధుమపిండి, కోకోపౌడర్ వేసి ఉండలు లేకుండా కలపాలి. చివరగా మిల్క్ చాకొలెట్ చంక్స్ వేసి కలిపి ఈ మిశ్రమాన్ని వెన్నరాసిన ప్లేట్ మీద పోసి సమంగా సర్దాలి. ఆ పైన చాకొలెట్ చిప్స్‌ని చల్లాలి. ● ఈ ప్లేట్‌ని ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన కుకర్‌లో స్టాండ్ మీద జాగ్రత్తగా అమర్చి మూత పెట్టి (విజిల్ లేకుండా) మీడియం మంట అర గంట సేపు ఉంచి దించేయాలి. ● కుకర్ పూర్తిగా చల్లారిన తర్వాత మూత తీసి బ్రౌనీ ప్లేట్ బయటకు తీయాలి. బ్రౌనీ కూడా చల్లారిన తర్వాత జాగ్రత్తగా ముక్కలుగా కట్ చేయాలి. కట్ చేసేటప్పుడు పొడి రాలుతుందనిపిస్తే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టి ఆ తర్వాత కట్ చేయాలి. పై కొలతలతో 9 బ్రౌనీలు వస్తాయి.





డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు (మొత్తానికి)
కేలరీలు – 230;
ప్రొటీన్ – 3.5 గ్రాములు;
కార్బోహైడ్రేట్‌లు – 22 గ్రాములు;
షుగర్స్ – 12 గ్రాములు;
ఫ్యాట్ – 14 గ్రాములు;
సాచురేటెడ్ ఫ్యాట్ – 8 గ్రాములు;
ఫైబర్ – 2 గ్రాములు;
సోడియం – 45మిల్లీగ్రాములు

● ఓ పచ్చటి నీడ
గ్రీన్... టీన్

'పద్నాలుగు సంవత్సరాల వయసులోనే ఏం చేయగలం!' అని ఎవరైనా నిట్టూరిస్తే... 'ఎంతో చేయగలం' అని చెప్పడానికి కెన్యాకు చెందిన ఎల్లియానే బలమైన ఉదాహరణ. పచ్చని చెట్టు నీడలో, చల్లటి వెన్నెల నీడలో ఆమె విన్న కథల్లో పర్యావరణ ఉద్యమకారిణి ప్రొఫెసర్ మాథాయ్ ఉంది. మాథాయ్ స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా వేలాది మొక్కలు నాటింది ఎల్లియానే. 'చిల్డ్రన్స్ విత్ నేచర్' స్వచ్ఛంద సంస్థ స్థాపించి మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా మార్చింది.

స్ఫూర్తి అనేది ఎంత గొప్పదో చెప్పడానికి బలమైన ఉదాహరణ ఎల్లియానే వాంజీ క్లిస్టన్. చిన్నప్పుడు తాను విన్న కథల్లో కథానాయిక వంగరి మాథాయ్. నోబెల్ బహుమతి గ్రహీత వంగరి మాథాయ్ చెట్ల రక్షణ, మొక్కల పెంపకం గురించి చేసిన కృషి, ఉద్యమం అంతా ఇంతా కాదు. ఆమె ప్రారంభించిన 'గ్రీన్ బెల్ట్ మూమెంట్' గురించి కథల రూపంలో విన్నది ఎల్లియానే.

వంగరి మాథాయ్ స్ఫూర్తితోనే గ్రీన్ వారియర్‌గా మారింది.

మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, ఫ్లోరెన్స్ నైటింగేల్ లాంటి ప్రపంచ ప్రసిద్ధుల గురించి వినడం ద్వారా 'మార్పు' గొప్పదనం ఏమిటో తెలుసుకుంది. 'మన భూగోళాన్ని రక్షించడానికి నేను సైతం' అంటూ ప్రయాణం ప్రారంభించింది. పర్యావరణ కార్యక్రమాలలో భాగంగా కింగ్ చార్లెస్‌లాంటి వారిని కలుసుకోవడం, గ్రామీ అవార్డ్ గ్రహీత మెజీ అలాబీ, మాజీ ఫుట్‌బాల్ స్టార్ డేవిడ్ బెక్హామ్‌తో కలిసి వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ప్రచారంలో పాల్గొనడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దృష్టిని ఆకర్షించింది.

'నేను ప్రొఫెసర్ మాథాయ్ కావాలనుకుంటున్నాను' అని చిన్నప్పుడు ఎల్లియానే తల్లితో అన్నప్పుడు ఆ తల్లి నుంచి తక్షణ స్పందనగా రావాల్సిన మాట... వెరీ గుడ్!

అయితే కూతురు నుంచి వచ్చిన మాట విని తల్లి భయపడింది. మాథాయ్‌ను మానసికంగా ఎలా గాయపరిచారో, కొట్టారో, జైల్లో పెట్టారో వివరంగా చెప్పింది. 'నువ్వు డాక్టర్ లేదా లాయర్ కావడం మంచిది' అని కూతురికి సలహా కూడా ఇచ్చింది ఆ తల్లి.

తల్లి చెప్పింది విని ఎల్లియానే భయపడి ఉండాలి. కానీ అలా జరగలేదు. పైగా ప్రొఫెసర్ మాథాయ్‌పై మరింత గౌరవం పెరిగింది.



ఎల్లియానే వాంజీ క్లిస్టన్

తొలిసారిగా ఒక విత్తనాన్ని నాటింది. అది మొలకెత్తిన అద్భుతాన్ని చూసింది. ఇక అప్పటినుంచి చెట్ల వెనక ఉన్న సైన్స్ గురించి తెలుసుకుంటూనే ఉంది. కెన్యా ఫారెస్ట్రీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో డాక్టర జేన్ జుగునా ద్వారా మొక్కల పెంపకానికి సంబంధించి పనిముట్ల నుంచి సరైన మట్టి వరకు ఎన్నో విషయాలు తెలుసుకుంది.

'చిల్డ్రన్ విత్ నేచర్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. ఈ సంస్థ ద్వారా పిల్లలకు పాఠాలు చెప్పింది. 'మీరు తలచుకుంటే మీ ప్రాంతంలో మార్పు తీసుకురావచ్చు' అని ధైర్యాన్ని ఇచ్చింది.

'2020 నాటికి వేలాది మొక్కలను నాటాను. కెన్యాలోనే కాకుండా విదేశాలలో కూడా ట్రీ లవర్స్ కమ్యూనిటీలను ఏర్పాటు చేశాను' అంటున్న ఎల్లియానే మొరాకో నుంచి జాంబియా వరకు తాను వెళ్లిన ఎన్నో దేశాలలో మొక్కలు నాటింది. అయితే వాతావరణ మార్పుల గురించి ప్రపంచ వ్యాప్తంగా వివిధ సదస్సులలో పాల్గొనడం వల్ల 'గతంతో పోల్చితే మొక్కల పెంపకంలో వెనక పడ్డాను' అనే బాధ ఎల్లియానేలో కనిపిస్తుంది.

చెట్ల పెంపకం సంగతి సరే, మరి చదువు సంగతి ఏమిటి? చదువులో ఎప్పుడూ ముందే ఉంటుంది ఎల్లియానే.

పిల్లలతోపాటు జంతువులపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని గురించి వివరించే 'సేవ్ అవర్ వైల్డ్‌లైఫ్' అనే డాక్యుమెంటరీలో కనిపించింది. ఈ డాక్యుమెంటరీలో తనకు ఇష్టమైన జంతువు ఏనుగు గురించి చెప్పింది. వేట కంటే మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల వాటికి కలుగుతున్న ముప్పు గురించి వివరంగా మాట్లాడింది.

'ఆఫ్రికాలోని గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటాలి అనేది నా కల' అంటుంది ఎల్లియానే. 'ఏదీ అసాధ్యం కాదు' అనేది ఎల్లియానే నోటినుంచి ఎప్పుడూ వినిపించే మాట.

గుర్తించారు... చాలు!



శ్రేయాంక పాటిల్

'కుదిరితే క్షమించు. లేదంటే శిక్షించు. కానీ మేమున్నామని గుర్తించత్తా. దయచేసి గుర్తించు. దయచేసి గుర్తించు..' అని అనేది ఓ సినిమాలో డైలాగ్! నిజమే.. క్షమించినా, శిక్షించినా, విమర్శించినా, ద్వేషించినా... అసలంటూ గుర్తించటమే కావలసింది. ఆటలోనైనా, బతుకు పోరాటంలోనైనా గెలుపోటములు ఎలా ఉన్నా ముందైతే గుర్తింపు ముఖ్యం. ఆ విషయాన్నే భారత మహిళా క్రికెట్ జట్టులోని ఆల్ రౌండర్ శ్రేయాంక పాటిల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంతో చక్కగా వ్యక్తం చేశారు. 'మీ అభిమానానికి, మీ విమర్శలకూ నిజంగా అభివందనాలు. ఈవిధంగానైనా మమ్మల్ని గుర్తించినందుకు ధన్యవాదాలు. ఓటమి మమ్మల్ని ఒకవైపు బాధిస్తున్నా, గెలుపు కోసం మరింతగా ఆకలిని మాలో రాజేసింది..' అని రాశారు. యూఏఈ లో ప్రస్తుతం జరుగుతున్న టి20 విమెన్స్ వరల్డ్ కప్‌లో భారత జట్టు సెమీస్‌కి క్వాలిఫై కాలేకపోయిన సంగతి అటుంచితే... ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రేయాంక పాటిల్ పెట్టిన ఈ పోస్ట్... ముఖ్యంగా స్పాన్సరర్లు మహిళల క్రికెట్ జట్టును గుర్తించి, మరింతగా ప్రోత్సహించవలసిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

మాజీ సీజే జస్టిస్ అంబటి లక్ష్మణరావు కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు (90) గురువారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమారులు ఉన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు తాలూకాలోని వెల్లలూరు గ్రామానికి చెందిన లక్ష్మణరావు మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. 1959లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 1982లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1995, ఫిబ్రవరి నుంచి అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి..1996 జనవరిలో పదవీ విరమణ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు విస్పర్ వ్యాలీ సమీపంలోని వైకుంఠ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

జేఎన్‌వీలో 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- ఆయా తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష
- దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 30, ప్రవేశ పరీక్ష జనవరి 8వ తేదీ

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో (జేఎన్‌వీ) 9వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను కోరుతూ జేఎన్‌వీ గురువారం ప్రకటన వెలువరించింది. ఆయా తరగతుల్లో లాటరల్ ఎంట్రీ ప్రవేశ పరీక్షకు హాజరు కావడానికి, అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 30వ తేదీగా నిర్ణయించారు. ప్రవేశ పరీక్షను 2025 జనవరి 8న నిర్వహించనున్నారు. దరఖాస్తులను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఆయా జిల్లా పరిధి లోని విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వెల్లడించారు. 9వ తర గతిలో ప్రవేశానికి 2010 మే 1 నుంచి 2012 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్ మొదటి సంవత్సరం (11వ తరగతి)లో అడ్మిషన్లకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతూ 2008 జూన్ 1 నుంచి 2010 జూలై 31వ తేదీ మధ్యన జన్మించిన వారై ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బలంగా ఎదుగుదాం

- ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమవుదాం
- క్షేత్ర స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టంగా నిర్మిద్దాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో వైఎస్ జగన్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: గ్రామ, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత వ్యవస్థీకృతంగా నిర్మించడం ద్వారా దేశంలోనే బలమైన పార్టీగా నిలుపుదామని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన పార్టీ ఏర్పాటు చేసుకుని దాదాపు 15 ఏళ్లు అవుతోందని, ఈ సమయంలో వివిధ రకాల ఎన్నికలు చూశామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నామని.. అధికారంలోనూ ఉన్నామని.. స్థానిక సంస్థలతో పాటు చాలా ఎన్నికల్లో పాల్గొన్నామని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నామని, గ్రామ స్థాయి నుంచి ప్రతి అడుగులోనూ పార్టీ యుద్ధం చేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగితేనే మంచి ఫలితాలను ఇస్తుందని, అప్పుడే మనం రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు శక్తివంతంగా ఉంటామని ఉద్బోధించారు. లోటుపాట్లు సరిదిద్దుకోవడానికి ఇప్పుడు తగినంత సమయం ఉందని, దానిని సద్వినియోగం చేసుకుందామని కోరారు. శాసనసభ, పార్లమెంటుకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తామంటున్నారని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేద్దామని జిల్లా అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మన కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా

- ఇవాళ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరైనా సగర్వంగా కాలర్ ఎగరేసుకుని ప్రతి ఇంటికీ వెళ్లగలం. కారణం మనం చెప్పిన ఎన్నికల మేనిఫెస్టో అన్నదాన్ని చెత్తబుట్టలో వేసే డాక్యుమెంటు కింద కాకుండా.. దేశ చరిత్రలోనే సరికొత్త అర్థం తీసుకువచ్చిన పార్టీ మనది. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ దానిలో చెప్పినవి తూచ తప్పకుండా అమలు చేశాం.
- రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌తో పాటే మనం పథకాలు అమలు చేసే తేదీలతో సహా సంక్షేమ క్యాలెండర్ రిలీజ్ చేసే వాళ్లం. నేరుగా బటన్ నొక్కి మధ్యలో దళారులు లేకుండా అక్కచెల్లెమ్మలకు ఆయా పథకాలు అందించింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదు. ఇవాళ ఈ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? వాళ్లు ఎన్నికలప్పుడు చెప్పిన మాటలేమిటి? ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూసి ఉండం. ఎన్నికలప్పుడు ప్రచారంలో వారిలా మనం అబద్ధాలు చెప్పలేకపోయాం. అదే మనకు వాళ్లకూ తేడా. విలువలు, విశ్వసనీయత అన్నది ముఖ్యం. ఐదేళ్లు ప్రతిపక్షంలో కూర్చుంటే తప్పేముంది?

4 నెలల్లోనే ఎప్పుడూ లేనంత వ్యతిరేకత

- మనం అమలు చేసిన హామీలే మనకు శ్రీరామ రక్ష. కేవలం నాలుగు నెలల్లోనే ఎప్పుడూ చూడని వ్యతిరేకత ప్రభుత్వం మీద కనిపిస్తోంది. వాళ్లు ఎవరి ఇంటికైనా వెళితే మా రూ.15 వేలు ఏమయ్యాయని పిల్లలు అడుగుతారు. మా రూ.18 వేలు ఏమయ్యాయని మహిళలు, రూ.48 వేలు ఏమయ్యాయని అవ్వలు, మా రూ.20 వేలు ఏమయ్యాయని రైతులు, మా రూ.36 వేలు ఏమయ్యాయని నిరుద్యోగ యువత అడుగుతారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం మరింతగా ప్రిపేర్ అవ్వాలి. ఒకవైపు హామీల అమలు లేకపోగా, మరోవైపు రాష్ట్రంలో పాలన దారుణంగా తయారైంది. దాదాపు రూ.2,400 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరోగ్య ఆసరా లేదు. ప్రభుత్వం ఆస్పత్రులు నిర్వీర్యం అయ్యాయి.
- మూడు త్రైమాసికాలు వచ్చినా, విద్యా దీవెన, వసతి దీవెన లేదు. ఇంగ్లిష్ మీడియం లేదు. సీబీఎస్ఈ లేదు. టోఫెల్ క్లాసులు లేవు. గోరుముద్ద కూడా పాడైపోయింది. అన్ని రంగాలూ దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయి. వ్యవసాయ రంగంలో ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా రైతులకు పెట్టుబడి సహాయం అందలేదు. ఉచిత పంటల బీమా గాలికి ఎగిరిపోయింది. ఈ-క్రాప్ ఏమైందో తెలియదు. ఆర్బీకేలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. రైతుల పంటలకు కనీస మద్దతు దక్కని పరిస్థితి.
- ఇంటి వద్దకు వచ్చే అన్ని సేవలూ నిలిచిపోయాయి. ఏం కావాలన్నా మళ్లీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పాలన వచ్చింది. ఇప్పటికే లక్షన్నర పెన్షన్లు తొలగించారు. లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఘోరంగా ఉంది. మహిళలకు భద్రత సున్నా. దిశ యాప్ ఏమైందో తెలియదు.

ప్రజల్లో ఆలోచన మొదలైంది

- వైఎస్సార్‌సీపీ, జగన్ వల్ల జరిగిన మంచి ఏమిటి.. అంటూ మనం చేసిన మంచి పనుల గురించి ప్రజలు ఇప్పుడు గుర్తు చేసు కుంటున్నారు. చెప్పినవన్నీ జగన్ చేశాడని ప్రతి ఇంట్లోనూ చర్చ జరుగుతోంది. ఎన్ని కల మేనిఫెస్టోలో చెప్పినవన్నీ చేశాడు. జగన్ మాకు పలావు పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నాడు. తీరా చూస్తే పలావు పోయింది.. బిర్యానీ లేదు.. అన్న చర్చ ప్రతి ఇంట్లోనూ జరుగుతోంది. ఫలానా మంచి మా హయాంలో జరిగిందని.. ప్రజల్లోకి మనం ధైర్యంగా వెళ్లగలుగుతాం. కానీ టీడీపీ కూటమి కార్యకర్తలు వెళ్లగలుగుతారా?
- టీడీపీ వాళ్లు ప్రజల ఇళ్లకు పోయే పరిస్థితుల్లేవు. చంద్రబాబు అబద్ధాలకు రెక్క లు కట్టారు. మనం ప్రజల్లోకి వెళ్లినప్పుడు, ప్రతి ఇంటికీ మన నాయకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసినప్పుడు, ఎవరింటికి పోయినా అందరూ సంతోషంగా దీవించారు. అయితే ఒకవైపు ఈవీఎంల వ్యవహారం, మరోవైపు టీడీపీ మోసపూరిత హామీలతోనే ఓడిపోయాం.

గతంలో మన పాలనలో అక్కచెల్లెమ్మలు ఫోన్ తీసుకుని బయటకు వెళ్లినప్పుడు, ఆపద ఎదురై ఫోన్ చేస్తే.. పది నిమిషాల్లో పోలీసులు వచ్చి ఏమైందని అడిగే పరిస్థితి ఉండేది. అవేవీ ఇప్పుడు లేవు. రాష్ట్రంలో దారుణంగా చిన్నారులను సైతం వదలకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. పోలీసులు దొంగ కేసులకు పరిమితం అయ్యారు. విధి నిర్వహణ మరిచిపోయి మూడు సింహాలకు కాకుండా, రాజకీయ నాయకులకు మడుగులొత్తుతున్నారు. ఎక్కడ చూసినా స్కాంలే కనిపిస్తున్నాయి.

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలి

- ఇప్పుడు నడుస్తున్నది సోషల్ మీడియా కాలం. ఇది నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నుంచి గ్రామ స్థాయి లీడర్ వరకు ధ్యాస పెట్టాల్సిన అంశం. ఇవాళ మనం యుద్ధం చేసేది చంద్రబాబుతోనే కాదు. ఒక చెడిపోయిన వ్యవస్థతో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, టీడీపీ తప్పుడు సోషల్ మీడియాలతో యుద్ధం చేస్తున్నాం. వాళ్లే అబద్ధాలు సృష్టిస్తున్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అందుకే మనం మరింత బలంగా తయారు కావాలి. ప్రతి గ్రామంలోనూ పార్టీ కమిటీలన్నీ సోషల్ మీడియాకు అనుసంధానం కావాలి.
- నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న అన్యాయాలు, ఆకృత్యాలు చూపించగలగాలి. రెండో వైపున పార్టీ సందేశాలు కూడా గ్రామ స్థాయికి వెళ్లాలి. ఇది సవాల్‌తో కూడిన కార్యక్రమం. ఇది చేయగలిగే వ్యవస్థ మనకుంది. వచ్చే రోజుల్లో దీనిపై బాగా దృష్టి పెట్టాలి. వైఎస్సార్‌సీపీని దేశంలో అత్యంత బలమైన పార్టీగా తయారు చేయాలి.

ఉన్నత విద్యలో మార్పులపై దృష్టి

- యువతను పోటీ ప్రపంచంలోకి తీసుకెళ్తా
- భావితరానికి పనికొచ్చే బోధన ప్రణాళిక
- మండలి కొత్త చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి. చిత్రంలో ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ పురుషోత్తం

సాక్షి, హైదరాబాద్: ఉన్నతవిద్యకు ప్రస్తుతమున్న చాలెంజ్‌లను అధిగమించడమే తన తొలి ప్రాధాన్యం అని ఉన్నత విద్యామండలి కొత్త చైర్మన్ ప్రొఫె సర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. సమాజంలో ఇప్పుడున్న పోకడలకు అనుగుణంగా సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతు న్నట్టు తెలిపారు. సాంకేతిక రంగం విసురుతున్న సరికొత్త సవాళ్లను ఎదుర్కొనే రీతిలో ఉన్నతవిద్యకు సానబట్టబోతున్నట్టు చెప్పారు. అంతిమంగా ప్రపంచంతో పోటీపడే స్థాయికి తెలంగాణ ఉన్నతవిద్యను తీసుకెళ్లేందుకు కృషి చేస్తాన న్నారు. హైదరాబాద్ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో గురువారం ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మీడియాతో మాట్లాడారు.

యువతకు ఊతమివ్వాలి

గ్రామీణ యువతకూ అత్యాధునిక సాంకేతికత అందాల్సిన అవసరం ఉందని బాలకిష్టారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీని తట్టుకునేందుకు రాష్ట్రంలోని ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దాలనే సంకల్పం ఉందన్నారు. ఈ దిశగా బోధన ప్రణాళికలో మార్పులు తెస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తామన్నారు. నేటితరం ఉపాధిని మెరుగు పరిచే సరికొత్త కోర్సులను తీసుకొస్తామని, నూతన విద్యావిధానం అమలుపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

మార్పునకు వర్సిటీలే కీలకం..

ఏ మార్పు అయినా వర్సిటీ నుంచి మొదలవుతుందని బాలకిష్టారెడ్డి విశ్వసించారు. అక్కడ మార్పు లేకుంటే మరెక్కడా పురోగతి ఉండబోదని తెలిపారు. వర్సిటీల్లో అధ్యాప కుల కొరత, మౌలిక సదుపాయాల లేమి వంటి సమస్యలున్నాయని అంగీకరించారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో తాను చేరినప్పటి నుంచి అందుబాటులోకి తెచ్చిన కోర్సులు, నిధుల సమీకరణకు జరిగిన ప్రణాళికను ఆయన ప్రస్తావించారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త చైర్మన్ నేతృత్వంలో మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, వైస్ చైర్మన్ మహమూద్ పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

జడ్జి గుర్తింపు కార్డు లాక్కున్నారు

టోల్‌గేట్ సిబ్బంది దురుసు ప్రవర్తన



నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి టోల్‌గేట్

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి టోల్‌గేట్ సిబ్బంది.. ఓ న్యాయమూర్తి కుటుంబం వెళ్తున్న కారుకు టోల్ ఫీజు చెల్లించినా జడ్జి గుర్తింపు కార్డు లాక్కోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. గురువారం ఓ జిల్లా జడ్జి కుటుంబ సభ్యులు కారులో ఖమ్మం వస్తున్నారు. ఈ క్రమంలో పైనంపల్లి టోల్‌గేట్ వద్ద డ్రైవర్.. న్యాయమూర్తి కారు అని చెప్పినా వినకుండా రుసుము చెల్లించాలని సిబ్బంది వాదనకు దిగారు. దీంతో డ్రైవర్ రుసుము చెల్లించారు. ఆపై న్యాయమూర్తికి చెందిన గుర్తింపు కార్డు చూపించగా.. సిబ్బంది దానిని లాక్కుని ఒరిజినల్ కార్డా, కాదా? అని తెలుసుకుని తర్వాత పంపిస్తామని దురుసుగా బదులిచ్చారు. ఈ విషయం తెలియడంతో ఆ న్యాయ మూర్తి టోల్‌గేట్ వద్దకు వచ్చి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. సూర్యాపేట జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌తో పాటు నేలకొండపల్లి పోలీసులు సైతం వచ్చి రుసుము చెల్లించినా న్యాయమూర్తి ఐడీ కార్డు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం టోల్‌గేట్ సిబ్బంది నుంచి కార్డు తిరిగి తీసుకున్నారు. ఈ ఘటనపై టోల్‌గేట్ సిబ్బంది మాట్లాడుతూ, చాలామంది నకిలీ కార్డులతో వస్తుండటంతో అనుమానం వచ్చి అడిగామని చెప్పడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి హైదరాబాద్‌లో ప్రొ కబడ్డీ లీగ్

ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌కు నగారా మోగింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నేడు ఈ టోర్నీ ప్రారంభమవుతుంది. మొత్తం 12 జట్లు బరిలో ఉన్నాయి. డిసెంబర్ 24 వరకు సాగే లీగ్ దశలో 132 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. హైదరాబాద్‌తో పాటు నోయిడా. పుణే ఇతర వేదికలుగా ఉన్నాయి. నేడు జరిగే రెండు మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో బెంగళూరు బుల్స్; ఢిల్లీ దబంగ్‌తో యు ముంబా ఆడతాయి. గురువారం జరిగిన ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో అన్ని జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. స్టేడియంలో ప్రత్యక్షంగా మ్యాచ్‌లు చూడాలనుకునే కబడ్డీ అభిమానులు bookmyshow ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు. రూ.500, రూ.1000, రూ. 2500లకు టికెట్లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు నవంబర్ 9వ తేదీన ముగుస్తాయి. ఆ తర్వాత నవంబర్ 10 నుంచి డిసెంబర్ 1 వరకు నోయిడాలో... డిసెంబర్ 3 నుంచి 24 వరకు పుణేలో మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్ దశ ముగిశాక టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

దక్షిణాఫ్రికా ధమాకా

- సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై సంచలన విజయం
- వరుసగా రెండోసారి టి20 ప్రపంచకప్ ఫైనల్లోకి



అనెకె బాష్

దుబాయ్: ఆరుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా జట్టుకు మహిళల టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా షాక్ ఇచ్చింది. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఆసీస్‌ను బోల్తా కొట్టించింది. తద్వారా సొంతగడ్డ (దక్షిణాఫ్రికా 2023)పై జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. ఇప్పటి వరకు ఎనిమిది సార్లు మెగా టోర్నీ జరిగితే ఏడు సార్లు ఫైనల్ చేరిన ఆస్ట్రేలియా జట్టును ఈసారి దక్షిణాఫ్రికా టైటిల్ పోరుకు దూరం చేసింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44; 2 ఫోర్లు), ఎలీస్ పెరీ (31; 2 ఫోర్లు), కెప్టెన్ తాలియా మెక్‌గ్రాత్ (27; 3 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో అయబొంగ ఖాకా 2, మరిజాన్ కాప్, ఎమ్‌లాబా చెరో వికెట్ తీశారు. తర్వాత దక్షిణాఫ్రికా మరో 2.4 ఓవర్లు మిగిలుండగానే 17.2 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్, ఓపెనర్ లౌరా వోల్‌వార్ట్ (37 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనెకె బాష్ (48 బంతుల్లో 74 నాటౌట్; 8 ఫోర్లు,1 సిక్స్) రెండో వికెట్‌కు చకచకా 96 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. నేడు రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో వెస్టిండీస్ తలపడుతుంది. ఇందులో గెలిచిన జట్టుతో ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికా ఆడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

46తో నగుబాటు

మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 ఆలౌట్

వికెట్‌కు ఇరువైపులా నాట్యం చేస్తున్న బంతిని రోహిత్ శర్మ ఆడలేక చేతులెత్తేశాడు. కోహ్లి, సర్ఫరాజ్‌లకు ఖాతా తెరిచే అవకాశం కూడా రాలేదు. ఆదుకుంటున్నట్లు అనిపించిన యశస్వి జైస్వాల్ ఆట కూడా ఎక్కువసేపు సాగలేదు. ఆ తర్వాత వరుసగా కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, అశ్విన్ 'సున్నా' చుట్టడంతో భారత స్కోరు 34/7. దాంతో నాలుగేళ్ల క్రితం నాటి '36 ఆలౌట్' కళ్ల ముందు తిరిగింది. ఎలాగో రిషభ్ పంత్ ఆ గండం దాటించి తానూ వెనుదిరిగాడు. నాటి అడిలైడ్ స్కోరుకు మరో 10 పరుగులు మాత్రమే అదనంగా జోడించిన తర్వాత టీమిండియా ఖేల్ ఖతం. సొంతగడ్డపై గతంలో ఎన్నడూ చూడని ఘోరమైన ప్రదర్శనతో భారత ఇన్నింగ్స్ ముగిసింది. వర్షం ఆగిన తర్వాత మనోళ్లు పరుగుల వరద పారిస్తారనుకుంటే అంతా తిరగబడి జట్టుపై పెద్ద పిడుగు పడింది.

హెన్రీ, రూర్కే, సౌతీ... ఈ ముగ్గురు కివీ పేసర్ల బౌలింగ్ చూస్తే టెస్టు జరుగుతోంది మన చిన్నస్వామి మైదానంలోనా లేక న్యూజిలాండ్‌లోనా అనిపించింది. ఒకరితో మరొకరు పోటీ పడుతూ ఈ పేసర్లు భారత జట్టు వెన్ను విరిచారు. పిచ్‌పై, గాల్లో తేమను సమర్థంగా వినియోగించుకుంటూ వీరు సీమ్ బౌలింగ్‌తో అదరగొట్టారు. ఈ బంతులకు మన బ్యాటర్ల వద్ద జవాబు లేకపోయింది. రోహిత్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి సౌతీ టీమిండియా పతనానికి శ్రీకారం చుట్టగా... జట్టు ఆట కట్టించే బాధ్యత మిగతా ఇద్దరు తీసుకున్నారు. ఫలితంగా ఐదుగురు భారత బ్యాటర్లు 'డకౌట్'లతో సరిపెట్టగా... ఇద్దరు మినహా మిగతా వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం కివీస్ బౌలర్ల ప్రతిభకు నిదర్శనం.

టాస్ గెలవడం... పరిస్థితులు ఎలా ఉన్నా బ్యాటింగ్ ఎంచుకొని భారీ స్కోరు సాధించడం... ఆపై ప్రత్యర్థిపై అన్ని రకాలుగా ఆధిపత్యం ప్రదర్శించి టెస్టును చేతుల్లోకి తెచ్చుకోవడం! సుదీర్ఘ కాలంగా సొంతగడ్డపై భారత జట్టు విజయసూత్రం ఇదే. అప్పుడప్పుడు ఆరంభంలో కాస్త తడబాటు ఎదురైనా తర్వాతి బ్యాటర్లు పరిస్థితిని చక్కబెడితే అంతా అనుకూలంగా మారిపోయేది. కానీ ఇప్పుడు కాస్త భిన్నమైన పరిస్థితి... ఈసారీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాం. కానీ పిచ్‌ను, వాతావరణాన్ని అంచనా వేయడంలో లెక్క తప్పాం... అనూహ్యంగా దూసుకొచ్చిన సవాల్‌ను ఎదుర్కొనే సన్నద్ధత లేక కుప్పకూలిపోయాం ... మూడో రోజు న్యూజిలాండ్‌ను ఎంత వరకు నిలువరించి టెస్టును కాపాడుకోగలమో చూడాలి.



రోహిత్ శర్మ

1 స్వదేశంలో భారత్‌కు ఇదే అత్యల్ప స్కోరు. 1987లో విండీస్‌పై భారత జట్టు 75 పరుగులకు ఆలౌటైంది.



కోహ్లి (0) సర్ఫరాజ్ (0) రాహుల్ (0) జడేజా (0) అశ్విన్ (0)

- స్వదేశంలో అత్యల్ప స్కోరు నమోదు
- టీమిండియాను కుప్పకూల్చిన కివీస్ పేసర్లు హెన్రీ, రూర్కే
- ప్రస్తుతం న్యూజిలాండ్ 180/3
- ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యం



కాన్వే

బెంగళూరు: తొలి రోజు పూర్తిగా వర్షార్పణమైన భారత్, న్యూజిలాండ్ మొదటి టెస్టు రెండో రోజు ఊహించలేని మలుపు తీసుకుంది. వాన లేకపోవడంతో నిర్ణీత సమయానికే ఆట ఆరంభమైన ఆనందం ఒక్కసారిగా ఆవిరైంది. కివీస్ పదునైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోలేక భారత జట్టు చెత్త ప్రదర్శనతో అవమానకర రికార్డులను మూటగట్టుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలో కేవలం 46 పరుగులకే ఆలౌటైంది. స్వదేశంలో మన జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. రిషభ్ పంత్ (20; 2 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (13; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మ్యాట్ హెన్రీ (5/15), విలియమ్ ఓ రూర్కే (4/22) భారత్‌ను కుప్పకూల్చగా... సౌతీకి ఒక వికెట్ దక్కింది. అనంతరం న్యూజిలాండ్ ఆట ముగిసే సమయానికి 50 ఓవర్లలో 3 వికెట్లకు 180 పరుగులు సాధించింది. డెవాన్ కాన్వే (91; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... రచిన్ రవీంద్ర (22 బ్యాటింగ్), డరైల్ మిచెల్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం కివీస్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. దాదాపు ఒక్క సెషన్ సమయంలోనే కివీస్ పూర్తిగా పైచేయి సాధించింది. 1 పరుగు వద్ద అదృష్టవశాత్తూ 'అంపైర్ కాల్'తో బయటపడిన రోహిత్ (16 బంతుల్లో 2)ను సౌతీ ఎక్కువ సేపు నిలవనీయలేదు. కోహ్లి (0) లెగ్ గల్లీలో క్యాచ్ ఇవ్వగా, సర్ఫరాజ్ (0) మరో అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. 13/3 వద్ద వానతో కొద్దిసేపు అంతరాయం ఏర్పడగా... ఆట మళ్లీ మొదలైన తర్వాత యశస్వి జైస్వాల్ వెనుదిరిగాడు. ఆ తర్వాత 9 బంతుల వ్యవధిలో రాహుల్ (0), జడేజా (0), అశ్విన్ (0) పెవిలియన్ చేరారు. 34 స్కోరు వద్ద పంత్ ఫోర్ కొట్టడంతో భారత్ తమ ఆల్‌టైమ్ అత్యల్ప స్కోరును దాటగలిగింది. పంత్ అవుటయ్యాక మిగిలిన రెండు వికెట్లు తీసేందుకు కివీస్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. 7 పరుగుల వద్ద పంత్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను బ్లన్‌డెల్ వదిలేయకుండా ఉంటే భారత జట్టు పరిస్థితి ఇంకా ఎలా ఉండేదో!

3 ఓవరాల్‌గా టెస్టు క్రికెట్‌లో భారత్‌కిది మూడో అత్యల్ప స్కోరు. గతంలో 36 (ఆస్ట్రేలియాపై అడిలైడ్‌లో: 2020లో), 42 (ఇంగ్లండ్‌పై లండన్‌లో 1974లో) చేసింది. ఉపఖండంలో గతంలో ఏ జట్టూ ఇంత తక్కువ స్కోరు చేయలేదు.

5 భారత్ తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌ల సంఖ్య. టాప్-8 బ్యాటర్లలో ఐదుగురు 'డకౌట్' కావడం 136 ఏళ్ల తర్వాత మళ్లీ జరిగింది. 1888లో మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఇలా జరిగింది.



హెన్రీ 5/15

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఎజాజ్ పటేల్ (బి) రూర్కే 13; రోహిత్ (బి) సౌతీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) రూర్కే 0; సర్ఫరాజ్ (సి) కాన్వే (బి) హెన్రీ 0; పంత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 20; రాహుల్ (సి) బ్లన్‌డెల్ (బి) రూర్కే 0; జడేజా (సి) ఎజాజ్ పటేల్ (బి) హెన్రీ 0; అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; కుల్దీప్ (సి) (సబ్) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 2; బుమ్రా (సి) హెన్రీ (బి) రూర్కే 1; సిరాజ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (31.2 ఓవర్లలో ఆలౌట్) 46. **వికెట్ల పతనం:** 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40, 10-46. **బౌలింగ్:** సౌతీ 6-4-8-1, హెన్రీ 13.2-3-15-5, ఓ రూర్కే 12-6-22-4.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33; రచిన్ (బ్యాటింగ్) 22; మిచెల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (50 ఓవర్లలో 3 వికెట్లకు) 180. **వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154. **బౌలింగ్:** బుమ్రా 10-4-23-0, సిరాజ్ 7-1-21-0, అశ్విన్ 11-1-46-1, కుల్దీప్ 12-1-57-1, జడేజా 10-0-28-1.

సాక్షి బిజినెస్
శుక్రవారం
18-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	495	81,007
నిఫ్టీ ▽	221	24,750

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		మార్పు
నాస్‌డాక్	18,482	△ 115
డోజోన్స్	43,275	△ 197
ఎఫ్‌టీఎస్ఈ 100	8,385	△ 56
డాక్స్	19,583	△ 151
షాంఘై	3,169	▽ 34
నికాయ్	38,911	▽ 269

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99 స్వచ్ఛత)	76,810
బంగారం (95 స్వచ్ఛత)	76,502
వెండి (కేజీ)	91,600

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.62	84.64
£	బ్రిటన్ పౌండ్	107.81	110.65
€	యూరో	90.01	92.63
¥	జపాన్ ఎన్ (100)	55.57	57.01
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.16	57.36
S$	సింగపూర్ డాలర్	61.64	66.33
SAR	సౌదీ రియాల్	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	22.00	23.78
¥	చైనా యువాన్	10.93	12.75

విప్రో 1:1 బోనస్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతంపైగా ఎగసి రూ. 3,209 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,646 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్రంగా తగ్గి రూ. 22,302 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 22,516 కోట్ల టర్నోవర్ అందుకుంది. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనుంది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెరసి వాటాదారులవద్దగల ప్రతీ షేరుకి మరో షేరుని డిసెంబర్ 15కల్లా ఉచితంగా కేటాయించే వీలుంది.

గైడెన్స్ వీక్

ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో పనిదినాలు తగ్గడం, సీజనల్ బలహీనతలు ప్రతికూల ప్రభావం చూపనున్నట్లు విప్రో సీఈవో, ఎండీ శ్రీని పల్లియా పేర్కొన్నారు. దీంతో క్యూ3 ఆదాయంలో వృద్ధి అంచనా(గైడెన్స్)లను –2 నుంచి 0 శాతానికి సవరించారు. ఇంతక్రితం –1 నుంచి +1% గైడెన్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రధాన క్లయింట్లను పెంచుకోవడంతోపాటు.. మరోసారి భారీ డీల్స్ బుకింగ్స్ బిలియన్ డాలర్లను దాటినట్లు పల్లియా వెల్లడించారు.

ఆన్‌బోర్డింగ్ పూర్తిచేస్తాం

ఈ డిసెంబర్‌కల్లా మొత్తం రిక్రూట్‌మెంట్ బ్యాక్‌లాగ్స్‌ను పూర్తి చేయనున్నట్లు విప్రో చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు 6 నెలల నుంచి 2ఏళ్లవరకూ ఆన్‌బోర్డింగ్‌ను ఆలస్యం చేస్తున్నట్లు వెలువడుతున్న విమర్శలకు చెక్ పెడుతూ గోవిల్ క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో అన్ని ఆఫర్లను క్లియర్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ప్రతీ త్రైమాసికంలోనూ 2,500–3,000 మంది ఫ్రెషర్స్‌ను తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం విప్రో మొత్తం సిబ్బంది సంఖ్య 2,33,889ను తాకింది.

- క్యూ2 లాభం రూ. 3,209 కోట్లు
- ప్రతీ క్వార్టర్‌లో ఫ్రెషర్స్‌కు ఉపాధి

44,000 మందికి శిక్షణ

క్యాప్‌కో పురోగతి కొనసాగుతున్నట్లు పల్లియా పేర్కొన్నారు. బీఎఫ్ఎస్ఐ, కన్జూమర్, టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ రంగాలలో వృద్ధిని అందుకున్నట్లు తెలియజేశారు. ఏఐ ఆధారిత విప్రోను పటిష్ట పరచేందుకు పెట్టుబడులు కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ ఏఐలో 44,000మంది ఉద్యోగులకు శిక్షణ పూర్తిచేసినట్లు వెల్లడించారు. సెప్టెంబర్‌లో ప్రతిభ ఆధారిత వేతన పెంపును చేపట్టినట్లు తెలియజేశారు.

షేరు బీఎస్ఈలో 0.7% నీరసించి రూ. 529 వద్ద ముగిసింది.

ఇన్ఫోసిస్ గైడెన్స్ అప్

క్యూ2 లాభం రూ. 6,506 కోట్లు • 20,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతుల దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 6,506 కోట్లను తాకింది. 4.4 శాతం అధికంగా రూ. 8,649 కోట్ల నిర్వహణ లాభం(ఇబిట్) ఆర్జించింది. 21.1 శాతం ఇబిట్ మార్జిన్లు సాధించింది. మొత్తం ఆదాయం సైతం 5 శాతం ఎగసి రూ. 40,986 కోట్లకు చేరింది. పూర్తి ఏడాదికి ఆదాయ అంచనాల(గైడెన్స్)ను తాజాగా మెరుగుపరచింది. 3.75–4.5 శాతం మధ్య వృద్ధి సాధించగలమని ప్రకటించింది. ఇంతక్రితం క్యూ1 ఫలితాల సమయంలోనూ ఆదాయ వృద్ధి అంచనాలను 1–3 శాతం నుంచి 3–4 శాతానికి పెంచిన విషయం విదితమే. వాటాదారులకు షేరుకి రూ. 21 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రికార్డ్ డేట్ ఈ నెల 29కాగా.. నవంబర్ 8కల్లా చెల్లించనుంది. డాలర్లలో ఆదాయం త్రైమాసిక వారీగా 4 శాతం ఎగసి 4.89 బిలియన్లను అధిగమించింది.

ఇతర విశేషాలు..

- మొత్తం 2.4 బిలియన్ డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను కుదుర్చుకుంది.
- ఆరు త్రైమాసికాలుగా ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తున్న ట్రెండ్‌కు క్యూ2లో చెక్ పడింది. నికరంగా 2,500 మందిని జత చేసుకుంది.
- సెప్టెంబర్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 3,17,788 కు చేరుకుంది.
- ఉద్యోగ వలసల రేటు 14.6% నుంచి 12.9 శాతానికి తగ్గింది.
- ఈ ఏడాది 15,000–20,000 మంది ఫ్రెషర్స్‌ను నియమించుకోనుంది. ఇప్పటికే తొలి అర్ధభాగంలో కొంత మందికి చోటిచ్చింది.

డిమాండ్ జూమ్



అన్నివైపుల నుంచి సాఫ్ట్‌వేర్ సేవలకు డిమాండ్ బలపడటం మెరుగైన గైడెన్స్‌కు సహకరించింది. ప్రధానంగా ఐటీ పరిశ్రమలో కీలకమైన ఫైనాన్షియల్ రంగ క్లయింట్ల నుంచి భారీ డీల్స్ పెరుగుతుండటం ప్రభావం చూపింది. కోబాల్ట్‌తో క్లౌడ్, టోపజ్‌తో జెన్‌ఏఐ ద్వారా కంపెనీ సామర్థ్యాలు మరింత బలపడ్డాయి. దీంతో క్లయింట్లు ఇన్ఫోసిస్‌తో జత కట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
– సలీల్ పరేఖ్, సీఈవో, ఎండీ

షేరు బీఎస్ఈలో 3% బలపడి రూ. 1,975 వద్ద ముగిసింది.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం 51 శాతం అప్

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూ2 లాభం 51% పెరిగి రూ. 913 కోట్లకు చేరింది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ. 8,412 కోట్ల నుంచి రూ. 9,849 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ. 3,028 కోట్ల నుంచి రూ. 3,410 కోట్లకు, నికర వడ్డీ మార్జిన్ 3.29% నుంచి 3.44 శాతానికి చేరాయి.



యాక్సిస్ బ్యాంక్ లాభం జూమ్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ క్యూ2 కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతంపైగా ఎగసి రూ.7,401 కోట్లను అధిగమించింది. స్టాండెలోన్ లాభం 18 శాతం పుంజుకుని రూ. 6,918 కోట్లకు చేరింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 5,864 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 31,660 కోట్ల నుంచి రూ. 37,142 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ.26,626 కోట్ల నుంచి రూ. 30,420 కోట్లకు మెరుగుపడింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం అధికమై రూ. 13,483 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.99 శాతానికి చేరాయి. స్లిప్పేజీలు రూ. 4,400 కోట్లను దాటాయి. వీటిలో రిటైల్ బుక్ రూ. 4,013 కోట్లుగా నమోదైనట్లు బ్యాంక్ సీఎఫ్‌వో పునీత్ శర్మ పేర్కొన్నారు. వీటిలో అన్‌సెక్యూర్డ్ రుణాలు అధికమని తెలియజేశారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.54 శాతం నుంచి 1.44 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.36% నుంచి 0.34 శాతానికి దిగివచ్చాయి.

యాక్సిస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 2% క్షీణించి రూ. 1,132 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

న్యూఢిల్లీలో రూ. 79,000 దాటిన బంగారం	పండుగ సీజన్లో విమాన ప్రయాణికుల జోరు

2 నెలల కనిష్టానికి సూచీలు

బ్యాంకులు, ఆటో, రియల్టీ షేర్లలో అమ్మకాలు • మార్కెట్ మూడోరోజూ డీలా



ముంబై: బ్యాంకులు, ఆటో, రియల్టీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు రెండు నెలల కనిష్టానికి దిగివచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 495 పాయింట్లు నష్టపోయి 81,007 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 221 పాయింట్లు పతనమై 24,750 వద్ద నిలిచింది. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఏ దశలో కోలుకోలేక రోజంతా బలహీనంగా కదలాడాయి. ఇంట్రాడేలో 596 పాయింట్లు క్షీణించి 80,906 వద్ద, నిఫ్టీ 242 పాయింట్లు కోల్పోయి 24729 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 1.65%, 1.42 శాతం చొప్పున నష్టపోయాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెబీకి విశాల్ మెగా మార్ట్ ఐపీవో ప్రాస్పెక్టస్

ప్రతిపాదిత రూ. 8,000 కోట్ల పబ్లిక్ ఆఫర్‌కి (ఐపీవో) సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించినట్లు సూపర్ మార్ట్ దిగ్గజం విశాల్ మెగా మార్ట్ తెలిపింది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉంటుందని పేర్కొంది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'బంగారానికి వెండి ఉచితం' ఆఫర్

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దీపావళికి ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాల బరువుకు సమానమైన వెండిని పూర్తిగా ఉచితంగా పొందవచ్చు. వజ్రాలపై ప్రతి క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్‌కట్ డైమండ్స్‌పై క్యారెట్‌కు 2 గ్రాముల వెండి, ప్లాటినం ఆభరణాల బరువుకు సమానమైన వెండి ఉచితంగా పొందవచ్చు. అలాగే వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25% తగ్గింపు, వెండి ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ గరిష్ట విక్రయ ధరపై 10 శాతం తగ్గింపు ఇస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని షోరూమ్‌ల్లో ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ పండుగ సీజన్‌లో 'బంగారానికి వెండి ఉచితం' ఆఫర్ కస్టమర్లకు మరింత ఆనందాన్ని అందిస్తుందని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

హ్యుందాయ్ ఐపీవోకు 2.4 రెట్ల స్పందన



కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా పబ్లిక్ ఇష్యూ సంస్థాగత ఇన్వెస్టర్ల అండతో గట్టెక్కింది. ఇష్యూ చివరి రోజు గురువారాని(17)కల్లా 2.4 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 9,97,69,810 షేర్లను ఆఫర్ చేయగా.. 23,63,26,937 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 7 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 60 శాతం, రిటైలర్ల నుంచి 50 శాతానికి మాత్రమే దరఖాస్తులు లభించాయి. షేరుకి రూ. 1,865–1,960 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 27,870 కోట్లు సమకూర్చుకుంది. ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ, దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ మొత్తం 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచింది. వెరసి రూ. 21,000 కోట్ల ఎల్ఐసీ ఐపీవో తదుపరి అతి పెద్ద ఇష్యూగా హ్యుందాయ్ మోటార్ ఇండియా రికార్డును సాధించింది. 2003లో కార్ల తయారీ జపనీస్ దిగ్గజం మారుతీ సుజుకీ ఐపీవో తరువాత మళ్లీ మరో ఆటో రంగ దిగ్గజం దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానుంది. ఈ వారం మొదట్లో హ్యుందాయ్ మోటార్ ఇండియా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 8,315 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-10-2024	
విశాఖ	505-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.40

సన్నబియ్యానికి 'నూకలు' చెల్లినట్టే!

▶ మొదటి పేజీ తరువాయి

నూకలు ఇస్తామనడం పట్ల పౌరసరఫరాల శాఖ అధికారులే విస్తుపోతున్నారు.

బ్యాంక్ గ్యారంటీలపైనా తకరారు!

ఖరీఫ్ సీజన్‌లో మిల్లర్లకు ధాన్యం కేటాయింపులో ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగానే బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలలో పొందుపరిచారు కూడా. దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించాల్సి ఉండగా, ముసాయిదాతోనే నిలిపివేసి, మంత్రులతో ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రైస్‌మిల్లు కెపాసిటీకి అనుగుణంగా కేటాయించిన ధాన్యం విలువలో 25 శాతం మేర బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి. మిల్లును లీజుకు తీసుకుంటే.. కేటాయించిన ధాన్యం విలువలో 50 శాతం మేర లీజుదారుడు చెల్లించాలి. అయితే ఈ బ్యాంక్ గ్యారంటీ నిబంధనలను మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడం అనేది తమకు తలకు మించిన భారమని, మిల్లింగ్ చార్జీలు కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించడం లేదని, ఏపీ వంటి రాష్ట్రాల్లో క్వింటాల్‌కు రూ.100 చెల్లిస్తుంటే మనరాష్ట్రంలో కేవలం రూ. 10 మాత్రమే ఇస్తున్నారని మిల్లర్లు చెబుతున్నారు. అది కూడా చాలా కాలంగా ఇవ్వడం లేదని వారి ఆరోపణ. ఈ నేపథ్యంలో బ్యాంకు గ్యారంటీలను ఎత్తివేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఒక సీజన్‌లో సీఎంఆర్ ఇవ్వకుండా డిఫాల్ట్ అయిన మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకొని ధాన్యం కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అంటే ఒక సీజన్‌లో సీఎంఆర్ డిఫాల్ట్ అయిన మిల్లర్లు తాము ఇవ్వాల్సిన బియ్యాన్ని అప్పగించడంతోపాటు అదనంగా 25 శాతం జరిమానా మొత్తానికి బ్యాంక్ గ్యారంటీ ఇస్తే వారికి ధాన్యం కేటాయిస్తారు. ఇలా ఒక సీజన్‌లో సీఎంఆర్ డిఫాల్ట్ అయిన మిల్లులు రాష్ట్రంలో 791 ఉన్నట్టు పౌరసరఫరాల సంస్థ తేల్చింది. రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయించమని మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో తేల్చిచెప్పారు. 386 మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా తేల్చడం గమనార్హం. మొత్తానికి బ్యాంకు గ్యారంటీల అంశం కూడా అటకెక్కినట్టేనని పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.



ముగింపు సభలకు హాజరైన క్రైస్తవులు

ముగిసిన కల్వరి ఉపవాస దీక్షలు

- జనసంద్రమైన సోమగూడెం కల్వరి చర్చి ప్రాంగణం

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోమగూడెంలోని కల్వరి చర్చి ప్రాంగణంలో కల్వరి మినిస్ట్రీ ఆధ్వర్యంలో 50 రోజులుగా సాగుతున్న ఉపవాస ప్రార్థనలు గురువారం రాత్రి ఘనంగా ముగిశాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ నలుమూలల నుంచి క్రైస్తవులు లక్షకు పైగా తరలి వచ్చారు. దీంతో సోమగూడెం–బెల్లంపల్లి ప్రాంతం జన సంద్రంగా మారింది. కల్వరి ప్రాంగణంలో నిర్వహించిన ముగింపు సభలో 50 రోజుల ఉపవాస దీక్షలు పూర్తి చేసిన పాస్టర్ ప్రవీణ్ ప్రత్యేక దైవ సందేశం ఇచ్చారు. జాతి, భాష, కుల, మతభేదాలు లేకుండా దేశ ప్రజలందరూ సుఖశాంతు లతో వర్ధిల్లాలనే ఆశయంతో దీక్షలు చేసినట్లు తెలిపారు. ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మత విద్వేషాలను రాజకీయాల్లోకి లాగకూడదని, ఎవరి మత విశ్వాసాలు వారికి ఉంటాయన్నారు. ఇతర మతాలను గౌరవించినట్లయితే ఎవరికీ అభద్రత ఉండదన్నారు. షారోన్ ఫౌండేషన్ నిర్వాహకురాలు సిస్టర్ షారోన్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్వేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు పాల్గొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

అధికారం పోయాక నిరుద్యోగులు గుర్తొచ్చారా?

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఏమీ చేయలేని మాజీ మంత్రి కేటీఆర్‌కు.. అధికారం పోయిన తర్వాత నిరుద్యోగులు గుర్తుకొచ్చారా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. ఎన్ని చేసినా కేటీఆర్‌ను నిరుద్యోగులు నమ్మరని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కనీసం యూనివర్సిటీల్లో నియామకాలు కూడా చేపట్టలేదని, జీతాలు అడిగిన ఆశావర్కర్లపై లాఠీ చార్జి చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో గురుకుల విద్యను నిర్లక్ష్యం చేశారని, కులాల వారీగా విద్యను విభజించి వివక్ష చూపారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో 60 వేల ఉద్యోగ నియామక పత్రాలను ఎల్బీ స్టేడియంలో పంపిణీ చేయడం కనిపించలేదా? అని దయాకర్ నిలదీశారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల విడుదల

తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి 2025 జనవరి కోటాను అక్టోబర్ 19న ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కాగా కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన జనవరి కోటాను అక్టోబర్ 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

23న అంగప్రదక్షిణ టోకెన్లు

జనవరికి సంబంధించిన అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను అక్టోబర్ 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు ఆన్‌లైన్ టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా

జనవరికి సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను అక్టోబర్ 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిల్లో జనవరి గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in ద్వారా శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఆస్పత్రులపై పోలీస్ నిఘా

ఆస్పత్రుల్లోని సీసీ కెమెరాలు ఠాణాలతో అనుసంధానం

- 24 గంటల కంట్రోల్ రూంతోపాటు బారికేడ్ల విధానం
- వైద్య సిబ్బందికి భద్రతపై మంత్రి దామోదర కీలక నిర్ణయం
- ప్రైవేట్ ఆస్పత్రుల మాదిరిగా రోగుల బంధువులకు విజిటర్స్ పాస్
- ఉత్తర్వులు జారీ చేసిన వైద్య,ఆరోగ్యశాఖ



సాక్షి, హైదరాబాద్: అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందికి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి దామోదర రాజనర్సింహ నిర్ణయం తీసుకోగా, వైద్య,ఆరోగ్యశాఖ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న సీసీ కెమెరాలను స్థానిక పోలీస్‌స్టేషన్లకు అనుసంధానించాలని మంత్రి ఆదేశించారు. ఆయా సీసీ కెమెరాల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కదలికలను పోలీసులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. అనుమానాస్పదంగా వ్యవహరించే వారిపై నిఘా పెడతారు. 24 గంటల కంట్రోల్ రూమ్‌తోపాటు బారికేడ్ల విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తారు. ఆస్పత్రి ప్రధాన గేట్ల వద్ద స్క్రీనింగ్, సీసీ కెమెరాలతో చెకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వాస్పత్రుల్లో సెక్యూరిటీ, వయలెన్స్ నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేస్తారు. ప్రజారోగ్య విభాగం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, వైద్యవిద్య విభాగం పరిధిలోని బోధనాస్పత్రుల్లో అన్నింటిలో ఈ కమిటీలు ఏర్పడనున్నాయి. ఈ కమిటీలు ఆస్పత్రుల భద్రత పెంపుతోపాటు వైద్య సిబ్బంది భద్రతకు కీలకంగా ఉంటాయి. ఆస్పత్రుల్లో కొన్ని సందర్భాల్లో రోగుల బంధువులు, డాక్టర్లు, ఇతరుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకొని దాడులకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది.

కమిటీ ఏర్పాటు ఇలా...


ఆస్పత్రి సూపరింటెండెంట్ చైర్మన్ / చైర్‌పర్సన్‌గా, సేఫ్టీ ఆఫీసర్ (ఆర్ఎంవో) కన్వీనర్‌గా, స్టేషన్ హౌస్ ఆఫీసర్, నర్సింగ్ సూపరింటెండెంట్, బయో మెడికల్ ఇంజినీర్, సెక్యూరిటీ స్టాఫ్ ఇన్‌చార్జ్, ఐఎంఏ మెంబరు, సీనియర్ డాక్టర్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్, సీనియర్ అలైడ్ హెల్త్‌స్టాఫ్ నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. సెక్యూరిటీ, వయలెన్స్ నియంత్రణ కమిటీలు రెండు వేర్వేరుగా పనిచేస్తాయి. ఈ రెండు కమిటీలకు చైర్మన్‌గా ఒకరే వ్యవహరిస్తారు.

కమిటీలు ఏం చేస్తాయంటే?

ప్రతిరోజూ ఆస్పత్రులను ఆడిట్ చేస్తాయి. మూడు షిఫ్టులలోని భద్రతపై ఆరా తీస్తాయి. ఆస్పత్రి బయట, వార్డులలోనూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయి. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల తరహాలోనే రోగుల సహాయకులు, బంధువులకు విజిటర్ పాస్ వ్యవస్థను అందుబాటులో తీసుకొస్తారు. డాక్టర్ల డ్యూటీ రూమ్స్, రెస్ట్ రూమ్స్, టాయిలెట్స్ వద్ద అదనంగా లైటింగ్, డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర వైద్య సిబ్బంది అందరికీ రక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాల పనితీరును చెక్ చేస్తూనే, వాటి సంఖ్య మరింత పెంచుతారు. సీసీ కెమెరాల ఫుటేజ్ స్టోరేజ్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తారు. ఎప్పటికప్పుడు ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్, ఫైర్‌సేఫ్టీ, మెడికల్ ఎక్విప్‌మెంట్, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌పై సమీక్షిస్తారు. చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుతూ, ఆస్పత్రుల సిబ్బంది భద్రతకు సెక్యూరిటీ సిబ్బందికి డ్రిల్, ట్రైనింగ్ ఇస్తారు.

టుడేస్ గ్రాఫిక్

వివిధ దేశాల ప్రజల సగటు నిద్ర గంటలు, నిద్ర రకాలు, గాఢత, నిద్రలేమి సమస్యలు వంటి వాటిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ, నేషనల్ స్లీప్ ఫౌండేషన్ తోపాటు మరికొన్ని సంస్థలు తాజాగా అధ్యయనం చేపట్టాయి. ఈ సర్వే ప్రకారం భారతీయులు సగటున 7.1 గంటలు నిద్రిస్తున్నారు. అత్యధికంగా నెదర్లాండ్స్‌వాసులు సగటున 8.1 గంటలు గుర్రుపెడుతుంటే అతితక్కువగా సూడాన్ జాతీయులు 5 గంటల సేపే నిద్రపోతున్నారు.



రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఐటీ దాడులు

- ఏకకాలంలో 35 ప్రత్యేక బృందాలతో సోదాలు

సాక్షి, హైదరాబాద్: విదేశీ పెట్టుబడులు సేకరించడంతోపాటు ఆదాయపన్ను చెల్లింపులలో అవకతవకలకు పాల్పడుతున్న పలు రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఆదాయపన్ను శాఖ అధికారులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని అన్విత బిల్డర్స్ సహా పలు కంపెనీల్లో ఐటీ అధికారుల బృందాలు గురువారం సోదాలు చేపట్టాయి. ఐటీ అధికారులతో కూడిన 35 ప్రత్యేక బృందాలు జూబ్లీహిల్స్, రాయదుర్గం, చైతన్యపురి, మలక్‌పేట్, కొల్లూరులోని అన్విత బిల్డర్స్, ప్రాపర్టీస్ కార్యాలయాల్లో తెల్లవారుజామున 6 గంటల నుంచి సోదాలు నిర్వహించాయి. ఏపీ, తెలంగాణలోని అన్విత గ్రూప్‌కు చెందిన బొప్పన శ్రీనివాస్‌రావు, బొప్పన్న అచ్యుతరావు ఇళ్లు, కార్పొరేట్ ఆఫీసుల్లో అధికారులు సోదాలు చేశారు. అన్విత గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నిర్వాహకులు సింగపూర్, దుబాయిలో ఇంటీరియర్ వ్యాపారం చేస్తున్నారు. విదేశాల్లో నిర్వహిస్తున్న వ్యాపారాల ద్వారా సమకూరిన డబ్బును అన్విత బిల్డర్స్ అండ్ ప్రాపర్టీస్‌లో భారీగా పెట్టుబడులుగా పెట్టినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. కొల్లూరులో ప్రీలాంచ్ ఆఫర్ ద్వారా భారీగా డిపాజిట్లు సేకరించినట్లు ఐటీ అనుమానిస్తోంది. ఈ మేరకు అన్విత గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌పై ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రాయదుర్గంలోని అన్విత బిల్డర్స్ ప్రధాన కార్యాలయంతో పాటు సంగారెడ్డి, కొల్లూరు, జూబ్లీహిల్స్‌లోని సంస్థ ఎండీలు, డైరెక్టర్ల ఇళ్లలో సోదాలు చేసింది. ఈ సోదాల్లో సంస్థ ఆడిట్ రికార్డులు, కంపెనీ ఆదాయ వ్యవహారాలకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు విదేశీ పెట్టుబడులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీఆర్‌పీఎఫ్ బలగాల బందోబస్తుతో ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాలు శుక్రవారం కూడా కొనసాగే అవకాశాలు ఉన్నట్టు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

సుజాత ఎక్కడ?

మావోయిస్టు అగ్రనేత ఆచూకీపై ఉత్కంఠ

- పోలీసుల అదుపులో ఉన్నారంటూ జోరుగా ప్రచారం
- ఇప్పటికీ ఖండించని పోలీసులు, మావోయిస్టులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/గట్టు: మావోయిస్టు అగ్రనేత సుజాత అలియాస్ పద్మ అలియాస్ మైనా అలియాస్ కల్పన ఎక్కడున్నారనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం ఆమెను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రచారం మొదలైంది. విప్లవ పోరాటంలో 40 ఏళ్లుగా అజ్ఞాత జీవితం గడుపుతున్న సుజాత ఇటీవల అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం తెలంగాణకు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె లొంగుబాటుకు ప్రయత్నించారా లేక మావోల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు ఒడుపుగా అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నారా అన్న అంశంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే సుజాత పోలీసుల అదుపులో ఉన్నారంటూ జరుగుతున్న ప్రచారంపై ఇటు పోలీసుల నుంచి గానీ, అటు మావోయిస్టు పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో మావోయిస్టు పార్టీలో సెంట్రల్ రీజనల్ బ్యూరో సభ్యురాలైన సుజాత ఇప్పుడు ఎక్కడ, ఎలా ఉన్నారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, భద్రాద్రి జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని ఓ జిల్లాలో సుజాతను పోలీసులు విచారిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

అందరి చూపూ ఆ ఊరి వైపే..

నక్సల్స్ ఉద్యమంలో సాధారణ స్థాయి నుంచి కీలక నేతగా ఎదిగిన సుజాత పోలీసులకు పట్టుబడ్డారనే వార్తల నేపథ్యంలో అందరి దృష్టి ఆమె స్వగ్రామం పెంచికలపాడు వైపు మళ్లింది. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, యంకమ్మ దంపతుల రెండో సంతానం సుజాత. సుమారు 40 ఏళ్ల క్రితం గద్వాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న క్రమంలో అన్న శ్రీనివాసరెడ్డితో కలిసి నక్సల్స్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. కొన్నేళ్ల తర్వాత తండ్రి తిమ్మారెడ్డి మరణంతో అన్న శ్రీనివాసరెడ్డి స్వగ్రామానికి వచ్చారు. దీంతో శ్రీనివాసరెడ్డికి కుటుంబ సభ్యులు వివాహం జరిపించడంతో ఆయన మళ్లీ ఉద్యమం వైపు వెళ్లకుండా గ్రామంలోనే ఉండిపోయారు. అయితే సుజాత మాత్రం తండ్రి మరణం తర్వాత కూడా స్వగ్రామం వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు తెలిపారు. మావోయిస్టు పార్టీలో ఒకప్పుడు అగ్రనేతగా పేరున్న కిషన్‌జీని సుజాత పెళ్లి చేసుకున్నారు. సుజాతకు కుమార్తె కూడా ఉన్నట్టు తెలిసింది. అయితే ఆమె ఎక్కడ ఉంటున్నారనే విషయం మాత్రం ఎవరికీ తెలియడం లేదు. మావోయిస్టుల ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించిన సుజాతపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గడ్‌లో రూ.కోటికి పైగా రివార్డు ఉంది.

వారి మద్దతే ధైర్యాన్నిచ్చింది

- కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలపై సినీ నటి సమంత



సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు నాగచైతన్య–సమంత విడాకుల వ్యవహారంపై ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలనుద్దేశించి నటి సమంత మరోసారి స్పందించారు. ఆ సమయంలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, అభిమానులు, ఇతరులు ఇచ్చిన మద్దతు తనకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని సమంత పేర్కొన్నారు. సమంత నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ సమాధానమిచ్చారు. ''నేను ఈ రోజు ఇక్కడ మాట్లాడుతున్నానంటే అందుకు కారణం ఎంతోమంది నాకు మద్దతుగా నిలవడమే. చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు, అభిమానుల ప్రేమ, వారికి నాపై ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. వాళ్లంతా నా పక్షాన నిలబడ్డారు కాబట్టే నేను ఈ ఇబ్బందికర పరిస్థితి నుంచి త్వరగా తేరుకోగలిగాను. లేకపోతే ఆ క్లిష్టపరిస్థితులను అధిగమించేందుకు ఇంకా సమయం పట్టేది'' అని సమంత అన్నారు. ఇక వరుణ్ ధావన్, సమంత ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్ నవంబర్ 7 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

మందుపాతర పేల్చిన మావోయిస్టులు

- చర్ల మండలం చెన్నాపురం వెళ్లే మార్గంలో ఘటన


చర్ల: పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఒక స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల సీఐ రాజువర్మ నేతృత్వంలో గురువారం ఉదయం స్పెషల్ పార్టీ పోలీసులు చర్ల నుంచి తాలిపేరు ప్రాజెక్టు మీదుగా చెన్నాపురం సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంపు వద్దకు వెళ్లారు. వారు తిరిగి వస్తుండగా గోరుకొండకు కిలోమీటర్ దూరంలో అటవీ ప్రాంతంలోని దారి పక్కన మావోయిస్టులు మందుపాతర పేల్చారు. అయితే పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలో విద్యుత్ స్తంభం ఉండటంతో శకలాలు దానికి తగిలి పడిపోయాయి. దీంతో పోలీసులకు పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతం మీదుగా పోలీసులు తరచూ చెన్నాపురం వైపు వెళ్తున్నారన్న సమాచారంతోనే మావోయిస్టులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

ఎకో–సెన్సిటివ్ జోన్‌గా పోచారం అభయారణ్యం

- ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: మెదక్ జిల్లా పోచారంలోని వన్యజీవి అభయారణ్యాన్ని ఎకో–సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు నిజామాబాద్ కలెక్టర్ చైర్మన్‌గా, మరో 9 మంది సభ్యులతో ఒక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసింది. ఇందులో మెదక్ జిల్లా కలెక్టర్ తరఫున ఒక ప్రతినిధి ఉంటారు. అలాగే పర్యావరణ రంగంలో పనిచేస్తున్న ఎన్జీవో ప్రతినిధి ఒకరు, జీవావరణ శాస్త్ర నిపుణుడు ఒకరు ఉంటారు. వీరిద్దరినీ తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా ఉన్న ప్రాంతీయ అధికారి ఒకరు, ఆ ప్రాంతానికి చెందిన సీనియర్ టౌన్ ప్లానర్ లేదా చీఫ్ అర్బన్ ప్లానర్, సిటీ ప్లానర్ సభ్యుడు ఒకరు, మెదక్ జిల్లా డివిజినల్ ఫారెస్ట్ అధికారి (టెరిటోరియల్) ఒకరు, నిజామాబాద్ జిల్లా డివిజినల్ ఫారెస్ట్ అధికారి (టెరిటోరియల్), అలాగే మెదక్ జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ ఒకరు, రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు సభ్యుడు ఒకరు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



మానేరు శోభకు మురిశారు

ఇది ప్రఖ్యాత చిత్రకారుడు గీసిన చిత్రం అనుకుంటే పొరపాటే. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులోని మానేరువాగులోని మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో సూర్యాస్తమయం వేళ ఈ దృశ్యం అబ్బురపరిచింది. సిరిసిల్ల–తంగళ్లపల్లి వంతెనపై నుంచి కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాన్ని వాహనచోదకులు ఆద్యంతం ఆస్వాదించారు.

– తంగళ్లపల్లి(సిరిసిల్ల)



సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: ఎగువనుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. నాలుగు రేడియల్ క్రస్ట్‌గేట్లను ఐదడుగుల మేరకు ఎత్తి.. స్పిల్‌వే మీదుగా దిగువ కృష్ణానదిలోకి 32,400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రధాన విద్యుదుత్పాదనతో మరో 29,557 క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు). ప్రస్తుతం ఇది గరిష్ట స్థాయిలో ఉంది. అదనంగా వచ్చే నీటిని బయటికి వదులుతున్నారు. 78,997 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. అంతేనీటిని విడుదల చేస్తున్నారు. గేట్లు, విద్యుదుత్పాదనతో 61,957 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి వదులుతుండగా, కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 17,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇలాగే వరద కొనసాగితే శుక్రవారం కూడా గేట్లు ఎత్తి ఉంచే అవకాశం ఉంది.

తరంతరం.. పసిడి మరింత ప్రియం!



ఊహకందని రీతిలో పెరిగిన బంగారం ధర

రోల్డ్‌గోల్డ్ ఆభరణాలే దిక్కంటున్న సామాన్యులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రపంచంలో ఏ వస్తువు ధర పెరగనంతగా బంగారం ధరలు పెరుగుతూ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. కనకం ధర పాతికేళ్ల కాలంలో ఊహించని స్థాయిలో పెరిగి కొండెక్కింది. గురువారం మార్కెట్‌లో మేలిమి బంగారం తులం (10 గ్రాములు) రూ.79 వేల మార్కును దాటింది. 2000 సంవత్సరంలో తులం బంగారం రూ. 4,400 ఉండగా ఇప్పుడు రూ.79 వేలకు చేరడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచంలో ఏ వస్తువుగానీ, లోహం ధరగానీ ఈ స్థాయిలో పెరిగిన దాఖలాలు లేవు. భారతీయులకు బంగారమంటే మక్కువ ఎక్కువ. శుభకార్యాలలో ఎవరి తాహతుకు తగ్గట్లుగా వారు ఆభరణాలను ధరిస్తుంటారు. కానుకలుగా బంగారం ఇస్తుంటారు. పెళ్లిళ్లలో అయితే తప్పనిసరి. కూతురు పెళ్లి చేయాలంటే తక్కువలో తక్కువ 5 తులాల బంగారం కట్నంగా పెట్టాల్సిందే. ఐదు తులాలు అంటే ప్రస్తుతం రూ. 4 లక్షలు అవుతుంది. ధర భారీగా పెరగడంతో సామాన్యులకు ఏం చేయాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. చాలామంది బంగారు ఆభరణాలను కొనలేని పరిస్థితిలో ఇమిటేషన్ జ్యువెలరీని ఆశ్రయిస్తున్నారు. బంగారం ధరల పెరుగుదలపై కామారెడ్డికి చెందిన మూడు తరాలవారితో 'సాక్షి' మాట్లాడింది. ఒక తరంలో ఉన్న ధరకు, తరువాతి తరంలో ఉన్న ధరకు పొంతన లేకుండా పెరుగుదల కనిపిస్తోందని వారు పేర్కొంటున్నారు.

1950 నుంచి బంగారం ధర వివరాలు..

సంవత్సరం	బంగారం ధర (రూ.లలో) (10 గ్రాములకి)
1950	99
1955	79
1960	111
1965	72
1970	184
1975	540
1980	1,330
1985	2,130
1990	3,200
1995	4,680
2000	4,400
2005	7,000
2010	18,500
2015	26,343
2020	48,650
2021	50,045
2022	52,950
2023	60,300
2024	79,000



నూరు రూపాయలుండే..

నా పెళ్లి 1954 సంవత్సరంలో అయ్యింది. అప్పుడు బంగారం తులం నూరు రూపాయలు ఉండేది. అప్పుడు ధర తక్కువే అయి నా సంపాదన కూడా తక్కువగానే ఉండేది. ఇప్పుడు ధరలు చాలా పెరిగిపోయాయి. బంగారం ధర వింటేనే భయమేస్తుంది.

– పొగాకు నర్సుబాయి, కామారెడ్డి



తులానికి రూ. 1400 ఉండేది..

నా పెళ్లి 1980 లో జరిగింది. అప్పట్ల తులం బంగారం ధర రూ. 1,400 ఉండేది. ఆ ధర ఇప్పుడు తక్కువ అనిపిస్తుంది కానీ అప్పటిది అప్పుడు, ఇప్ప టిదిప్పుడు అన్నట్టుగా నే ఉంది. బంగారం ధరలు బాగా పెరిగి, సామాన్యులు కొనుక్కోలేని పరిస్థితికి చేరింది.

– మైలారపు అంజలి, పొగాకు నర్సుబాయి కూతురు, కామారెడ్డి



తులానికి రూ.5,500 ఎక్కువ అనుకున్నం...

నా వివాహం 2003 సంవత్సరంలో జరిగింది. అప్పుడు తులం బంగారం ధర రూ.5,500 ఉండేది. అప్పట్లో ఆ ధరే చాలా ఎక్కువ అనుకున్నం. తరువాత ధరలు పెరుగుతూ వచ్చాయి. ఇప్పుడు రూ.79 వేలు అంటుంటే ఆశ్చర్యపోతున్నాం. ఇరవై ఏళ్లల్లో ధర అడ్డగోలుగా పెరిగింది.

– ముప్పారపు అపర్ణ, పొగాకు నర్సుబాయి మనవరాలు, కామారెడ్డి

ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురులు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురులది ఇష్టా రాజ్యంగా మారిందని, రాష్ట్రంలో ఏ మూల చూసినా విచ్చలవిడిగా ఇసుక దందాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో కాంగ్రెస్ ప్రభు త్వంపై ధ్వజమెత్తారు. కిందిస్థాయి నాయకుల నుంచి మంత్రుల వరకు ఇసుక దందా చేస్తూ దండుకుంటున్నారని, అధికారులకు మామూళ్లు ఇచ్చి మచ్చిక చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక వనరులను కొల్లగొట్టి ఖజానాకు చేరాల్సిన సొమ్మును కాంగ్రెస్ నేతలు జేబుల్లో నింపుకొంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల అండదండలతో అనధికార తవ్వకాలతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఢిల్లీలో గ్లోబల్ హెల్త్ సమ్మిట్

ఆపి అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ కత్తుల

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో కేన్సర్ వ్యాప్తిని, గుండె సంబంధిత వ్యాధులను తగ్గించే లక్ష్యంతో ఢిల్లీలో శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఆపి) అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ కత్తుల వెల్లడించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, ప్రపంచవ్యాప్తంగా వివిధ వైద్య విభాగాల్లో నిష్ణాతులైన భారతీయ వైద్యనిపుణులు, వైద్య పరిశోధకులు, వందలాది మంది వైద్యవిద్యార్థులు హాజరవుతున్నారన్నారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. దేశంలో కేన్సర్, గుండెపోటు జబ్బులపై జన్యుపరమైన అంశాలు, వాతావరణ పరిస్థితులు ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్న అంశాలపై నిపుణులు ఈ సదస్సులో తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజల జీవనశైలికి అనుగుణంగా ప్రభుత్వాలు విధాన నిర్ణయాలను తీసుకోవడం, కార్యక్రమాలను అమలు చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయన్నారు.

మిద్దె తోటల పెంపకంపై సిక్కిం ఆసక్తి



సాక్షి, హైదరాబాద్: మిద్దె తోటల పెంపకం, అర్బన్ సాగుపై కార్యాచరణ ప్రణాళికను తెలుసుకోవడానికి సిక్కిం రాష్ట్ర ఉద్యాన శాఖాధికారులు గురువారం తెలంగాణ రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు రెడ్‌హిల్స్, పబ్లిక్ గార్డెన్‌లోని హెర్బల్ యూనిట్లను సందర్శించారు. దీనిలో భాగంగా సిక్కిం రాష్ట్రంలో కూరగాయలు, పండ్లు, పూలు, హెర్బల్ గార్డెన్ సాగుకు పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ బిజు పెరియర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్‌సింగ్, డిప్యూటీ డైరెక్టర్ టెక్నికల్ విజయ ప్రసాద్, ఉద్యాన శాఖాధికారి మంగ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణది వేల ఏళ్ల వైభవం



భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చారిత్రకంగా, సాంస్కృతికంగా వేలాది సంవత్సరాల వైభవాన్ని కలిగి ఉందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ చెప్పారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఐదు రోజుల పాటు మధ్యప్రదేశ్‌లోని బిమ్బేట్కాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ భారతీయ సభ వేడుకలకు ప్రసంగకర్తగా ప్రత్యేక ఆహ్వానాన్ని అందుకున్న హరికృష్ణ గురువారం జాతీయ స్థాయి సెమినార్లో జానపద గిరిజన కళారూపాలపై ప్రసంగించారు. జానపద, గిరిజన కళారూపాల వికాసానికి, తెలంగాణ కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో తెలంగాణలోని అరుదైన జానపద గిరిజన కళారూపాలు జాతీయ స్థాయిలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయని స్పష్టం చేశారు. అవి సామాన్య ప్రజల జీవన విధానంలో అంతర్భాగమయ్యాయని హరికృష్ణ అభిప్రాయపడ్డారు.



చేప పిల్లల ఉచిత పంపిణీపై దృష్టి పెట్టండి

మెట్టు సాయికుమార్‌కు పిట్టల రవీందర్ హితవు

సాక్షి, హైదరాబాద్ : పిచ్చి ప్రేలాపనలు మాని చేప పిల్లల ఉచిత పంపిణీపై దృష్టి పెట్టాలని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ హితవు పలికారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం చేసి, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు మాజీమంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తారా అని గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. కుంటిసాకులు వెతుకుతున్న మీ పాలనపై మత్స్యకార కుటుంబాలు దుమ్మెత్తిపోస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలను బలోపేతం చేశారని, కొత్త జిల్లాల వారీగా మత్స్య సహకార సంఘాలు, అడ్డుగా ఉన్న నిబంధనలు తొలగించి 25గా ఉన్న సొసైటీలను 6,500కు పెంచారని, సభ్యుల సంఖ్యను నాలుగు లక్షలకు పెంచారని వెల్లడించారు. హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లకు సాయికుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



ఎల్లంబావి గ్రామంలో చేనేత కార్మికుడు శంకర్ ఇంటిలో రంగుల అద్దకాన్ని పరిశీలిస్తున్న యూకే మహిళలు

సహజ రంగులతో చేనేత వస్త్రాల తయారీ అద్భుతం

- బ్రిటన్ మహిళల కితాబు
- చేనేత కార్మికుడు దుద్యాల శంకర్ ఇంటిని సందర్శించిన మహిళలు

చౌటుప్పల్ రూరల్: ప్రకృతి నుంచి సేకరించిన మూలికలు, ఆకులు, కాయల నుంచి రంగులను తీసి చేనేత వస్త్రాలు తయారు చేయడం అద్భుతంగా ఉందని బ్రిటన్ దేశానికి చెందిన మహిళలు కితాబిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామంలో ప్రకృతి రంగులతో చేనేత వస్త్రాలు తయారు చేస్తున్న చేనేత కార్మికుడు దుద్యాల శంకర్ ఇంటిని గురువారం బ్రిటన్‌కు చెందిన మహిళలు సందర్శించారు. ప్రకృతి నుంచి లభించే వనరుల నుంచి వంద రకాల రంగులను తయారు చేసి నేటి తరానికి అనుకూలంగా ఫ్యాషన్లతో కూడిన చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నట్లు వారికి శంకర్ వివరించారు. చేనేత మగ్గాలను పరిశీలించి, బ్రిటన్‌లో కూడా సహజ రంగులతో వస్త్రాలు తయారు చేయడానికి ప్రయత్నం చేస్తామని ఆ మహిళలు తెలిపారు. జాతీయ స్థాయి అవార్డులు పొందిన చేనేత కార్మికుడు దుద్యాల శంకర్‌ను అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్, కోర్టులు ఏర్పాటు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి న్యాయవాది నవ్వుల మల్లారెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: భూ సమస్యల పరిష్కారం కోసం తక్షణమే ట్రిబ్యునల్, కోర్టులు ఏర్పాటు చేయాలని, అక్రమంగా భూ కబ్జాలు చేసేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయవాది నవ్వుల మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మల్లారెడ్డి లేఖ రాశారు. గత ప్రభుత్వం చేసిన భూ సమగ్ర సర్వే కొన్ని చోట్ల తప్పులతో కూడిన పాస్‌పుస్తకాలు ఇచ్చి భూములను వివాదాస్పదంగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలోని మొత్తం భూములను గ్రామాల వారీగా యూనిట్ తీసుకోవాలని, భూములను సర్వే నంబర్ల వారీగా రీ సర్వే చేయించి భౌతికంగా ఉన్న భూమి విస్తీర్ణ, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులకు అనుసంధానించాలన్నారు. అదేవిధంగా సరిహద్దులు, కొలతలు, లొకేషన్‌మ్యాప్‌లతో కూడిన పాస్‌బుక్‌లు ఇవ్వాలని, వాటికి చట్టభద్రత కల్పించాలని కోరారు. తహసీల్దార్ వ్యవస్థలో అవినీతి పెరిగిపోయిందని, ఆ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరారు.



వాల్మీకి, కొమురం భీంకు సీఎం నివాళి

వాల్మీకి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన నివాసంలో నివాళులర్పించారు, జంగిల్ ఔర్ జమీన్ పేరుతో పోరాటం చేసిన కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


– సాక్షి, హైదరాబాద్





కొమురం భీమ్ 84వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు వి. సర్వేశ్వర్ రెడ్డి, టీఆర్‌ఐ డైరెక్టర్ సముజ్వల, ట్రైకర్ జీఎం శంకర్ రావు తదితరులు

అందమైన గ్రామం.. అడవివరం



కొండవాలున గాలితెమ్మెర రివ్వున వీస్తూపోయింది. ఆకాశంలో కారు మబ్బు నేనున్నానంటూ నాలుగు చినుకులు రాల్చింది. ఊరి నడుమ అప్పన్న కోనేరులో గుడి గంట సుస్వరాలు పలికింది. నలుచెరగులా పచ్చదనం. ఎటుచూసినా ఆహ్లాదకర వాతావరణం. ఇదీ ప్రకృతి కాన్వాసుపై చిత్తరువులా కనిపిస్తున్న అడవివరం గ్రామం. ప్రశాంత వాతావరణంలో సేదతీరుతున్న బాటసారిలా ఉన్న గ్రామాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

అందమైన ఉగ్రసాగరం



అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. విశాఖ తీరాన కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. పెద్ద పెద్ద అలలు రక్షణ గోడను తాకుతుండటంతో సందర్శకులు గురువారం బీచ్‌లోకి అడుగుపెట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. భారీ అలలు తీరాన్ని తాకుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

హలో.. జాగ్రత్త సుమీ?



గుంతలు తేలిన రోడ్డు.. ఆపై ఒంటిచేతి సవారీ. సాధారణ పరిస్థితుల్లోనే ఇటువంటి రోడ్డుపై ప్రమాదానికి ఆస్కారం ఎక్కువ. ఇక ఒంటిచేతి డ్రైవింగ్ అయితే.. మరింత ప్రమాదకరం. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని పోలీసులు చెవిలో ఇల్లుకట్టుకుని చెబుతున్నప్పటికీ కొందరికి చెవికెక్కడంలేదు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో వాహన చోదకులు ఇలా ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,371 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,065 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి 8 గంటల సమయం పడుతోంది.

భక్తి శ్రద్ధలతో వాల్మీకి మహర్షికి పూజలు

కడప కల్చరల్: రామాయణ మహా కావ్యాన్ని రచించిన కారణజన్ముడు వాల్మీకి మహర్షి హిందూ పురాణాలకు గుర్తింపు గౌరవం కల్పించారని బీసీ నేతలు కొనియాడారు. బీసీల సంఘం నాయకులు, బీసీ కార్పొరేషన్ అధికారులు గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు.

అప్పన్నకు పౌర్ణమి తిరువీధి



సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం సాయంత్రం తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు కుమారాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.

వేడుకగా చినవెంకన్న కల్యాణం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం స్వామివారి తిరుకల్యాణోత్సవం గురువారం రాత్రి ఆలయ అనివెట్టి మండపంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఉంచి వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తి చేసిన తర్వాత శుభముహూర్తాన నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవింద నామస్మరణల నడుమ అట్టహాసంగా జరిపించారు. దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు శ్రీవారికి పట్టువస్త్రాలను, రాష్ట్ర ప్రభుత్వం తరఫున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారు ఉదయం సింహ వాహనంపై, కల్యాణ వేడుక అనంతరం రాత్రి వెండి గరుడ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రత్యేక అలంకరణల్లో భాగంగా ఆలయ ముఖ మండపంలో స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు.

వానల వేళ.. కాటేసే కరెంట్



విద్యాసంస్థలు విధిగా భద్రతా నియమాలు పాటించాలి

- ఎలక్ట్రిక్ వైరింగ్, స్విచ్‌లు, జాయింట్ల తనిఖీ తప్పనిసరి
- పాడైన ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను తక్షణం మార్చేయాలి
- ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రధాన బోర్డులకు కంచె వంటి ఏర్పాట్లు అవసరం
- ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగం సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. విద్యాసంస్థల్లో తరగతులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరిస్థితి మెరుగుపడిందికానీ, అనేక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో భద్రతా ప్రమాణాలు అంతంత మాత్రమే. పెచ్చులూడిపోయి నీరుకారే స్లాబులు, తడిచి చెమ్మెక్కిన గోడలు ఎక్కడికక్కడ కనిపిస్తూనే ఉంటాయి. అలాంటి విద్యాసంస్థల్లో వర్షాల వల్ల విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యుత్ వైర్లు, లైన్లు, స్విచ్ బోర్డులు, ఎర్తింగ్, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి వాటిపై ఆడిట్ నిర్వహించాలని ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలు విద్యుత్ ప్రమాదాల నివారణకు నియమాలు పాటించాలని సూచిస్తున్నారు.

ఈ నియమాలు పాటిస్తే మేలు





- ఎలక్ట్రిక్ వైరింగ్, స్విచ్‌లు, జాయింట్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి.. పాడైపోయిన, అరిగిపోయిన వాటిని వెంటనే మార్చాలి
- పాఠశాలలు, కళాశాలల ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రధాన బోర్డులకు తప్పనిసరిగా కంచె ఏర్పాటు చేయాలి
- పిల్లలు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- అన్ని ప్రైవేట్, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఎలక్ట్రికల్ సేఫ్టీ నిబంధనలను అనుసరించాలి
- భూమిలో ఉన్న స్తంభాలను సరిగ్గా ఇన్సులేట్ చేయాలి. అన్ని కేబుల్స్, జంక్షన్‌లను ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు, సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్‌లతో తనిఖీ చేయించాలి
- ప్రామాణిక, మంచి నాణ్యత గల ఎలక్ట్రిక్ పరికరాలను ఉపయోగించాలి. కేబుల్స్, ప్లగ్‌లు కరగకుండా నిరోధించాలంటే సాకెట్‌కు ఎక్కువ పరికరాలను కనెక్ట్ చేయకూడదు. ఒకవేళ ఎక్కువ పరికరాలు సర్క్యూట్‌లో ప్లగ్ చేస్తే.. కరెంట్ వైర్లు వేడెక్కి స్పార్క్ వచ్చి మంటలు చెలరేగుతాయి



- విద్యార్థులు, సిబ్బందికి లీకేజీలు, ఎలక్ట్రిక్ షాక్‌లను అరికట్టడం, బాధితులను రక్షించడం, షాక్‌కు గురైన వారికి ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాల్లో అవగాహన కల్పించాలి
- షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవిస్తే తప్పించుకోవడానికి వీలుగా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలి
- సబ్‌స్టేషన్లు, సరఫరా లైన్లకు దూరంగా పాఠశాలలు ఉండేలా చూసుకోవాలి
- ఓపెన్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్, జంక్షన్ బాక్స్, స్ట్రీట్ బాక్స్ మొదలైనవి కూడా పాఠశాలలకు సమీపంలో ఉండకూడదు
- పాఠశాల ఆవరణలోను, విద్యార్థులు వెళ్లే మార్గంలోను ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు పూర్తి స్థాయిలో కంచె వేయాలి
- విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఎలక్ట్రిక్ పరికరాల్లో మరమ్మతులు వస్తే తప్పనిసరిగా ఎలక్ట్రీషియన్ సహాయం తీసుకోవాలి. సొంతంగా మరమ్మతులు చేయకూడదు
- కుళాయి, నీళ్ల ట్యాంకులకు సమీపంలో ఎలక్ట్రికల్ ఉపకరణాలను ఉపయోగించకూడదు
- వర్షం, తుపానుల సమయాల్లో సరఫరా లైన్లు ఉన్న ఏ నిర్మాణం కింద ఆశ్రయం పొందకూడదు
- కరెంటు తీగలకు సమీపంలోని చెట్లు ఎక్కడం, తాకడం వంటివి చేయకూడదు
- ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతులకు మెటల్ నిచ్చెనలు ఉపయోగించకూడదు
- స్విచ్ ఆఫ్ చేసిన తరువాత మాత్రమే ప్లగ్‌ని పట్టుకుని కేబుల్స్‌ను డిస్‌కనెక్ట్ చేయాలి
- త్రీ పిన్ ఎర్త్ ప్లగ్‌లు, సాకెట్‌లను ఉపయోగించాలి. విరిగిన త్రీ పిన్ ప్లగ్‌లను ఎప్పుడూ వాడకూడదు
- ఎక్స్‌టెన్షన్ కేబుల్స్‌ను వినియోగించకపోవడమే మంచిది. తప్పదనుకుంటే ఒకే సామర్థ్యం (ఆంపియర్ రేటింగ్) ఉన్నదాన్ని ఎంచుకోవాలి
- అన్ని కనెక్షన్లు గట్టిగా, చెక్కుచెదరకుండా ఉన్నాయో లేదో నిర్ధారించుకుని.. ఏవైనా వదులుగా ఉంటే వెంటనే ఎలక్ట్రికల్ ఇన్‌చార్జికి తెలియజేయాలి
- కేబుల్స్ చాలా వేడిగా ఉన్నట్లు అనిపిందినా.. షాక్ తగిలినా.. పరిస్థితిని సంబంధిత అధికారులకు తెలియజేయాలి
- వర్షం నీటితో నిండిపోయిన రహదారుల్లో విద్యుత్ వైర్లు పడిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ దారిలో వెళ్లే వాహనాలు, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి
- ఎట్టి పరిస్థితుల్లోనూ స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలను తాకకూడదు



నిర్లక్ష్యమే ప్రాణాలు తీస్తోంది



మానవ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యుత్ చట్టం 2003 ప్రకారం.. విద్యుత్ ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టం నుండి ప్రజలను రక్షించడం ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ల కర్తవ్యం. అందులో భాగంగానే పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యాసంస్థలు తప్పనిసరిగా విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించాలి. మేం అందించిన సూచనల ప్రకారం నడుచుకోవాలి. తద్వారా విద్యార్థులను విద్యుత్ షాక్ నుంచి కాపాడుకోగలుగుతాం.

– జి.విజయలక్ష్మి, డైరెక్టర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ

విద్యా సమాచారం

ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీన ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సువర్ణలతా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీసెట్-2024 అర్హత సాధించి, ఇప్పటివరకు అడ్మిషన్ పొందని విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

స్విమ్స్‌లో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 19 నుంచి 21వ తేదీలోపు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు గురువారం పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు, సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, బోధనా విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఆరోగ్యకర వాతావరణంలో బోధించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ , 6వ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సీఈ ఎ. శివప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు నవంబర్ 2 లోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఏఎన్‌యూ పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఏపీపీజీసెట్- 2024లో ర్యాంకులు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

దూరవిద్య ప్రవేశాలకు 25తో ముగుస్తున్న గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశం పొందేందుకు తుది గడువు ఈనెల 25న ముగియనుందని సంస్థ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాత్రికి రాత్రే సర్దేశారు

కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో రూ.కోటి విలువైన బియ్యం మాయం

పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లో ఘరానా దొంగలు పడ్డారు. పేదల పొట్టనింపే రేషన్ బియ్యాన్ని బొక్కేశారు. విషయం బయటకు పొక్కడంతో కంగారు పడ్డారు. స్థానిక మంత్రి చాణక్యం.. ఓ డిప్యూటీ తహసీల్దార్ మేధస్సు.. కొత్తగా వచ్చిన డీఎం పనితనంతో రాత్రికి రాత్రే మళ్లీ గోడౌన్‌ను బస్తాలతో నింపేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 4 వేలకు పైగా బస్తాలు.. 260 టన్నులు.. సుమారు రూ.కోటికిపైగా విలువైన బియ్యం!! ఈ కథంతా తెలుసుకోవాలంటే ఏలూరు జిల్లా కైకలూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లాల్సిందే!

- 5 వేల బస్తాలు ఉండాల్సిన గోడౌన్‌లో కేవలం 400 బస్తాలే
- సుమారు 260 టన్నుల బియ్యాన్ని పక్కదారి పట్టించిన కేటుగాళ్లు
- కూటమి ప్రభుత్వం బియ్యం దందా బయట పడకుండా స్థానిక మంత్రి చాణక్యం

సాక్షి, అమరావతి: అలీబాబా.. 40 దొంగలు కథ గుర్తుందిగా? ''ఖుల్‌జా సిమ్‌సిమ్..'' అనగానే దొంగల ముఠా డబ్బులు దాచుకున్న గుహ తలుపులు తెరుచుకుంటాయి! పౌరసరఫరాల శాఖలో దీన్ని తలదన్నే చీకటి వ్యవహారం బట్టబయలైంది. మూడో కంటికి తెలియకుండా కాజేసిన వేల బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు రాత్రికి రాత్రే యథాస్థానంలో సర్దేశారు!

ఖాళీ గోడౌన్‌లో రోజంతా డ్రామా..

కైలూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం కాగితాల్లో మాత్రమే ఉండటం.. గోదాములో మాత్రం సరుకు లేకపోవడంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో, డీఎం, ఇతర అధికారులు బుధవారం ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించేందుకు వచ్చారు. గోడౌన్ మొత్తం ఖాళీగా కనిపించడం.. దాదాపు 5 వేల బస్తాలు ఉండాల్సిన చోట 400 మాత్రమే ఉండటం చూసి ఖంగుతిన్నారు. కూటమి నేతల నుంచి రాజకీయ ఒత్తిడితో బియ్యం దందా బయట పడకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇన్‌స్పెక్షన్ డ్రామా నడిపారు.

రాత్రికి రాత్రే నింపేశారు

స్థానిక మంత్రికి సన్నిహితుడిగా పేరు పొందిన ఓ డిప్యూటీ తహసీల్దార్ రంగంలోకి దిగి మాయమైన బియ్యం బస్తాల స్థానంలో కొందరు మిల్లర్ల దగ్గర నుంచి 4 వేలకుపైగా బస్తాల బియ్యాన్ని సేకరించి రాత్రికి రాత్రే గోడౌన్‌ను నింపేశారు. ఇటీవల ఏలూరు జిల్లాలో పౌరసరఫరాల సంస్థ డీఎంగా వచ్చిన ఓ అధికారి దగ్గరుండి దీన్ని పర్యవేక్షించినట్లు సమాచారం. గోడౌన్‌లో సరుకు లేకపోవడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీ పరారయ్యాడు. అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలోనూ సదరు ఇన్‌చార్జీ అక్కడ లేడు. సరుకు నింపిన తర్వాత గురువారం ఉదయం ఇన్‌చార్జీని రప్పించి గోడౌన్‌లో కూర్చోబెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

దొంగలను పట్టుకుంటారా?

ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చే సరుకు వివరాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేస్తారు. ఏ మిల్లు నుంచి వచ్చింది? బియ్యం సంచిపై ఎటువంటి స్టెన్సిల్ వాడారు? అది ఎప్పుడు వచ్చింది? లాంటి వివరాలు కచ్చితంగా నమోదవుతాయి. కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తే బియ్యం దొంగలు దొరకడం ఖాయం. కొద్ది నెలలకు ముందే బియ్యం నిల్వ చేస్తారు. ఇప్పుడున్న బియ్యాన్ని పరీక్షకు పంపితే అది పాతదో కొత్తదో తెలిసిపోతుంది. తద్వారా దొంగలను పట్టుకుని చట్టప్రకారం శిక్షించవచ్చు. కైకలూరు ఘటనలో కుట్రను కప్పిపుచ్చుకోవడమే మినహా దోషులను శిక్షించాలనే ఉద్దేశం ప్రభుత్వంలో కానరావడం లేదు.



బుధవారం కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు, వెనుకాల ఖాళీగా కనిపిస్తున్న గోడౌన్

నెల గడువు..

ఎంఎల్ఎస్ పాయింట్‌లో మాయమైన బియ్యం స్థానంలో కొత్త బియ్యం బస్తాలు తీసుకొచ్చి పెట్టడంతోనే తమ పని పూర్తయిందని దోపిడీని కవర్ చేసిన అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీ నెల రోజుల్లో సరుకు మొత్తం విలువ చెల్లించాలని గడువు ఇచ్చినట్లు తెలుస్తోంది. సదరు ఇన్‌చార్జి చేతులు ఎత్తేస్తే అందరం మునిగిపోతామని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

సీఆర్డీఏ ఖాతాల ఆడిట్‌కు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఏపీసీఆర్డీఏలో 2019 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి చివరి వరకు నిర్వహించిన ఖాతాలను ఆడిట్ కోసం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌కు అప్పగించనున్నారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, రాబడి, ఖర్చులను కాగ్ లేదా కాగ్ నియమించిన ఆడిటర్ సీఆర్డీఏ ఖాతాలను తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

తమిళనాడు తరహాలో గౌరవ వేతనం ఇవ్వాలి

మంత్రి ఫరూక్‌కు ప్రభుత్వ ఖాజీల వినతి

సాక్షి, అమరావతి: తమిళనాడు తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోను గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వ ఖాజీలు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఫరూక్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధుల బృందంతో సమావేశమయ్యారు. వారు తమ సమస్యల్ని మంత్రికి వివరించారు. ప్రభుత్వ ఖాజీల సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పాడి రైతులకు నాణ్యమైన సేవలందిస్తా

సాక్షి, అమరావతి: పాడి రైతులకు నాణ్యమైన సేవలందిస్తామని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టీ దామోదర నాయుడు పేర్కొన్నారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా పనిచేసిన రెడ్నం అమరేంద్రకుమార్ మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నియమితులైన డాక్టర్ దామోదరనాయుడు గురువారం పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనను పలువురు అధికారులు, సిబ్బంది అభినందించారు.

సంక్రాంతి సీన్ మారుతోంది!

తెలుగు సినిమాకు సంక్రాంతి సీజన్ అంటే చాలా స్పెషల్. వరుసగా సెలవులు ఉంటాయి కాబట్టి దాదాపు అన్ని సినిమాల వసూళ్లు బాగుంటాయి. ఒకవేళ హిట్ టాక్ తెచ్చుకుంటే ఇక ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో చాలా మంది హీరోలు, దర్శక - నిర్మాతలు వారి సినిమాలను సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలని పోటీ పడుతుంటారు. కానీ ఫైనల్‌గా బెర్త్ కొంతమందికే దొరుకుతుంది. 2025 సంక్రాంతి సమయం సమీపిస్తున్న తరుణంలో సంక్రాంతి బరిలో నిలిచేందుకు ఆయా చిత్రబృందాలు రెడీ అవుతున్నాయి. కానీ ఆల్రెడీ సంక్రాంతికి ప్రకటించిన సినిమాలు థియేటర్స్‌లోకి రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వాటి స్థానంలో వేరే సినిమాలు సంక్రాంతికి సై అంటున్నాయి. ఇలా సంక్రాంతి సినిమా సీన్ మారుతోంది. ఇక 2025 సంక్రాంతి బాక్సాఫీస్ పోరులోకి వెళదాం.


బాలకృష్ణ


రామ్‌చరణ్


వెంకటేశ్


సందీప్ కిషన్


సుమంత్


రవితేజ

నార్త్ ఇండియాలో...

ఈ సంక్రాంతి పండక్కి బాలకృష్ణ 109వ చిత్రం థియేటర్స్‌లోకి రానుంది. కేఎస్ రవీంద్ర ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఆల్రెడీ చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ దీపావళి సందర్భంగా టైటిల్, రిలీజ్ డేట్‌పై ఓ స్పష్టత రానుంది. ఈ సినిమాలో బాలకృష్ణ బందిపోటుగా కనిపిస్తారని, కథకు నార్త్ ఇండియా నేపథ్యం ఉంటుందని, విలన్‌గా బాబీ డియోల్, ఓ పోలీసాఫీసర్ పాత్రలో హీరోయిన్ ఊర్వశీ రౌతేలా కనిపిస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

మజాకా

ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్స్‌లో 'మజాకా' సెలబ్రేషన్స్ ఖాయం అంటున్నారు హీరో సందీప్ కిషన్. రవితేజతో 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తీసిన నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'మజాకా'. మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది.

మహేంద్రగిరి దేవాలయం

సంక్రాంతి వంటి పెద్ద పండక్కి మీడియమ్, స్మాల్ మూవీస్ కూడా రిలీజ్ అవుతుంటాయి. ప్రతి సంక్రాంతికి ఇలాంటి చిత్రాలు రెండు అయినా వస్తుంటాయి. ఏ చిత్రం ఆడియన్స్‌కు నచ్చితే అది పెద్ద హిట్ అయిన సందర్భాలు ఉన్నాయి. 2025 సంక్రాంతికి ఈ కోవలో వస్తున్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సుమంత్ హీరోగా, బ్రహ్మానందం మరో లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా ఇది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో కాలిపు మధు నిర్మిస్తున్నారు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుందని యూనిట్ పేర్కొంది.

సంక్రాంతికి వస్తున్నాం... కానీ!

'సంక్రాంతికి వస్తున్నాం' అనే వర్కింగ్ టైటిల్‌ని పెట్టుకుని మరీ వెంకటేశ్ అండ్ టీమ్ వర్క్ చేస్తున్నారంటే ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలని యూనిట్ ఎంతటి కృతనిశ్చయంతో ఉందో అర్థం చేసుకోవచ్చు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ఆల్రెడీ ప్రకటించింది. సినిమా చిత్రీకరణ కూడా శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో మాజీ పోలీస్ ఆఫీసర్‌గా వెంకటేశ్, అతని భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేష్, మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... మరోవైపు 'దిల్' రాజు నిర్మిస్తున్న మరో చిత్రం 'గేమ్ చేంజర్' కూడా సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఈ సంక్రాంతి పండక్కి రిలీజ్ అవుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సంక్రాంతి పండక్కి ఎన్ని పెద్ద సినిమాలు వచ్చినా స్పేస్ ఉంటుంది కాబట్టి తమ బేనర్‌లోని ఈ రెండు చిత్రాలనూ 'దిల్' రాజు పండగ బరిలో దింపుతారని ఊహించవచ్చు.

ఆఫీసర్ వస్తారా?

ఈ ఏడాది సంక్రాంతి సమయంలో రవితేజ హీరోగా నటించిన 'ఈగల్' సినిమా థియేటర్స్‌లోకి రావాల్సింది. కానీ సంక్రాంతి బరిలో నిలిచిన సినిమాల నిర్మాతల రిక్వెస్ట్, వివిధ సమీకరణాల నేపథ్యంలో 'ఈగల్' సినిమా సంక్రాంతి నుంచి తప్పుకుని, ఫిబ్రవరిలో విడుదలైంది. దీంతో 2025 సంక్రాంతికి తన సినిమాను రిలీజ్ చేయాలని రవితేజ ప్లాన్ చేశారు. రచయిత భాను భోగవరపును దర్శకుడిగా పరిచయం చేస్తూ, హీరో రవితేజ ఓ సినిమా చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాను 2025 సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇందుకు తగ్గట్లుగానే షూటింగ్ శరవేగంగా జరుపుకుంటూ వచ్చారు. కానీ ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్న సమయంలో రవితేజ భుజానికి గాయమైంది. దాంతో ఈ సినిమా చిత్రీకరణ సజావుగా సాగలేదు. ఈ నేపథ్యంలో ఈ సినిమా సంక్రాంతికి వస్తుందా? లేదా అనే విషయంపై మరో సారి క్లారిటీ రావాల్సి ఉంది. 'ధమాకా' సినిమా తర్వాత రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ లక్ష్మణ్ భేరి పాత్రలో రవితేజ నటిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

గేమ్ చేంజర్ రెడీ

సంక్రాంతి బరికి సిద్ధమయ్యారు రామ్‌చరణ్. తమిళ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాను తొలుత 2024 క్రిస్మస్‌కి రిలీజ్ చేయాలనుకున్నారు 'దిల్' రాజు. కానీ ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ అవుతున్న సినిమాల ట్రేడ్ బిజినెస్, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్స్ సూచనల మేరకు 'గేమ్ చేంజర్' సినిమా రిలీజ్‌ను 2024 క్రిస్మస్ నుంచి 2025 సంక్రాంతికి వాయిదా వేసినట్లుగా నిర్మాత 'దిల్' రాజు ఇటీవల ఓ వీడియోలో వెల్లడించారు. 2025 జనవరి 10న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇక 'గేమ్ చేంజర్' సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లుగా, నవీన్‌చంద్ర, ఎస్‌జే సూర్య, జయరాం, సునీల్, ప్రియదర్శి వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం ఇది. ఇక సార్వత్రిక ఎన్నికల సమయంలో ఐఏఎస్ ఆఫీసర్ల విధులు, హక్కులు, వారికి ఉండే ప్రత్యేక అధికారాలు వంటి అంశాల నేపథ్యంలో 'గేమ్ చేంజర్' ఉంటుందని టాక్.


చిరంజీవి

2025 జనవరి 10న సంక్రాంతి సందర్భంగా 'విశ్వంభర' చిత్రం రిలీజ్ కావాల్సింది. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ ఈ సినిమా నిర్మిస్తోంది. కానీ 'విశ్వంభర' జనవరి 10న రిలీజ్ కావడం లేదు. 'విశ్వంభర' సినిమా వర్క్ ఆల్మోస్ట్ పూర్తయిపోయిందని, రామ్‌చరణ్- 'దిల్' రాజుగార్ల కోసం చిరంజీవిగారితో మాట్లాడి 'విశ్వంభర' రిలీజ్‌ను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చిత్రదర్శకుడు వశిష్ఠ పేర్కొన్నారు. ఇక 'విశ్వంభర' చిత్రం వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ కానున్నట్లుగా తెలుస్తోంది. అలాగే 2025 సంక్రాంతి సందర్భంగా తాను హీరోగా నటించే ఓ సినిమా థియేటర్స్‌లోకి వస్తుందన్నట్లు నాగార్జున గతంలో పేర్కొన్నారు. కానీ ఇది సాధ్యపడేలా లేదు. అయితే నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'తండేల్' చిత్రం 2025 సంక్రాంతి సందర్భంగా రిలీజ్ అవుతుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. కానీ ఓటీటీ డీల్స్, పర్‌ఫెక్ట్ రిలీజ్ డేట్స్ వంటి అంశాలను పరిశీలించుకుని 'తండేల్' సినిమా సంక్రాంతి రిలీజ్‌పై చిత్రయూనిట్ ఓ స్పష్టతకు వస్తారట. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' సినిమాకు చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.


నాగచైతన్య

సంక్రాంతి బరిలో స్ట్రయిట్ చిత్రాలతో పాటు ఒకటి లేదా రెండు తమిళ హీరోల చిత్రాలు కూడా రిలీజ్‌కు రెడీ అవుతుంటాయి. ఇలా 2025 సంక్రాంతికి అజిత్ హీరోగా నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' థియేటర్స్‌లోకి రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాల్ 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అజిత్ క్యారెక్టర్‌లో మూడు వేరియేషన్స్ ఉంటాయి.


అజిత్

\- ముసిమి శివాంజనేయులు


పూజా హెగ్డే

శ్రీలంకలో ఖుషీ ఖుషీగా

శ్రీలంకలో ఖుషీ ఖుషీగా బర్త్ డే సెలబ్రేట్ చేసుకున్నారు పూజా హెగ్డే. ఈ నెల 13న హీరోయిన్ పూజాహెగ్డే బర్త్ డే. ఈ సందర్భంగా ఆమె శ్రీలంకలోని యాల నేషనల్ పార్క్‌కు వెళ్లారు. కోస్టల్ ఏరియాలోని అక్కడి లొకేషన్స్‌లో బస చేసి, ఎంజాయ్ చేశారు. ఆ ఫొటోలను పూజా హెగ్డే సోషల్ మీడియాలో షేర్ చేయగా, వైరల్ అవుతున్నాయి. ఇక హిందీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించిన 'దేవా' చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. అలాగే విజయ్, సూర్య చిత్రాల్లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు.

హే తారా..!


రుక్మిణీ వసంత్, నిఖిల్ సిద్ధార్థ్

'కార్తికేయ 2' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు సొంతం చేసుకున్న నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ద్వారా కన్నడ హీరోయిన్ రుక్మిణీ వసంత్ టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. దివ్యాంశా కౌశిక్, హర్ష చెముడు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. బాపినీడు బి. సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దీపావళి సందర్భంగా నవంబర్ 8న విడుదల కానుంది. సింగర్ కార్తీక్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ సినిమా నుంచి 'హే తారా..' అంటూ సాగే మెలోడీ పాటను గురువారం విడుదల చేశారు మేకర్స్. కృష్ణ చైతన్య సాహిత్యం అందించిన ఈ పాటని కార్తీక్, నిత్యశ్రీ పాడారు. హీరో, హీరోయిన్ మధ్య ప్రేమ, కెమిస్ట్రీని తెలిపేలా ఈ పాట సాగుతుంది. ''స్వామి రారా, కేశవ' వంటి చిత్రాల తర్వాత నిఖిల్, సుధీర్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. ముక్కోణపు ప్రేమకథగా రూపొందుతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమాకు నేపథ్య సంగీతం: సన్నీ ఎంఆర్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్.

ఒకే రోజు... రెండు లొకేషన్లలో...


నిధీ అగర్వాల్

''సినిమా తారల జీవితంలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. కొన్ని సంఘటనలు కృతజ్ఞతా భావంతో ఉండిపోయేలా, కొన్ని ఆశీర్వాదంలా అనిపిస్తాయి'' అంటున్నారు నిధీ అగర్వాల్. ఈ బ్యూటీ ఇలా అనడానికి కారణం ఉంది. ఒకే రోజు రెండు సినిమాల షూటింగ్స్‌లో పాల్గొంటూ బిజీ బిజీగా గడిపారామె. ఈ బిజీని ఉద్దేశించే నిధీ అగర్వాల్ ఇలా పేర్కొన్నారు. పైగా ఈ రెండూ కూడా పాన్ ఇండియా చిత్రాలే కావడం విశేషం. ఇంతకీ ఆ రెండు సినిమాలు ఏంటీ? అనే విషయానికొస్తే... ఒకటి ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'రాజా సాబ్'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు నిధి. అలాగే పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతున్న 'హరి హర వీరమల్లు'లోనూ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ''ఒక సినిమా ('హరి హర వీరమల్లు) షూటింగ్ ఆంధ్రలో, మరో సినిమా ('రాజా సాబ్') షూటింగ్ తెలంగాణలో జరుగుతుంటే... ఒకే రోజు రెండు సినిమాల షూటింగ్స్‌లో పాల్గొన్నాను. ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న రెండు పాన్ ఇండియా సినిమాల షూటింగ్స్‌లో ఒకే రోజు పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది'' అని పేర్కొన్నారు నిధీ అగర్వాల్. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్', జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' చిత్రాలు రూపొందుతున్నాయి.

తల్లి కానున్న రాధికా ఆప్టే



'రక్తచరిత్ర, రక్తచరిత్ర 2, లెజెండ్, లయన్' వంటి చిత్రాలతో బాలీవుడ్ హీరోయిన్ రాధికా ఆప్టే తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీలైనప్పుడు షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ నటిగా ఎప్పుడూ బిజీగా ఉంటుంటారామె. తాజాగా రాధిక వ్యక్తిగత జీవితంలో ఓ కొత్త అధ్యాయం మొదలైంది. ప్రస్తుతం ఆమె గర్భవతి. కాగా లండన్‌లో జరుగుతున్న 68వ బీఎఫ్ఐ లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'సిస్టర్ మిడ్‌నైట్' సినిమా ప్రీమియర్ స్క్రీనింగ్‌కు హాజరయ్యారు రాధిక. ఈ సందర్భంగా అక్కడి రెడ్ కార్పెట్‌పై దిగిన ఫొటోలను రాధికా ఆప్టే షేర్ చేశారు. ఈ ఫొటోల్లో రాధిక బేబీ బంప్‌తో కనిపించారు. ఇలా తాను గర్భవతిని అనే విషయాన్ని రాధిక ఆప్టే స్పష్టం చేశారు. ఇక 2012లో విదేశీ సంగీత వాయిద్యకారుడు బెనెడిక్ట్ టేలర్‌ను వివాహం చేసుకున్నారు రాధికా ఆప్టే. పన్నెండేళ్ల తర్వాత రాధికా ఆప్టే తల్లి కానుండటంతో రాధికా ఆప్టేకు ఆమె అభిమానులు సోషల్ మీడియా ద్వారా 'కంగ్రాట్స్... రాధిక' అంటూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు కామెడీ డ్రామాగా రూపొందిన 'సిస్టర్ మిడ్‌నైట్' చిత్రంలో రాధికా ఆప్టే ఓ లీడ్ రోల్‌లో నటించగా, కరణ్ కంధారి దర్శకత్వం వహించారు.

జై హనుమాన్‌లో..?


రిషబ్ శెట్టి

'జై హనుమాన్' సినిమాలో రిషబ్ శెట్టి నటించే అవకాశం ఉందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'హనుమాన్'. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలాగే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'జై హనుమాన్' సినిమాలో ఎవరు హీరోగా నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. చిరంజీవి, రామ్‌చరణ్ వంటి స్టార్స్‌ను పరిశీలిస్తున్నట్లుగా ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన చైతన్య చెప్పారు. అయితే తాజాగా ఈ సినిమాలో కన్నడ హీరో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నిరంజన్ రెడ్డి, చైతన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రస్తుతం 'కాంతార' సినిమా ప్రీక్వెల్‌తో బిజీగా ఉన్నారు రిషబ్ శెట్టి. మరి... 'జై హనుమాన్' సినిమాలో రిషబ్ శెట్టి నటించనున్నారనే వార్త నిజమేనా? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే.

బిజినెస్ రీల్

రూ. 79,000 దాటిన పసిడి



న్యూఢిల్లీ: బంగారం పరుగు ఆగడం లేదు. దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం ముగింపు ధరతో పోల్చితే గురువారం 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర రూ.450 ఎగసి రూ.79,350కి చేరింది. ఇది ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి. ఇక 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.78,950కి ఎగసింది. పండుగల సీజన్ నేపథ్యంలో ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్, భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడ్ ఫండ్ సరళతర వడ్డీరేటు విధానం, డాలర్ బలహీనత వంటి అంశాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ధరలో పటిష్టత దేశీయంగా పసిడి ధర పటిష్టతకు కారణం. రూపాయి బలహీనత కూడా బంగారం ధర పరుగుకు ఒక కారణంగా ఉంది.

ఇక రుణ సెక్యూరిటీలలో లిక్విడిటీ

ట్రేడింగ్‌కు వీలు కల్పించనున్న సెబీ

న్యూఢిల్లీ: రుణ సెక్యూరిటీలకు లిక్విడిటీని కల్పించేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ట్రేడింగ్ చేసేందుకు విండోను ప్రవేశపెట్టనుంది. వెరసి లిస్టెడ్ రుణ సెక్యూరిటీలు కలిగిన ఇన్వెస్టర్లు వీటిని జారీ చేసిన సంస్థలకు తిరిగి విక్రయించేందుకు వీలు కలగనుంది. ఇందుకు ప్రత్యేకించిన తేదీలలో పుట్ ఆప్షన్‌ను వినియోగించుకునేందుకు సెబీ తెరతీయనుంది. వచ్చే నెల(నవంబర్) 1నుంచి తాజా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లకు ఇది ప్రయోజనకారిగా నిలవనుంది. తద్వారా రుణ సెక్యూరిటీలలో మరిన్ని పెట్టుబడులకు దారిచూపనున్నట్లు ఒక సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. సాధారణంగా కార్పొరేట్ బాండ్లను సంస్థాగత ఇన్వెస్టర్లు గడువు తేదీవరకూ హోల్డ్ చేస్తుంటారు. ఫలితంగా లిక్విడిటీకి వీలుండదు. దీంతో ప్రత్యేకించి రిటైల్ ఇన్వెస్టర్లకు లిక్విడిటీ సౌకర్యాన్ని కల్పించే యోచనతో సెబీ తాజా మార్గదర్శకాలను తెరమీదకు తీసుకువచ్చింది.

భారత్ నుంచి మరిన్ని కొనుగోళ్లు: వాల్‌మార్ట్

న్యూఢిల్లీ: దీపావళి సందర్భంగా అమెరికా మార్కెట్ కోసం మరిన్ని భారత సంస్థల నుంచి ఆహారోత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్లు రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ తెలిపింది. బికానో, బ్రిటానియా, జయంతి స్పైసెస్ వంటి బ్రాండ్స్ నుంచి ఈ జాబితాలో ఉన్నట్లు పేర్కొంది. సంప్రదాయ తినుబండారాలు, మసాలా దినుసులు, రెడీ టు ఈట్ ఆహారోత్పత్తులు, స్నాక్స్ మొదలైనవి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపింది. 2027 నాటికి భారత్ నుంచి ఏటా 10 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని పెట్టుకున్నామని వాల్‌మార్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రియా ఆల్‌బ్రైట్ తెలిపారు.

నేటి బోర్డు సమావేశాలు

హిందుస్తాన్ జింక్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, జీఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, ఐసీఐసీఐ లాంబార్డ్, బెనారస్ హోటల్స్, ఒబెరాయ్ రియల్టీ, అజ్మీరా రియల్టీ, ఏథర్ ఇండస్ట్రీస్, తేజాస్ నెట్‌వర్క్స్, మాస్టెక్, కేశోరాం, ఇండోస్టార్ క్యాపిటల్, ఐఐఎల్ ఫైనాన్స్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,974.55	2.84
TECHM	1,707.00	2.81
POWERGRID	331.15	1.21
LT	3,566.00	0.95
SBIN	811.3	0.73

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	10,093.50	-13.11
SHRIRAMFIN	3,251.20	-4.11
M&M	2,960.00	-3.52
NESTLEIND	2,377.65	-3.44
HEROMOTOCO	5,214.95	-3.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,045
ఎన్ఎస్ఈ	99,892
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,13,983
ఎఫ్ఐఐ	- 7,421
డీఐఐ	+ 4,978

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.72	$ 70.39
బ్రెంట్	74.47	$ 74.22

రోజుకు 12వేల కొత్త కార్లు

- మొత్తం మెక్సికోను మించి ఏసీల విద్యుత్ వినియోగం
- 2035 నాటికి భారత్‌పై ఐఈఏ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే దశాబ్దకాలంలో భారత్‌లో విద్యుత్, ఇంధనాల వినియోగానికి, కార్లకు డిమాండ్ గణనీయం గా పెరగనుంది. రోజుకు కొత్తగా 12,000 కార్లు రోడ్డెక్కనున్నాయి. 2035 నాటికి ఎయిర్ కండీషనర్ల (ఏసీ) విద్యుత్ వినియోగం మొత్తం మెక్సికోలో విద్యుత్ వినియోగాన్ని మించిపోనుంది. వరల్డ్ ఎనర్జీ అవుట్‌లుక్ 2024 నివేదికలో ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) ఈ విషయాలు వెల్లడించింది. భారత్‌లో చమురు, గ్యాస్, బొగ్గు, విద్యుత్, పునరుత్పాదక విద్యుత్ మొదలైన అన్ని రూపాల్లోనూ శక్తికి డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది. ప్రస్తుతం చమురు వినియోగం, దిగుమతికి సంబంధించి ప్రపంచంలో 3వ స్థానంలో ఉన్న భారత్‌లో చమురుకు డిమాండ్ రోజుకు దాదాపు 20 లక్షల బ్యారెళ్ల మేర పెరుగుతుందని ఐఈఏ అంచనా వేసింది. దీంతో అంతర్జాతీయంగా చమురు డిమాండ్ పెరిగేందుకు భారత్ ప్రధాన కారణంగా ఉంటుందని తెలిపింది. 2023లో అయిదో భారీ ఎకానమీగా ఉన్న భారత్ 2028 నాటికి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని వివరించింది.

నివేదికలో మరిన్ని వివరాలు..

- భారత్‌లో జనాభా పరిమాణం పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే దశాబ్దకాలంలో మిగతా దేశాలతో పోలిస్తే ఇంధనాలకు డిమాండ్ మరింత పెరగనుంది.
- 2035 నాటికి ఐరన్, స్టీల్ ఉత్పత్తి 70 శాతం, సిమెంటు ఉత్పత్తి సుమారు 55 శాతం పెరుగుతుంది. ఎయిర్ కండీషనర్ల నిల్వలు 4.5 రెట్లు పెరుగుతాయి. దీంతో ఏసీల కోసం విద్యుత్ డిమాండ్ అనేది వార్షికంగా యావత్ మెక్సికో వినియోగించే విద్యుత్ పరిమాణాన్ని మించిపోతుంది.
- ఆయిల్ డిమాండ్ రోజుకు 5.2 మిలియన్ బ్యారెళ్ల (బీపీడీ) నుండి 7.1 మిలియన్ బీపీడీకి చేరుతుంది. రిఫైనరీల సామర్థ్యం 58 లక్షల బీపీడీ నుండి 71 లక్షల బీపీడీకి పెరుగుతుంది. సహజవాయువుకు డిమాండ్ 64 బిలియన్ ఘనపు మీటర్ల (బీసీఎం) నుంచి 2050 నాటికి 172 బీసీఎంకి చేరుతుంది. బొగ్గు ఉత్పత్తి సైతం అప్పటికి 645 మిలియన్ టన్నుల నుంచి 721 మిలియన్ టన్నులకు పెరుగుతుంది.
- భారత్‌లో మొత్తం శక్తి వినియోగం 2035 నాటికి సుమారు 35 శాతం మేర పెరగనుండగా, విద్యుదుత్పత్తి దాదాపు మూడు రెట్లు పెరిగి 1,400 గిగావాట్లకు చేరనుంది.
- సౌర విద్యుదుత్పత్తి పెరుగుతున్నప్పటికీ బొగ్గు నుంచి విద్యుదుత్పత్తి దానికన్నా 30 శాతం అధికంగా ఉండనుంది. సోలార్ ఇన్‌స్టాలేషన్ల సామర్థ్యం తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. పరిశ్రమ విద్యుత్ అవసరాలను తీర్చడంలో బొగ్గు కీలకపాత్ర పోషిస్తోంది. 40 శాతం అవసరాలను తీరుస్తోంది.
- రాబోయే రోజుల్లో విద్యుదుత్పత్తి, ఇంధనాలకు సంబంధించి భారత్ పలు సవాళ్లు ఎదుర్కొనాల్సి రావచ్చు. శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. వంటకోసం పర్యావరణహితమైన ఇంధనాన్ని సమకూర్చాలి. విద్యుత్ రంగం విశ్వసనీయతను పెంచాలి. వాయు కాలుష్య స్థాయిని నియంత్రించాలి. వాతావరణంలో పెనుమార్పుల కారణంగా వడగాలులు, వరదల్లాంటి ప్రభావాలను కట్టడి చేయడంపై దృష్టి పెట్టాలి.
- భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. 2030 నాటికి ఆయిల్ డిమాండ్ తారస్థాయికి చేరుతుంది. (ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పట్టొచ్చు). పరిశ్రమల్లో విద్యుత్, హైడ్రోజన్ వినియోగం క్రమంగా పెరగనున్న నేపథ్యంలో బొగ్గుకు కూడా డిమాండ్ 2030 నాటికి గరిష్ట స్థాయికి చేరుకుంటుంది.
- 2, 3 వీలర్లకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్లలో ఒకటి కాగా, ప్యాసింజర్ కార్ల మార్కెట్ విభాగంలో నాలుగో స్థానంలో ఉంది.
- వచ్చే దశాబ్ద కాలంలో భారత్‌లో కొత్తగా 3.7 కోట్ల పైచిలుకు కార్లు, 7.5 కోట్ల పైగా 2,3 వీలర్లు రోడ్లపైకి రానున్నాయి. వీటిలో ఎలక్ట్రిక్ వాహనాల వాటా పెరుగుతున్నప్పటికీ, ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ వాహనాలూ వృద్ధి చెందుతాయి కనుక రహదారి రవాణా విభాగం విషయంలో చమురుకు డిమాండ్ 40 శాతం పెరుగుతుంది. దేశీయంగా ప్రతి రోజూ 12,000 కార్లు రోడ్లపైకి రానుండటంతో రహదార్లపరంగా మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చుకోవాల్సి ఉంటుంది. వాహనాల వల్ల వాయు కాలుష్యం మరింత తీవ్రమవుతుంది. 2035 నాటికి రోడ్ మార్గంలో ప్రయాణికుల రవాణా రద్దీ వల్ల కర్బన ఉద్గారాలు 30 శాతం పెరుగుతాయి.

ఎక్కేద్దాం... ఎగిరిపోదాం



- దేశీయంగా విమాన ప్రయాణికుల జోరు
- అక్టోబర్ 14న 4,84,263 మంది ప్రయాణం
- సెప్టెంబర్‌లో 1.30 కోట్ల మంది రాకపోకలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది. అక్టోబర్ 14న వివిధ నగరాల నుంచి 4,84,263 మంది విమానాల్లో ప్రయాణం సాగించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న నమోదైన 4,71,751 రికార్డుతో పోలిస్తే 2.6 శాతం ప్రయాణికులు అధికంగా ప్రయాణించడం విశేషం. నవరాత్రి, దసరా, దుర్గా పూజ ముగిసిన తర్వాత తొలి పని దినం కావడంతో ప్యాసింజర్ల సంఖ్య గణనీయంగా నమోదైంది. అక్టోబర్ 14న మొత్తం 6,435 విమాన సర్వీసులు ప్రయాణికులకు సేవలు అందించాయి. భారత్‌లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య దూసుకుపోతుండడంతో విమానయాన సంస్థల మధ్య పోటీ వేడి మీద ఉంది. ఈ ఏడాది ఆగస్ట్‌తో పోలిస్తే సెప్టెంబర్‌లో ఇండిగో మార్కెట్ వాటా 60 బేసిస్ పాయింట్లు, ఎయిర్ ఇండియా 40 బేసిస్ పాయింట్లు పెరిగింది. స్పైస్‌జెట్ 30 బేసిస్ పాయింట్లు, ఆకాశ ఎయిర్ 10 బేసిస్ పాయింట్లు క్షీణించాయి.

సెప్టెంబర్‌లో ఇలా..

ఈ ఏడాది సెప్టెంబర్‌లో 1.30 కోట్ల మంది దేశీయంగా విమాన ప్రయాణం సాగించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకారం 2023 సెప్టెంబర్‌తో పోలిస్తే గత నెలలో ప్యాసింజర్ల సంఖ్య 6.4 శాతం దూసుకెళ్లింది. వాస్తవానికి నాలుగు నెలలుగా దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో క్షీణత నమోదవుతోంది. 2024 మే నెలలో 1.38 కోట్ల మంది రాకపోకలు సాగించారు. ప్యాసింజర్ల సంఖ్య జూన్ నుంచి వరుసగా 1.32 కోట్లు, 1.29 కోట్లు, 1.31 కోట్లుగా ఉంది. రద్దు అయిన విమాన సర్వీసుల సంఖ్య 0.85 శాతం ఉంది. మే నెలలో ఇది 1.7 శాతంగా నమోదైంది. ఫ్లైబిగ్ ఎయిర్ అత్యధికంగా 17.97 శాతం క్యాన్సలేషన్ రేటుతో మొదట నిలుస్తోంది. 4.74 శాతం వాటాతో అలయన్స్ ఎయిర్, 4.12 శాతం వాటాతో స్పైస్‌జెట్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. క్యాన్సలేషన్ రేటు అతి తక్కువగా ఎయిర్ ఇండియా 0.13 శాతం, ఏఐఎక్స్ కనెక్ట్ 0.27, ఇండిగో 0.62, విస్తారా 0.88 శాతం నమోదైంది. విమానాల రద్దు ప్రభావం గత నెలలో 48,222 మంది ప్రయాణికులపై పడింది. పరిహారం, సౌకర్యాలకు విమానయాన సంస్థలు రూ.88.14 లక్షలు ఖర్చు చేశాయి. సర్వీసులు ఆలస్యం కావడంతో 2,16,484 మందికి అసౌకర్యం కలిగింది. నష్టపరిహారంగా విమానయాన సంస్థలు రూ.2.41 కోట్లు చెల్లించాయి. గత నెలలో మొత్తం 765 ఫిర్యాదులు అందాయి. 10,000 మంది ప్రయాణికులకు ఫిర్యాదుల శాతం 0.59 ఉంది.

మార్కెట్ లీడర్‌గా ఇండిగో..

సమయానికి విమాన సర్వీసులు అందించడంలో దేశంలో తొలి స్థానంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నిలిచింది. ఇండిగో, విస్తారా, ఎయిర్ ఇండియా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇండిగో మార్కెట్ వాటా ఏకంగా 63 శాతానికి ఎగసింది. సెప్టెంబర్ నెలలో ఈ సంస్థ 82.12 లక్షల మందికి సేవలు అందించింది. రెండవ స్థానంలో ఉన్న ఎయిర్ ఇండియా 15 శాతం వాటాతో 19.69 లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చింది. 13.08 లక్షల మంది ప్రయాణికులతో విస్తారా 10 శాతం, ఏఐఎక్స్ కనెక్ట్ 5.35 లక్షల మంది ప్రయాణికులతో 4.1 శాతం వాటా సొంతం చేసుకుంది. 2022 ఫిబ్రవరిలో 10.7 శాతం మార్కెట్ వాటా కైవసం చేసుకున్న స్పైస్‌జెట్ గత నెలలో 2 శాతం వాటాకు పరిమితమైంది. సెప్టెంబర్‌లో ఈ సంస్థ 2,61,000 మందికి సేవలు అందించింది. ఆక్యుపెన్సీ రేషియో స్పైస్‌జెట్ 80.4 శాతం, విస్తారా 90.9, ఇండిగో 82.6, ఎయిర్ ఇండియా 80.1, ఏఐఎక్స్ కనెక్ట్ 81.6 శాతం నమోదైంది.

సగానికి పడిపోయిన టాటా కెమికల్స్ లాభం

సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.267 కోట్లు



ముంబై: టాటా కెమికల్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలహీన పనితీరు ప్రదర్శించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం మేర తగ్గి రూ.267 కోట్లకు పరిమితమైంది. కానీ, సీక్వెన్షియల్‌గా చూస్తే మార్చి త్రైమాసికంలో వచ్చిన రూ.190 కోట్లతో పోల్చితే పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.495 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయంలో పెద్దగా మార్పు లేకుండా రూ.3,999 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.3,998 కోట్లుగా ఉంది. ''భారత్‌లో సోడాయాష్‌కు డిమాండ్ స్థిరంగా ఉంది. అమెరికా, యూరప్‌లో కంటెయినర్ గ్లాస్ తదితర విభాగాల్లో డిమాండ్ స్తబ్దుగా ఉంది. జూలై, ఆగస్ట్‌లో అసాధారణ వర్షాలతో మిథాపూర్ ప్లాంట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడింది. ఉత్పత్తి తగ్గడంతో మార్జిన్లపై ప్రభావం పడింది''అని టాటా కెమికల్స్ ఎండీ, సీఈవో ఆర్ ముకుందన్ తెలిపారు. మార్చి త్రైమాసికంతో పోల్చితే పనితీరు మొత్తం మీద మెరుగుపడినట్టు చెప్పారు. కస్టమర్లను అట్టిపెట్టుకోవడంతోపాటు స్థిరమైన కార్యకలాపాలపై తమ దృష్టి కొనసాగుతుందన్నారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో టాటా కెమికల్స్ షేరు 2.41 శాతం క్షీణించి రూ.1,074 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ లాభం 25 శాతం వృద్ధి

చెన్నై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 474 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఇది క్రితం క్యూ2లో నమోదైన రూ. 378 కోట్లతో పోలిస్తే 25 శాతం అధికం. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2,336 కోట్ల నుంచి రూ. 2,856 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ. 915 కోట్ల నుంచి రూ. 1,060 కోట్లకు చేరగా, నికర వడ్డీ మార్జిన్ 4.07 శాతం నుంచి 4.11 శాతానికి పెరిగింది. వృద్ధి, లాభదాయకత, అసెట్ క్వాలిటీ పరంగా ఈ త్రైమాసికంలో కూడా పటిష్టమైన ఫలితాలు సాధించినట్లు బ్యాంక్ ఎండీ బి. రమేష్ బాబు తెలిపారు. నికర నిరర్థక ఆస్తులు 0.28 శాతంగా ఉన్నట్లు వివరించారు.

ధన్‌లక్ష్మీ బ్యాంక్ లాభం రూ. 26 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ ధన్‌లక్ష్మీ బ్యాంక్ నికర లాభం రూ. 25.8 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ. 23.16 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 327.43 కోట్ల నుంచి రూ. 380.64 కోట్లకు పెరిగింది. మరోవైపు, ప్రథమార్ధానికి గాను ఆదాయం రూ. 718.58 కోట్లకు చేరింది.

తాన్లా లాభం రూ. 130 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తాన్లా ప్లాట్‌ఫామ్స్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 130 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఇది రూ. 142.5 కోట్లు. మరోవైపు, సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 1,015 కోట్ల నుంచి రూ. 1,011 కోట్లకు తగ్గింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు

ఐవోబీ లాభం అప్

రూ. 777 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐవోబీ) ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ. 777 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 625 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,935 కోట్ల నుంచి రూ. 8,484 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 5,821 కోట్ల నుంచి రూ. 6,851 కోట్లకు మెరుగుపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.74 శాతం నుంచి 2.72 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.68 శాతం నుంచి 0.47 శాతానికి దిగివచ్చాయి. మొండి రుణాలకు ప్రొవిజన్లు భారీగా తగ్గి రూ. 71 కోట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో ఇవి రూ. 1,121 కోట్లుగా నమోదయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 17.45 శాతాన్ని తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోబీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం జంప్‌చేసి రూ. 56 వద్ద ముగిసింది.

ఎల్‌టీమైండ్‌ట్రీ లాభం ప్లస్

- రూ. 1,251 కోట్లుగా నమోదు
- 2,504 మందికి ఉద్యోగాలు
- షేరుకి రూ. 20 డివిడెండ్



ముంబై: ఐటీ సర్వీసుల కంపెనీ ఎల్‌టీమైండ్‌ట్రీ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం పుంజుకుని రూ. 1,251 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,161 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 6 శాతం ఎగసి రూ. 9,432 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 8,905 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు షేరుకి రూ. 20 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. కీలక విభాగాలలో 20 కోట్ల డాలర్ల డీల్‌సహా పలు కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ దేవశిష్ చటర్జీ పేర్కొన్నారు. ఈ కాలంలో 2,504 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 84,438ను తాకింది. సెప్టెంబర్ కల్లా 742 మంది యాక్టివ్ క్లయింట్లను కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌టీమైండ్‌ట్రీ షేరు బీఎస్ఈలో 0.7% బలపడి రూ. 6,402 వద్ద ముగిసింది.

టాటా కమ్యూనికేషన్స్ అదే పనితీరు

నికర లాభం రూ.227 కోట్లు



న్యూఢిల్లీ: టాటా కమ్యూనికేషన్స్ సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.227 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.221 కోట్ల కంటే 3 శాతమే పెరిగింది. జూన్ త్రైమాసికంలో సంస్థ ఆర్జించిన లాభం రూ.333 కోట్లతో పోల్చి చూస్తే 32 శాతం తగ్గిపోయింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.5,767 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,872 కోట్ల కంటే 18 శాతం అధికం. కొన్ని కీలక మార్కెట్లలో డీల్స్ సొంతం చేసుకోవడంతో ఆర్డర్ల బుక్ విస్తరించిందని.. భవిష్యత్ వృద్ధి పట్ల ఆశావహంగా ఉన్నామని టాటా కమ్యూనికేషన్స్ ఎండీ, సీఈవో ఏఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. **బీఎస్ఈలో టాటా కమ్యూనికేషన్స్ షేరు 5 శాతం వరకు క్షీణించి రూ.1,834 వద్ద ముగిసింది.**

జిందాల్ స్టెయిన్‌లెస్ లాభం డౌన్

క్యూ2లో లాభం రూ. 609 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 609 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 764 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ.9,829 కోట్ల నుంచి రూ. 9,824 కోట్లకు బలహీనపడింది. మొత్తం వ్యయాలు రూ. 8,944 కోట్ల నుంచి రూ. 8,990 కోట్లకు పెరిగాయి. వీటిలో మెటీరియల్స్ వ్యయాలు రూ. 6,024 కోట్ల నుంచి రూ. 6,760 కోట్లకు పెరిగాయి. స్టాండెలోన్ అమ్మకాల పరిమాణం 5,43,618 మెట్రిక్ టన్నుల నుంచి 5,64,627 ఎంటీకు ఎగశాయి.

జిందాల్ స్టెయిన్‌లెస్ షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 762 వద్ద ముగిసింది.

నెస్లే ఇండియా లాభం ఫ్లాట్

రూ. 899 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప వెనకడుగుతో రూ. 899 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 908 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 5,111 కోట్లకు చేరింది. దేశీ అమ్మకాలు 1 శాతం పుంజుకుని రూ. 4,883 కోట్లను తాకాయి. ఎగుమతుల ఆదాయం 3 శాతం బలపడి రూ. 192 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 3 శాతంపైగా పెరిగి రూ. 4,090 కోట్లుగా నమోదయ్యాయి.

నెస్లే ఇండియా షేరు బీఎస్ఈలో 3.4 శాతం క్షీణించి రూ. 2,380 వద్ద ముగిసింది.

హావెల్స్ మెరుగైన పనితీరు

8 శాతం పెరిగిన నికర లాభం



న్యూఢిల్లీ: కన్జ్యూమర్ ఎలక్ట్రిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ హావెల్స్ ఇండియా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ.268 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.249 కోట్లతో పోల్చితే 8 శాతం వృద్ధి చెందింది. ఆదాయం 16 శాతం అధికమై రూ.3,900 కోట్ల నుంచి రూ.4,539 కోట్లకు చేరింది. అన్ని విభాగాల్లోనూ బలమైన వృద్ధిని సాధించినట్టు కంపెనీ ప్రకటించింది. వ్యయాలు 18 శాతం పెరిగి రూ.4,269 కోట్లకు చేరాయి. 2022లో నీమ్రానా అగ్ని ప్రమాదానికి సంబంధించి క్లెయిమ్‌ను పరిష్కరించుకున్నట్టు హావెల్స్ తెలిపింది. బీమా సంస్థ నుంచి రూ.32.84 కోట్ల పరిహారాన్ని అందుకుంది. స్విచ్‌గేర్ విభాగం నుంచి ఆదాయం 4 శాతం పెరిగి రూ.551 కోట్లకు చేరింది. కేబుల్స్ విభాగం ఆదాయం 23 శాతం వృద్ధితో రూ.1,805 కోట్లుగా నమోదైంది. లైటింగ్, ఫిక్చర్స్ విభాగం ఆదాయం మార్పు లేకుండా రూ.395 కోట్లుగా నమోదైంది. 2017లో సంస్థ కొనుగోలు చేసిన లాయిడ్ కన్జ్యూమర్ నుంచి రూ.590 కోట్ల ఆదాయం సమకూరింది.

బీఎస్ఈలో హావెల్స్ షేరు 6 శాతం నష్టపోయి రూ.1,826 వద్ద స్థిరపడింది.

నిరాశ పరిచిన సియట్

నికర లాభం 42 శాతం డౌన్



న్యూఢిల్లీ: కమోడిటీల ధరలు గణనీయంగా పెరిగిపోవడం టైర్ల తయారీ సంస్థ సియట్ లాభాలపై ప్రభావం చూపించింది. సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.121 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.208 కోట్లతో పోల్చి చూస్తే 42 శాతం తగ్గిపోయింది. ఆదాయం ఇదే కాలంలో రూ.3,053 కోట్ల నుంచి రూ.3,304 కోట్లకు వృద్ధి చెందింది. ''త్రైమాసికం వారీగా అత్యధిక ఆదాయాన్ని నమోదు చేశాం. అంతర్జాతీయ మార్కెట్‌లో, టైర్ల రీప్లేస్‌మెంట్ మార్కెట్లో బలమైన పనితీరు సాధించాం. అయితే కమోడిటీల ధరలు గణనీయంగా పెరిగిపోవడం మార్జిన్లపై ప్రభావం చూపించింది''అని సియట్ ఎండీ, సీఈవో అర్ణబ్ బెనర్జీ తెలిపారు. పెరిగిన తయారీ ధరల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ఉత్పత్తుల ధరలను పెంచినట్టు చెప్పారు. డిసెంబర్ త్రైమాసికంలోనూ మెరుగైన ఆదాయాన్ని నమోదు చేస్తామన్నారు. ముడి సరుకుల నిల్వలు పెరగడంతో రుణ భారం రూ.280 కోట్లు అధికమైనట్టు సంస్థ సీఎఫ్‌వో కుమార్ సుబ్బయ్య వెల్లడించారు.

సెమీస్‌లో రిత్విక్ జోడీ

సాక్షి, హైదరాబాద్: అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. కజకిస్తాన్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ చౌదరీ-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6-4, 6-4తో రెండో సీడ్ సాదియో డుంబియా-ఫాబియెన్ రెబూల్ (ఫ్రాన్స్) జంటపై సంచలన విజయం సాధించింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-అర్జున్ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. ఇదే టోర్నీలో ఆడుతున్న శ్రీరామ్ బాలాజీ (భారత్)-గిడో ఆంద్రెజి (అర్జెంటీనా) ద్వయం కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో బాలాజీ-ఆంద్రెజి 6-3, 6-4తో నాలుగో సీడ్ షెవ్‌చెంకో-స్కాటోవ్ (కజకిస్తాన్)లపై గెలిచారు.



అభయ సంచలనం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ అమ్మాయి వేమూరి అభయ సంచలనం సృష్టించింది. గురువారం బెంగళూరులో జరిగిన ఈ టోర్నీ సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అభయ 6-2, 7-6 (7/4)తో మూడో సీడ్ ఎలీనా జమ్‌షిది (డెన్మార్క్)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టిన అభయ తొలి రౌండ్‌లో 6-3, 7-6 (7/3)తో యశస్విని (భారత్)పై గెలిచింది. తెలంగాణకే చెందిన హుమేరా బహార్మస్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 3-6, 3-6తో ఆకాంక్ష (భారత్) చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన తెలంగాణ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక చివరి నిమిషంలో వైదొలిగింది.





తొడగొట్టేందుకు సిద్ధం

నేటి నుంచి ప్రొ కబడ్డీ లీగ్ | మొదటి దశ మ్యాచ్‌లు హైదరాబాద్‌లోనే | తొలి పోరులో టైటాన్స్‌తో బుల్స్ 'ఢీ'

రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్: పది సీజన్లుగా కబడ్డీ అభిమానులను అలరిస్తున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడాది వ్యవధిలోపే మళ్లీ ముందుకు వచ్చింది. పీకేఎల్ 11వ సీజన్‌కు నేటితో తెర లేవనుంది. గత సీజన్‌కంటే భిన్నంగా ఈసారి మూడు వేదికలకే టోర్నీ లీగ్ దశను పరిమితం చేస్తున్నారు. సీజన్-10 ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలోనే నేడు టోర్నీ ప్రారంభం అవుతుంది. నవంబర్ 9 వరకు ఇక్కడే పోటీలు జరుగుతాయి. ఆ తర్వాత నోయిడా, పుణే తర్వాతి దశ పోటీలకు ఆతిథ్యం ఇస్తాయి. మరోసారి 12 టీమ్‌లతోనే పీకేఎల్ జరగనుండగా... లీగ్ దశలో మొత్తం 132 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్లే ఆఫ్స్ (ఎలిమినేటర్-1, ఎలిమినేటర్-2, రెండు సెమీఫైనల్స్, ఫైనల్) ఐదు మ్యాచ్‌లతో కలిపి ఓవరాల్‌గా 137 మ్యాచ్‌లు పీకేఎల్‌లో జరుగుతాయి. టోర్నీ తొలిరోజు జరిగే మొదటి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ మాజీ చాంపియన్ బెంగళూరు బుల్స్‌తో తలపడనుండగా... మాజీ చాంపియన్స్ దబంగ్ ఢిల్లీ, యు ముంబా మధ్య రెండో మ్యాచ్ మ్యాచ్ (రాత్రి 9 గంటల నుంచి) జరుగుతుంది. తొలి మ్యాచ్ రాత్రి 8 గంటలకు మొదలవుతుంది. డిసెంబర్ 24న జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్ తర్వాత నాకౌట్ మ్యాచ్‌ల వేదికలను ఖరారు చేస్తారు.

భారీ వేలంతో మొదలు...

సీజన్-11 కోసం నిర్వహించిన వేలంలో ఆటగాళ్లకు భారీ విలువ పలికింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో రూ. 1 కోటికి పైగా విలువతో అమ్ముడుపోయిన ఆటగాళ్ల జాబితాలో ఏకంగా 8 మంది ఉండటం విశేషం. అత్యధికంగా తమిళ్ తలైవాస్ సచిన్ తన్వర్‌ను రూ.2 కోట్ల 15 లక్షలకు దక్కించుకుంది. టోర్నీ ఆరంభానికి ముందు గురువారం హైదరాబాద్‌లో ట్రోఫీ ఆవిష్కరణ సహా లీగ్ ప్రచార కార్యక్రమం జరిగింది. పీకేఎల్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తదితరులు ఇందులో పాల్గొన్నారు. దశాబ్దకాలంగా తమ లీగ్‌కు మంచి ఆదరణ దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన ముందు టోర్నీని మరింత ఆకర్షణీయంగా మారుస్తామని ప్రకటించారు. పీకేఎల్ రాకతో తమ కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంలో ఎంతో మార్పు వచ్చిందని... డబ్బుతో పాటు గుర్తింపూ దక్కిందని అగ్రశ్రేణి ఆటగాళ్లు పవన్ సెహ్రావత్, ప్రదీప్ నర్వాల్ వెల్లడించారు.

టైటాన్స్ రాత మారేనా...

ప్రొ కబడ్డీ లీగ్ ప్రారంభమైన నాటినుంచి లీగ్‌లో ఉన్న ఎనిమిది జట్లలో తెలుగు టైటాన్స్ కూడా ఒకటి. కానీ మిగతా ఏడు జట్లతో పోలిస్తే టైటాన్స్‌దే ఇప్పటి వరకు పేలవ ప్రదర్శన. టైటాన్స్ మినహా మిగిలిన ఏడు జట్లు కనీసం ఒక్కసారైనా విజేతగా నిలవడం విశేషం. రెండో సీజన్‌లో మూడో స్థానంలో నిలవడమే ఇప్పటి వరకు ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. గత మూడు సీజన్లుగానైతే మరీ చెత్త ప్రదర్శనతో చివరిదైన 12వ స్థానంలో నిలుస్తూ వచ్చింది. ఓవరాల్‌గా 10 సీజన్లలో కలిపి 192 మ్యాచ్‌లు ఆడితే 56 మాత్రమే గెలిచి 116 ఓడిపోయింది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, లీగ్‌లో దబంగ్ ఢిల్లీకి టైటిల్ అందించిన కోచ్ కృషన్ కుమార్ హుడా ఈసారి టైటాన్స్ కోచ్‌గా రావడం జట్టుకు సానుకూలాంశం. అతని నేతృత్వంలో టీమ్ రాత మారుతుందా అనేది ఆసక్తికరం. వేలంలో ఎఫ్‌బీఎం ద్వారా రూ.1.72 కోట్లకు కెప్టెన్ పవన్ సెహ్రావత్‌ను టీమ్ కొనసాగించింది. విజయ్ మలిక్, అమిత్ కుమార్, సంజీవి వంటి ఆల్‌రౌండర్లు జట్టులో ఉన్నారు. అయితే పవన్ మినహా చెప్పుకోదగ్గ అగ్రశ్రేణి రైడర్ లేకపోవడం జట్టులో ఒక లోపం. ప్రఫుల్, ఓంకార్, మన్‌జీత్ ఈ విషయంలో ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంది. డిఫెన్స్‌లో కృషన్ ధుల్ రూపంలో కీలక ఆటగాడు ఉండగా... మిలాద్, అజిత్, సాగర్ నుంచి సహకారం అవసరం.

పీకేఎల్-11లో పాల్గొనే జట్లు: తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్, బెంగాల్ వారియర్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, యు ముంబా, యూపీ యోధాస్.

క్వార్టర్ ఫైనల్లో సింధు



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 18-21, 21-12, 21-16తో ప్రపంచ 7వ ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై గెలిచింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను కోల్పోయినా నెమ్మదిగా తేరుకొని ఆ తర్వాతి రెండు గేముల్లో గెలిచి ముందంజ వేసింది. హాన్ యువెపై సింధుకిది ఏడో విజయం కావడం విశేషం. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 8వ ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 10-2తో గ్రెగోరియాపై ఆధిక్యంలో ఉంది.

వివాన్‌కు రజతం... అనంత్‌కు కాంస్యం





న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ కప్ ఫైనల్స్‌ను భారత జట్టు నాలుగు పతకాలతో ముగించింది. టోర్నీ చివరిరోజు గురువారం భారత్ ఖాతాలో ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి రెండు పతకాలు చేరాయి. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో జైపూర్‌కు చెందిన వివాన్ కపూర్ రజత పతకం సొంతం చేసుకోగా... పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరూకా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఆరుగురు షూటర్లు పోటీపడ్డ 'ట్రాప్' ఫైనల్లో 22 ఏళ్ల వివాన్ 44 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. వివాన్ కెరీర్‌లో ఇదే తొలి అంతర్జాతీయ వ్యక్తిగత పతకం. గతంలో అతను మూడు సార్లు వరల్డ్‌కప్ టీమ్ ఈవెంట్స్‌లో రజత పతకాలు సాధించాడు. 'స్కీట్' ఈవెంట్ ఫైనల్లో 'పారిస్ ఒలింపియన్' అనంత్‌జీత్ 43 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానాన్ని పొందాడు. అనంత్ కెరీర్‌లో ఇదే తొలి వరల్డ్‌కప్ మెడల్ కావడం విశేషం. మహిళల స్కీట్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ గనీమత్ సెఖోన్ ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో భారత్ 2 రజతాలు, 2 కాంస్యాలతో నాలుగు పతకాలు నెగ్గి తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచింది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలోనే...

- న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టు ప్రకటన
- నలుగురు కొత్త ప్లేయర్లకు అవకాశం



న్యూఢిల్లీ: మహిళల టి20 ప్రపంచకప్‌లో నిరాశజనక ప్రదర్శన అనంతరం కూడా ఈ నెల 24 నుంచి న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరగనున్న వన్డే సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా కొనసాగనుంది. తాజా వరల్డ్‌కప్‌లో భారత జట్టు గ్రూప్ దశ నుంచే నిష్క్రమించగా... సారథ్య మార్పు అంశం తెరపైకి వచ్చింది. కానీ, సెలెక్టర్లు మాత్రం ప్రస్తుతానికి నాయకత్వ మార్పు జోలికి వెళ్లకుండా హర్మన్‌పైనే నమ్మకం ఉంచారు. అహ్మదాబాద్‌లో ఈ నెల 24, 27, 29న జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం సెలెక్షన్ కమిటీ గురువారం 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇందులో నలుగురు కొత్త ప్లేయర్లకు చోటు దక్కింది. 12వ తరగతి బోర్డు పరీక్షల నేపథ్యంలో వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఆల్‌రౌండర్ పూజ వస్త్రాకర్‌కు విశ్రాంతినివ్వగా... ఆశ శోభనను గాయం కారణంగా పరిగణించలేదు. ఇటీవల ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత 'ఎ'జట్టు నుంచి తేజల్ హసాబ్నిస్, సయాలీ సత్ఘరె, ప్రియా మిశ్రాతో పాటు మహిళల ఐపీఎల్‌లో రాణించిన సైమా ఠాకూర్ తొలిసారి జాతీయ జట్టులోకి వచ్చారు.

భారత మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హేమలత, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, ఉమా ఛెత్రి, సయాలీ, అరుంధతి రెడ్డి, రేణుక సింగ్, తేజల్ హసాబ్నిస్, సైమా ఠాకూర్, ప్రియా మిశ్రా, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్.

ఇంగ్లండ్ లక్ష్యం 297

- ప్రస్తుతం 36/2
- విజయానికి ఇంకా 261 పరుగుల దూరంలో స్టోక్స్ బృందం
- మూడో రోజు 16 వికెట్లు
- పాకిస్తాన్‌తో రెండో టెస్టు



ముల్తాన్: ఇంగ్లండ్ ముల్తాన్ వేదికపై మరో టెస్టు విజయం కోసం గట్టి ప్రయత్నమే చేస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య పాకిస్తాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేసిన ఇంగ్లండ్ ముందు 297 పరుగుల లక్ష్యం ఉంది. రెండు రోజుల సమయం ఉన్నప్పటికీ ఓ రోజు ముందే దీన్ని ఛేదించే బాధ్యత బ్యాటర్లు తీసుకుంటే ఇంగ్లండ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను వశం చేసుకునే స్వర్ణావకాశం జట్టును ఊరిస్తోంది. అయితే మూడో రోజును ఇరుజట్ల బౌలర్లు శాసించారు. దీంతో 16 వికెట్లు కూలాయి. గురువారం ముందుగా ఓవర్‌నైట్ స్కోరు 239/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 67.2 ఓవర్లలో 291 పరుగుల వద్ద ఆలౌటైంది. స్పిన్నర్ సాజిద్ ఖాన్... బ్రైడన్ కార్స్ (4), పాట్స్ (6) బషీర్ (9) వికెట్లను కూడా పడేయడంతో ఈ ఇన్నింగ్స్‌లో అతనికి ఏకంగా 7 వికెట్లు దక్కాయి. ఓవర్‌నైట్ బ్యాటర్ స్మిత్ (21; 2 ఫోర్లు), పదో వరుస బ్యాటర్ జాక్ లీచ్ (25 నాటౌట్; 3 ఫోర్లు) ఇరవై పైచిలుకు స్కోరు చేయడంతో ఇంగ్లండ్ క్రితం రోజు స్కోరుకు 52 పరుగులు జత చేసింది. పిచ్ స్వభావాన్ని గుర్తించి ఇంగ్లండ్ కూడా స్పిన్నర్లతో ఆటను ప్రారంభించడంతో పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 59.2 ఓవర్లలో 221 పరుగుల వద్ద ఆలౌటైంది. టాపార్డర్ బ్యాటర్లు షఫీఖ్ (4), అయూబ్ (22; 1 ఫోర్), షాన్ మసూద్ (11)లకు షోయబ్ బషీర్ స్పిన్ ఉచ్చు బిగించగా, మరో స్పిన్నర్ లీచ్... కమ్రాన్ గులామ్ (26; 5 ఫోర్లు), సౌద్ షకీల్ (31; 2 ఫోర్లు)లను ఎల్బీగా వెనక్కి పంపాడు. దీంతో పాక్ 114 పరుగులకే 5 వికెట్లను కోల్పోయింది. ఏడో వరుస బ్యాటర్ సల్మాన్ ఆఘా (63; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో పాక్ 200 పైచిలుకు స్కోరు చేయగలిగింది. బషీర్ 4, లీచ్ 3, పేసర్ కార్స్ 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో పొందిన 75 పరుగుల ఆధిక్యం వల్ల పాక్ ఇంగ్లండ్ ముందు 297 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు క్రాలీ (3), డకెట్ (0) వికెట్లు కోల్పోయి 36/2 స్కోరు చేసింది. ఓలీ పోప్ (21 బ్యాటింగ్, 2 ఫోర్లు), రూట్ (12 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు.




శ్రీలంకదే టి20 సిరీస్

దంబుల్లా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు వెస్టిండీస్‌పై టి20 సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. గురువారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో శ్రీలంక 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (27 బంతుల్లో 37; ఒక ఫోర్, 3 సిక్సర్లు), గుడకేశ్ మోతీ (15 బంతుల్లో 32; ఒక ఫోర్, 3 సిక్సర్లు) తప్ప మిగిలిన వాళ్లు ఆకట్టుకోలేకపోయారు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, హసరంగ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం శ్రీలంక 18 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 166 పరుగులు చేసి గెలిచింది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 68 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), కుశాల్ పెరీరా (36 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు) అజేయ అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. నిసాంక (22 బంతుల్లో 39; 7 ఫోర్లు, ఒక సిక్సర్) కూడా మెరుపులు మెరిపించడంతో శ్రీలంక అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది.

సన్‌రైజర్స్‌కు స్టెయిన్ గుడ్‌బై

బౌలింగ్ కోచ్ పదవి నుంచి వైదొలిగిన దక్షిణాఫ్రికా మాజీ స్టార్



ముంబై: దక్షిణాఫ్రికా మాజీ స్టార్ పేసర్ డెల్ స్టెయిన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఫ్రాంచైజీకి చెందిన ఇతర జట్లతో కొనసాగుతానని పేర్కొన్న స్టెయిన్... వచ్చే ఏడాది ఐపీఎల్‌కు అందుబాటులో ఉండటం లేదని వెల్లడించాడు. 'గత కొన్నేళ్లుగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కలిసి పని చేశా. ఫ్రాంచైజీ యాజమాన్యానికి, సహచరులకు ధన్యవాదాలు. వచ్చే సీజన్ ఐపీఎల్‌కు అందుబాటులో ఉండటం లేదు. కానీ దక్షిణాఫ్రికా లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుతో కలిసి పని చేస్తా' అని స్టెయిన్ గురువారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా లీగ్‌లో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఈస్టర్న్ కేప్ జట్టు రెండుసార్లు విజేతగా నిలవడంలో స్టెయిన్ కీలక పాత్ర పోషించాడు. స్టెయిన్ స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు న్యూజిలాండ్ మాజీ బౌలర్ జేమ్స్ ఫ్రాంక్లిన్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకుంది.

రుత్విక జోడీ ముందంజ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుత్విక-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 21-14, 21-13తో టాన్ వె లియాంగ్-యాప్ లింగ్ (మలేసియా) జోడీని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. బరిలో ఉన్న ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, కార్తికేయ గుల్షన్ కుమార్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. ప్రపంచ 39వ ర్యాంకర్ శ్రీకాంత్ 16-21, 15-21తో ప్రపంచ 158వ ర్యాంకర్ టింగ్ యెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. కార్తికేయ 12-21, 19-21తో పానిత్‌చపోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయాన్ని చవిచూశాడు.

భారత మహిళల జట్టు శుభారంభం

పాకిస్తాన్‌పై 5-2 గోల్స్‌తో విజయం

కఠ్మాండు: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) మహిళల చాంపియన్‌షిప్‌లో భారత్ భారీ విజయంతో శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం ఇక్కడి దశరథ్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు 5-2 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. సగం మ్యాచ్ ముగిసేసరికే దాయాది జట్టుపై 4-1తో పూర్తిస్థాయి ఆధిపత్యం కనబరిచింది. తద్వారా కెప్టెన్ ఆశాలతా దేవి అంతర్జాతీయ కెరీర్‌లో 100వ మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకుంది. ఐదో నిమిషంలోనే భారత్ ఖాతా తెరిచింది. భారత్ తరఫున గ్రేస్ డాంగ్మెయి (5వ, 42వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... మనీషా (17వ ని.లో), బాలాదేవి (35వ ని.లో), జ్యోతి చౌహాన్ (78వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఈ మ్యాచ్ ద్వారా బాలాదేవి 50 గోల్స్ మైలురాయిని అందుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారత ఫుట్‌బాలర్‌గా ఆమె గుర్తింపు పొందింది. పాక్ తరఫున సుహ హిరాణి (45+2వ ని.లో), మేరీ సిద్దిఖీ (47వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.



బాలా దేవికి (జెర్సీ నంబర్ 10) సహచరుల అభినందన

ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా వేణుగోపాలరావు

హెడ్ కోచ్‌గా హేమంగ్ బదానీ



న్యూఢిల్లీ: ఆంధ్ర మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఎంపికయ్యాడు. గత సీజన్ వరకు సౌరవ్ గంగూలీ ఈ బాధ్యతలు నిర్వర్తించగా... 'దాదా' స్థానంలో ఇప్పుడు జట్టు యాజమాన్యం వేణుగోపాల రావును నియమించింది. ఏడేళ్లుగా ఢిల్లీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పాంటింగ్‌ను ఇటీవల తొలగించిన క్యాపిటల్స్... అతడి స్థానంలో భారత మాజీ ప్లేయర్ హేమంగ్ బదానీని కొత్త కోచ్‌గా ఎంపిక చేసింది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ వచ్చే సీజన్ కోసం ఇప్పటి నుంచి కసరత్తులు చేస్తోంది. ఆంధ్ర ఆటగాడు వేణుగోపాలరావు జాతీయ జట్టు తరఫున 16 వన్డేలు ఆడాడు. 2009లో ఐపీఎల్ టైటిల్ గెలిచిన డెక్కన్ చార్జర్స్ జట్టులో సభ్యుడైన వేణుగోపాలరావు... గతంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున మూడు సీజన్‌లు ఆడాడు. దుబాయ్ క్యాపిటల్స్ జట్టుకు మెంటార్‌గానూ వ్యవహరించాడు. 'ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీతో చాన్నాళ్లుగా కొనసాగుతున్నా. నా మీద నమ్మకంతో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు. కొత్త సవాలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నా' అని వేణు పేర్కొన్నాడు. మరోవైపు 47 ఏళ్ల బదానీ జాతీయ జట్టు తరఫున 4 టెస్టులు, 40 వన్డేలు ఆడాడు. అతడికి కోచింగ్‌లో అపార అనుభవం ఉంది. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేసిన బదానీ, లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో జాఫ్నా కింగ్స్ జట్టుకు కోచ్‌గా రెండు టైటిల్స్ అందించాడు. దక్షిణాఫ్రికా లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గానూ వ్యవహరించాడు. ఇటీవల ఐఎల్‌టి20లో దుబాయ్ క్యాపిటల్స్‌కు శిక్షకుడిగా పనిచేశాడు. 'ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్‌కోచ్‌గా ఎంపికవడం ఆనందంగా ఉంది. నాపై నమ్మకముంచిన ఫ్రాంచైజీ యాజమాన్యానికి కృతజ్ఞుడిని. మెగా వేలానికి ముందు కోచింగ్ బృందాన్ని సమన్వయ పరుచుకొని అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకునే ప్రయత్నం చేస్తా. క్యాపిటల్స్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని బదానీ అన్నాడు. 'ఆటపై అపార అనుభవం ఉన్న బదానీ, వేణుగోపాలరావు ఢిల్లీ జట్టుతో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నారు. కొత్త పాత్రలను వారు సమర్థవంతంగా నిర్వర్తించగలరనే నమ్మకముంది' అని ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని గ్రంధి కిరణ్ కుమార్ తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా గంగూలీ

భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఎంపికయ్యాడు. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్‌తో పాటు దక్షిణాఫ్రికా లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి 'దాదా' డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా కొనసాగనున్నాడు. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్లకు జేఎస్‌డబ్ల్యూతో పాటు జీఎంఆర్ గ్రూప్ సహ యజమానిగా ఉండగా... దక్షిణాఫ్రికా లీగ్‌లో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సొంతంగానే జట్టును కొనుగోలు చేసుకుంది.

బహ్రెయిచ్ నిందితుల అరెస్టు



కాల్పుల్లో గాయపడిన నిందితులను మోసుకెళ్తున్న పోలీసులు

పారిపోబోతున్న ఇద్దరిపై కాల్పులు

బహ్రెయిచ్: దుర్గాదేవి విగ్రహ ఊరేగింపు సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్ జిల్లాలో జరిగిన కాల్పులు, అల్లర్ల ఘటనలో నిందితులైన ఐదుగురిని యూపీ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. నిందితుల్లో ఇద్దరు నేపాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నించగా కాళ్లపై షూట్‌చేసి వారిని నిలువరించారు. తొలుత పోలీసులపైకి నిందితులు కాల్పులు జరపడంతో కొద్దిసేపు పరస్పర కాల్పుల ఘటన చోటుచేసుకుంది. బహ్రెయిచ్- నేపాల్ సరిహద్దులో ఈ ఘటన జరిగిందని ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీ(శాంతిభద్రతలు), స్పెషల్ టాస్క్‌ఫోర్స్ చీఫ్ అమితాబ్ యష్ చెప్పారు. మొహమ్మద్ ఫహీస్, మొహమ్మద్ సర్ఫరాజ్, అబ్దుల్ హమీద్, మొహమ్మద్ తలీమ్ అలియాస్ సబ్లూ, మొహమ్మద్ అఫ్జల్‌లను అరెస్ట్‌చేశామని డీజీపీ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. తొలుత ఫహీస్, తలీమ్‌లను అరెస్ట్‌చేసి కాల్పులకు వాడిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు గురువారం మధ్యాహ్నం నేపాల్ సరిహద్దు సమీపంలోని హడా బసేహరీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడికి చేరుకోగానే హమీద్, సర్ఫరాజ్, అఫ్జల్ పోలీసులపైకి కాల్పులు మొదలెట్టారు. ఈ క్రమంలో సర్ఫరాజ్, తలీమ్ పోలీసుల నుంచి తప్పించుకుని నేపాల్‌కి పారిపోబోయారు. ఈ క్రమంలో పోలీసులు జరిపి ఎదురుకాల్పుల్లో సర్ఫరాజ్, తలీమ్ గాయపడ్డారు. ఒకరి కుడి కాలికి, ఇంకొకరి ఎడమ కాలికి బుల్లెట్లు దిగాయి. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు. మహసీ తాహసిల్ పరిధిలోని మన్సూర్ గ్రామంలో అక్టోబర్ 13న దుర్గామాత విగ్రహం ఊరేగింపులో మరో మతానికి చెందిన ప్రార్థనాస్థలం ఎదురుగా భారీ శబ్దంతో 'మళ్లీ యోగీజీ వస్తారు' అంటూ పాటలు, డీజే మోగించడంతో వివాదం మొదలైంది. ఈ సందర్భంగా ఒక ఇంటి పైనుంచి గుర్తు తెలియని వ్యక్తి ఊరేగింపుపై కాల్పులు జరిపాడు. దీంతో 22 ఏళ్ల రాంగోపాల్ మిశ్రా చనిపోగా, ఆరుగురు గాయపడ్డారు. వ్యక్తి మృతికి నిరసనగా 14వ తేదీన అల్లరి మూకలు ఇళ్లు, దుకాణాలు, షోరూమ్‌లు, ఆస్పత్రులు, వాహనాలను దగ్ధంచేయడం తెల్సిందే. పరిస్థితి గురువారానికి అదుపులోకి రావడంతో ప్రభుత్వం 4 రోజుల తర్వాత బహ్రెయిచ్ జిల్లాలో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించింది. పరిపాలనలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో జిల్లా, రాష్ట్ర యంత్రాలు పూర్తిగా విఫలమయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ దుయ్యబట్టారు.

షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్



జారీచేసిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఇటీవల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వెల్లువెత్తిన విద్యార్థి ఉద్యమాలు, ప్రజావ్యతిరేకత కారణంగా చెలరేగిన అల్లర్లు, ఘర్షణల్లో మరణాలకు కారకురాలిగా పేర్కొంటూ బంగ్లాదేశ్ మాజీ మహిళా ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ అరెస్ట్ వారెంట్ జారీచేసింది. హసీనాతోపాటు మరో 45 మందిని నవంబర్ 18వ తేదీలోపు అరెస్ట్‌చేసి తమ ఎదుట హాజరుపరచాలని అధికార యంత్రాంగాన్ని ట్రిబ్యునల్ గురువారం ఆదేశించింది. హసీనాను అరెస్ట్‌చేయాలంటూ దాఖలైన రెండు పిటిషన్లను విచారించి ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ గులాం మోర్తుజా ఈ ఆదేశాలిచ్చారని చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజూల్ చెప్పారు. విద్యార్థి ఉద్యమం వేళ కొందరి ఆచూకీ గల్లంతవడం, మరి కొందరు హత్యకు గురికావడంతో వారి బంధువులు దాదాపు 60 ఫిర్యాదులు ట్రిబ్యునల్‌లో ఇచ్చారు. వీటిపై విచారించిన జడ్జి.. హసీనా, ఆమెకు చెందిన ఆవామీ పార్టీ కీలకనేతలు, 14 రాజకీయపార్టీల కూటమి, పాత్రికేయులు, మాజీ ఉన్నతాధికారులుసహా 45 మందిని అరెస్ట్ చేయాలంటూ ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మాజీ స్వాతంత్ర్యసమరయోధుల వారసులకు రిజర్వేషన్లు కల్పించడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత చేపట్టిన ఆందోళనలు ఆగస్ట్ 5వ తేదీన ఉధృతంగా మారినపుడు పలు హత్యలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యమం వ్యాపించడంతో నాటి ప్రధాని పీఠం నుంచి షేక్ హసీనా దిగిపోక తప్పలేదు. పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ నుంచి హసీనా ఢిల్లీకి చేరుకోవడం, స్నేహబంధానికి విలువిచ్చి ఢిల్లీలో గుర్తుతెలియని ప్రదేశంలో ఆమెకు భారత్ ఆశ్రయం కల్పించడం తెల్సిందే. ఆగస్ట్ 5న ఢిల్లీకి చేరుకున్నాక ఆమె ఇంతవరకు బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. జూలై మూడోవారంలో మొదలైన అల్లర్లలో విద్యార్థి సంఘాల సభ్యులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడంతో దాదాపు 1000కిపైగా మరణాలు సంభవించాయి. ఆ తర్వాత ఆగస్ట్ 8వ తేదీన కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం ఉద్యమకాలంనాటి హత్యలకు కారకులను బోను ఎక్కిస్తామని ప్రకటించింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే హసీనాకాలంలో నియమితులైన ట్రిబ్యునల్ జడ్జీలు, దర్యాప్తు బృందాలు, దర్యాప్తు ఏజెన్సీ అధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. దీంతో కొత్త ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఇటీవలే పునర్వ్యవస్థీకరించారు.

200 సీట్లపై ఏకాభిప్రాయం

శరద్‌పవార్ వెల్లడి

పుణె: మహావికాస్ అఘాడిలోని మూడు భాగస్వామ్య పార్టీల మధ్య 200 స్థానాలపై ఏకాభిప్రాయం కుదిరిందని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ గురువారం వెల్లడించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలుండగా.. కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) కలిసి పోటీచేయనున్న విషయం తెలిసిందే. తమ తరఫున ఎన్సీపీ (ఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ సీట్ల పంపకం చర్చల్లో పాల్గొంటున్నారని, ఆయనిచ్చిన సమాచారం మేరకు 200 సీట్లపై ఏకాభిప్రాయం కుదిరిందని వెల్లడించారు. ఎవరెన్ని స్థానాల్లో పోటీచేయాలి, ఏయే నియోజకవర్గాలు ఏ పార్టీకి కేటాయించాలనే విషయంలో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) పార్టీలు చాలా రోజులుగా కసరత్తు చేస్తున్నాయి. నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని ఈసీ షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఈ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. హరియాణా ఫలితం ప్రభావం (బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుంది) మహారాష్ట్ర ఎన్నికలపై ఉండదని శరద్ పవార్ అభిప్రాయపడ్డారు. ఎంవీఏ సీఎం అభ్యర్థిని ప్రకటించాలనే శివసేన (యూబీటీ) డిమాండ్‌ను ప్రస్తావించగా మూడు భాగస్వామ్యపక్షాల మధ్య ఈ అంశం పరిష్కారమైందని బదులిచ్చారు. ఉద్ధవ్ ఠాక్రే పాల్గొన్న సంయుక్త విలేకరుల సమావేశంలో దీనిపై స్పష్టత ఇచ్చామని, ఎన్నికల తర్వాత సీఎం అభ్యర్థి నిర్ణయమవుతారని తెలిపారు.

నాందేడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా రవీంద్ర చవాన్

నాందేడ్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తమ అభ్యర్థిగా రవీంద్ర చవాన్‌ను ప్రకటించింది. దివంగత ఎంపీ వసంత్ రావు కుమారుడే రవీంద్ర. వసంత్ రావు మృతి చెందడంతో నాందేడ్ స్థానికి ఉపఎన్నిక వచ్చింది. వచ్చేనెల 20న పోలింగ్ జరగనుంది.

ప్రియాంక ప్రత్యర్థి సత్యన్ మొకెరి

తిరువనంతపురం: వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీపై పోటీకి వామపక్ష ఎల్డీఎఫ్ సత్యన్ మొకెరిని ఎంపిక చేసింది. సీపీఐకి చెందిన మొకెరి కొజికోడ్ జిల్లాలోని నాదపురం మాజీ ఎమ్మెల్యే. వ్యవసాయ రంగానికి చెందిన సమస్యలపై పనిచేసిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. వయనాడ్‌లో సత్యన్ మొకెరి ఎల్డీఎఫ్ అభ్యర్థిగా ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వమ్ గురువారం ప్రకటించారు. మొకెరి 2014 వయనాడ్ నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఐ.షానవాజ్ చేతిలో దాదాపు 20 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. రాహుల్ గాంధీ సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్ల గెలిచి రాయ్‌బరేలి ఎంపీగా కొనసాగుతూ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. నవంబరు 13న వయనాడ్‌లో పోలింగ్ జరగనుంది.



ఫాక్స్‌న్యూస్ ఇంటర్వ్యూలో

హారిస్.. సారీలు.. హామీలు

వాషింగ్టన్: మూడు వారాల్లోపు ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ ప్రచార జోరు పెంచారు. ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు బహిరంగంగా మద్దతు పలుకుతూ ఆయనను తరచూ ఇంటర్వ్యూచేసే 'ఫాక్స్ న్యూస్'వార్తాసంస్థకు బుధవారం హారిస్ ఇంటర్వ్యూ ఇచ్చారు. లక్షలాది మంది రిపబ్లికన్ మహిళా ఓటర్ల మనసునూ గెల్చుకునే ప్రయత్నంచేశారు. యాంకర్ బ్రెట్ బేయర్ అడుగడుగునా అడ్డుతగిలి ప్రశ్నలబాణాలు సంధిస్తుంటే హారిస్ వాటికి దీటుగా ఎదుర్కొని ఇంటర్వ్యూను రక్తికట్టించారు. హోరాహోరీగా సాగిన ఈ ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు కొన్ని..

వలస బిల్లుపై తొలి సంతకం

అమెరికాలోకి అక్రమంగా వలసవచ్చిన వ్యక్తి చేతిలో హత్యకు గురైన 12 ఏళ్ల జాస్లిన్ నంగరే తల్లి పడే ఆవేదన వీడియోను యాంకర్ తొలుత హారిస్‌కు చూపించారు. అక్రమ వలసదారుల చేతుల్లో చనిపోతున్న అమెరికన్ల కుటుంబాలను క్షమాపణ కోరాలని మీకెప్పుడూ అనిపించలేదా? అని యాంకర్ ప్రశ్నించగా.. 'చిన్నారిని కోల్పోయాం. ఈ విషయంలో నన్ను క్షమించండి'అని హారిస్ సారీ బేషరతుగా సారీ చెప్పారు. అక్రమ వలసలకు మద్దతు పలుకుతూ, వారిపై క్రిమినల్ కేసులను ఎత్తేయాలంటూ హారిస్ గతంలో చేసిన వ్యాఖ్యలను యాంకర్ వినిపించారు. ఈ అంశంలో మాట మార్చారని దెబ్బిపొడిచారు. దీంతో హారిస్ 'సరిహద్దు దాటి అక్రమ చొరబాట్లపై నేరాలను మోపాల్సిందే. నాటి అభిప్రాయాలు ఉపాధ్యక్షురాలిగా చేసినవి కాదు. ఇకమీదట అధ్యక్షురాలినైతే అలా చేయను. అస్తవ్యస్తంగా ఉన్న వలస విధానాన్ని సంస్కరిస్తా. నేను దేశాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసల కట్టడిపైనే చట్టం తెస్తా. ఆ బిల్లుపైనే తొలి సంతకం చేస్తా'అని హారిస్ అన్నారు.

ఖైదీల లింగమార్పిడి సర్జరీలపై..

ఖైదీల లింగ మార్పిడి శస్త్రచికిత్సల కోసం ప్రజాధనాన్ని ఖర్చుచేస్తారా ? అని యాంకర్ ప్రశ్నించగా చట్టప్రకారమే వెళ్తామని హారిస్ సమాధానమిచ్చారు. ట్రంప్ హయాంలో కూడా ఇలాంటి సర్జరీలు జరిగాయని హారిస్ అన్నారు. అయితే ట్రంప్ హయాంలో కొందరు ఖైదీలకు హార్మోన్ థెరపీ చేశారుగానీ ఇలాంటి ఆపరేషన్లు జరగకపోవడం గమనార్హం. బైడెన్ హయాంలోనే ఇలాంటి ఆపరేషన్లు జరగడం విశేషం.

వారసత్వ పాలన కాబోదు

బైడెన్‌తో పోలిస్తే ఉపాధ్యక్షురాలిగా మీరేమైనా చేశారా? అని గతంలో 'ది వ్యూ'టాక్‌షోలో అడిగిన ప్రశ్నకు 'నాకేం గుర్తురావట్లేదు'అని హారిస్ చెప్పిన సమాధానాన్ని యాంకర్ ప్లే చేసి హారిస్‌ను ఇరకాటంతో పెట్టారు. అధికారంలో ఉన్న సొంత పార్టీ నేత బైడెన్ అనుసరిస్తున్న విధానాలను అధ్యక్షురాలిగా కొనసాగిస్తారా? అని ప్రశ్నించగా 'నా పరిపాలన అనేది బైడెన్ పాలనకు కొనసాగింపుగా ఉండబోదు. నా జీవితపాఠాల సారాన్ని, ప్రాసిక్యూటర్‌గా, జిల్లా అటార్నీగా, కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌గా వృత్తి అనుభవాన్ని, ఉపాధ్యక్షురాలిగా పరిపాలనా దక్షతను జోడించి ప్రజారంజకంగా పరిపాలిస్తా 'అని హారిస్ హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ఓడిన ట్రంప్‌కు ఇంకా మద్దతు ఇస్తున్న వాళ్లను తెలివితక్కువ వాళ్లుగా, విషయపరిజ్ఞానం లేని వాళ్లుగా పరిగణిస్తారా? అని ప్రశ్నించగా 'అమెరికా ప్రజలను అంతమాట నేను ఎప్పుడూ అనలేదు'అని హారిస్ స్పష్టంచేశారు.

బైడెన్ మానసిక స్థితిపై..

''మా పార్టీ నేత జో బైడెన్ నిర్ణయాలు ఏనాడూ తప్పుకాలేదు. అమెరికా ప్రజల కోసం అధ్యక్షుడిగా ఆయన ఎన్నో కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకున్నారు. ఆయనతో పోలిస్తే ట్రంప్ అసమర్థుడు. అధ్యక్ష పీఠంపై కూర్చునే అర్హత ఆయనకు లేదు. ట్రంప్ అమెరికా ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి. అయినా బైడెన్ గురించి ఇక్కడ ప్రస్తావన అనవసరం. ఎందుకంటే ఇప్పుడు బైడెన్ రేసులో లేరు. ట్రంప్ గురించే మాట్లాడదాం''అని హారిస్ అన్నారు. మహిళల అబార్షన్ వంటి కీలక అంశం ఇంటర్వ్యూలో అస్సలు చర్చకురాలేదు. ప్రధానంగా సరిహద్దు భద్రత, వలసలపైనే ఎక్కువ సేపు ఇంటర్వ్యూ సాగింది.

దేశ పురోభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉంది: మోదీ

చండీగఢ్: బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) దేశ పురోగతికి మరింత ముందుకు తీసుకెళ్లడానికి అంకితభావంతో కృషి చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పేదలు, దిగువవర్గాల అభ్యున్నతికి, సాధికారతకు కట్టుబడి ఉన్నామన్నారు. హరియాణా సీఎం నయాబ్‌సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం అనంతరం గురువారం మోదీ ఇక్కడి ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంతులు, ఉప ముఖ్యమంత్రులతో సమావేశం అయ్యారు. మొత్తం 17 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం మోదీ ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'సుపరిపాలన అందించడం, ప్రజలు జీవితాలను మెరుగుపర్చడంపై సుదీర్ఘంగా చర్చించాం. దేశ పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, పేదలు, అట్టడుగువర్గాలకు సాధికారతను కల్పించడానికి ఎన్డీయే కట్టుబడి ఉంది' అని పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే తదితర ఎన్డీయే మిత్రపక్షాల ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హరియాణా విజయాన్ని సానుకూలంగా మలచుకొని మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలను ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మొత్తం ఆరు తీర్మానాలను ఆమోదించినట్లు జేపీ నడ్డా తెలిపారు. ఎమర్జెన్సీ ఖండిస్తూ అమిత్ షా తీర్మానం పెట్టగా, రాజ్యాంగం అమృతమహోత్సవంపై రాజ్‌నాథ్ తీర్మానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

విమానాలకు ఉత్తుత్తి బాంబు బెదిరింపులు 10 సోషల్ మీడియా ఖాతాలు రద్దు

న్యూఢిల్లీ: విమానాలకు ఉత్తుత్తి బాంబు బెదిరింపుల బెడద ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. గురువారం ముంబై నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్‌ఇండియా విమానం ఏఐసీ129కు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. లండన్ గగనతలంపై ప్రయాణిస్తుండగా 'స్క్వాకింగ్ 7700' సంకేతాలు అందాయి. ఇదొక అత్యవసర సంకేతమని అధికారులు దాంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఇటీవల 14 భారత విమానాలను వేర్వేరు దేశాల్లో ఇలాంటి కారణంతోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా, విమానాల్లో బాంబులు అమర్చామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న 10 సోషల్ మీడియా ఖాతాలను సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు రద్దు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇందులో ఎక్కువ ఖాతాలు 'ఎక్స్'కు సంబంధించినవేనని తెలిపాయి. ముంబై నుంచి బయలుదేరే మూడు విమానాల్లో బాంబులు పెట్టానని ఎక్స్‌లో పోస్టు చేసిన 17 ఏళ్ల బాలుడిని ముంబై పోలీసులు చత్తీస్‌గఢ్‌లో ఇటీవల అరెస్టు చేశారు.

భారత్ మాతాకీ జై అనాల్సిందే

- 21 సార్లు జాతీయజెండాకు సెల్యూట్ చేయాలి
- తీర్పు వచ్చేంతకాలం ఇలాగే కొనసాగాలి
- పాక్ అనుకూల నినాదాలిచ్చిన నిందితుడికి కోర్టు ఆదేశాలు

జబల్పూర్: మాతృదేశాన్ని మరచి శత్రుదేశాన్ని పొగిడిన వ్యక్తికి మధ్యప్రదేశ్ హైకోర్టు తగిన శిక్ష విధించింది. తుది తీర్పు వచ్చేదాకా నెలకు రెండు సార్లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అక్కడి జాతీయ జెండాకు 21 సార్లు సెల్యూట్ చేయాలని, రెండు సార్లు భారత్ మాతా కీ జై అని నినదించాలని ఆదేశించింది. భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫైజల్ అలియాస్ ఫైజాన్ మే నెలలో 'పాకిస్తాన్ జిందాబాద్, హిందుస్తాన్ ముర్దాబాద్' అని నినదించాడు. దీంతో ఇతనిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. 153బీ సెక్షన్ కింద కేసునమోదుచేశారు. సమాజంలో రెండు వర్గాల మధ్య శత్రుత్వం పెంచేలా, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యవహరించాడని పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతో బెయిల్ కోసం మధ్యప్రదేశ్ హైకోర్టును ఫైజల్ ఆశ్రయించాడు. ఈ కేసును జస్టిస్ డీకే పలివాల్ మంగళవారం విచారించారు. రూ.50వేల వ్యక్తిగత బాండు, మరో రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు అంగీకరిస్తూ రెండు షరతులు విధించింది. '' ప్రతి నెలా తొలి, చివరి మంగళవారాల్లో భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లు. అక్కడి భవంతిపై రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి 21 సార్లు సెల్యూట్‌చేసి రెండు సార్లు భారత్ మాతాకీ జై అని నినదించు. ఈ కేసులో తుదితీర్పు వచ్చేదాకా ఇలా చేయాల్సిందే. ఇలా చేస్తే అయినా నీలో దేశభక్తి కాస్తయినా పెరుగుతుంది' అని జడ్జి వ్యాఖ్యానించారు. '' ఇతనికి బెయిల్ ఇవ్వకండి. గతంలోనూ ఇలాగే ప్రవర్తించాడు. ఇతనిపై 14 నేరకేసులు పెండింగ్‌లో ఉన్నాయి' అని ప్రభుత్వ లాయర్ వాదించారు.

రాజ్యాంగబద్ధతను తేలుస్తాం

మారిటల్ రేప్‌కు మినహాయింపుపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: మారిటల్ రేప్ నుంచి భర్తలకు రక్షణ కల్పిస్తున్న ఐపీసీ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని మినహాయింపు నిబంధనల రాజ్యాంగబద్ధతను తేలుస్తామని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. భార్య సమ్మతి లేకుండా ఆమెతో భర్త బలవంతంగా సంభోగం జరపడాన్ని మారిటల్ రేప్‌గా పరిగణిస్తారు. పాశ్చాత్య దేశాల్లో ఇది క్రిమినల్ నేరం. భారత్‌లో చట్టాలు దీనికి మినయింపునిస్తున్నాయి. మారిటల్ రేప్ నేరం కాదని భర్తలకు రక్షణ కల్పిస్తున్నాయి. భార్య 18 ఏళ్ల లోపు మైనర్ కాకుంటే మారిటల్ రేప్ నేరం కాదని పేర్కొంటున్నాయి. దీన్ని పలువురు సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ అఫిడవిట్‌పై పిటిషనర్ల ప్రతిస్పందన కోరింది. మారిటల్ రేప్‌ను నేరంగా చేస్తే దాంపత్య బంధంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతుందని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఇదే విషయాన్ని తాజా అఫిడవిట్‌లో సుప్రీంకోర్టు ముందుంచింది.

'ఇది రాజ్యాంగబద్ధతకు సంబంధించిన అంశం. ఈ అంశంలో రెండు గత తీర్పులున్నాయి. మినహాయింపును ఇస్తున్న నిబంధనల రాజ్యాంగబద్ధతను తేల్చడమే ముఖ్యం' అని సీజేఐ చంద్రచూడ్ విచారణ సందర్భంగా అన్నారు. భార్య వయసు 18 ఏళ్ల లోపు కానంతవరకు భర్త ఆమెను బలవంతంగా అనుభవించినా అది నేరం కాదు.. అని బీఎన్ఎస్‌లో సెక్షన్ 63 (రేప్) మినహాయింపు-2 చెబుతోంది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ నిబంధనను కొట్టివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కరుణా నంది కోరారు. 'మారిటల్ రేప్‌కు మినయింపు నిబంధన.. ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు), ఆర్టికల్ 19, ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ)కు భంగకరమని మీరు అంటున్నారు. 18 ఏళ్లు పైబడిన భార్యతో భర్త బలవంతంగా లైంగిక చర్యకు పాల్పడ్డా అది రేప్ కాదని మినహాయింపును ఇచ్చినపుడు పార్లమెంటు భావించింది. భర్తలకు రక్షణ కల్పిస్తున్న మినహాయింపును కొట్టివేస్తే అప్పుడా లైంగిక చర్య రేప్ నిర్వచనం కిందకు వస్తుంది. అలాంటపుడు దీన్ని ప్రత్యేక నేరంగా చూడాలా? మినహాయింపు చట్టబద్ధతను తేల్చాలా? అనే సమస్య కోర్టులకు ఉత్పన్నమవుతుంది'అని ధర్మాసనం పేర్కొంది. 'భర్త డిమాండ్ చేస్తాడు. భార్య నిరాకరిస్తుంది. ఈ సందర్భంలో భర్త ఆమెను నిర్బంధిస్తే అది చట్టవిరుద్ధమవుతుంది. ఆమెను గాయపరిస్తే నేరపూరిత బెదిరింపు అవుతుంది. చివరికి భార్య లొంగిపోతే అప్పుడా సంభోగం నేరం కాదు. మిగతావన్నీ నేరాలైనపుడు చివరికి ఎందుకు కాదనేగా మీ ప్రశ్న' అని జస్టిస్ పార్దివాలా అన్నారు. 'కాదంటే కాదనే అర్థం. ఒక మహిళ వద్దు అదంటే వద్దనే అర్థం. వైవాహిక బంధంలో బలవంతంగా సంభోగం జరిపినా అది రేప్ అవుతుంది. కేసు నమోదు చేయాల్సిందే' అని పిటిషనర్ తరఫున వాదించిన కోలిన్ గొంజాల్వెజ్ అన్నారు. వాదనల తర్వాత కేసు ఈనెల 22వ తేదీకి వాయిదా పడింది.

తమన్నాను ప్రశ్నించిన ఈడీ

గువాహటి: బిట్‌కాయిన్లు, ఇతర క్రిప్టోకరెన్సీలను సంపాదించవచ్చని హెచ్‌పీజెడ్ టోకెన్ యాప్‌లో చేసిన ప్రకటనకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నటి తమన్నా భాటియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గురువారం ప్రశ్నించారు. యాప్‌కు సంబంధించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నందుకే తమన్నాను ప్రశ్నించారని, ఆమెపై ఎలాంటి నేరసంబంధ కేసు నమోదుకాలేదని సంబంధిత విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. యాప్ ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న కేసులో ఇప్పటిదాకా 299 సంస్థలను నిందితుల జాబితాలో చేర్చారు. వీటిలో 76 సంస్థలు చైనా అధీనంలో నడుస్తున్నాయి. వాటిలో పది మంది డైరెక్టర్లు చైనా జాతీయులుకాగా రెండు సంస్థలను విదేశీయులు నడిపిస్తున్నారు. బిట్‌కాయిన్లు, క్రిప్టో కరెన్సీల మైనింగ్ ద్వారా ఊహించని లాభాలు గడించవచ్చని ఆశపెట్టి కోట్లు దండుకున్నారని యాప్‌పై కోహిమా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదుచేశారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, బిట్‌కాయిన్ మైనింగ్ కోసం పెట్టుబడులు పెడితే భారీ లాభాలు కళ్లజూస్తారని ప్రచారం చేయడంతో ఎంతో మంది పెట్టుబడులు పెట్టారు. రూ.57వేల పెట్టుబడికి మూడు నెలలపాటు ప్రతిరోజూ రూ.4,000 ఇస్తామని చెప్పి కేవలం ఒకే ఒక్కసారి ఇచ్చి మానేశారని బాధితులు ఆరోపించారు. దీంతో దేశవ్యాప్తంగా సోదాలు చేపట్టిన ఈడీ ఏకంగా రూ.455 కోట్ల విలువైన స్థిర,చరాస్తులను జప్తుచేసింది. అసలు డైరెక్టర్లు లేకపోయినా డొల్ల కంపెనీలు సృష్టించి వాటి పేరు మీద బ్యాంక్ ఖాతాలు, మర్చెంట్ ఐడీలు తీసుకున్నారని తేలింది.

యువ సంగీత కెరటం లియాం పెనీ హఠాన్మరణం



బ్యూనస్ ఎయిర్(అర్జెంటీనా): బ్రిటన్ సంగీత సంచలనం, పాప్ గాయకుడు, గేయ రచయిత 31 ఏళ్ల లియాం పెనీ కన్నుమూశారు. బుధవారం సాయంత్రం అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్ సిటీలోని ఒక విలాసవంత హోటల్ మూడో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మద్యం, మత్తుపదార్థాలు అతిగా తీసుకోవడం వల్ల హోటల్ గది అంతా చిందరవందర చేసి కిందపడి చనిపోయారని వార్తలొచ్చాయి. పోస్ట్‌మార్టమ్ నివేదిక తర్వాతే మరణానికి కారణాలు తెలిసే వీలుంది. ఆయన బస చేసిన కాసాసర్ హోటల్ గదిలో మద్యంతోపాటు బెంజోడైజీపైన్ అనే ఔషధంను కనుగొన్నారు. బెంజోడైజీపైన్‌ను ఉద్రేకాన్ని తగ్గించేందుకు, మూర్ఛ, నరాల సంబంధ చికిత్సల్లో వాడతారు. పెనీ తన గది బాల్కనీ నుంచి దూకి ఉంటారని నగర భద్రతా మంత్రి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పాబ్లో పోలీసీచియో మీడియాతో చెప్పారు.

14 ఏళ్లకే సంచలనం

2010లో బ్రిటన్ ప్రఖ్యాత టాలెంట్ రియాలిటీ షో 'ది ఎక్స్ ఫ్యాక్టర్'లో 14 ఏళ్ల వయసులోనే అడుగుపెట్టి అద్భుతంగా పాటి అందరి మనసుల్ని గెల్చుకున్నాడు. మరో నలుగురితో కలిసి 'వన్ డైరెక్షన్'పేరిట బాయ్‌బ్యాండ్‌ను నెలకొల్పాడు. ఈ బ్యాండ్ నుంచి వెలువడిన పాటలు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్ అయ్యాయి. 7 కోట్ల 'రికార్డ్'లు అమ్ముడుపోయాయి. 2016లో బ్యాండ్ నుంచి విడిపోయాక సోలోగా కెరీర్‌ను మొదలుపెట్టి సంచలనాలు సృష్టించారు. ఈయన చేసిన సంగీత విభావరిలు సైతం పెద్ద హిట్ అయ్యాయి. సొంత ఆల్బమ్స్ లక్షల్లో అమ్ముడుపోయాయి. ఆన్‌లైన్‌లో వీటిని దాదాపు 390 కోట్ల సార్లు చూశారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. అయితే మద్యపానంతో ఇబ్బంది పడుతున్నట్లు గతంలో పలుమార్లు ఇంటర్వ్యూల్లో చెప్పారు. రెండు సార్లు ఆస్పత్రిలో చేరారు. గత ఏడాది మూత్రపిండాల సమస్యతో ఆస్పత్రిలో చికిత్సపొందారు. ఈ ఏడాది మార్చిలో విడుదలైన ఒక 'టియర్ డ్రాప్స్' పాట అందర్నీ నిరాశపరిచింది.

సాక్షి ప్లస్
శుక్రవారం । 18-10-2024

ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు-విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక హక్కుల్లో ఆర్థిక పరమైన హక్కులను గుర్తించలేదు. ఉదాహరణకు పని హక్కు, విశ్రాంతి హక్కు, సామాజిక భద్రతా హక్కులను ప్రాథమిక హక్కుల్లో పొందుపరచలేదు.

మితిమీరిన పరిమితులు

'మూడో భాగంలో ఆరు ప్రాథమిక హక్కులుంటే రెట్టింపు సంఖ్యలో పరిమితులున్నాయి. ఒకవైపు హక్కులు కల్పిస్తూ మరోవైపు పరిమితులు విధించడం సమంజసం కాదు' అని విమర్శకులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని మూడో భాగం ప్రాథమిక హక్కుల జాబితా కాదని, ప్రాథమిక హక్కులపై పరిమితుల జాబితా అని జస్వంత్‌రాయ్ కపూర్ అనే రచయిత వ్యాఖ్యానించారు. ఒక చేత్తో హక్కులిచ్చి మరో చేత్తో వాటిని తీసుకునే విధంగా హక్కులున్నాయని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణుడు ఎం.సి. చాగ్లా వ్యాఖ్యానించారు.

స్పష్టత లేకపోవడం, కఠిన పదజాలం

ప్రాథమిక హక్కుల్లో ఉపయోగించిన భాష సంక్లిష్టంగా ఉంది.దీంతో ఇది సామాన్యులకు అర్థం కాదు. దీన్ని అర్థం చేసుకోవడం న్యాయకోవిదులకు కూడా తేలిక కాదు. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం అన్న ఐవర్ జెన్నింగ్స్ విమర్శ ఒక్క ప్రాథమిక హక్కులతోనే రుజువు అవుతుంది.

ఆస్తి హక్కు- తొలగింపు

మౌలిక రాజ్యాంగంలో ఉన్న ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దీంతో ప్రాథమిక హక్కుల స్థాయిని తగ్గించినట్లయింది. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. నివారక నిర్బంధ చట్టాల ఆధారంగా ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు. రాజకీయ ప్రయోజనాలు, కక్ష సాధింపులకు ఇది ఆస్కారం కల్పిస్తోంది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య వివాదాలు ఏర్పడవచ్చు. అది శాసన, న్యాయ వ్యవస్థల మధ్య ఘర్షణ వైఖరికి దారితీసే అవకాశముంది.

అత్యవసర పరిస్థితి-హక్కుల రద్దు

జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులను రద్దు చేయవచ్చు. దీంతో ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు రక్షణ ఉండదు. ప్రాథమిక హక్కులపై విమర్శ ఉన్నప్పటికీ, వాటి ప్రాముఖ్యతను, విలువను విస్మరించలేం. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు మూలాలు. వ్యక్తి వికాసానికి అనివార్యమైనవి. వ్యక్తులు నైతికంగా, భౌతికంగా ఎదగడానికి ఇవి ఎంతో అవసరం. హక్కుల అమలు కేవలం న్యాయస్థానాల జోక్యం ద్వారానే కాకుండా పౌరుల చైతన్యం, అవగాహనపై కూడా ఆధారపడి ఉంటుంది. నిరంతర అప్రమత్తతే పై స్వేచ్ఛలకు మూలం అని జె.ఎస్.మిల్ అనే రాజనీతిజ్ఞుడు వ్యాఖ్యానించాడు.

ఇతర భాగాల్లో ఉన్న హక్కులు

మూడో భాగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులే కాకుండా రాజ్యాంగంలోని మరికొన్ని భాగాల్లో రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన హక్కులున్నాయి. వీటినే ప్రాథమికేతర హక్కులు అంటారు.

ఉదాహరణలు:

- 12వ భాగంలోని ఆర్టికల్ 265 ప్రకారం చట్టపరమైన ఆధారం లేనిదే పన్నులు విధించరాదు.



- 12వ భాగంలో ప్రకరణ 300-ఎ ప్రకారం చట్టబద్ధంగా తప్ప మరే విధంగా వ్యక్తి ఆస్తికి భంగం కలిగించరాదు.
- 15వ భాగంలో ప్రకరణ 326 ప్రకారం వయోజన ఓటుహక్కును గుర్తించారు.

పై హక్కులకు కూడా న్యాయ సంరక్షణ ఉన్నప్పటికీ అవి ప్రాథమిక హక్కులతో సమానం కావు.

వీటి అమలు, రక్షణ కోసం ప్రకరణ-32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదు. కానీ ప్రకరణ-226 ప్రకారం హైకోర్టు ద్వారా రక్షణ పొందవచ్చు.

రాజ్యాంగ సమీక్షా కమిషన్ సూచించిన ఇతర ప్రాథమిక హక్కులు

2000లో జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన రాజ్యాంగ సమీక్ష కమిషన్‌ను నియమించారు. రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రాథమిక హక్కుల జాబితాలో కింద పేర్కొన్న హక్కులను కూడా పొందుపరచాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది.

- పత్రికా స్వేచ్ఛ-సమాచార స్వేచ్ఛ
- క్రూరమైన శిక్షలకు వ్యతిరేకంగా రక్షణ
- పని హక్కు
- రహస్యాలను కాపాడుకునే హక్కు
- రక్షిత మంచినీరు
- పర్యావరణ హక్కు
- న్యాయం, న్యాయ సలహా పొందే హక్కు

ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు సుప్రీంకోర్టు తీర్పులు

సజ్జన్ సింగ్ Vs రాజస్థాన్ -1964

ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ సవరణ అధికారానికి సంబంధించిన వివాదాన్ని పరిశీలించింది. ఆస్తి హక్కుకు సంబంధించిన 17వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగబద్ధమేనని ప్రకటించింది.

గోలక్‌నాథ్ Vs పంజాబ్ ప్రభుత్వం-1967

పంజాబ్ ప్రభుత్వం రూపొందించిన భూసంస్కరణ చట్టాన్ని ఈ కేసులో ప్రశ్నించారు. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రాథమిక హక్కులను సవరించాలంటే ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రకటించింది.

కేశవానంద భారతి Vs కేరళ ప్రభుత్వం-1973

ప్రాథమిక హక్కులను సవరించడానికి ఉద్దేశించిన 24, 25వ రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టులో ప్రశ్నించారు. గోలక్‌నాథ్ కేసులో చెప్పిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 'పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉంది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చరాదు' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. మౌలిక స్వరూపం (Basic Structure) అనే పదాన్ని తొలిసారిగా ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ప్రయోగించింది.

మినర్వా మిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1980

ఈ కేసులో 42వ రాజ్యాంగ సవరణను ప్రశ్నించారు. 'ప్రాథమిక హక్కులు రాజ్యాంగ స్వరూపంలో భాగం. వాటిని తగ్గించడం లేదా రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించింది.

ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1992

వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని ఈ కేసులో ప్రశ్నించారు.

ఉన్ని కృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్; మోహిని జైన్ Vs కర్ణాటక 1993

'ప్రాథమిక హక్కుల్లో విద్యాహక్కు లేకపోతే జీవించే హక్కుకు, వ్యక్తి గౌరవానికే అర్థం లేదు. ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలి' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

- కింద పేర్కొన్న వాటిలో ఏ ప్రాతిపదికన సకారాత్మక వివక్షతను రాజ్యాంగం అనుమతించలేదు
  ఎ) విద్యాపరమైన వెనుకబాటు
  బి) సామాజిక వెనుకబాటు
  సి) ఆర్థిక వెనుకబాటు
  డి) ఏదీకాదు
  సమాధానం-సి
- 'న్యాయ సమీక్ష' ఏ ప్రభుత్వ లక్షణం?
  ఎ) ఏక కేంద్ర బి) సమాఖ్య
  సి) పార్లమెంటరీ డి) పైవన్నీ
  సమాధానం-బి
- కింది ఏ ప్రకరణను సుప్రీంకోర్టు ఉదారంగా వ్యాఖ్యానించి, దాని పరిధిని విస్తరించింది?
  ఎ) ప్రకరణ 32 బి) ప్రకరణ 13
  సి) ప్రకరణ 20 డి) ప్రకరణ 21
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా రూపొందించిన చట్టాలను న్యాయస్థానాలు కొట్టివేస్తాయి. అయితే చట్టం అనే పదంలోకి రాని అంశం?
  ఎ) ఆర్డినెన్సులు బి) ఉపచట్టాలు
  సి) నోటిఫికేషన్లు డి) రాజ్యాంగ సవరణ
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులపై ఎలాంటి ప్రభావం చూపని అత్యవసర పరిస్థితి?
  ఎ) జాతీయ అత్యవసర పరిస్థితి
  బి) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
  సి) పై రెండూ డి) ఏదీకాదు
  సమాధానం-బి


గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రాథమిక హక్కులు?
   ఎ) నిరపేక్షమైనవి
   బి) ప్రభుత్వ అధికారాలపై పరిమితులు
   సి) సవరణకు అతీతం
   డి) న్యాయ సమీక్షకు గురికావు
2. ప్రాథమిక హక్కులకు మరోపేరు?
   ఎ) న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు
   బి) న్యాయ సంరక్షణ లేని హక్కులు
   సి) నైతిక హక్కులు డి) పౌర హక్కులు
3. కింద పేర్కొన్న ఏ కేసును ప్రాథమిక హక్కుల కేసుగా పరిగణిస్తారు?
   ఎ) గోలక్‌నాథ్ బి) కేశవానంద భారతి
   సి) మేనకా గాంధీ డి) మినర్వా మిల్స్
4. సుప్రీంకోర్టు ఏ కేసులో సహజీవన హక్కును ప్రస్తావించింది?
   ఎ) ఖుష్బూ బి) అరుణా రాయ్
   సి) అరుంధతీరాయ్ డి) విశాఖ
5. ఒక వ్యక్తి నిర్బంధం చట్టబద్ధమైందా? కాదా? అని విచారించడానికి ప్రభుత్వం అమలు చేసే న్యాయబద్ధమైన పరిహారం?
   ఎ) హెబియస్ కార్పస్ బి) సెర్షియోరరి
   సి) మాండమస్ డి) కోవారెంటో
6. ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
   ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
   సి) ప్రధాన మంత్రి డి) పార్లమెంటు
7. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం ఒక వ్యక్తి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై సుప్రీం కోర్టుకు అప్పీల్ చేయవచ్చు?
   ఎ) ఆర్టికల్-13 బి) ఆర్టికల్-32
   సి) ఆర్టికల్-14 డి) ఆర్టికల్-34
8. ఏ ప్రాథమిక హక్కును రాజ్యాంగానికి ప్రాణం, ఆత్మ, హృదయం అని అంబేద్కర్ వర్ణించారు?
   ఎ) సమానత్వ హక్కు బి) స్వాతంత్ర్య హక్కు
   సి) పీడనాన్ని నిరోధించే హక్కు
   డి) రాజ్యాంగ పరిహార హక్కు
9. అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించమని ఆదేశించే రిట్?
   ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
   సి) సెర్షియోరరి డి) కోవారెంటో
10. ప్రాథమిక హక్కుల్లో సాంస్కృతిక, విద్యా హక్కుల ఉద్దేశం?
    ఎ) నిరక్షరాస్యతను రూపుమాపడం
    బి) ఒకే సంస్కృతిని రూపొందించడం
    సి) అల్పసంఖ్యాక వర్గీయుల సంస్కృతిని సంరక్షించడానికి సహాయపడటం
    డి) భారతదేశ సంస్కృతిని సంరక్షించడానికి ఇది సహాయపడదు.
11. ఆర్థిక సమానత్వాన్ని కల్పించేవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) అవతారిక సి) ఆదేశిక సూత్రాలు
    డి) ప్రాథమిక విధులు
12. వార్తా ప్రచురణ హక్కును కల్పించే ఆర్టికల్?
    ఎ) 14 బి) 21 సి) 32 డి) 19
13. చట్టాల సమాన రక్షణను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
    ఎ) బ్రిటన్ బి) అమెరికా
    సి) ఐర్లాండ్ డి) ఆస్ట్రేలియా
14. ఏ ప్రకరణ ప్రకారం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం చేశారు?
    ఎ) ప్రకరణ 21 జీవించే హక్కులో భాగంగా ఆరోగ్యకరమైన పర్యావరణ హక్కు
    బి) ప్రకరణ 48 ఆదేశిక నియమం
    సి) ప్రకరణ 275 షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి
    డి) ఏదీకాదు
15. విద్యాహక్కు చట్టం ఏ స్థాయి విద్యార్థులకు ఉపయోగపడుతుంది?
    ఎ) అన్ని స్థాయిల విద్యార్థులకు
    బి) కళాశాల విద్యార్థులకు
    సి) సీనియర్ సెకండరీ స్థాయి విద్యార్థులకు
    డి) 14 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులకు
16. చట్టం వల్ల సమాన రక్షణ అంటే?
    ఎ) ప్రత్యేక రక్షణ
    బి) సమాన అవకాశాలు
    సి) అసమానతను తగ్గించడం
    డి) పైవన్నీ
17. ప్రాథమిక హక్కులు ఎవరికి వర్తించవు?
    ఎ) ప్రభుత్వ చర్యలకు
    బి) న్యాయస్థాన చర్యలకు
    సి) ప్రైవేట్ వ్యక్తుల చర్యలకు
    డి) పైవన్నీ
18. నేరారోపణ ఎదుర్కొనే వ్యక్తిని బలవంతంమీద నేరం ఒప్పించడాన్ని ఏమంటారు?
    ఎ) సెల్ఫ్ ఇన్‌క్రిమినేషన్ బి) డబల్ జపార్డీ
    సి) ఎక్స్ పోస్ట్ లా డి) పైవేవీ కాదు
19. ప్రాథమిక హక్కులను అమలుపరచడంలో పార్లమెంటు కొన్ని వర్గాలపై ప్రత్యేక పరిమితులు విధించవచ్చు. ఆ వర్గాలు?
    ఎ) రక్షణ దళాలు బి) నేరస్థులు
    సి) విదేశీయులు డి) నిందితులు
20. కింద పేర్కొన్న వాటిలో వ్యక్తిగత స్వేచ్ఛలపై పరిమితులు?
    ఎ) శాంతి భద్రతలు బి) దేశ రక్షణ
    సి) నైతిక ప్రవర్తన డి) పైవన్నీ
21. కింది ఏ వర్గానికి ప్రాథమిక హక్కుల్లో ప్రస్తావన లేదు?
    ఎ) వికలాంగులు బి) మహిళలు
    సి) ఆర్థికంగా వెనుకబడినవారు డి) ఎ, సి

సమాధానాలు

1) బి 2) ఎ 3) బి 4) ఎ 5) ఎ
6) బి 7) బి 8) డి 9) బి 10) సి
11) సి 12) డి 13) బి 14) ఎ 15) డి
16) డి 17) సి 18) ఎ 19) ఎ 20) డి
21) డి

కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?



జంతువుల్లో పోషణ

జంతువులు వాటి ఆహారాన్ని అవి తయారు చేసుకోలేవు. ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు అంటారు. పరపోషకాలు రెండు రకాలు అవి.. పూతికాహారులు, జాంతవ భక్షకులు

- నీటిలో కరిగిన ఆహార పదార్థాలను శరీర ఉపరితలం ద్వారా పీల్చుకోవడాన్ని పూతికాహార విధానం అంటారు. **ఉదా:** కొన్ని రకాల ప్రోటోజోవన్‌లు, పరాన్నజీవులు.
- జంతువుల్లో ఎక్కువశాతం ఘన, ద్రవ, ఆహార పదార్థాలను ప్రత్యేక సేకరణ యంత్రాంగాల సహాయంతో తీసుకుని జీర్ణరసాల ద్వారా జీర్ణం చేసుకుంటాయి. దీన్ని జాంతవ భక్షణం అంటారు.
- అమీబా మిథ్యాపాదాలు, హైడ్రా స్పర్శకాల ద్వారా ఆహారాన్ని సేకరించి ముక్కలు చెయ్యకుండా ఒకేసారి మింగుతాయి.
- నత్త రాడ్యులా (నాలుక)తో ఆహారాన్ని చిన్న చిన్న రేణువుల రూపంలో మింగు తుంది.
- తేళ్లు, సాలీళ్లు భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదిలి జీర్ణమైన ద్రవరూప ఆహారాన్ని తీసుకుంటాయి.
- సీతాకోకచిలుకలు గొట్టం వంటి తొండంతో పుష్పాల మకరందాన్ని పీల్చుకుంటాయి.
- జలగ రక్తాన్ని ఆహారంగా తీసుకుంటుంది. రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు కొన్ని పదార్థాలను జీవి రక్తంలోకి విడుదల చేస్తుంది.
- కొన్ని జీవులు ఒకే రకమైన ఆహారాన్ని తీసుకుంటాయి. వీటిని ఏక రక భక్షక జీవులు అంటారు. ఉదా: పట్టుపురుగు (గొంగళిపురుగు దశలో) మల్బరీ ఆకులను మాత్రమే తింటుంది.
- కొన్ని జంతువుల్లో ఆడ, మగ జీవులు వేర్వేరు ఆహారాన్ని తీసుకుంటాయి. **ఉదా:** మగదోమ చెట్టు నుంచి రసాలను, ఆడదోమ మనిషి రక్తాన్ని ఆహారంగా తీసుకుంటాయి.
- ఆహారంలో ఉండే క్లిష్టమైన స్థూల ఆహార అణువులను సరళమైన అణువులుగా మార్చడాన్ని జీర్ణక్రియ అంటారు.
- జీర్ణవ్యవస్థ గోడల్లో ఉండే గ్రంథి కణాలు ఎంజైములను విడుదల చేస్తాయి. ఈ ఎంజైములు జీర్ణక్రియ రసాయనిక చర్య లను వేగవంతం చేస్తాయి. ఎంజైములు ఉత్ప్రేరకాల్లా పనిచేస్తాయి.
- ఉన్నతస్థాయి బహుకణ జీవుల్లో జీర్ణవ్య వస్థ అంతర్భాగాల్లోని కణాల బయట జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణబాహ్య జీర్ణక్రియ అంటారు.
- ప్రోటోజోవా వంటి ఏకకణ జీవుల్లో కణం లోపల ఆహార రిక్తికలోనికి విడుదలైన ఎంజైముల వల్ల జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణాంతర జీర్ణక్రియ అంటారు.
- బహుకణ జీవుల్లో కూడా కణాంతర జీర్ణక్రియ కొంతవరకు జరుగుతుంది. లైసోజోమ్‌లు ఈ జీర్ణక్రియలో ఎంజైము లను విడుదల చేస్తాయి.
- ఎంజైములు చైతన్యవంతంగా ఉండాలంటే సరైన పీహెచ్ (హైడ్రోజన్ గాఢత) ఉష్ణోగ్రత అవసరం.
- పెప్సిన్ చైతన్యరహిత రూపం పెప్సినోజన్. కైమోట్రిప్సిన్ చైతన్యరహిత రూపం కైమోట్రిప్సినోజన్.

నెమరువేసే జంతువుల్లో జీర్ణక్రియ

- ఆవు, ఎద్దు, గేదె, మేక వంటి పెంపుడు జంతువులు శాకాహారులు. ఇవి మొక్కలను తింటాయి. కాబట్టి వృక్షకణంలో తయారైన సెల్యులోజ్‌ను ఆహారంగా తీసు కుంటాయి. సెల్యులోజ్ అనేక గ్లూకోజ్ అణువులతో తయారైన పాలిసాకరైడ్.
- సెల్యులేస్ అనే ఎంజైము సెల్యులోజ్‌ను జీర్ణం చేస్తుంది.
- జంతువుల్లో కొన్ని కశాభజీవులు బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థలో ఉండి సెల్యు లేస్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే ఈ జంతు వుల్లో కశాభజీవులు, బ్యాక్టీరియా జీర్ణ వ్యవస్థలో ఉండి సహజీవనం చేస్తాయి.
- శాకాహారుల్లో కుంతకాలు (కత్తెర పళ్లు) బాగా అభివృద్ధి చెంది ఉంటాయి.
- నెమరువేసే జీవుల్లో జీర్ణాశయం పెద్దగా నాలుగు గదుల్లో ఉంటుంది. అవి ప్రథమ అమాశయం, జాలకం, తృతీయ, చతుర్థ అమాశయాలు.
- ప్రథమ అమాశయం అతి పెద్ద గది. ఇందులో అతి ఎక్కువ (వేల సంఖ్యలో) సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీ వులుంటాయి. తృతీయ అమాశయంలో నీరు, బై కార్బొనేట్లు శోషణ చెందుతాయి.
- చతుర్థ అమాశయంలో ఆమ్లం విడుదలై సూక్ష్మ జీవులను చంపుతుంది. ప్రొటీన్ల నిర్మాణాన్ని విడగొడుతుంది. దీన్ని విస్వా భావకరణం అంటారు.
- పేగులో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత జీర్ణమైన ఆహారపదార్థాలు శోషణ చెందుతాయి.
- గ్లూకోజ్ కిణ్వప్రక్రియ చెందడం వల్ల నెమరు వేసే జంతువుల్లో ప్రొపియోనిక్, బ్యుటీరిక్ వంటి కొవ్వు ఆమ్లాలు ఏర్పడతాయి.
  ఈ క్రియలో సూక్ష్మజీవుల శరీర నిర్మాణానికి, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి లభిస్తుంది.
- లాలాజలంలో ఉండే బై కార్బొనేట్ ఆమ్లా న్ని తటస్థీకరణం చేస్తుంది.
- నెమరువేసే జంతువుల్లో ఇతర జంతువుల రక్తం లో కంటే తక్కువ మొత్తంలో గ్లూకోజ్ కన్పిస్తుంది.
- కుందేళ్లు శాకాహారులు కానీ, నెమరువేసే జంతువులు కాదు. ఇవి రెండు రకాల మల పదార్థాన్ని విసర్జిస్తాయి. మెత్తగా బూడిద రంగులో ఉండే పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్ కలిగిన మల పదార్థాన్ని కుందేలు తిరిగి తింటుంది. దీన్ని మల కబళనం అంటారు.
- కొన్ని శాకాహారుల్లో ఉండూకం(అపెండిక్స్) సెల్యులోజ్ జీర్ణక్రియకు ఉపయోగ పడుతుంది.
- కుందేలులో రెండు దవడలపైన, ఢీకో డాంట్, విషమదంతి, ద్వివారదంతి రకపు దంతాలుంటాయి. కుంతకాలుండవు. 3 రకాల దంతాలు మాత్రమే ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. తేలు, సాలీడు భక్షకానికి సంబంధించి సరైంది?
   1) పూతికాహార సేకరణ
   2) రాడ్యులాతో ఆహారాన్ని తినటం
   3) భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదలడం
   4) పొడవైన గొట్టంతో ఆహారాన్ని పీల్చడం
2. జీవుల రక్తాన్ని పీల్చేముందు రక్తం గడ్డకట్ట కుండా దానిలోకి పదార్థాలను విడుదల చేసే జీవి?
   1) తేలు 2) మగ ఈగ
   3) మగ ఎనాఫిలస్ దోమ 4) జలగ
3. ఏక రక భక్షక జీవులకు ఉదాహరణ?
   1) బొద్దింక
   2) పట్టుపురుగు(గొంగళిపురుగు దశలో)
   3) కప్ప టాడ్‌పోల్
   4) చిట్టెలుక
4. కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?
   1) రిక్తిక 2) కేంద్రకం
   3) లైసోజోమ్ 4) రైబోజోమ్
5. జీర్ణక్రియలోని ఎంజైములకు సంబంధించి సరికానిది?
   1) ఎంజైములు ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయి
   2) ఎంజైములను హైడ్రోలేసులుగా పిలుస్తారు
   3) ఎంజైములు జీర్ణరసాల్లో ఉంటాయి
   4) ఎంజైములు జీర్ణక్రియలోని రసాయ నిక చర్యలో పాల్గొంటాయి
6. కిందివాటిలో ఎంజైమ్ చైతన్యరహిత రూపా న్ని తెలియజేసేది?
   1) ట్రిప్సిన్ 2) ట్రిప్సినోజన్
   3) పెప్సిన్ 4) కైమోట్రిప్సిన్
7. జీర్ణక్రియ ఎంజైములను హైడ్రోలేసులు అని కూడా అంటారు. ఎందుకు?
   1) జీర్ణక్రియ చర్యల్లో పాల్గొనకుండా చర్యావేగాన్ని పెంచుతాయి.
   2) సరళసమ్మేళనాలను సంక్లిష్ట అణువులుగా మారుస్తాయి
   3) క్లిష్టమైన అణువుల మధ్య ఉండే రసాయన బంధాలను నీటి అణువును చేర్చి విడగొడతాయి
   4) రసాయన చర్యలను ఆమ్ల మాధ్యమంలో ఉండే ఆహార పదార్థాల్లోనే జరుపుతాయి
8. ఎమైలేసస్ అనేవి చర్య జరపటానికి కావలసిన అధస్తరం?
   1) పిండి పదార్థాలు 2) కొవ్వులు
   3) మాంసకృత్తులు
   4) విటమిన్‌లు
9. శాకాహారుల్లో సెల్యులోజ్ జీర్ణక్రియకు సంబంధించి సరైన ప్రవచనం?
   1) నెమరువేయడం వల్ల సెల్యులోజ్ జీర్ణక్రియ జరుగుతుంది
   2) జీర్ణాశయం నాలుగు గదులుగా ఉండటం వల్ల సెల్యులోజ్ జీర్ణం అవుతుంది.
   3) సెల్యులోస్ జీర్ణక్రియకు కశాభజీవుల, బ్యాక్టీరియా సహాయాన్ని తీసుకుంటాయి
   4) సెల్యులోజ్ జీర్ణక్రియలో ఒక శాకాహారి మరొక శాకాహారికి ఉపయోగపడుతుంది
10. ఆవు ఏ జీర్ణాశయ గదిలో విస్వాభావ కరణం జరుగుతుంది?
    1) చతుర్థ అమాశయం
    2) తృతీయ అమాశయం
    3) ప్రథమ అమాశయం
    4) ద్వితీయ అమాశయం
11. ఆవు జీర్ణాశయంలోని తృతీయ అమా శయంలో జరిగే రెండు చర్యలు ఏవి?
    ఎ) ఎంజైముల వల్ల ప్రొటీన్ల జీర్ణక్రియ జరుగుతుంది
    బి) ఆహారం బాగా చిక్కగా అవుతుంది
    సి) నీరు, బైకార్బొనేట్లు శోషణచెందుతాయి
    డి) ఆహారంలో సెల్యులోజ్, ఇతర పదా ర్థాల మీద విశ్లేషక చర్యలు జరుగుతాయి
    1) ఎ,సి 2) బి, సి
    3) ఎ, డి 4) బి, డి
12. ఆవు జీర్ణాశయంలోని సూక్ష్మజీవులకు శరీర నిర్మాణం, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి ఏ ప్రక్రియల ద్వారా లభిస్తుంది?
    1) విస్వాభావకరణం 2) శోషణ ప్రక్రియ
    3) కిణ్వప్రక్రియ 4) మలకబళనం

సమాధానాలు

1) 3 2) 4 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 1 9) 3 10) 1
11) 2 12) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవు ప్రథమ అమాశయంలో సెల్యులోజ్ నుంచి ఏర్పడిన గ్లూకోజ్‌లో కలిగే మార్పు? (డీఎస్సీ 2008)
   1) ఇంధనంగా ఉపయోగపడుతుంది
   2) కిణ్వప్రక్రియ ద్వారా సారాయిగా మారుతుంది
   3) శోషణం చెందుతుంది
   4) కిణ్వప్రక్రియ ద్వారా కొవ్వు ఆమ్లాలుగా మారుతుంది.
2. కొన్ని జంతువుల్లో కనిపించే మల కబళనం అనే ప్రక్రియ? (డీఎస్సీ 2008)
   1) పాక్షికంగా జీర్ణమైన కొవ్వులను గ్రహించడానికి
   2) పాక్షికంగా జీర్ణమైన ఖనిజ లవణాలను గ్రహించడానికి
   3) పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్‌ను గ్రహించడానికి
   4) పాక్షికంగా జీర్ణమైన మాంస కృత్తులను గ్రహించడానికి
3. ఆవు, గేదె వంటి నెమరువేసే జంతువుల జీర్ణాశయంలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండే భాగం? (డీఎస్సీ 2008)
   1) తృతీయ అమాశయం
   2) చతుర్థ అమాశయం
   3) ప్రథమ అమాశయం
   4) ద్వితీయ అమాశయం
4. లాలాజలం లక్షణం? (డీఎస్సీ 2001)
   1) క్షారం, ఆమ్లం 2) కొద్దిగా క్షారం
   3) పూర్తిగా నీరు కల్గి ఉంటుంది
   4) కొద్దిగా ఆమ్లం
5. సోడియం కొలేట్, సోడియం డీ ఆక్సీ కొలేట్ అనేవి? (డీఎస్సీ 2006)
   1) పైత్యరస లవణాలు
   2) పైత్యరస వర్ణకాలు
   3) క్లోమరస లవణాలు
   4) క్లోమరస వర్ణకాలు
6. మానవునిలో సంవరణీ కండరాలు వ్యాకోచించినప్పుడు? (డీఎస్సీ 2006)
   1) జీర్ణక్రియ వల్ల ఏర్పడ్డ అంత్య ఉత్పన్నకాలు పేగులో శోషణమవుతాయి
   2) కొవ్వులు జీర్ణమవుతాయి
   3) జీర్ణక్రియ అంత్య ఉత్పన్నకాలను చూషకాలు పీల్చుకుంటాయి
   4) మలం పాయువు ద్వారా విసర్జితమవుతుంది
7. కైమ్ ఏ స్థితిలో ఉంటుంది? (డీఎస్సీ 2004)
   1) క్షారంగా, ఆమ్లంగా 2) ఆమ్లస్థితి
   3) క్షారస్థితి 4) సమతౌల్యస్థితి
8. మ్యూసిన్ అనే శ్లేష్మ పదార్థాన్ని స్రవించేది? (డీఎస్సీ 2004)
   1) అధోజంబిక 2) అధోజిహ్వక
   3) జఠర గ్రంథులు
   4) పెరోటిడ్ గ్రంథులు
9. రెనిన్ అనే ఎంజైము? (డీఎస్సీ 2004)
   1) కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మారుస్తుంది
   2) అమైనో ఆమ్లాలను ప్రొటీన్లుగా మారుస్తుంది
   3 పిండి పదార్థాన్ని మాల్టోజ్‌లుగా మారుస్తుంది
   4) పాలను పెరుగుగా మారుస్తుంది
10. పెరిస్టాల్టిక్ చలనాలు ఉన్న మానవుని జీర్ణ మండలంలోని భాగం? (డీఎస్సీ 2004)
    1) జీర్ణాశయం 2) ఆంత్రమూలం
    3) కాలేయం 4) ఆహార వాహిక

సమాధానాలు

1) 4 2) 3 3) 4 4)2 5) 3
6) 4 7) 2 8) 3 9) 4 10) 4

మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

షోడశ మహాజనపదాలు

క్రీ.పూ. 6వ శతాబ్దానికి భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానముంది. ఈ కాలంనాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితుల ప్రభావం భారతదేశ చరిత్రపై ఎక్కువగా ఉంది. ఈ కాలాన్ని మహా జనపదాల యుగం, బుద్ధ యుగం, రెండో నగరీకరణ యుగం, మౌర్యుల పూర్వ యుగమని పలుపేర్లతో పిలుస్తున్నారు. దీనికి కారణం..దేశ చరిత్రలోనే తొలిసారిగా వేద కాలపు తెగ ఆధారిత జనపదాలకు భిన్న ంగా, ప్రాంతం ఆధారిత మహాజన పదాలు (ప్రాదేశిక రాజ్యాలు) ఏర్పడ్డాయి. ప్రపంచ మతంగా ఉన్న బౌద్ధమత స్థాపకుడు బుద్ధుడు జీవించిందీ, తన సిద్ధాంతాలను ప్రచారం చేసిందీ ఈ కాలంలోనే. సింధూ నాగరికత పట్టణాల తర్వాత మళ్లీ నగరాలు ఆవిర్భవిం చింది కూడా ఈ కాలంలోనే. ఈ యుగం అంతం కాగానే క్రీ.పూ. 325లో మౌర్య సామ్రాజ్యం ఏర్పడింది. అందువల్ల దీన్ని మౌర్యుల పూర్వయుగం అని అంటారు.

మహాజనపదాల ఆవిర్భావం

ప్రపంచంలోని అత్యంత సారవంతమైన మైదానాల్లో ఒకటైన గంగామైదానం సాగులోకి రావడంతో పాటు ఈ కాలంలో విస్తృత స్థాయిలో ఇనుమును ఉపయోగించారు. కొత్త కొత్త పనిముట్లు అందుబాటులోకి వచ్చి వ్యవసాయంలో మిగులు ఏర్పడింది. దీనివల్ల వ్యాపార వాణిజ్యాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. పన్నుల వ్యవస్థకు అవకాశం కలిగింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ యుగం లో 16 పెద్ద ప్రాదేశిక రాజ్యాల ఏర్పాటుకు దారి తీశాయి. బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయలో ఈ 16 రాజ్యాల ప్రస్తావన ఉంది. అవి..

- **అంగ:** రాజధాని చంపా. దీని రాజు బ్రహ్మదత్తుడిని అంతం చేసి బింబిసారుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **కాశీ:** రాజధాని వారణాశి. ఇది వరుణ, అసి నదుల సంగమ ప్రాంతం.
- **కోసల:** దీని తొలి రాజధాని అయోధ్య. మలి రాజధాని శ్రావస్తి. ఈ రాజులు కాశీని ఆక్రమించుకొన్నారు. ఈ రాజ్యం చివరికి మగధలో విలీనమైంది.
- **వజ్జీ:** వైశాలి రాజధాని. ఇది 8 గణ రాజ్యాలతో కూడిన సమాఖ్య. వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. ఈ రాజ్యాన్ని చివరికి అజాతశత్రువు అంతం చేశాడు.
- **మల్ల:** దీని రాజధానులు కుసినార, పావ. కుశినారలో బుద్ధుడు నిర్యాణం చెందితే, పావలో మహావీరుడు మరణించాడు. ఈ గణరాజ్యం బుద్ధుడిని బాగా ఆదరించింది. బుద్ధుని శిష్యులు ఆనందుడు, ఉపాలి మొదలైన వారు ఈ రాజ్యానికి చెందినవారే. పావలో సాంతాగార అనే శాసనసభ ఉండేది.
- **చేది:** రాజధాని సుక్తిమతి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో ఉంది.
- **వత్స:** దీని రాజధాని కౌశాంబి. దీని రాజు ఉదయనుడు. బౌద్ధమతాన్ని ఆదరించాడు. హర్షుని ప్రియదర్శిక, రత్నావళితో పాటు అనేక కథల్లో ఇతడు నాయకుడు.
- **పాంచాల:** దీని రాజధానులు అహిచ్ఛత్ర, కంపిల్య.
- **సౌరసేన:** దీని రాజధాని మధుర, గ్రీకు రచనల్లో ఈ రాజ్యాన్ని సౌరసేనాయ్‌గా, రాజధాని మేథోరాగా ప్రస్తావించారు.
- **మత్స్య:** దీని రాజధాని విరాట నగరం. ఈ రాజ్యం మగధలో కలిసిపోయింది.
- **కురు:** రాజధాని ఇంద్రప్రస్థ. ఆధునిక ఢిల్లీ పరిసరాల్లోని నగరం ఇది. 2వ రాజధాని హస్తినాపుర్
- **అస్సక/అస్మక:** రాజధాని పొదన లేదా పోటన. దీన్ని నేటి బోధన్‌గా భావి స్తున్నారు. ఇది షోడశ మహాజనపదాల్లోని ఏకైక దక్షిణాది రాజ్యం. ఇది ఆంధ్ర, మహారాష్ట్రలకు విస్తరించి ఉంది.
- **అవంతి:** రాజధానులు ఉజ్జయిని, మహి ష్మతి. బుద్ధుని సమకాలికుడైన అవంతి రాజు ప్రద్యోత లేదా చండ ప్రద్యోత మహాసేన. దీని చివరి రాజు నంది వర్ధ నుడిని ఓడించి మగధరాజు శిశునాగుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **గాంధార:** రాజధాని తక్షశిల. దీనిరాజు పుక్కుసతి లేదా పుష్కర సరీన్. బింబి సారుని వద్దకు రాయబారిని పంపాడు. ఈ రాజ్యాన్ని పర్షియన్లు ఆక్రమించుకున్నారు.
- **కాంభోజ:** రాజధాని రాజాపుర.
- **మగధ:** రాజగృహ (గిరివ్రజ) పాటలీపుత్ర రాజధానులు.

బుద్ధుని కాలానికి పైన పేర్కొన్న 16 జనపదాల్లో కేవలం నాలుగు రాజ్యాలు మాత్రమే ఉండేవి. అవి వత్స, అవంతి, కోసల, మగధ. మిగిలిన రాజ్యాలన్నీ ఈ నాలుగు రాజ్యాల్లో విలీనం అయ్యాయి. ఐతే క్రీ.పూ. 4వ శతాబ్దంలో ఈ నాలుగు రాజ్యాలు విలీనమై మగధ సామ్రాజ్యం అవతరించింది.

మగధను పాలించిన రాజవంశాలు: క్రీ.పూ.6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 4వ శతాబ్దం వరకు అంటే.. మౌర్య సామ్రాజ్యం ఏర్పడే వరకు మగధను మూడు రాజవంశాలు పాలించాయి.

హర్యాంక వంశం (544-413)

బింబిసారుడు : ఇతనితో ప్రారంభమైన మగధ సామ్రాజ్యవాదం అశోకుని కళింగ యుద్ధం వరకూ కొనసాగింది. బింబిసారుడు అంగను జయించి, తన కుమారుడు అజాత శత్రువును రాజ ప్రతినిధిగా నియమించాడు. కోసలరాజు ప్రసేనజిత్ చెల్లెలు కోసలదేవిని వివాహమాడి కాశీని పొందాడు. వైశాలీ లిచ్ఛవీ రాజు చేతకుని కుమార్తె చెల్లనను, పంజాబ్‌ను పాలించే మాద్రా రాకుమార్తె ఖేమాను వివాహమాడి పశ్చిమ ఉత్తర దిశలో రాజ్య విస్తరణ మార్గాన్ని సుగమం చేసుకొన్నాడు. ప్రధాన శత్రువు అయిన చండ ప్రద్యోత మహాసేనుడి వద్దకు బింబిసారుడు తన ఆస్థాన వైద్యుడు జీవకుడిని పంపి కామెర్ల వ్యాధి నుంచి విముక్తున్ని చేసి మిత్రునిగా చేసుకొన్నాడు. గాంధారరాజు పుష్కర సరీన్ కూడా తన రాయబారిని పంపి బింబిసారునితో స్నేహం కుదుర్చుకున్నాడు. బింబిసారుడు బుద్ధుని సమకాలికుడైనప్పటికీ ఏ మతాన్ని ఆదరించాడనే దానిపై స్పష్టత లేదు. బౌద్ధ, జైన మతాలు రెండూ ఇతన్ని తమ మతం వాడిగానే పేర్కొన్నాయి.

అజాతశత్రువు: తండ్రిని హత్యచేసి సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. తీవ్రమైన సామ్రాజ్యవాద విధానాన్ని అవలంబించాడు.

కోసలరాజు, తన మేనమామ ప్రసేనజిత్‌కు వ్యతిరేకంగా అజాతశత్రువు యుద్ధం చేశాడు. విజయం సాధించి కోసల రా కుమార్తెను వివాహం చేసుకోవడంతో పాటు కాశీని తిరిగి పొందాడు. వైశాలీ లిచ్ఛవుల నాయకత్వంలోని 36 రాజ్యాల కూటమికి వ్యతిరేకంగా 16 ఏళ్ల యుద్ధం చేసి విజయం సాధించాడు. ఇతడు తొలుత జైనాన్ని, తర్వాత బౌద్ధాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. బుద్ధున్ని కలిసి తన తండ్రిని చంపిన నేరాన్ని అంగీకరించాడు. వీరి సమావేశ దృశ్యం బార్హుత్ శిల్పాల్లో చెక్కారు. ఇతని కాలంలో మొదటి బౌద్ధసంగీతి జరిగింది. అజాత శత్రువుకు కునిక అనే బిరుదు ఉంది.



ఉదయనుడు: ఇతడు పాటలీ గ్రామంలోని గంగ, సోన్ నది సంగమ స్థానంలో కోటను నిర్మించాడు. దాంతో ఉదయనుడిని పాట లీపుత్ర నగర నిర్మాతగా చరిత్రకారులు భావిస్తున్నారు.

శిశునాగ వంశం (413-364)

శిశునాగుడు: ఉదయనుడి తర్వాత పితృ హంతకులు రాజులుగా వచ్చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు కాశీలో రాజ ప్రతినిధిగా ఉన్న శిశునాగున్ని రాజుగా చేసినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రాజధానిని వైశాలికి మార్చాడు. అవంతి రాజు ప్రద్యోతను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపివేయడం శిశునాగుని గొప్ప విజయం. దీనితో ఈ రాజ్యాల మధ్య వంద ఏళ్లుగా సాగిన వైరం అంతమైంది.

కాలశోకుడు: ఇతడు రాజధానిని పాటలీ పుత్రానికి తిరిగి మార్చాడు. ఇతని కాలంలో రెండో బౌద్ధ సంగీతి జరిగింది. కాలశోకుడిని సేనాపతి మహాపద్మ నందుడు హత్యచేసి నంద వంశ స్థాపన చేశాడు.

నందవంశం: (364-321)

ఈ కాలంలో మగధను పాలించిన అత్యంత బలమైన వంశం ఇది.

మహాపద్మనందుడు: ఇతడు శూద్ర మహిళకు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అనేక క్షత్రియ రాజ కుటుంబాలను రూపుమాపి రెండో పరశురామునిగా పేరుగాంచాడు. ఖార వేలుని హాతిగుంఫా శిలాశాసనం ప్రకారం ఇతడు కళింగను జయించి విజయచిహ్నంగా జైనతీర్థంకరుని విగ్రహం తెచ్చినట్లు తెలు స్తోంది. ఏకరాట్ అనే బిరుదును మహా పద్మనందుడు ధరించాడు.

ధననందుడు: మహాపద్మనందుడి తర్వాత అతని ఎనిమిదిమంది కుమారులు పాలిం చారు. వారిలో చివరివాడు ధననందుడు. ఇతనికి 2 లక్షల పదాతిదళం, 20 వేల అశ్వికదళం, 3 వేల గజదళం. 2 వేల రథ బలముండేది. అలెగ్జాండర్ సేనలు బియాస్‌ను దాటి భారత్‌పై దండెత్తక పోవడానికి ధననం దుడి బలసంపత్తి కూడా ఒక కారణం. ఐతే ఇతనికి మితిమీరిన ధన కాంక్ష ఉండేది. ప్రజలను పీడించి వారి మద్దతు కోల్పోయాడు. ఈ పరిస్థితులను అనువుగా చేసుకొని చంద్ర గుప్త మౌర్యుడు ఇతన్ని అంతమొందించి మౌర్య వంశ స్థాపన చేశాడు.

బుద్ధయుగంలోని గణతంత్ర రాజ్యాలు

ఈ కాలంనాటి పాళి గ్రంథాల్లో నాడు మనుగడలో ఉన్న కొన్ని గణతంత్ర రాజ్యాల ప్రస్తావన ఉంది. ఈ రాజ్యాల్లో కొన్ని షోడశ మహాజనపదాల్లోనూ కన్పిస్తాయి.

- నాటి గణరాజ్యాల్లో కపిల వస్తు, కుసినగర, పావ, వైశాలి ప్రధానమైనవి.
- కపిలవస్తును శాక్యవంశం పాలించేది. ఇది భారత్- నేపాల్ సరిహద్దు రాజ్యం. బుద్ధుడు ఈ వంశానికి చెందినవాడు. కోసలరాజు విరుధకుడు ఈ రాజ్యాన్ని అంతం చేసి శాక్యాలను ఊచకోత కోశాడు.
- కుశినగర, పావ రాజధానులుగా మల్ల వంశం పాలించేది. అజాతశత్రువు ఈ రాజ్యాన్ని అంతం చేశాడు.
- దదవైశాలీ రాజధానిగా లిచ్ఛావీలు పరిపాలించారు. వీరు స్వేచ్ఛా పిపాసులు. యుద్ధ పిపాసులు. అందువల్ల అజాతశత్రువుకు ఈ రాజ్యాన్ని ఆక్రమించేందుకు 15 ఏళ్ల పట్టింది. అజాతశత్రువు ఈ యుద్ధంలో విజయం సాధించినా లిచ్ఛావీలు తీవ్ర నష్టాన్ని కలుగజేసారు. వీరి సమావేశ మందిరం పేరు సంతాగార,ఇందులో 7707 మంది ప్రతినిధులు పాల్గొనేవారని తెలుస్తోంది.

మాదిరి ప్రశ్నలు

1. షోడశ మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?
   ఎ) అవంతీ బి) అస్మక
   సి) కాంభోజ డి) శౌరసేన
2. భారత దేశంపై దండెత్తిన తొలి విదేశీ పాలకుడు?
   ఎ) సైరస్ బి) డేరియస్-1
   సి) జెక్సెస్ డి) డేరియస్-3
3. కింది వారిలో అజాతశత్రువుకు సమకాలీనులు కానివారు?
   ఎ) బుద్ధుడు బి) మహావీరుడు
   సి) మస్కరి గోషల పుత్రుడు
   డి) నాగసేనుడు
4. కింది రాజ్యాలు వాటి రాజధానుల్లో సరైన సమాధానాన్ని గుర్తించండి?

A	B
1. అంగ	a) తక్షశిల
2. గాంధార	b) చంప
3. కురు	c) మధుర
4. శౌరసేన	d) ఇంద్రప్రస్థ

	1	2	3	4
ఎ)	B	A	D	C
బి)	C	D	A	B
సి)	D	C	B	A
డి)	A	B	C	D

సమాధానాలు

1) బి 2) ఎ 3) డి 4)ఎ

Which of the following will be third..

ALPHABET AND ALPHA-NUMERIC-SYMBOL SEQUENCE

BANK EXAMS

REASONING

Questions on alphabet are based on the position of the letters of English Alphabet.

There are 26 letters in English Alphabet with 'A' - taking 1st position. 'B' - 2nd position and so on 'Z' takes the 26th position.

Similarly 'Z' takes the 1st posi tion, 'Y'- 2nd position and so on 'A' takes the 26th position. So the sum of the positions of any letter from the left end and from the right end is equal to 27.

A candidate is advised to reme mber positions of letters from the left end and if the position is to be found from right end subtract its position from left end from 27.

(E.g. 1-5): Answer these questions on the basis of the following alphabets.

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

E.g.1: Four of the following are alike in regard to their group. Which is the one that does not belong to the group?

1) FE 2) ML 3) JK 4) VX 5) RS

SOL: All the pairs of letters except 'VX' occupy consecutive position in English alphabet. So 'VX' does not belong to the group.


E.g. 2: Which letter is 9th to the left of 9th letter from the right end.

1) J 2) K 3) H 4) M 5) None of these

SOL: The letter will be 9+9=18th from right end.

⇒ The same will be 27–18=9th from left end. But 9th letter from left = 'I'.

E.g. 3: If the above alphabets, are divided in two equal halves from A to M and N to Z, which letter in the latter half would be corres ponding to letter J?



1) Q 2) V 3) X 4) W 5) None of these

SOL: If the alphabet is divided into two halves the difference bet ween any letter of first half and corresponding letter of second half is equal to 13.

⇒(Letter from second half)-(J) = 13

⇒Letter from second half = 13 + J = 13 + 10 = 23 = W

E.g. 4: If the above alphabets, are written in the reverse order whi ch letter will be 12th to the left of 16th from left?

1) X 2) W 3) D 4) V 5) None of these

SOL: 12th to the left of 16th from left = 16–12 = 4th from left since the alphabets are written in reverse order. Z becomes 1st from left, Y becomes 2nd and so on.

4th letter from left = W.

E.g. 5: What should come in place of question mark(?) in the follow ing letter series?

BD CEF DFGH ?

SOL: In each set letters are written starting from B,C,D respectively. Moreover the number of letters written are 2, 3 and 4 respe ctively. In continuation the next set should start with E and should have 5 letters i.e. EGHIJ.

PRACTICE QUESTIONS

1. Which of the following will come in place of question mark (?) in the following series based on English alphabetical order? ZA BY XC DW ?
1) VF 2) EU 3) UE 4) EV 5) VE

Ans: 5

The two letters in each set are last and first alphabets, second and second last, third last and third, fourth and fourth last. So the next set will be fifth last and fifth, i.e. VE

2. Which of the following will come in the place of the question mark (?) in the following series based on the English alphabetical or der?
ZXWY TRQS NLKM ?
1) HGFE 2) IGFH 3) HFEG 4) EFGH 5) IFGH

Ans: 3

The order of letters in the series are jumbled starting with the last letter of the alphabet. After 4 letters from the reversing alphabet, two letters are left and the series again continues.

The order of the letters first, fourth, second and third.

The next letters will be H, G, F, E. i.e. HFEG

3. If each vowel in the word POLITE is changed to the next letter in the English alphabetical series and each consonant is changed to the previous letter in the English alphabetical series, and then the alphabets so for-med are arranged in alphabetical order from left to right, which of the following will be third from the left?
1) O 2) P 3) J 4) K 5) None

Ans: 4

The vowels in the given word 'POLITE' are O, I, E and conson ants are P, L, T.

Applying the changes the word will be 'OPKJSF'.

Arranging in alphabetical order, F J K O P S.

The third letter from left will be 'K'.

4. How many meaningful English words can be formed with the letters 'NSIK' (starting with S) using all the letters but each letter only once in each word?
I) None 2) One 3) Two 4) Three 5) More than three

Ans: 3

The meaningful words starting with 'S' will be SKIN and SINK.

Only two words can be formed.

5. Which of the following is exactly in the middle of the twentieth element from the left and the nineteenth element from the right of the English alphabetical seri es?
1) S 2) T 3) M 4) N 5) None

Ans: 4

Left position = 20 (T)

Right position = 19

⇒ Left position = 27–19 = 8

Exactly middle letter =

[illegible] = 17

14th letter from left will be 'N'.

6. How many such pairs of letters are there in the word 'BARG AINED', each of which has as many letters between them in the word (in both forward and back ward directions) as they have bet ween them in the English alphabetical series?
1) Two 2) Three 3) None 4) One 5) More than three

Ans: 5

For questions like this, the number of letters between a set of letters in the word should be same as in the English alphabetical series.

For example, in the alphabe tical series, between G and I there is 1 letter.

BARGAINED

Directions (7-10): Study the following arrangement carefully and answer the questions given below :

6 C R % K B H # X D 2 @ G A 8 S 5 P E 3 F 4 L 7 M 9 $ Q U

7. What will come in place of the question mark (?) based on the above series?
RK% #H 2G@ 5EP ?
1) LM7 2) M$9 3) 7M9 4) 79M 5) M9$

Ans: 4

The series continues with a set of three letters. After first set one element (letter/number /symbol) is left, after second set two elements are left, after third set three elements are left. So after the fourth set leave four elements.

∴ The next set of letters will be 79M.

8. Which of the following is sixth to the left of the fifteenth from the right end of the above arrangement ?
1) X 2) D 3) # 4) 2 5) H

Ans: 1

Sixth to the left of the fifteenth from the right end = 6 + 15 = 21st from right end

Total = 30

L + R = T + 1

∴ 21st from right end = (30 + 1) - 21 = 10th from left end = X

9. How many such consonants are there in the above arrangement which are immediately preceded by a symbol and imme diately followed by a vowel?
1) One 2) Two 3) Three 4) More than three 5) None

Ans: 2

Required = Symbol-Consonant-Vowel (SCV)

@GA, $QU

10. Four of the following five are similar in a certain way based on their positions in the above arrangement and hence form a group. Which of the following that does not belong to the group?
1) R%K 2) 7M9 3) 5PE 4) H#X 5) FL7

Ans:

FL7 is different.

In the first four options, all the three elements are in a sequence. But in the 5th option between F and L, there is one element.

Directions (11-15): Study the following arrangement carefully and answer the questions given below:

B U B D C E D B D E U B A D C B E A C D A E B A U A C D B C A C

11. How many such pairs of alphabets are there in the series of alphabets given in BOLD (A to E) in the above arrangement, each of which has as many letters between them (in both forward and backward directions) as they have between them in the English alphabetical series?
1) None 2) One 3) Two 4) Three 5) More than three

Ans: 5

A D C B E

There are 6 pairs.

12. Which of the following is the eighth to the left of the twentieth from the left end of the above arrangement?
1) C 2) E 3) U 4) B 5) A

Ans: 4

eighth to the left of the twentieth from the left end = 20 – 8 = 12

Twelfth from the left = B

13. How many meaningful Fwords can be formed with the alphabets which are first, second, fifth and sixth from the left end of the above arrangement?
1) None 2) One 3) Two 4) Three 5) More than three

Ans: 2

First letter = B, Second letter = U, Third letter = C, Fourth letter = E

Only one word can be formed with these letters i.e. CUBE

14. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a vowel and also immediately followed by a consonant ?
1) One 2) Two 3) Three 4) Four 5) More than Four

Ans: 5

Vowel-Consonant-Consonant (VCC)

UBD, EDB, ADC, ACD, UAC

There are five such consonants.

15. If all As are dropped from the above arrangement, which of the following will be eleventh from the right end of the above arrangement?
1) E 2) C 3) D 4) U 5) None of these

Ans: 1

Leaving A's count the letters from the right end.